

ఈనాడు



విజయవాడ 5-1-2026 సోమవారం సిటీ సంపుటి 52 . సంచిక 146

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 14

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



ఛాంపియన్స్



ప్రధాని మోదీ

2036 ఒలింపిక్స్ నిర్వహణే లక్ష్యంగా..

వారణాసి

2036 ఒలింపిక్స్ క్రీడలను నిర్వహించేందుకు భారత్ పూర్తి స్థాయిలో సన్నద్ధమవుతోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. వారణాసిలో 72వ జాతీయ వాలీబాల్ ఛాంపియన్‌షిప్ పోటీల ప్రారంభోత్సవంలో ప్రధాని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. "గత దశాబ్ద కాలంలో భారత్ 20కి పైగా అంతర్జాతీయ క్రీడా పోటీలకు వేదికగా నిలిచింది. అండర్- 17 ఫిఫా ప్రపంచకప్, హాకీ ప్రపంచకప్, అనేక ప్రపంచ స్థాయి చెస్ టోర్నీలను విజయవంతంగా నిర్వహించింది. 2030లో జరిగే కామన్వెల్త్ క్రీడలకు కూడా భారత్ ఆతిథ్యమివ్వనుంది. క్రీడాకారులకు మరింత గొప్ప అవకాశం కల్పించే దిశగా 2036 ఒలింపిక్స్‌కు ఆతిథ్యమిచ్చేందుకు గట్టి ప్రయత్నం చేస్తున్నాం" అని ప్రధాని అన్నారు. ప్రభుత్వం క్రీడల బడ్జెట్‌ను ఎంతో పెంచిందని.. ప్రతిభాన్వేషణ, శిక్షణ, పౌష్టికాహారం, పారదర్శక సెలక్షన్‌కు ప్రాధాన్యమిస్తూ క్రీడాకారుల ప్రయోజనాలే లక్ష్యంగా క్రీడా విధానాన్ని ప్రభుత్వం అనుసరిస్తోందని మోదీ అన్నారు. 2014 తర్వాత క్రీడల్లో భారత్ ప్రదర్శన నిలకడగా మెరుగుపడుతోందని.. మన క్రీడాకారుల ఆత్మవిశ్వాసం కూడా ఎంతో పెరిగిందని ఆయన పేర్కొన్నారు. జనవరి 4 నుంచి 11 వరకు జరగనున్న జాతీయ వాలీబాల్ ఛాంపియన్‌షిప్‌లో దేశవ్యాప్తంగా 58 జట్లు పాల్గొంటున్నాయి.

భారత్‌లో టీ20 ప్రపంచకప్ ఆడం

- మా మ్యాచ్‌లను మరో దేశంలో నిర్వహించండి
- ఐసీసీకి బంగ్లాదేశ్ బోర్డు విజ్ఞప్తి

దిల్లీ

ఊహించిందే జరిగింది. భద్రత కారణాలను చూపిస్తూ వచ్చే నెలలో భారత్‌లో టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌లు ఆడేందుకు బంగ్లాదేశ్ తిరస్కరించింది. తమ మ్యాచ్‌లను మరో దేశంలో నిర్వహించాలని ఐసీసీకి బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) విజ్ఞప్తి చేసింది. భారత్, బంగ్లాదేశ్‌ల మధ్య కొంతకాలంగా దౌత్యపరమైన ఉద్రిక్తత నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే బీసీసీఐ ఆదేశాల మేరకు బంగ్లా ఫాస్ట్‌బౌలర్ ముస్తాఫిజుర్ రెహమాన్‌ను కోల్‌కతా నైట్‌రైడర్స్ తమ జట్టు నుంచి విడుదల చేసింది. ఆ తర్వాతి రోజే టీ20 ప్రపంచకప్ కోసం భారత్‌లో పర్యటించరాదని బీసీబీ నిర్ణయించుకుంది. "గత 24 గంటల్లో పరిణామాలను పరిగణనలోకి తీసుకుని తాజా పరిస్థితులను బోర్డు సమీక్షించింది. బంగ్లాదేశ్ బృందం భద్రతపై ఆందోళన పెరుగుతున్న నేపథ్యంలో బంగ్లా ప్రభుత్వ సలహా ప్రకారం టీ20 ప్రపంచకప్ కోసం జట్టును భారత్‌కు పంపరాదని నిర్ణయించింది" అని బీసీబీ ఓ ప్రకటనలో పేర్కొంది. "ప్రపంచకప్‌లో మా మ్యాచ్‌లను మరో దేశానికి (శ్రీలంక) తరలించాలని ఐసీసీకి బీసీబీ విజ్ఞప్తి చేసింది" అని చెప్పింది. "ఒక్క ఆటగాడికే (ముస్తాఫిజుర్) భద్రత కల్పించలేమని భారత్ చెబుతోంది. మరి మొత్తం జట్టుకు ఎలా భద్రత కల్పించగలుగుతుంది. మేం భారత్‌లో ఆడలేం. శ్రీలంకలో ఆడతాం" అని ఓ బీసీబీ అధికారి వ్యాఖ్యానించాడు. మరోవైపు ఐపీఎల్ వేలానికి ముస్తాఫిజుర్‌ను అందుబాటులో ఉంచాలని తమను కోరిన బీసీసీఐ.. ఇప్పుడు అతణ్ని ఎందుకు కేకేఆర్ నుంచి విడుదల చేసిందో వివరించాలంటూ భారత బోర్డుకు బీసీబీ లేఖ రాసింది. నిరుడు బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా పదవీచ్యుతురాలు అయిన అనంతరం భారత్, బంగ్లా సంబంధాలు దెబ్బతిన్నాయి. అప్పటి నుంచి బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు జరుగుతున్నాయి.

తరలింపు తేలిక కాదు: భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తోన్న టీ20 ప్రపంచకప్ వచ్చే నెల 7న ఆరంభం కానుంది. షెడ్యూల్ ప్రకారం ప్రపంచకప్‌లో బంగ్లాదేశ్ లీగ్ దశలో నాలుగు మ్యాచ్‌లు ఆడాల్సివుంది. కోల్‌కతాలో ఫిబ్రవరి 7న వెస్టిండీస్‌తో, 9న ఇటలీతో, 14న ఇంగ్లాండ్‌తో ఆ జట్టు మ్యాచ్‌లు ఉన్నాయి. చివరి మ్యాచ్‌లో ఫిబ్రవరి 17న ముంబయిలో నేపాల్‌తో తలపడాలి. టోర్నీకి ఇంకో నెల రోజులు మాత్రమే ఉంది. బంగ్లాదేశ్ మ్యాచ్‌లను శ్రీలంక తరలించడం కోసం షెడ్యూలును మార్చడం కష్టమైన పనే. బంగ్లా విజ్ఞప్తికి ఐసీసీ అంగీకరిస్తుందో లేదో చూడాలి. బీసీబీ నిర్ణయంపై బీసీసీఐ ఇంకా స్పందించలేదు. కానీ ఇంత తక్కువ సమయంలో మ్యాచ్‌లను తరలించడం దాదాపు అసాధ్యమని బోర్డు అధికారి ఒకరు వ్యాఖ్యానించారు. "ఎవరో కోరారని వెంటనే మ్యాచ్‌లను తరలించడం వీలుకాదు. అది చాలా కష్టమైన పని. ప్రత్యర్థుల గురించి ఆలోచించండి. వాళ్ల విమాన టికెట్లు, హోటళ్లు ఇప్పటికే బుక్ చేశాం. ప్రసార బృందానికి కూడా కష్టమే. మ్యాచ్‌లను మరో దేశానికి మార్చడం చెప్పినంత తేలిక కాదు" అని అన్నారు. భారత చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్ తన మ్యాచ్‌లన్నింటినీ శ్రీలంకలో ఆడనున్న సంగతి తెలిసిందే.

బంగ్లాలో ఐపీఎల్ ప్రసారాలు బంద్!: తాజా పరిణామాల నేపథ్యంలో బంగ్లాదేశ్‌లో ఐపీఎల్ మ్యాచ్‌లు కూడా ప్రసారం కాబోవట్లేదు. దేశంలో ఐపీఎల్ ప్రసారాలను సస్పెండ్ చేయాలని సమాచార ప్రసారాల మంత్రిత్వ శాఖకు విజ్ఞప్తి చేసినట్లు బంగ్లాదేశ్ ప్రభుత్వ సలహాదారు అసిఫ్ నజ్రుల్ చెప్పాడు. "బంగ్లాదేశ్ క్రికెట్‌కు, ఆటగాళ్లకు, దేశానికి అవమానాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించం" అని అన్నాడు. ముస్తాఫిజుర్‌ను ఐపీఎల్ నుంచి పంపేయడంపై ఇప్పటివరకు బీసీసీఐ అధికారికంగా ఎలాంటి సమాచారం ఇవ్వలేదని ఓ బీసీబీ అధికారి చెప్పాడు.

టీ20 ప్రపంచకప్‌నకు బంగ్లాదేశ్ జట్టిదే



లిటన్ దాస్

టీ20 ప్రపంచకప్ కోసం బంగ్లాదేశ్ ఆదివారం లిటన్ దాస్ నేతృత్వంలో 15 మంది సభ్యుల జట్టును ప్రకటించింది. తమ ప్రపంచకప్ మ్యాచ్‌లను శ్రీలంకకు తరలించాలని కోరిన కొన్ని గంటల్లోనే బంగ్లా.. జట్టును ఎంపిక చేసింది. ఇటీవల ఐర్లాండ్‌తో సిరీస్ ఆడని పేసర్ తస్కిన్ అహ్మద్.. జట్టులోకి తిరిగొచ్చాడు. **బంగ్లాదేశ్ జట్టు:** లిటన్ దాస్ (కెప్టెన్), సైఫ్ హసన్, తంజిద్ హసన్, పర్వేజ్ హొస్సేన్ ఎమాన్, తౌహిద్ హృదోయ్, షమీమ్ హొస్సేన్, ఖాజి నురుల్ హసన్, మెహదీ హసన్, రిషాద్ హొస్సేన్, నసుమ్ అహ్మద్, ముస్తాఫిజుర్, తంజిమ్ హసన్ సకిబ్, తస్కిన్ అహ్మద్, సైఫుద్దీన్, షోరిఫుల్ ఇస్లామ్.



షమి

భారత్‌కు లభించిన అత్యుత్తమ ఫాస్ట్‌బౌలర్లలో మహ్మద్ షమి ఒకడు. ప్రస్తుతం దేశంలో ఉన్న పేసర్లలో నైపుణ్యంతో పోల్చుకున్నా.. రికార్డులు చూసినా అతడి గొప్పదనం తెలుస్తుంది. సుదీర్ఘ కాలంగా ఆడుతున్నా.. ఇప్పటికీ ఫిట్‌గా ఉన్నాడు. దేశవాళీల్లోనూ సత్తా చాటుతున్నాడు. కానీ సెలక్టర్లు మాత్రం ఈ వెటరన్ పేసర్‌ను జట్టుకు ఎంపిక చేయట్లేదు. ఇది చాన్నాళ్లుగా జరుగుతున్న తంతే! తాజాగా సొంతగడ్డపై న్యూజిలాండ్‌తో జరిగే వన్డే సిరీస్‌లో బరిలోకి దిగే జట్టులోనూ షమికి చోటు దక్కలేదు. ఈ నేపథ్యంలో 35 ఏళ్ల ఈ పేసర్‌ను ఇక భారత జెర్సీలో చూడలేమా.. అతడికి తలుపులు మూసుకుపోయినట్లేనా.. అన్న సందేహాలు కలుగుతున్నాయి.

తలుపులు మూసేశారా!

ఈనాడు క్రీడావిభాగం

గతేడాది ఛాంపియన్స్ ట్రోఫీలో విజేతగా నిలిచిన భారత జట్టులో షమి సభ్యుడిగా ఉన్నాడు. ఈ టోర్నీలో అతడు 5 మ్యాచ్‌ల్లో 22.27 సగటుతో 11 వికెట్లు పడగొట్టాడు. ఆ తర్వాత సెలక్టర్లు అతడిని విస్మరించారు. గాయం నుంచి పూర్తిగా కోలుకోలేదన్న కారణంతో ఇంగ్లాండ్ పర్యటనకు షమిని ఎంపిక చేయలేదనే చర్చ జరిగింది. చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ సైతం షమి ఫిట్‌నెస్‌పై సందేహాలు వ్యక్తం చేశాడు. అయితే తర్వాత స్వదేశంలో వెస్టిండీస్, దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్‌లకు కూడా అతణ్ని పరిగణనలోకి తీసుకోలేదు. ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లోనూ షమికి చోటు దక్కలేదు. తాజాగా న్యూజిలాండ్‌తో సిరీస్‌లోనూ అతడికి మొండిచేయే ఎదురైంది. గౌతమ్ గంభీర్ కోచ్‌గా పగ్గాలు చేపట్టాక షమికి వచ్చిన అవకాశాలు చాలా తక్కువ. జాతీయ జట్టులో చోటు దక్కకపోయినా.. అతడు మాత్రం ఆశ వదులుకోవట్లేదు. దేశవాళీలో బెంగాల్‌కు ఆడుతూ సత్తా చాటుతున్నాడు. ముస్తాక్ అలీ టీ20 టోర్నీలో దేశవాళీ ట్రోఫీ 5 మ్యాచ్‌ల్లో 13 వికెట్లు పడగొట్టిన ఈ పేసర్.. విజయ్ హజారే ట్రోఫీ (50 ఓవర్లు)లో ఇప్పటిదాకా 5 మ్యాచ్‌ల్లో 11 వికెట్లు తీశాడు. కొత్త బంతితో షమి ఎంత ప్రమాదకరంగా బౌలింగ్ చేస్తాడో ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. వయసు పెరగడం, ఉత్తమ ఫిట్‌నెస్‌తో లేకపోవడం వల్ల టెస్టు జట్టులోకి తీసుకోవట్లేదంటే అర్థం చేసుకోవచ్చు. కానీ అతడికి వన్డేల్లోనూ చోటు దక్కకపోవడం ఆశ్చర్యం కలిగించే విషయమే. 2027 వన్డే ప్రపంచకప్‌లో ఆడాలని సీనియర్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ ఆశిస్తున్నారు. ఇందుకోసం దేశవాళీలోనూ బరిలో దిగారు. వారికి వన్డే జట్టులో చోటు దక్కుతోంది. మరి షమికి ఎందుకు అవకాశం ఇవ్వట్లేదో అర్థం కావట్లేదు.

"షమి భవిష్యత్ ఏంటి? అతడు నిన్నా మొన్నా వచ్చిన ప్లేయర్ కాదు. దాదాపు 400 పైన అంతర్జాతీయ వికెట్లు అతడి ఖాతాలో ఉన్నాయి. అలాంటి బౌలర్‌ను ఎలాంటి కారణం లేకుండానే ఎందుకు ఎంపిక చేయట్లేదు? ఫిట్‌నెస్ మాత్రమే సమస్య అనుకోవట్లేదు. దేశవాళీలో అతడు ఇటీవల 200పైన ఓవర్లు బౌలింగ్ చేశాడు. ఫిట్‌నెస్ నిరూపించుకోవడానికి ఇంతకంటే పరీక్ష ఏముంటుంది? ఇంకా ఏం చేయాలి. ఏం మెరుగుపరుచుకోవాలి" అని టీమ్ఇండియా మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ ప్రశ్నించాడు. షమికి అన్యాయం జరుగుతోందని బెంగాల్ కోచ్ లక్ష్మీరతన్ శుక్లా విమర్శించాడు. "సెలక్షన్ కమిటీ షమికి అన్యాయం చేసింది. ఇటీవలి కాలంలో ఏ అంతర్జాతీయ ఆటగాడు తనలా అంకితభావంతో ఇన్ని దేశవాళీ మ్యాచ్‌ల్లో బరిలోకి దిగలేదు. దేశవాళీలో సత్తా చాటినా.. సెలక్షన్ కమిటీ అతడిని విస్మరించడం సిగ్గుచేటు" అని శుక్లా పేర్కొన్నాడు. షమి ఇప్పటిదాకా భారత్‌కు 64 టెస్టులు, 108 వన్డేలు, 25 టీ20 ఆడాడు. టెస్టుల్లో 229, వన్డేల్లో 206, టీ20ల్లో 27 వికెట్లు తీశాడు. 2023 ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ తర్వాత అతను సుదీర్ఘ ఫార్మాట్లో ఆడలేదు. చివరి టీ20ని గతేడాది ఫిబ్రవరిలో ఇంగ్లాండ్‌పై ఆడిన షమి.. వన్డేల్లో చివరగా 2025 ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో బరిలోకి దిగాడు.

రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్‌గా జడేజా!



జడేజా

జైపుర్: ఈ ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్‌ను రవీంద్ర జడేజా నడిపించడం ఖాయమైంది. 'ఎక్స్'లో జడేజా ఫొటోను పంచుకున్న రాజస్థాన్ ఫ్రాంఛైజీ.. 'దళపతి' అనే వ్యాఖ్యను జోడించింది. గత సీజన్ వరకు రాజస్థాన్‌కు కెప్టెన్‌గా ఉన్న సంజు శాంసన్ చెన్నై సూపర్ కింగ్స్‌కు వెళ్లిపోయాడు. జడేజా సీఎస్కే నుంచే రాయల్స్‌కు వచ్చాడు. గత సీజన్లో సంజు గాయపడడంతో పరాగ్ రాజస్థాన్‌కు తాత్కాలిక సారథిగా వ్యవహరించాడు.

ఐపీఎల్‌లో మా మైదానాన్ని కొనసాగించండి

జైపుర్: వచ్చే ఐపీఎల్ సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ మ్యాచ్‌లను సవాయ్ మాన్‌సింగ్ స్టేడియంలోనే కొనసాగించాలని రాజస్థాన్ క్రికెట్ సంఘం (ఆర్‌సీఏ).. బీసీసీఐని కోరింది. ఈ స్టేడియంలో మౌలిక వసతులపై అసంతృప్తితో ఉన్న రాయల్స్ ఫ్రాంఛైజీ ప్రత్యామ్నాయ వేదికను పరిశీలిస్తున్న నేపథ్యంలో ఆర్‌సీఏ స్పందించింది. మార్చిలో ఐపీఎల్ 18వ సీజన్ ఆరంభ సమయానికి స్టేడియాన్ని ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నామని, స్టేడియంలో మరమ్మతులు ముమ్మరంగా జరుగుతున్నాయని, వసతులకు కూడా లోటు లేకుండా చూస్తామని.. ఐపీఎల్ మ్యాచ్‌లకు ఏ ఇబ్బందీ రానివ్వమని ఆర్‌సీఏ హామీ ఇచ్చింది.

జాతీయ బాక్సింగ్ తొలి రోజు గందరగోళం

గ్రేటర్ నోయిడా: జాతీయ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో తొలి రోజు గందరగోళం చెలరేగింది. ఆదివారం రింగ్స్ సిద్ధం కాకపోవడంతో సీనియర్ బాక్సర్లు గంటలపాటు నిరీక్షించాల్సివచ్చింది. ఆరంభం ఆలస్యం కావడంతో 32 మహిళల బౌట్లను మంగళవారానికి రీషెడ్యూలు చేశారు. మహిళల, పురుషుల ఛాంపియన్‌షిప్‌ను తొలిసారి కలిపి నిర్వహిస్తున్నారు. షెడ్యూలు ప్రకారం తొలి రోజు 80 బౌట్లు (పురుషులు 42, మహిళలు 38) జరగాలి. కానీ గౌతమ్ బుద్ధ విశ్వవిద్యాలయంలో రింగులు సిద్ధంగా లేకపోవడంతో మధ్యాహ్నం 2 గంటలకు ఆరంభం కావాల్సిన ఈ టోర్నీ.. చివరికి సాయంత్రం 6.30కు పురుషుల పోటీలతో మొదలైంది. మహిళా బాక్సర్లకైతే మరింత సమయం నిరీక్షించాల్సివచ్చింది. వాళ్ల పోటీలు రాత్రి 8 గంటలకు మొదలయ్యాయి. మహిళల బౌట్లు ఆరు మాత్రమే జరిగాయి. నిర్వహణ సమస్యల కారణంగా టోర్నీ ఆలస్యంగా ప్రారంభమైందని భారత బాక్సింగ్ సమాఖ్య కార్యదర్శి ప్రమోద్ కుమార్ చెప్పాడు. పురుషుల ఛాంపియన్‌షిప్‌లో 2018 ఆసియా క్రీడల స్వర్ణ విజేత అమిత్ పంఘాల్ శుభారంభం చేశాడు.

రుతురాజ్ జట్టులో ఉండాల్సింది



అశ్విన్

చెన్నై: స్వదేశంలో దక్షిణాఫ్రికాతో సిరీస్‌లో రెండో వన్డేలో సెంచరీ చేసి సత్తా చాటాడు రుతురాజ్ గైక్వాడ్. కానీ న్యూజిలాండ్‌తో ఈ నెల 11 నుంచి జరిగే సిరీస్‌లో అతడికి అవకాశం దక్కలేదు. దీనిపై టీమ్ఇండియా మాజీ ఆటగాడు రవిచంద్రన్ అశ్విన్ స్పందించాడు. రుతురాజ్‌కు జట్టులో చోటు దక్కి ఉండాల్సిందని అన్నాడు. "న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు రుతురాజ్ భారత జట్టులో ఉండాల్సింది. అతడు అందుబాటులో ఉన్న సమయంలో రెండో స్పెషలిస్ట్ వికెట్‌కీపర్ అవసరం ఏం వచ్చింది? రుతురాజ్ ఓపెనర్‌గానే కాక మిడిలార్డర్‌లోనూ ఆడగలడు. అతడు స్పిన్నర్లను ఆడే తీరు, వికెట్ల మధ్య పరుగెత్తే విధానం చాలా బాగుంటాయి. తన ఆలోచన విధానం మాత్రం కొంచెం మారాలి. విరాట్ కోహ్లి, రోహిత్ శర్మల తర్వాత వన్డేల్లో ఎక్కువ కాలం కెరీర్‌ను కొనసాగించే సత్తా అతడికి ఉంది" అని అశ్విన్ అన్నాడు.

కోలుకుంటున్న మార్టిన్



మార్టిన్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ డామియన్ మార్టిన్ కోలుకుంటున్నాడు. మెదడు వాపు వ్యాధి కారణంగా కోమాలోకి వెళ్లి ఇటీవలే ఆసుపత్రిలో చేరిన 54 ఏళ్ల మార్టిన్.. వైద్యానికి స్పందిస్తున్నాడని, ఇప్పుడిప్పుడే మాట్లాడగలుగుతున్నాడని అతడి సహచరుడు ఆడమ్ గిల్‌క్రిస్ట్ చెప్పాడు. "గత 48 గంటల్లో మార్టిన్ విషయంలో అద్భుతం జరిగింది. కోమా నుంచి బయటకు వచ్చాడు. చికిత్సకు బాగా స్పందిస్తున్నాడు. కొంచెం మాట్లాడగలుగుతున్నాడు. త్వరలోనే ఐసీయూ నుంచి సాధారణ గదికి మార్చే అవకాశాలున్నాయి" అని గిల్లీ తెలిపాడు. ఆసీస్ తరఫున మార్టిన్.. 67 టెస్టులు, 208 వన్డేలు, 4 టీ20లు ఆడాడు. 1999, 2003 వన్డే ప్రపంచకప్ గెలిచిన ఆస్ట్రేలియా జట్టులో మార్టిన్ సభ్యుడు.

నిలిచిన రూట్, బ్రూక్

ఇంగ్లాండ్ 211/3

యాషెస్ అయిదో టెస్టు



సిడ్నీ: ఆస్ట్రేలియాకు యాషెస్ సిరీస్‌ను 0-3తో కోల్పోయినా, నాలుగో టెస్టులో నెగ్గడం ద్వారా ఆత్మవిశ్వాసాన్ని పెంచుకున్న ఇంగ్లాండ్.. చివరిదైన అయిదో టెస్టులో తడబడి, పుంజుకుంది. వర్షం, వెలుతురు లేమి కారణంగా 45 ఓవర్లే సాధ్యమైన తొలి రోజు ఆటలో ఆ జట్టు.. మొదటి ఇన్నింగ్స్‌లో 3 వికెట్లకు 211 పరుగులు చేసింది. ఓపెనర్లు క్రాలీ (16), డకెట్ (27)లతో పాటు బెతెల్ (10) త్వరగా ఔటవడంతో 57 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన ఇంగ్లాండ్‌ను.. హ్యారీ బ్రూక్ (78 బ్యాటింగ్; 92 బంతుల్లో 6×4, 1×6), జో రూట్ (72 బ్యాటింగ్; 103 బంతుల్లో 8×4) ఆదుకున్నారు. ఈ జంట అభేద్యమైన నాలుగో వికెట్‌కు 154 పరుగులు జోడించింది. స్టార్క్, నీసర్, బోలాండ్ ఒక్కో వికెట్ పడగొట్టారు. ఆస్ట్రేలియా బ్యాటర్ ఖవాజాకు ఇదే చివరి టెస్టు.



సిడ్నీ మైదానంలో 'బోండి బీచ్' హీరో అహ్మద్


వాళ్లిద్దరూ నిలిచారు: టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లాండ్ 35/0తో ఇన్నింగ్స్‌ను మెరుగ్గానే ఆరంభించింది. కానీ ఆస్ట్రేలియా పేసర్లు విజృంభించడంతో తడబడింది. డకెట్ (27), క్రాలీ (16), బెతెల్ (10) స్వల్ప వ్యవధిలో వెనుదిరిగారు. డకెట్‌ను ఔట్ చేయడం ద్వారా స్టార్క్.. ఆసీస్‌కు తొలి వికెట్‌ను అందించాడు. ఆ తర్వాత ఎనిమిది బంతుల వ్యవధిలో క్రాలీ, బెతెల్ వికెట్లు చేజార్చుకున్న ఇంగ్లాండ్.. 57/3తో కష్టాల్లో పడింది. ఈ స్థితిలో రూట్, బ్రూక్ నిలిచారు. ఆస్ట్రేలియా బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్న ఈ జంట.. ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లింది. ఈ క్రమంలో 65 బంతుల్లో రూట్.. 63 బంతుల్లో బ్రూక్ అర్ధసెంచరీలు అందుకున్నారు. వర్షం వల్ల ఆటగాళ్లు ముందుగానే టీకి వెళ్లారు. ఆ తర్వాత వర్షం తగ్గినా.. వెలుతురు మందగించడంతో మరో సెషన్ మిగిలి ఉండగానే ఆటను ఆపేశారు. బోండి బీచ్ ఉగ్రవాద దాడి మృతులకు సంతాపంగా ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ ప్లేయర్లు ఆట ఆరంభానికి ముందు మౌనం పాటించారు. నల్ల రిబ్బన్లను ధరించి బరిలోకి దిగారు. దాడి సమయంలో షూటర్లపై తిరగబడిన అహ్మద్‌తో పాటు పోలీసులు, అత్యవసర విభాగం సిబ్బంది కూడా నివాళి కార్యక్రమంలో పాల్గొన్నారు.

సంక్షిప్త స్కోర్లు... ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్: 211/3 (క్రాలీ 16, డకెట్ 27, బెతెల్ 10, రూట్ 72 బ్యాటింగ్, బ్రూక్ 78 బ్యాటింగ్; స్టార్క్ 1/53, నీసర్ 1/36, బోలాండ్ 1/48)

138 ఏళ్లలో తొలిసారి..

ఇంగ్లాండ్‌తో యాషెస్ అయిదో టెస్టులో ఆస్ట్రేలియా తుది జట్టులో స్పిన్నర్ లేకుండానే బరిలోకి దిగింది. స్పిన్‌కు అనుకూలించే సిడ్నీ పిచ్‌పై స్పెషలిస్టు స్పిన్నర్ లేకుండానే ఆడుతోంది. సిడ్నీలో ఆ జట్టు స్పిన్నర్‌ను దింపకపోవడం 138 ఏళ్లలో ఇదే తొలిసారి. స్పెషలిస్ట్ స్పిన్నర్ టాడ్ మర్ఫీని కాదని ఆల్‌రౌండర్ బ్యూ వెబ్‌స్టర్‌ను ఆస్ట్రేలియా తుది జట్టులోకి తీసుకుంది. లబుషేన్, హెడ్‌ల రూపంలో పార్ట్‌టైమ్ స్పిన్నర్లు మాత్రమే ఆ జట్టుకు అందుబాటులో ఉన్నారు. ఈ సిరీస్‌లో ఆసీస్ ప్రధాన స్పిన్నర్‌ను తుది జట్టులోకి తీసుకోకపోవడం ఇది మూడోసారి. బ్రిస్బేన్‌లో జరిగిన రెండో టెస్టు (డేనైట్)లో నాథన్ లైయన్‌ను ఆ జట్టు పక్కనపెట్టింది. మూడో టెస్టులో లైయన్ పునరాగమనం చేసినా.. గాయం కావడంతో నాలుగో టెస్టుకు దూరమయ్యాడు. అతడి స్థానంలో ఎంపికైన స్పిన్నర్ టాడ్ మర్ఫీని ఇప్పటిదాకా ఆడించలేదు. మరోవైపు ఇంగ్లాండ్ కూడా తమ ప్రధాన స్పిన్నర్ షోయబ్ బషీర్‌ను వరుసగా అయిదో టెస్టులోనూ బరిలోకి దింపలేదు.

యూపీ వారియర్స్ కెప్టెన్‌గా లానింగ్



మెగ్ లానింగ్

ముంబయి: ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మెగ్ లానింగ్.. మహిళల ప్రిమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) జట్టు యూపీ వారియర్స్ సారథిగా నియమితురాలైంది. ఆమె తొలి మూడు డబ్ల్యూపీఎల్ సీజన్లలో దిల్లీ క్యాపిటల్స్‌కు నాయకత్వం వహించింది. ఆ మూడు సార్లూ దిల్లీ ఫైనల్‌కు చేరింది. ఈసారి వేలంలో యూపీ వారియర్స్ రూ.1.9 కోట్లకు లానింగ్‌ను కొనుక్కుంది. గత సీజన్లో యూపీని దీప్తి శర్మ నడిపించింది. "యూపీ వారియర్స్ తన ప్రయాణంలో కొత్త దశలోకి అడుగు పెడుతోంది. నాయకత్వ స్థానంలో అనుభవం, ప్రశాంతచిత్తానికి ప్రాధాన్యమిస్తున్నామనడానికి లానింగ్ నియామకం ఒక సూచిక" అని ఫ్రాంఛైజీ ఒక ప్రకటనలో పేర్కొంది. "డబ్ల్యూపీఎల్ నాలుగో సీజన్లోకి అడుగు పెడుతోంది. లీగ్ ఏ స్థాయికి ఎదిగిందో, ఇందులో క్రికెట్ నాణ్యత ఎంత పెరిగిందో చూస్తున్నాం. ప్రతి సంవత్సరం లీగ్ ప్రమాణాలు పెరిగేలా కొత్త ప్రతిభ వస్తోంది. ప్రతిభావంతులైన భారత క్రికెటర్లతో పాటు అంతర్జాతీయ అనుభవమున్న క్రీడాకారిణులతో సమతూకంగా కనిపిస్తున్న జట్టును నడిపించడం కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నా" అని లానింగ్ చెప్పింది. డబ్ల్యూపీఎల్ కొత్త సీజన్ ఈ నెల 9న మొదలు కానుంది. టోర్నీ ఈ నెల 17 వరకు నవీ ముంబయిలో, జనవరి 19 నుంచి ఫిబ్రవరి 5 వరకు వడోదరలో జరుగుతుంది.

ఈనాడు
విజయవాడ 5-1-2026 సోమవారం సిటీ సంపుటి 52 . సంచిక 146
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 14
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



జెన్‌కో @ 6,009 మెగావాట్లు

రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి

స్థాపిత సామర్థ్యంలో సగటున 88.79 శాతం

ఈనాడు, అమరావతి: ప్రభుత్వరంగ విద్యుత్ సంస్థ ఏపీ జెన్‌కో ఉత్పత్తిలో చరిత్ర సృష్టించింది. రికార్డులను శనివారం తిరగరాసింది. థర్మల్ ప్లాంట్ల ద్వారా 5,828 మెగావాట్లు, జల విద్యుత్ ద్వారా 181 మెగావాట్లు.. మొత్తం 6,009 మెగావాట్లను ఉత్పత్తి చేసింది. ఉత్పత్తి సామర్థ్యం పెరగడం వల్ల గతంతో పోలిస్తే రోజుకు సుమారు 1,500 మెగావాట్ల విద్యుత్.. థర్మల్ ప్లాంట్ల ద్వారా గ్రిడ్‌కు అందుతోందని అధికారులు తెలిపారు. నాణ్యమైన బొగ్గు వినియోగం ఫలితాలను ఇస్తోందన్నారు. ఏపీ జెన్‌కో, ఏపీ విద్యుత్ అభివృద్ధి సంస్థ లిమిటెడ్ (ఏపీపీడీసీఎల్)లకు (మిగతా 2లో)

సోమనాథ్.. అచంచల విశ్వాస ప్రతీక

ఆలయంపై తొలి దాడికి వెయ్యేళ్లయిన సందర్భంగా ప్రధాని మోదీ ప్రత్యేక వ్యాసం

10లో



అల వైభోగాపురం



భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండ్ అయిన విమానానికి వాటర్ కేనన్‌తో స్వాగతం



విమానం నుంచి బయటకు వస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు. చిత్రంలో విమాన సిబ్బంది, విమానయానశాఖ అధికారులు

విమానాశ్రయంలో విమాన ల్యాండింగ్ విజయవంతం

- ప్రపంచ అగ్రశేణి నగరిగా మారుతుంది
- త్వరలో ప్రధాని చేతుల మీదుగా ప్రారంభం
- కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

ఈనాడు, విజయనగరం: విజయనగరం జిల్లాలోని భోగాపురం ప్రాంతం ప్రపంచ అగ్రశేణి నగరిగా త్వరలో మారబోతోందని పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. శంషాబాద్, దిల్లీ విమానాశ్రయాలకు దీటుగా భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నిలుస్తుందన్నారు. ఇక్కడ రన్‌వేపై విమాన ల్యాండింగ్ పరీక్ష నిర్వహణకు దిల్లీ నుంచి ఆదివారం ఆయన ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడితో కలిసి ఎయిర్ ఇండియా ప్రత్యేక విమానంలో వచ్చారు. ఈ విమానం విజయవంతంగా ల్యాండ్ అయ్యింది. అనంతరం రామ్మోహన్‌నాయుడు అక్కడ మాట్లాడారు. 'ఈ ప్రక్రియ విజయవంతం అయిందంటే ప్రాజెక్ట్ నిర్మాణం చివరి దశకు చేరుకున్నట్లే. దీనివల్ల అంతర్జాతీయ నగరాలతో అనుసంధానం ఏర్పడుతుంది. స్థిరాస్తి వ్యాపారం, ఉపాధి కల్పన, వ్యవసాయ, ఆహారోత్పత్తుల ఎగుమతులు పెరుగుతాయి. పర్యాటక రంగం కూడా అభివృద్ధి చెందుతుంది. నాలుగైదు నెలల్లో పూర్తిగా సిద్ధమయ్యాక ప్రధాని నరేంద్ర మోదీ దీన్ని ప్రారంభిస్తారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశీస్సులతో 18 నెలల్లో పనులు వేగంగా చేయగలిగాం" అని తెలిపారు.

యువత చేతిలో ఉపాధి సృష్టి

భోగాపురం విమానాశ్రయంతో ఉత్తరాంధ్ర ముఖచిత్రం మారబోతోందని రామ్మోహన్‌నాయుడు అన్నారు విశాఖ. 'ఈ ప్రాంతాన్ని ఆర్థిక నడవాగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పలు ప్రణాళికలు అమలు చేస్తోంది. యువత ఉపాధి అవకాశాలను అన్వేషించాల్సిన అవసరం లేదు.. సృష్టించుకోవచ్చు. ఇక్కడ విమానాల నిర్వహణ, మరమ్మతుల కేంద్రాన్ని (ఎంఆర్‌ఒ) దేశంలోనే అత్యుత్తమంగా తీర్చిదిద్దుతాం. బ్రిటన్, అమెరికా, ఆస్ట్రేలియాలోని ఎంఆర్‌ఒ కేంద్రాలకు దీటుగా అన్ని హంగులు కల్పిస్తాం. జీఎంఆర్-మాన్సాస్ సంయుక్త (మిగతా 2లో)

జూన్ నాటికి విమానాశ్రయం సిద్ధం
ముఖ్యమంత్రి చంద్రబాబు 2లో



మారిషస్ అధ్యక్షుడు ధరమ్ బీర్ గోకుల్‌కు 'భారత మిత్ర' అవార్డు ప్రదానం చేస్తున్న జ్యోతిష్ మఠ్ ఉత్తరాధికారి ముకుందానందగిరి శంకరాచార్య మహరాజ్. వేదికపై ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, గజల్ శ్రీనివాస్, ధరమ్ బీర్ గోకుల్ సతీమణి బృందా గోకుల్, బృందావన్ పార్థసారథి, ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్

భాషతోనే బంధం బలోపేతం

> మారిషస్ సంస్కృతిలో తెలుగు సంస్కృతీ సంప్రదాయాలు అంతర్భాగంగా ఉన్నాయి. భారత్, మారిషస్‌లను కలిపే సాంస్కృతిక బంధంగా తెలుగు ఉందని గర్వంగా చెబుతున్నా. -ధరమ్ బీర్ గోకుల్

మాతృభాషను కాపాడుకోవడం అందరి విధి

- 50 దేశాల్లో తెలుగు మాట్లాడుతుండటం గొప్పతనానికి నిదర్శనం
- ఇంగ్లిష్ అధిక వినియోగంతో తెలుగు లాంటి ప్రాచీన భాషలపై ప్రతికూల ప్రభావం
- మూడో ప్రపంచ తెలుగు మహాసభల్లో మారిషస్ అధ్యక్షుడు ధరమ్ బీర్ గోకుల్

ఈనాడు, అమరావతి: 'భాష, వారసత్వం, సంస్కృతితోనే మన సంబంధాలు బలోపేతం అవుతాయి. ఇందులోనూ కీలకపాత్ర పోషించేది మాతృభాష. మన పూర్వీకుల నుంచి వచ్చిన మాతృభాషను కాపాడుకోవడాన్ని ప్రతి ఒక్కరు విధిగా భావించాలి' అని మారిషస్ అధ్యక్షుడు ధరమ్ బీర్ గోకుల్ అన్నారు. గుంటూరులో జరుగుతున్న మూడో ప్రపంచ తెలుగు మహాసభల్లో ఆయన ఆదివారం సతీసమేతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన్ను రథంపై ఊరేగించి ఘనస్వాగతం పలికిన నిర్వాహకులు.. 'భారత మిత్ర' బిరుదును ఇచ్చి సత్కరించారు. అనంతరం ధరమ్ బీర్ గోకుల్ ప్రసంగించారు. "ఈ ప్రపంచ తెలుగు మహాసభల్లో నాకు ప్రసంగించే అవకాశం కల్పించడం అదృష్టంగా భావిస్తున్నా. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలతో ఉగాది పండగను మారిషస్‌లో ఘనంగా జరుపుకొంటాం. ఉగాదిని జాతీయ సెలవు దినంగా ప్రకటించాం. నవంబరు 1న ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని మారిషస్‌లో సాంస్కృతిక వేడుకగా జరుపుతారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఘననివాళులు అర్పిస్తారు. ప్రపంచంలో అత్యంత ఎత్తైన 108 అడుగుల వేంకటేశ్వరస్వామి విగ్రహం మా దేశంలోని హరిహర దేవస్థానంలో ఉంది.

బాధ్యతే కాదు.. అత్యంత అవసరం

భాష, సంస్కృతిని కాపాడటం ప్రతి దేశానికి బాధ్యత మాత్రమే కాదు. అత్యంత అవసరం కూడా. భారతదేశంలో అత్యధికంగా మాట్లాడే మూడో భాషగా (మిగతా 2లో)

తెలుగు మెరవాలి.. తరతరాలు మురవాలి
మూడో ప్రపంచ తెలుగు మహాసభల్లో వక్తల మనోగతం 3లో

మదురో స్థానంలో రోడ్రిగ్జ్?

90 రోజులపాటు అధ్యక్షురాలిగా ఉండనున్న వెనెజువెలా ఉపాధ్యక్షురాలు

- గుర్తిస్తున్నట్లు ప్రకటించిన సైన్యం..
- ప్రకటన చేసిన రక్షణ మంత్రి పాడ్రినో
- ఆమే అధికారం చేపట్టాలన్న సుప్రీం కోర్టు



డెల్సీ రోడ్రిగ్జ్

కారకాస్, న్యూయార్క్, వాషింగ్టన్

వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలిగా ఉపాధ్యక్షురాలు, చమురు, ఆర్థికశాఖల మంత్రి డెల్సీ రోడ్రిగ్జ్ బాధ్యతలు చేపట్టినట్లు తెలుస్తోంది. వెనెజువెలా చట్టాల ప్రకారం.. ఆమే బాధ్యతలు చేపట్టాలని సుప్రీం కోర్టు సూచించడం, దేశ సైన్యం ఆమెకు మద్దతుగా నిలిచిన నేపథ్యంలో రోడ్రిగ్జ్ అధికార బాధ్యతలు తీసుకున్నట్లు సమాచారం. అయితే అధికారికంగా ఎక్కడా దీనిపై ప్రకటన వెలువడలేదు. 90 రోజులపాటు ఆమె అధికారంలో ఉంటారని రక్షణ మంత్రి పాడ్రినో ప్రకటించినట్లు సమాచారం.

■ మదురోను వదిలేయాలని అమెరికాను వెనెజువెలా ఉపాధ్యక్షురాలు, తాత్కాలిక అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టారంటున్న డెల్సీ రోడ్రిగ్జ్ డిమాండు చేశారు. ఆయన దేశానికి చట్టబద్ధ నేతని శనివారం సాయంత్రం స్పష్టం చేశారు. 'దేశానికి ఒకరే అధ్యక్షులుగా ఉన్నారు. ఆయనే మదురో' అని అత్యున్నత పౌర, సైనికాధికారుల మధ్య ఆమె స్పష్టం చేశారు. (మిగతా 2లో)



అమెరికాలోని న్యూయార్క్‌లో డీఈఏ ప్రధాన కార్యాలయంలోకి మదురోను తీసుకెళ్తున్న అధికారులు

అడుగుపెట్టాక.. 5 నిమిషాల్లోనే మదురోను బంధించారు!

తర్వాత వంతు మీదే
- లాటిన్ అమెరికా దేశాలకు ట్రంప్ హెచ్చరిక 12లో

నీటిహక్కులపై రాజీ లేదు

- రాయలసీమ లిఫ్ట్ ఆగడానికి కారణం జగనే
- ఎన్‌జీటీ ఆదేశంతో 2020లోనే నిలిచిన ఎత్తిపోతల పనులు
- చంద్రబాబును బూచిగా చూపుతూ తెలంగాణ నేతల రాజకీయ ఎత్తుగడలు: మంత్రి సవిత



ఈనాడు-అమరావతి, విద్యాధరపురం (విజయవాడ)-న్యూస్‌టుడే: రాయలసీమ ఎత్తిపోతల పథకం (లిఫ్ట్) నిలిచిపోవడానికి కారణం వైకాపా అధినేత జగన్‌మోహన్‌రెడ్డేనని.. ఆయన రాయలసీమ ద్రోహిగా మిగిలిపోతారని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్.సవిత ధ్వజమెత్తారు. చంద్రబాబును బూచిగా చూపి రాజకీయ ఉనికి చాటుకోవడం తెలంగాణలోని అధికార, విపక్షాలకు అలవాటుగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ నీటి ప్రయోజనాల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఆదివారం ఆమె విజయవాడలో విలేకరులతో మాట్లాడుతూ 'ఎలాంటి అనుమతులూ లేకున్నా.. 2020లో రాయలసీమ ఎత్తిపోతల పథకం నిర్మాణం చేపడుతున్నామని అప్పటి వైకాపా ప్రభుత్వం అట్టహాసంగా ప్రకటించింది. దీనిపై తెలంగాణ ప్రభుత్వం ఫిర్యాదు చేయడంతో కేంద్రంతో పాటు జాతీయ హరిత ట్రైబ్యునల్ ఎత్తిపోతల నిర్మాణాన్ని అడ్డుకున్నాయి. ఇదే విషయం అప్పట్లో మీడియాలోనూ ప్రచురితమైంది. ఇది ముమ్మాటికీ రాయలసీమకు జగన్ చేసిన ద్రోహమే. ఇప్పుడు దాన్ని మభ్యపెడుతూ.. తెలంగాణ సీఎం పేరుతో తన సొంత మీడియాలో తప్పుడు రాతలు రాయిస్తూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు' అని విమర్శించారు. విషపు రాతలు మానుకోకుంటే ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. 'చంద్రబాబు అపర భగీరథుడు.. రాయలసీమలో సాగు, తాగునీరు అందుతున్నాయంటే చంద్రబాబు తీసుకున్న చర్యలే కారణం. (మిగతా 2లో)

తెలంగాణ నేతల వ్యాఖ్యలతో.. ఏపీలో రాజకీయ లబ్ధికి వైకాపా యత్నం

- రాయలసీమకు తీరని ద్రోహం చేసిన జగన్
- ధ్వజమెత్తిన జలవనరులశాఖ మంత్రి రామానాయుడు

10లో



న్యాయవాదులకు మార్గదర్శి సీతారామయ్య

- 200 మంది జూనియర్లను తీర్చిదిద్దారు
- చిత్రపటం ఆవిష్కరణ పండగలా నిర్వహించడం అసాధారణ విషయం
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీనరసింహ

11లో





ప్రయోగం సమయంలో ఎస్ఎస్3 మోటార్


ఎస్ఎస్ఎల్వీ పేలోడ్ సామర్థ్యం పెంపు

ఇంజిన్ కేసింగ్ మార్చడం ద్వారా ఇస్రో ఘనత

ఈనాడు డిజిటల్, తిరుపతి: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రయాణంలో మరో ముందడుగు పడింది. అత్యంత వేగంగా, తక్కువ ఖర్చుతో ఉపగ్రహాలను కక్ష్యలోకి చేర్చే చిన్న ఉపగ్రహ ప్రయోగ వాహకనౌక (ఎస్ఎస్ఎల్వీ) సామర్థ్యాన్ని ఇస్రో మెరుగుపరిచింది. ఈ వాహకనౌక మూడోదశ (ఎస్ఎస్3) మోటర్‌ను అత్యాధునికంగా తీర్చిదిద్ది (మిగతా 2లో)

తొలి దశలో గుర్తిస్తే.. చికిత్స వారం రోజులే..

- సాధారణ యాంటీ బయాటిక్స్‌తో నయం
- నిర్లక్ష్యం చేస్తే అవయవాల పనితీరుపై దుష్ప్రభావం
- 'స్క్రబ్ టైఫస్'పై 'ఈనాడు'తో డాక్టర్ ఎంవీ రావు



ఈనాడు, హైదరాబాద్: స్క్రబ్ టైఫస్‌కు కారణమయ్యే పొద పురుగు.. పేను కన్నా చిన్నది. పొలాలు, అడవులు, పొదలు, దట్టమైన గడ్డి ప్రదేశాల్లో ఎక్కువగా ఉంటుంది. అతి చిన్నదైన ఆ పురుగు కుట్టడం వల్ల 'ఓరియెంటియా సుట్సుగముషి' అనే బ్యాక్టీరియా వ్యాప్తి చెందుతుంది. దాని ద్వారానే స్క్రబ్ టైఫస్ వ్యాధి వస్తుంది. ఇది కొత్తది కాకపోయినా.. ఎక్కువ మందిలో అవగాహన లేకపోవడం వల్ల వ్యాధి నిర్ధారణలో జాప్యం జరుగుతోందని చెబుతున్నారు సీనియర్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ ఎంవీ రావు. దాదాపు పుష్కర కాలం కిందట ఈ వ్యాధిపై అధ్యయనం చేసిన వైద్య బృందంలో ఆయన సభ్యుడిగా కూడా ఉన్నారు.

'స్క్రబ్ టైఫస్'పై 'ఈనాడు'కు ఆయన తెలిపిన వివరాలు 10లో

ఓ వైద్యుడి కుటుంబం ఇటీవల పర్యటనకు వెళ్లింది. అక్కడ పార్కుల్లో గడ్డిపై పడుకొని ఆహ్లాదంగా గడిపింది. పర్యటన నుంచి వచ్చాక వైద్యుడి భార్యకు జ్వరం వచ్చింది. మందులు వాడారు. ఐదు రోజులైనా తగ్గలేదు. 103 డిగ్రీల జ్వరం, పొడి దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, కళ్లలో పసుపు రంగు కనిపించడం, రక్తంలో ఆక్సిజన్ స్థాయి 86 శాతానికి పడిపోవడంతో. హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చేర్చారు. సీబీపీ, సీయూఈ, మలేరియా, టైఫాయిడ్, డెంగీ సహా అన్ని రకాల పరీక్షలు చేయించారు. అన్నీ నార్మల్‌గానే ఉన్నాయి. కిడ్నీ, లివర్ పనితీరులో ప్రతికూల మార్పు కనిపించడంతో 'స్క్రబ్ టైఫస్'కు సంబంధించి ఇమ్యునో క్రోమటోగ్రాఫిక్ టెస్ట్(ఐసీటీ) చేశారు. అందులో పాజిటివ్‌గా గుర్తించారు. చికిత్స అందించడంతో ఆమె కోలుకున్నారు.

■ సూర్యాపేట జిల్లా కోదాడ ప్రాంతానికి చెందిన 60 ఏళ్ల వ్యక్తి ఈ వ్యాధి లక్షణాలతో హైదరాబాద్‌లో 4 రోజులు చికిత్స పొంది శనివారం మృతి చెందారు.

జెన్‌కో @ 6,009 మెగావాట్లు

(మొదటి పేజీ తరువాయి)

విజయవాడ, కడప, నెల్లూరు జిల్లాల్లో 6,610 మెగావాట్ల స్థాపిత సామర్థ్యం ఉన్న థర్మల్ యూనిట్లు ఉన్నాయి. వాటి ద్వారా గతంలో 4 వేల మెగావాట్ల ఉత్పత్తే కష్టమయ్యేది. ప్రస్తుతం 5,828 మెగావాట్ల ఉత్పత్తి గ్రిడ్‌కు అందుతోంది. ప్లాంట్ల స్థాపిత సామర్థ్యంలో సగటున 88.79 శాతం ఉత్పత్తి వస్తోంది. ◆ ప్రస్తుతం ప్రాజెక్టుల్లో నీటి లభ్యత లేని కారణంగా జల విద్యుత్ ఉత్పత్తికి అవకాశం తక్కువ. ఈ పరిస్థితుల్లోనూ మాచ్‌ఖండ్ జల విద్యుత్ ప్రాజెక్టు నుంచి 120 మెగావాట్లు, నాగార్జునసాగర్ కుడికాలువ పంప్ హౌస్ ద్వారా 40 మెగావాట్లు, హంపి పవర్ హౌస్ ద్వారా 14 మెగావాట్ల విద్యుత్ గ్రిడ్‌కు అందింది.

థర్మల్ విద్యుత్ ఉత్పత్తి గణాంకాలు(మెగావాట్లలో)		
థర్మల్ కేంద్రం	స్థాపిత సామర్థ్యం	విద్యుత్ ఉత్పత్తి
వీటీపీఎస్	2,560	2,222 (86.90%)
ఆర్‌టీపీపీ	1,650	1,543 (93.52%)
కృష్ణపట్నం	2,400	2,063 (85.96%)

వైకాపా హయాంలో ప్రైవేటుకు అప్పగించే యత్నం: కృష్ణపట్నం థర్మల్ ప్లాంట్ల (మూడు యూనిట్లు) నిర్వహణను ప్రైవేటుకు అప్పగించే ప్రయత్నాలను వైకాపా ప్రభుత్వం చేసింది. ఉద్యోగుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో పక్కన పెట్టింది. ప్లాంట్ల నిర్వహణకు నాణ్యమైన బొగ్గును అందుబాటులో ఉంచకపోవడంతో కృష్ణపట్నం ఉత్పత్తి.. సామర్థ్యంలో 45 శాతానికి మించలేదు. థర్మల్ ప్లాంటులోని మొదటి రెండు యూనిట్లకు 70 శాతం (6,000 జీసీవీ- గ్రాస్ కెలోరిఫిక్ వ్యాల్యూ) విదేశీ బొగ్గు, 30 శాతం స్థానిక బొగ్గును వినియోగించాలి. నాణ్యమైన బొగ్గు సరఫరా చేయకపోవడంతో ఆ ప్రభావం ఉత్పత్తిపై పడింది. కూటమి అధికారంలోకి వచ్చాక.. బొగ్గు నాణ్యతపై దృష్టి పెట్టింది. గతంలో 5,000 జీసీవీ ఉండే బొగ్గు రావడమే కష్టంగా ఉండేది. ప్రస్తుతం ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ నుంచి తీసుకునే (5,800 జీసీవీ) బొగ్గు, నాణ్యమైన వాష్డ్ కోల్‌ను వినియోగించడం వల్ల ప్రస్తుతం 2,063 మెగావాట్ల గరిష్ఠ విద్యుత్ ఉత్పత్తి వస్తోంది. గతంలో ఇది 1,200-1,400 మెగావాట్ల మధ్య ఉండేది.

కొనుగోళ్లు తగ్గాయ్: జెన్‌కో థర్మల్ కేంద్రాల ఉత్పత్తి సామర్థ్యం పెరగడం వల్ల సుమారు 50 మిలియన్ యూనిట్ల (ఎంయూ) విద్యుత్ అదనంగా డిస్కంలకు అందుబాటులోకి వస్తుందని అంచనా. ఆ మేరకు పీక్ డిమాండ్ వేళల్లో విద్యుత్ అందుబాటులోకి వస్తోంది. దీంతో బహిరంగ మార్కెట్‌లో విద్యుత్ కొనుగోళ్లు తగ్గాయి. 2024-25లో బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.3 వేల కోట్ల విలువైన విద్యుత్‌ను డిస్కంలు అధిక ధరకు కొన్నాయి. విద్యుత్‌కు మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌ను బట్టి యూనిట్‌కు గరిష్ఠంగా రూ.10 చొప్పున ఖర్చు చేశాయి. ముందస్తు ఒప్పందాల ద్వారా యూనిట్‌ను సగటున రూ.15కు కొన్నాయి. 2025-26లో డిసెంబరు వరకు డిస్కంలు రూ.1,700 కోట్లను విద్యుత్ కొనుగోలుకు వెచ్చించాయి. మిగిలిన మూడు నెలల్లో డిమాండ్ అనూహ్యంగా పెరిగే అవకాశం లేదని అధికారుల అంచనా. ఈ ప్రకారం బహిరంగ మార్కెట్ విద్యుత్ కొనుగోళ్లు రూ.2 వేల కోట్లకు మించబోవని భావిస్తున్నారు. దీనివల్ల విద్యుత్ వినియోగదారులకు ట్రూఅప్ భారం తప్పనుంది.

నీటిహక్కులపై రాజీ లేదు

(మొదటి పేజీ తరువాయి)

అందుకే కియా సహా అనుబంధ పరిశ్రమలు వచ్చాయి. మరిన్ని సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు వస్తున్నారంటే అందుకు కారణం చంద్రబాబే' అని పేర్కొన్నారు.

అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయినా..: జగన్ పాలనలో ఒక్క పిల్ల కాలువైనా తవ్వారా అని మంత్రి సవిత నిలదీశారు. 'కొత్త ప్రాజెక్టులు కట్టకపోగా.. ఉన్న వాటి నిర్వహణనూ పట్టించుకోలేదు. జగన్ ఇసుక మాఫియా కారణంగా అన్నమయ్య డ్యామ్ కొట్టుకుపోయి పలువురు ప్రాణాలు పోయినా పట్టించుకోలేదు' అని ధ్వజమెత్తారు. 'చిత్తూరు జిల్లా రామకుప్పం మండలం రాజుపేట వద్ద నీటి విడుదల పేరుతో 2024 ఫిబ్రవరి 26న డ్రామాలు ఆడారు. సినిమా సెట్టింగ్ వేయించి గేటు పెట్టి, దాన్ని ఎత్తుతున్నట్లు మీడియా ముందు హడావుడి చేశారు. సాయంత్రానికి అదంతా మాయమైపోయింది. గేటు వెంట బొట్టు నీరు కూడా పారలేదు. మరుసటి రోజే జేసీబీ తెచ్చి 'గేటు తరలించుకుపోయారు' అని విమర్శించారు.

వైఎస్ కుటుంబం చేసిందేమీ లేదు: 'రాయలసీమకు మొదటిసారి నీళ్లిచ్చిన ఘనత ఎన్టీఆర్‌దే. 2016-17లో గాలేరు నగరి ద్వారా గండికోట రిజర్వాయర్ నింపి పులివెందుల పైడిపాలెం ప్రాజెక్టుకు లిఫ్ట్ ద్వారా నీరందించిన ఘనత చంద్రబాబుకు దక్కుతుంది. అక్కడ నుంచి సీబీఆర్ ప్రాజెక్టు ద్వారా కడపకూ నీరందించాం. 40 ఏళ్లలో వైఎస్ కుటుంబం చేయలేని పనిని చంద్రబాబు చేసి చూపారు' అని సవిత పేర్కొన్నారు. 'వచ్చే పాలనలో రాయలసీమ రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్లు కూడా ఇస్తారా, చంద్రబాబు హయాంలోనే రైతులకు సూక్ష్మ సేద్య పరికరాలు అందుతున్నాయి' అని వివరించారు. 'రాయలసీమ ప్రాంతాన్ని ఉద్యాన హబ్‌గా తీర్చిదిద్దుతున్నాం. హంద్రీ- నీవా ద్వారా కుప్పం వరకు సాగునీరందించామని తెలిపారు. రాయలసీమ సహా రాష్ట్రంలోని ప్రతి ఎకరానికీ నీరందించాలనేది చంద్రబాబు సంకల్పమని చెప్పారు.





గుంటూరులో జరుగుతున్న ప్రపంచ తెలుగు మహాసభల వేదిక వద్దకు అశ్వరథంపై వస్తున్న మారిషస్ అధ్యక్షుడు ధరమ్ బీర్ గోకుల్ దంపతులు ◆ హాజరైన భాషాభిమానులు

భాషతోనే బంధం బలోపేతం

(మొదటి పేజీ తరువాయి)

తెలుగు గుర్తింపు పొందింది. 50 దేశాల్లో తెలుగును మాట్లాడుతుండటం ఆ భాష గొప్పతనానికి నిదర్శనం. తెలుగు పట్ల చూపుతున్న అంకితభావానికి ఆంధ్ర సారస్వత పరిషత్తును అభినందిస్తున్నా. ఈ మహాసభల్లో జరిగిన చర్చలు, ఫలితాలు ప్రపంచంలో తెలుగు గుర్తింపును బలపరుస్తాయని నా నమ్మకం.

మారిషస్ జాతీయ నిర్మాణంలో తెలుగు కీలకం

భారత్, మారిషస్ దేశాలు సాంకేతిక అభివృద్ధిలో పరస్పరం సహకరించుకుంటున్నాయి. మారిషస్ జాతీయ నిర్మాణంలో అక్కడి తెలుగు సమాజం ముఖ్య పాత్ర పోషిస్తోంది. మా దేశంలో విద్యాలయాల్లోనూ తెలుగును బోధిస్తున్నారు. తెలుగు భాష, విద్య, సంస్కృతిని కాపాడటంలో మారిషస్ తెలుగు మహాసభ కీలక భూమిక పోషిస్తోంది. ద్వీపవ్యాప్తంగా 98 శాఖలతో అది అలరారుతోంది. 2025 మార్చిలో భారత ప్రధాని నరేంద్ర మోదీ మారిషస్‌ను సందర్శించడం, ఆ తర్వాత మా దేశ ప్రధాని డాక్టర్ నవీన్ చంద్రరామ్ గులామ్ భారతదేశాన్ని, తిరుపతిని సందర్శించడంతో మా భాగస్వామ్యం ఎంతో పురోగతి సాధించింది. భాష, వారసత్వం, సంస్కృతి ఇరుదేశాల సంబంధాలను కలుపుతున్నాయి.

సీఎం చంద్రబాబుది ఎనలేని కృషి

మారిషస్‌లో తెలుగు సాహిత్యం, భాషను ప్రోత్సహించడంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో కృషి చేశారు. 2003లో చంద్రబాబు మారిషస్ వచ్చినప్పుడు విద్య, తెలుగు సంస్కృతి అభివృద్ధికి చర్యలు తీసుకున్నారు. తెలుగు భాషాభివృద్ధికి కృషి చేస్తున్న చంద్రబాబును హృదయపూర్వకంగా అభినందిస్తున్నా. ఏపీలో క్వాంటమ్ టెక్నాలజీని ప్రారంభించి ముందుతరాలకు మెరుగైన బాటలు వేస్తున్నారు. ఏఐ టెక్నాలజీతో తెలుగు, ఇంగ్లిష్, హిందీ భాషల్లో నైపుణ్యాన్ని పెంచే ఏర్పాట్లు చేయడం అభినందనీయం. ఈ నైపుణ్యాన్ని ప్రవాసులు వినియోగించుకోవాలని కోరుతున్నా.

సవాళ్లను ఎదుర్కొంటున్న ప్రాచీన భాషలు

ప్రపంచీకరణ, సాంకేతిక పరివర్తన వల్ల కొన్ని ప్రాచీన భాషలు ఎన్నడూ లేని సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. ఉదాహరణకు మన యువతరం ఇంగ్లిష్ వంటి ప్రపంచ భాషలను ఎక్కువగా ఉపయోగించడం వల్ల తెలుగు వంటి మాతృభాషలపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. ప్రతి రెండు వారాలకు ఒక భాష కనుమరుగవుతోందని, ఈ శతాబ్దం చివరికి ప్రపంచంలో సగానికి పైగా భాషలు అంతరించిపోవచ్చని ఇటీవల కొన్ని అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. మన పూర్వీకుల నుంచి వచ్చిన మాతృభాషను కాపాడుకోవల్సిన అవసరాన్ని ఇవి గుర్తు చేస్తున్నాయి. భాషా వారసత్వాన్ని కాపాడుకోవడంలో మారిషస్, భారత్ రెండూ సమానమైన సవాళ్లు ఎదుర్కొంటున్నాయి. ఈ మహాసభల వేదికగా తెలుగు భాషాభివృద్ధిపై ఫలప్రదమైన చర్చలు జరగాలి" అని ఆయన వివరించారు. నమస్కారం అని తెలుగులో తన ప్రసంగాన్ని ప్రారంభించి అనంతరం ఆంగ్లంలో మాట్లాడిన ధరమ్‌బీర్ గోకుల్.. చివరలో ధన్యవాదాలు, జై తెలుగు, జైహింద్, జై మారిషస్ అని ముగించారు.

'భారతమిత్ర'.. మన మారిషస్ అధ్యక్షుడు

ఈనాడు, అమరావతి: ప్రపంచ తెలుగు మహాసభల్లో మారిషస్ అధ్యక్షుడు ధరమ్‌బీర్ గోకుల్‌కు 'భారతమిత్ర' బిరుదు అందించి గజల్ శ్రీనివాస్ సత్కరించారు. మూడో ప్రపంచ తెలుగు మహాసభల వేదికపై ఆదివారం ఈ బిరుదును అంకితం చేశారు. ఉత్తరాఖండ్ జ్యోతిష్ మఠ్ ఉత్తరాధికారి స్వామి ముకుందానందగిరి శంకరాచార్య మహరాజ్ చేతులమీదుగా ఈ ప్రదానం జరిగింది. అనంతరం భారీ గజమాలతో ధరమ్‌బీర్ దంపతులను సత్కరించారు. ప్రపంచ తెలుగు మహాసభలకు ఓ దేశాధ్యక్షుడు రావడం ఇదే తొలిసారి. ధరమ్‌బీర్‌కు వేదికపై పంచలోహ వేంకటేశ్వరుని విగ్రహాన్ని బహూకరించారు. రామలింగేశ్వరరావు తయారుచేసిన ఆ విగ్రహమూర్తిని ధరమ్‌బీర్ ఎంతో ఆసక్తిగా చూసి, ఆనందం వ్యక్తం చేశారు. ప్రతిగా నావ నమూనా జ్ఞాపికను గజల్ శ్రీనివాస్‌కు ఆయన బహూకరించారు.

అశ్వరథంపై అతిథి ఊరేగింపు

ధరమ్‌బీర్ గోకుల్‌కు వేదిక వద్ద ఘనస్వాగతం లభించింది. శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, గజల్ శ్రీనివాస్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ తదితరులు వీవీపీ మార్గంలోని ద్వారం వద్దకు చేరుకుని స్వాగతించారు. అక్కడి నుంచి అశ్వరథంపై ఆయన్ను సతీసమేతంగా కూర్చోబెట్టి ఎన్టీఆర్ ప్రధాన వేదిక వద్దకు తీసుకొచ్చారు. దారి పొడవునా కోలాట నృత్యాలతో కళాకారులు సందడి చేశారు. ధరమ్‌బీర్ గోకుల్ సతీమణి అచ్చతెలుగు చీరకట్టులో వచ్చారు.

◆ ధరమ్‌బీర్ గోకుల్ దిల్లీలో చరిత్ర-అర్థశాస్త్రం చదువుకున్నారు. ఆయనకు భారత్‌తో 50 ఏళ్ల అనుబంధం ఉంది. ఎంపీగా, మంత్రిగా పనిచేసిన ఆయన.. 2024 డిసెంబరు 6న మారిషస్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

అల వైభోగాపురం



ఉత్తరాంధ్ర నాయకులు, అధికారులతో కలిసి విజయచిహ్నం చూపిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

(మొదటి పేజీ తరువాయి)

భాగస్వామ్యంతో సమీపంలోని అన్నవరం వద్ద 136 ఎకరాల్లో ఎడ్యూ సిటీ అవతరిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం విమానాశ్రయానికి ఇచ్చిన 2,203 ఎకరాలకు అదనంగా అందజేసిన 500 ఎకరాల్లో వివిధ విమానయాన అనుబంధ విభాగాలు వెలుస్తాయి' అని చెప్పారు.

18 నెలల్లో ఇదో రికార్డు

కూటమి అధికారంలోకి వచ్చినప్పటికి ఇక్కడ 23% పనులే జరిగాయని మంత్రి పేర్కొన్నారు. 18 నెలల్లో 96% పూర్తి చేసుకొని దేశంలో వేగంగా విమానాశ్రయ నిర్మాణం చేపట్టడంలో రికార్డు నెలకొల్పిందన్నారు. దేశంలో స్టార్ ఎయిర్ సంస్థ మళ్లీ రంగప్రవేశం చేయనుందని తెలిపారు. త్వరలో నవీ ముంబయి, నోయిడా విమానాశ్రయాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు.

సరకు రవాణాకు అనుకూలం: ఈ విమానాశ్రయం ఫార్మా, ఆక్వా ఉత్పత్తుల రవాణా, ఎగుమతులకు అనుకూలమని కేంద్ర మంత్రి అన్నారు. ప్రస్తుతం ఏటా ఐదారు వేల టన్నుల సరకు రవాణా చేస్తారని, క్రమంగా 20 వేల టన్నులకు పెరుగుతుందని చెప్పారు. ఇక్కడి నుంచి పశ్చిమాసియా, తూర్పు ఆసియా దేశాలకు ఎక్కువ కనెక్టివిటీ పెంచేలా పౌర విమానయాన మంత్రిత్వ శాఖ చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రస్తుతం విశాఖ నుంచి 33 విమాన సర్వీసులు నడుస్తున్నాయని, భోగాపురం విమానాశ్రయం అందుబాటులోకి వచ్చాక స్వదేశీ, విదేశీ సర్వీసులు రెట్టింపు అవుతాయన్నారు.


బీచ్ కారిడార్‌పై కేంద్రంతో చర్చలు

దీర్ఘకాలిక ప్రయోజనాల దృష్ట్యా బీచ్ కారిడార్ అభివృద్ధికి సీఎం చంద్రబాబు, కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో చర్చించారని రామ్మోహన్‌నాయుడు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా మూలపేటలో పోర్టు నిర్మాణం జరుగుతోందని, అక్కడకు సమీపంలో ఎయిర్‌పోర్టు ఉండాలనే లక్ష్యంతో పలాసలో విమానాశ్రయం నిర్మించాలని యోచిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీలు కలిశెట్టి అప్పలనాయుడు, శ్రీభరత్, సీఎం రమేశ్, ఎమ్మెల్యేలు, పౌరవిమానయాన మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

మరచిపోలేని క్షణాలివి
రామ్మోహన్‌నాయుడు

ఈనాడు, విజయనగరం: 'ఎయిర్ ఇండియా విమానంలో ఆదివారం ఉదయం 8.45 గంటలకు దిల్లీలో బయలుదేరాను. 11 గంటలకు గగనతలంలో ఉండగా మరికొద్దిసేపట్లో భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండ్ కానున్నట్లు పైలట్ చేసిన ప్రకటన వినగానే పరవశించిపోయాను. నా చెవిలో ఇప్పటికీ ఆ మాటలు మార్మోగుతున్నాయి. ఆ ఆనందం వర్ణనాతీతం. మరచిపోలేని క్షణాలవి" అని పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. ఉదయం 11.01 గంటలకు రన్‌వేపై దిగిన విమానం 11.04 గంటలకు ఏరోబ్రిడ్జి వద్దకు చేరింది. ఆ సమయంలో విమానానికి వాటర్ సెల్యూట్ చేశారు. విమానం ఆగిన తర్వాత అందులోంచి మంత్రి రామ్మోహన్‌నాయుడు బయటకు వచ్చి అందరికీ అభివాదం చేశారు. ఆయనతోపాటు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, కేంద్ర ప్రభుత్వ అధికారులు ఉన్నారు. స్థానిక నాయకులు, జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఛైర్మన్ జీబీఎస్ రాజు, విజయనగరం, విశాఖపట్నం కలెక్టర్లు ఎం.రాంసుందర్‌రెడ్డి, హరేంధిరప్రసాద్, కూటమి పార్టీల నాయకులు, అధికారులు ఘనస్వాగతం పలికారు.

జూన్ నాటికి విమానాశ్రయం సిద్ధం
సీఎం చంద్రబాబు



ఈనాడు, అమరావతి: భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రయోగాత్మకంగా చేపట్టిన తొలి విమాన ల్యాండింగ్ విజయవంతం కావడంపై సీఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర ప్రజలకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాది జూన్ నాటికి మిగిలిన 4% పనులూ పూర్తిచేసి విమానాశ్రయాన్ని అందుబాటులోకి తెస్తామని వివరించారు. 18 నెలల్లో విమానాశ్రయం పనులు వేగంగా పూర్తి కావడానికి కారణమైన కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీకి ఆదివారం ఎక్స్ వేదికగా ధన్యవాదాలు తెలిపారు. '2014-19 మధ్య ఎన్డీయే ప్రభుత్వం దీని నిర్మాణం చేపట్టింది. ఈ విమానాశ్రయం అందుబాటులోకి వస్తే ఆ ప్రాంతానికి అనుసంధానం పెరిగి.. అభివృద్ధికి దోహదపడుతుంది. నౌకాశ్రయాలు, విమానాశ్రయాలు, జాతీయ రహదారులు, ఐటీ సహా వివిధ రంగాలకు చెందిన అంతర్జాతీయ సంస్థల రాకతో ఉత్తరాంధ్ర దశ, దిశ మారబోతున్నాయి' అని చంద్రబాబు పేర్కొన్నారు. అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ప్రజల్ని కోరారు.

◆ మంత్రి నారా లోకేశ్ స్పందిస్తూ, విమానాశ్రయ నిర్మాణం వేగంగా సాగడానికి సహకరించిన ప్రధాని నరేంద్ర మోదీకి ఎక్స్ వేదికగా ధన్యవాదాలు తెలిపారు.

◆ భోగాపురం విమానాశ్రయంలో టెస్ట్‌ఫ్లైట్ ల్యాండింగ్ విజయవంతం కావడం హర్షణీయమని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు.

మదురో స్థానంలో రోడ్రిగ్జ?

(మొదటి పేజీ తరువాయి)

ఆమె మాట్లాడిన సమయంలో టీవీ ఛానళ్లలో కింద స్క్రోలింగ్ భాగంలో ఉపాధ్యక్షురాలనే వచ్చింది.

మరోవైపు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియోతో డెల్సీ రోడ్రిగ్జ్ సమగ్ర చర్చలు జరిపారని డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. 'మీకేం కావాలో అది చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఆమె దయగల వ్యక్తి. వెనెజువెలా బాధ్యతలను వేరేవారికి అప్పగించే ఛాన్స్ తీసుకోం. అది ఆ దేశ ప్రజలకు మంచిది కాదు' అని ట్రంప్ స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేత మచాడోకు దేశంలో పెద్దగా మద్దతు లేదని ఆయన అభిప్రాయపడ్డారు. మరోవైపు డెల్సీకి అమెరికాతో సంబంధాలున్నట్లు తెలుస్తోంది. అందుకే ఆమెపై అమెరికా ఎటువంటి అభియోగాలను మోపలేదు. చమురు పరిశ్రమలోని రిపబ్లికన్లతో, వాల్‌స్ట్రీట్‌తో ఆమెకు మంచి సంబంధాలే ఉన్నట్లు సమాచారం. దీనినిబట్టి వెనెజువెలా అధ్యక్షురాలిగా డెల్సీ కొనసాగే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

మదురో తరలింపు

ఆకస్మిక దాడులు చేసి వెనెజువెలా అధ్యక్షుడు నికొలస్ మదురోను చెరబట్టిన అమెరికా.. ఆయనను న్యూయార్క్‌కు చేర్చింది. శనివారం సాయంత్రం 4.30 గంటల సమయంలో ఆయనను, ఆయన భార్య సిలియా ఫ్లోర్స్‌ను నగరంలోని ఉత్తర ప్రాంతంలో ఉన్న ఓ చిన్న విమానాశ్రయానికి తీసుకొచ్చింది. మదురోను తీసుకొచ్చిన విమానానికి అమెరికా జెట్లు రక్షణగా వచ్చాయి. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో మన్‌హటన్‌కు తరలించారు. అక్కడ వేచి ఉన్న కాన్వాయ్‌తో మదురోను అమెరికా డ్రగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయానికి తీసుకెళ్లారు. ఈ ఇద్దరిపై 'నార్కో-టెర్రరిజం' అభియోగాలను మోపిన అమెరికా.. బ్రూక్లిన్ జైలులోనే విచారించి శిక్ష విధించనుంది. శ్వేతసౌధం విడుదల చేసిన వీడియోలో మదురో నవ్వుతూ కనిపించారు. అమెరికా అధికారులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం అర్ధరాత్రి దాటాక (శనివారం తెల్లవారుజామున) వెనెజువెలా రాజధాని కారకాస్‌లోని మదురో ఇంటిపై మెరుపు దాడి చేసి ఆయనను తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. అమెరికా చేసిన దాడిలో పౌరులు, సైనికులతోసహా కనీసం 40 మంది మరణించారని ఓ మీడియా సంస్థ తెలిపింది.

◆ మదురో, ఆయన భార్య సిలియాపై నార్కో-టెర్రరిజం కుట్ర, కొకైన్ దిగుమతి, మెషీన్ గన్స్, విధ్వంసకర ఆయుధాలను కలిగి ఉండటం వంటి అభియోగాలను మోపుతున్నారు. డ్రగ్స్ రవాణా చేసేవారి కిడ్నాప్‌లు, దాడులు చేయడంవంటి కేసులనూ పెట్టారు. వారు డబ్బులు ఇవ్వకపోవడంతో వారిని హింసించేవారని అభియోగాలు మోపారు.

◆ అమెరికా ఆపరేషన్ చట్టబద్ధతపై న్యాయ నిపుణులు పలు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. కాంగ్రెస్ అనుమతి లేకుండా చేయడాన్ని వారు ప్రశ్నిస్తున్నారు. అనేక అంతర్జాతీయ చట్టాలను అమెరికా ఉల్లంఘించిందని న్యాయ నిపుణుడు ఇలాన్ కట్జ్ అభిప్రాయపడ్డారు. వెనెజువెలా పడవలపై దాడులు చేయడాన్ని ఇప్పటికే అమెరికా కాంగ్రెస్‌లోని రెండు పార్టీల సభ్యులు ఖండించారు. ఇప్పుడు వారికి తెలియకుండా విరుచుకుపడటం, అధ్యక్షుడిని తీసుకురావడంపై ఎలా స్పందిస్తారనేది ఆసక్తికరంగా మారింది. ◆ అమెరికా దాడుల సందర్భంగా విధుల్లో ఉండి బయటపడ్డ అధికారులు తిరిగి తమ విధుల్లో చేరారు. ఇప్పటికిప్పుడే అందరినీ మార్చే ఉద్దేశం అమెరికాకు లేనట్లు కనిపిస్తోంది. ◆ అమెరికా తమపై దాడి చేసి ఉండవచ్చుగానీ తాము చీలిపోలేదని రక్షణ మంత్రి వ్లాదిమిర్ పాడ్రినో వ్యాఖ్యానించారు. 'ఈ ఎలుకలు దాడి చేశాయి. తాము చేసిన పనిపై ఏదో ఒక రోజు చింతిస్తారు' అని హోం మంత్రి స్పష్టం చేశారు.





న్యూయార్క్‌లోని డీఈఏ ప్రధాన కార్యాలయంలోకి వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో భార్య సిలియా ఫ్లోర్స్‌ను తీసుకువెళ్తున్న అధికారులు ◆ మదురో దంపతులను అమెరికా బంధించిన నేపథ్యంలో అర్జెంటీనా రాజధాని బ్యూనస్ ఎయిర్స్‌లో సంబరాలు చేసుకుంటున్న వెనెజువెలాకు చెందిన ప్రజలు

నేడు ఐరాస భద్రతా మండలి భేటీ

అమెరికా దాడులపై చర్చించేందుకు సోమవారం ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి సమావేశం కానుంది. అత్యవసరంగా సమావేశం కావాలని కొలంబియా చేసిన విజ్ఞప్తితో ఈ సమావేశం ఏర్పాటైంది.

విమానాలకు అంతరాయం

వెనెజువెలాపై దాడుల నేపథ్యంలో కరీబియన్ ప్రాంతంలో వందల విమానాలకు అంతరాయం కలిగింది. ప్రస్తుతం సెలవుల సీజను కావడంతో అనేక మంది కరీబియన్ దీవులకు ప్రయాణాలు పెట్టుకున్నారు. వారంతా ఇబ్బందిపడ్డారు. శనివారం రోజు ఏ ఒక్క విమానమూ వెనెజువెలా మీదుగా వెళ్లలేదు. ప్యూర్టోరికో, ద వర్జిన్ ఐలాండ్స్, అరూబాతోపాటు మరో డజను గమ్య స్థానాలకు విమాన సర్వీసులు రద్దయ్యాయి. శనివారం రాత్రికి ఆంక్షలను ఎత్తివేశారు. దీంతో విమానాలు యథావిధిగా తిరిగాయి. ఆదివారం అదనపు సర్వీసులూ నడిచాయి.

దేశంలో భయం.. భయం

తమ భవిష్యత్తుపై వెనెజువెలా వాసుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఆదివారం రాజధాని కారకాస్‌లో వీధులు జనం లేక బోసిపోయాయి. దుకాణాలు, పెట్రోలు బంకుల వద్ద భారీ క్యూలు మాత్రం కనిపించాయి. వైమానిక దాడుల్లో కీలక మౌలిక సదుపాయాలు, విద్యుత్ గ్రిడ్‌లు దెబ్బతినడంతో కారకాస్‌లోని అనేక ప్రాంతాల్లో కరెంట్ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కారకాస్‌లోని భారతీయుడు సునీల్ మల్హోత్రా మీడియాతో మాట్లాడుతూ.. 'భారీ నష్టం జరిగింది. దాడి అనంతరం సూపర్ మార్కెట్లు మూసేశారు. చిన్న దుకాణాలు తెరిచి ఉన్నాయి. వాటి ముందు పొడవైన క్యూలు కనిపిస్తున్నాయి' అని పేర్కొన్నారు. ప్రజా రవాణా సేవలు నిలిచిపోయాయని తెలిపారు.

ఎవరీ డెల్సీ రోడ్రిగ్జ్?

వెనెజువెలా రాజధాని కారకాస్‌లో 1969లో డెల్సీ రోడ్రిగ్జ్ జన్మించారు. ఆమె వామపక్ష గెరిల్లా నాయకుడు జార్జ్ అంటోనియో కుమార్తె. ఆమె తండ్రి పోలీసు కస్టడీలోనే మరణించారు. గతంలో మదురో ప్రభుత్వంలో కమ్యూనికేషన్, విదేశాంగ మంత్రిగా విధులు నిర్వర్తించిన ఆమె.. 2018లో ఉపాధ్యక్షురాలిగా నియమితులయ్యారు. ప్రస్తుతం ఆర్థిక, చమురుశాఖల మంత్రిగానూ పని చేస్తున్నారు. చమురు కోసం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాలు విధించిన వేళ.. వెనెజువెలాను ద్రవ్యోల్బణం నుంచి బయటపడేయటంలో ఆమె కృషి చేశారు. మదురోకు విశ్వసనీయురాలిగా ఉన్నారు.

ఎస్ఎస్ఎల్వీ పేలోడ్ సామర్థ్యం పెంపు

(మొదటి పేజీ తరువాయి)


నిర్వహించిన 'స్టాటిక్ టెస్ట్' విజయవంతమైనట్లు ఇస్రో తాజాగా వెల్లడించింది. గత శనివారం శ్రీహరికోటలోని సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రంలో ఈ ప్రయోగం నిర్వహించినట్లు పేర్కొంది. రాకెట్ బరువు తగ్గితే అది మోసుకెళ్లే ఉపగ్రహాల బరువును పెంచే వీలుంటుందన్న సూత్రాన్నే ఇస్రో అమలు చేసింది. గతంలో ఉన్న మోటార్ మూడో దశ కేసింగ్‌ను మార్చి తేలికగా ఉండే 'కార్బన్-ఎపోక్సీ' మిశ్రమంతో చేసిన కేసింగ్‌ను అమర్చింది. దీనివల్ల రాకెట్ బరువు గణనీయంగా తగ్గి ఎస్ఎస్ఎల్వీ మోసుకెళ్లే పేలోడ్ సామర్థ్యం మరో 90 కిలోలు పెరిగే అవకాశముంది.

గ్రహం అనుగ్రహం
5-1-2026 సోమవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం;
హేమంత రుతువు, పుష్యమాసం, బహుళపక్షం
విదియ: మ. 12-50 తదుపరి తదియ
పుష్యమి: సా. 4-45 తదుపరి ఆశ్లేష
వర్జ్యం: తె. 5-15 నుంచి
అమృత ఘడియలు: ఉ. 10-35 నుంచి 12-08 వరకు
దుర్ముహూర్తం: మ. 12-27 నుంచి 1-11 వరకు
తిరిగి 2-39 నుంచి 3-23 వరకు
రాహుకాలం: ఉ. 7-30 నుంచి 9-00 వరకు
సూర్యోదయం: ఉ.6.36; సూర్యాస్తమయం: సా.5.35

చలి పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
విజయనగరం	15.0	26.0
అనంతపురం	16.5	31.6
కడప	17.0	29.0
శ్రీకాకుళం	18.0	28.0
విశాఖపట్నం	18.0	28.2
తాడేపల్లిగూడెం	18.0	29.0
గుంటూరు	18.0	29.0
కర్నూలు	18.5	31.0
రాజమహేంద్రవరం	18.5	34.0
విజయవాడ	19.8	29.0
నరసాపురం	20.0	30.8



మముగన్న తల్లీ..
జై కల్పవల్లీ

ప్రపంచ తెలుగు మహాసభల వేదికపై గుంటూరు పీవీపీ స్కూల్ విద్యార్థుల తెలుగు వైభవం నృత్య ప్రదర్శన



పల్లవించిన పదనిసలు

మువ్వల రవళులు.. వివిధ కళాప్రక్రియలు.. మూడో ప్రపంచ తెలుగు మహాసభల ప్రధాన వేదికపై ప్రేక్షకులను మురిపించాయి. రోజంతా ఈ పదనిసలు పల్లవించగా, పదగతులు పరవళ్లు తొక్కాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు ప్రదర్శించిన నృత్య రూపకాలు, సామాజిక నాటకాలు, జానపద నృత్యాలు అలరించాయి. నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ హరిశ్చంద్ర ఏకపాత్రాభినయంతో మెప్పించారు. ఆర్ట్ ఆఫ్ నటరాజ్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన క్షేత్ర దర్శిని నృత్యరూపకంలో ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని దివ్య దేవాలయాల చరిత్ర, ఆయా ఆలయాల్లోని దేవతల మహిమలను కళ్లకు కట్టినట్లు చూపారు. ఈ సంగీత నృత్యరూపకానికి గజల్ శ్రీనివాస్ నేపథ్య గానం చేశారు.

– న్యూస్‌టుడే, గుంటూరు సాంస్కృతికం

భాషతోనే సంస్కృతి, జాతి పరిరక్షణ

మనది వసుధైక కుటుంబం

– స్వామి ప్రజ్ఞా చైతన్య ముకుందానందగిరి శంకరాచార్య మహారాజ్, ఉత్తరాఖండ్ జ్యోతిష్పీఠ్ శంకరాచార్య పీఠం



మన భారతదేశం... పుణ్యభూమి, ధర్మభూమి, కర్మభూమి. అలాంటి ఈ మట్టిపై మనం జన్మించడం మన అదృష్టం. ఇది దేవతలకూ పుట్టినిల్లు. ఇక్కడ నలువైపులా గంగ, యమున, గోదావరి, కృష్ణవేణి, నర్మద, కావేరి వంటి నదులతోపాటు ఒక్కో దిక్కులో జగన్నాథుడు, బద్రీనాథుడు, రామేశ్వరుడు, కాశీ విశ్వనాథుడు వంటివారు ఉన్నారు. ఇలాంటి దేశంలో మనం ఉండటం గర్వకారణం. భిన్నత్వంలో ఏకత్వం మన భారతదేశ ప్రత్యేకం. మన పూర్వీకులు, గురువులు సూచించిన మార్గంలో మనం నడవాలి. ప్రపంచంలో అందరి శ్రేయస్సును కాంక్షించాలి. మన సంస్కృతి, సంప్రదాయాలు వేర్వేరుగా ఉండొచ్చు కానీ మనమంతా ఒక్కటే. దక్షిణ భారతంలోని కేరళలోని కాలడిలో జగద్గురు భగవాన్ ఆదిశంకరాచార్యులు జన్మించి దేశమంతా ఈ ధర్మపాలనను పంచారు. మారిషస్ అధ్యక్షుని పేరు ధర్మబీర్ గోకుల్. ధర్మసంరక్షణ తన పేరులోనే కలిగి ఉన్నారు. మన దేశాన్ని విశ్వగురువుగా చెబుతుంటారు. ఇక్కడ ధర్మసంస్థాపనకు కృషిచేస్తున్నారు. గోమాతలు, గురుకులాలు విరివిగా స్థాపించి సనాతన హైందవ ధర్మ పరిరక్షణకు కృషిచేయాలి.

- లిపి లేని భాషలను సైతం గౌరవించాలి
- ద్వితీయ భాషగా తెలుగు తప్పనిసరి చేయాలి
- త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

ఈనాడు, అమరావతి: తెలుగు పరిరక్షణకు ప్రజలు, ప్రభుత్వాలు కలిసి పనిచేయాలని త్రిపుర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డి సూచించారు. మూడో ప్రపంచ తెలుగు మహాసభల్లో రెండోరోజు నిర్వహించిన తెలుగు వైభవ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. "తెలుగుభాషను కాపాడుకోవాలంటే ఇంట్లో తెలుగే మాట్లాడాలి. అమెరికాకు వెళ్లినవారు తెలుగులోనే మాట్లాడుకోవాలి. రాష్ట్రాల ఏర్పాటులో భాగంగా ఆంధ్రప్రదేశ్ నుంచి విడిపోయిన ప్రాంతాలు పలు రాష్ట్రాల్లోకి వెళ్లినప్పుడు అక్కడ తెలుగు మాధ్యమంలో పాఠశాలలున్నా, కొంతకాలానికి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు స్థానికంగా మాతృభాషలనే చదవాలనడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. తెలుగు రాష్ట్రాల్లో ద్వితీయ భాషగా తెలుగుకు ప్రత్యామ్నాయంగా ఆప్షన్ ఇవ్వడంతో ఇతర భాషలు ఎంపిక చేసుకుంటున్నారు. తెలుగు రాష్ట్రాల్లో తల్లిదండ్రులు పిల్లలను ఆంగ్ల మాధ్యమంలో చదివిస్తున్నారు. లిపి లేని భాషలనూ గౌరవించాలి.

కళలను ప్రోత్సహించాలి

భాషకు, సంస్కృతికి, చలనచిత్ర కళకు అవినాభావ సంబంధం ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని భరతనాట్యం, కూచిపూడిని ప్రోత్సహించాలి. త్రిపురకు 300 ఏళ్ల క్రితం శ్రీకాకుళం నుంచి వెళ్లినవారు తెలుగు మాట్లాడుతున్నారు. వారికి తెలుగు చదవడం రాదు. తెలుగు ప్రజలు పొరుగు రాష్ట్రాల్లో ఉన్నా తెలుగు సినిమాలు చూడటంతో తెలుగు భాష సజీవంగా ఉంది. పిల్లలకు వారంలో ఒక్కరోజైనా తెలుగులో పాఠాలు చెప్పటం, మాట్లాడటం, పద్యాలు చెప్పించటం ప్రాథమిక దశలో అలవాటు చేయాలి. తెలుగు సంస్కృతిని పిల్లలకు పరిచయం చేయాలి. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఇంగ్లిషు రైమ్స్ చెబుతున్నారు. తెలుగు పద్యాలు చెబితే సులభంగా నేర్చుకుంటారు.

తెలుగు వారి కోసం బంగ్లా పుస్తకం

త్రిపుర గవర్నర్‌గా వెళ్లిన తర్వాత అక్కడ తెలుగువారిని గుర్తించాను. త్రిపురలో తెలుగువారంతా సమావేశాలు పెట్టుకోవడమే కాకుండా ఆలయం నిర్మించి తరచూ కలుసుకుంటున్నారు. ఉగాది కార్యక్రమాలకు వెళ్లి వారిని ప్రోత్సహిస్తున్నాను. రాజ్‌భవన్‌లో సంక్రాంతిని నిర్వహించి సీఎం, అధికారులు, తెలుగు వారిని పిలిచి తెలుగు సంస్కృతిని పరిచయం చేస్తున్నాను. అక్కడి తెలుగువారికి బెంగాలీ మాట్లాడటం సమస్యగా మారటంతో స్పోకెన్ బంగ్లా పుస్తకం తయారుచేయించి ఇటీవలే విడుదల చేశాను. అలాంటి పుస్తకం ఇక్కడకూడా తెస్తే ఇతర భాషలవాళ్లు తెలుగు సులభంగా నేర్చుకుంటారు. కూరగాయల పేర్లు, బేరం చేయటం, ఆస్పత్రులకు వెళ్లినప్పుడు సమస్యలను చెప్పుకోవడం తదితర అంశాల గురించి బొమ్మలు వేసి పుస్తకాన్ని తయారుచేశాం. ఇతర ప్రాంతాలకు వెళ్లినవారికి అర్థమయ్యేలా ఇలా పుస్తకాలు రాయాలి" అని ఇంద్రసేనారెడ్డి సూచించారు.



ప్రపంచ తెలుగు మహాసభల వేదికపై త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి. చిత్రంలో ఏపీ సాంస్కృతిక మండలి ఛైర్‌పర్సన్ తేజస్వి, కర్ణాటక శాసనసభ పూర్వ సభాపతి రమేష్‌కుమార్, ఏపీ శాసన సభాపతి అయ్యన్నపాత్రుడు, ద్విసహస్రావధాని మాడుగుల నాగఫణిశర్మ, నన్నపనేని రాజకుమారి

ప్రపంచంలోనే గొప్పభాష..

– మాడుగుల నాగఫణిశర్మ, ద్విసహస్రావధాని

తెలుగు తల్లి, తెలుగు భాష ప్రపంచంలోనే గొప్పవి. కొప్పరపు కవులకు మూలమైన నగరం గుంటూరు అవధానక్షేత్రంలో తెలుగు మహాసభలు జరగటం అభినందనీయం. దేశ, విదేశాల నుంచి తెలుగు ప్రతినిధులు హాజరై వారి సలహాలు అందించి తెలుగుభాషాభివృద్ధికి పాటుపడటం గొప్ప విషయం అని ద్విసహస్రావధాని మాడుగుల నాగఫణిశర్మ చెప్పారు. తెలుగువారి గొప్పదనంపై పద్యాలు ఆలపించారు. వేంకటేశ్వరస్వామి, అమ్మవారిపై పద్యాలు పాడారు. కవులు రాసిన పద్యాలు వినిపించి అలరించారు. నన్నయ, తిక్కన, ఎర్రన, శ్రీనాథుడు వంటి కవుల రచనలను, పద్యాలను ఆలపించారు. ఎన్టీఆర్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేస్తూ మాడుగుల పద్యాలు వినిపించారు.

తెలుగు మధురమైన భాష

– తేజస్వి పొడపాటి, సాంస్కృతిక మండలి ఛైర్‌పర్సన్

దేశభాషలందు కాదు.. ప్రపంచ భాషలందు తెలుగు లెస్స. ప్రపంచంలోనే మధురమైన భాష తెలుగు. తెలుగును రాయడం, చదవడం, మాట్లాడటం మన అదృష్టం. తెలుగులో గజల్స్‌కు గుర్తింపు తెచ్చిన గాయకుడు గజల్ శ్రీనివాస్. ఆయన తెలుగుభాష కోసం చేస్తున్న కృషి మరువలేనిది. తెలుగుభాష ఉన్నతి కోసం మహాసభలు నిర్వహించుకోవడం శుభపరిణామం. 1930 నాటికి 20 శాతం మందికే తెలుగు రాయడం వచ్చేది. నాడు వాడుకభాష కాకుండా గ్రాంధిక భాష వినియోగంలో ఉండేది. దీంతో చాలామంది నిరక్షరాస్యులుగా ఉండేవారు. తెలుగును వాడుక భాషగా వినియోగంలోకి తెచ్చేందుకు గిడుగు రామ్మూర్తి పంతులు ఎంతో కృషిచేశారు. గొప్పభాషను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది.

తెలుగంటే అమితమైన అభిమానం

– రమేష్‌కుమార్, కర్ణాటక అసెంబ్లీ మాజీ స్పీకర్

కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో పుట్టి పెరిగాం. తల్లిదండ్రులు నేర్పిన తొలి పలుకు తెలుగు. నాకు తెలుగు చదవడం రాదు. కన్నడలోనే చదువుకున్నాను. కానీ తెలుగంటే అమితమైన గౌరవం. తెలుగు సినిమాలు చూడటం ద్వారా తెలుగుపై అభిమానం పెరిగింది. తెలుగు అక్షరాలు నేర్చుకుని అర్థం చేసుకుంటున్నాను. గురజాడ, వీరేశలింగం రచనలు చదివాను. వరంగా వచ్చిన భాషనే మనం చట్టసభల్లో అమలుచేయక అందరికీ దూరం చేస్తున్నాం. నిజాన్ని ఒప్పుకొనే స్థితిలో మనం లేము. భాషను మనం ముందుకు తీసుకువెళుతున్నామా.. వెనక్కి తీసుకెళుతున్నామా? అన్నది అందరూ ఆలోచించాలి. ప్రపంచానికి తెలుగును పరిచయం చేసిన మహానుభావుడు ఎన్టీఆర్.



మారిషస్ అధ్యక్షుడు ధరమ్ బీర్ గోకుల్ దంపతుల స్వాగత కార్యక్రమంలో ఉత్సాహభరితంగా సంప్రదాయ కోలాట ప్రదర్శన

నాలుగో ప్రపంచ తెలుగు మహాసభలు మారిషస్‌లో

2027 జనవరి 8, 9, 10 తేదీల్లో నిర్వహణ

ఈనాడు, అమరావతి: నాలుగో ప్రపంచ తెలుగు మహాసభలు మారిషస్‌లో జరగనున్నాయి. 2027 జనవరి 8, 9, 10 తేదీల్లో వీటిని నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఆంధ్ర సారస్వత పరిషత్తు, మారిషస్ తెలుగు మహాసభ అసోసియేషన్ల మధ్య ఆదివారం అవగాహన ఒప్పందం (ఎంఓయూ) జరిగింది. మూడో ప్రపంచ తెలుగు మహాసభల వేదికపై ఈ ప్రక్రియ పూర్తిచేశారు. రెండు దేశాల మధ్య పరస్పర సహకారానికి, సభల విజయవంతానికి ఈ ఎంఓయూ చేసుకున్నట్లు ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ తెలిపారు. వేదికపై అవగాహన ఒప్పందంపై సంతకాలు చేసిన ఇరుదేశాల ప్రతినిధులు.. మారిషస్ అధ్యక్షుడు ధరమ్ బీర్ గోకుల్ సమక్షంలో ఒప్పందపత్రాలు మార్చుకున్నారు.



ప్రపంచ తెలుగు మహాసభల వేదికపై గుంటూరు కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్ విద్యార్థుల దశావతార రూపకం




తెలుగు అక్షరాలతో చేసిన కళాకృతి

తెలుగు మెరవాలి.. తరతరాలు మురవాలి

తెలుగు మెరవాలి.. తరతరాలు మురవాలి.. మాతృభాష పరిరక్షణకు మనందరం కార్యోన్ముఖులం కావాలని వక్తలు పిలుపునిచ్చారు. గుంటూరు వేదికగా జరుగుతున్న మూడో ప్రపంచ తెలుగు మహాసభల్లో అమ్మభాష ప్రస్తుత పరిస్థితిని, కాపాడుకోవాల్సిన అవసరాన్ని స్పష్టం చేశారు.

తెలుగులోని గొప్పతనమదే

– జస్టిస్ ఎన్.జయసూర్య, హైకోర్టు న్యాయమూర్తి



మా తెలుగుతల్లికి మల్లెపూదండ గీతం వింటున్నప్పుడు మన శరీరం, మనసు పులకరిస్తాయి. తెలుగులోని గొప్పతనం అదే. ఆంగ్లభాష నేర్చుకుంటే ఎక్కువ ఉపయోగమని మనందరి భావన. అందులో తప్పులేదు. కానీ మన అమ్మభాషను తగ్గించుకోవాల్సిన అవసరం లేదు. మాతృభాషను ప్రోత్సహిస్తూనే ఇతర భాషలు నేర్చుకోవాలి. ఇలాంటి సభల్లో కీలక విషయాలు చెబుతుంటారు. నేను తెలుగు వ్యక్తిగా ఉండి భాషపై మరింత పట్టు సాధించాలనే ప్రేరణ నాకు వాటితో కలుగుతుంది.

మన భాష, పండగలు మరవొద్దు

– చింతకాయల అయ్యన్నపాత్రుడు, శాసన సభాపతి



మన భాషను, పండగలను తెలుగువాళ్లుగా ఎప్పటికీ మరచిపోకూడదు. డిసెంబరు 31, జనవరి 1లను గొప్పగా జరుపుకొంటూ.. శ్రీరామనవమి, ఉగాది, సంక్రాంతిని మరిచిపోవడం బాధాకరం. మారిషస్ అధ్యక్షుడు ఈ మహాసభలకు రావడం ఆనందంగా ఉంది. ఆయన 1973లో బీఏ ఆనర్స్, 1975లో ఎంబీఏ ఇక్కడే చదివారు. ఇక్కడినుంచి వేల మంది ఎప్పుడో తరలివెళ్లి మారిషస్‌లో స్థిరపడ్డారు. ఉగాది పండగ మారిషస్‌లో చేస్తుంటే మనం ఇక్కడ సరిగా చేయటం లేదు. తెలుగు విశిష్టతను ప్రజలకు తెలియజేసేలా ఈ మహాసభలు జరుగుతున్నాయి.

మారిషస్ స్ఫూర్తితో ముందడుగు

– మండలి బుద్ధప్రసాద్, అవనిగడ్డ ఎమ్మెల్యే



తెలుగు రాష్ట్రంలో తెలుగు కోసం పోరాడుకుంటున్నాం. 1913లో బాపట్లలో ఆంధ్ర మహాసభ జరిగినప్పుడు మనం చేసుకున్న తీర్మానం ఏంటంటే మా భాషలో మేం పరిపాలన చేసుకోవడానికి, మా భాషలో మేం చదువుకోవడానికి మాకో రాష్ట్రం కావాలని! చివరకు పొట్టి శ్రీరాములు ఆత్మార్పణతో రాష్ట్రం వచ్చినా ఆ రెండూ చివరకు ఎండమావులుగానే మిగిలాయి. తెలుగు బోధన గురించి మనం పోరాడాల్సి వస్తోంది. ఇప్పుడంతా ఆంగ్ల మాధ్యమం ఉంది. మారిషస్‌లో ఒకటో తరగతి నుంచి పీజీ వరకు తెలుగు మాధ్యమంలోనే బోధిస్తున్నారు. తెలుగు, తమిళం ఏ భాష వారికి ఆ భాష నేర్పుతారు. అలా తెలుగువారికి అండగా నిలిచారు. మహాత్మా గాంధీ ఇన్‌స్టిట్యూట్ మోకాలో అనేక పరిశోధనలు చేస్తోంది. మాతృభాషల్ని, సంస్కృతుల్ని కాపాడుతున్న మారిషస్‌ను స్ఫూర్తిగా తీసుకుని మన రాష్ట్రంలో తెలుగుకు వెలుగు కల్పించాలి. ఎంత చెబుతున్నా ప్రభుత్వం, ప్రజల్లో మార్పు రావడం లేదు. ఇది విచారకర విషయం. మాతృభాషను తిరస్కరిస్తే మాతృమూర్తిని తిరస్కరించినట్లే. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లకు తెలుగంటే ఎంతో అభిమానం. వారు చొరవ చూపాలి. తెలుగుజాతి ఔన్నత్యాన్ని చాటిచెప్పిన గొప్ప వ్యక్తి ఎన్టీఆర్. విగ్రహాలకు దండలేస్తే కాదు.. ఆశయాలను ఆచరిస్తే నిజమైన వారసులం అవుతాం.

మనల్ని కలిపేది మాతృభాష, సనాతన ధర్మమే


– సీఎల్ రాజం, ఛైర్మన్, మెట్రో ఇండియా



ఇంగ్లిష్, హిందీ పదాలు రాకుండా మూడు నిమిషాలు మాట్లాడలేని పరిస్థితిలో ఉన్నాం. దానికి ఎన్నో కారణాలున్నాయి. మొఘల్, బ్రిటిషువారు వందల ఏళ్లు పాలించడం వల్ల ఇలాంటి పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో యువతకు మన మాతృభాష గొప్పతనాన్ని వివరించేలా ఈ ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించడం చాలా గొప్ప విషయం. దేశంలో విభిన్న రాష్ట్రాలు, భాషలు ఉన్నాయి. అందరినీ కలిపే శక్తి మన హిందూ సంప్రదాయం, సనాతన ధర్మాలకు ఉంది. తెలుగు ప్రజలు రాష్ట్రాలుగా విడిపోయినా మాతృభాష కలిపే ఉంచింది.

తెలుగులోని తియ్యదనాన్ని పిల్లలకు నేర్పాలి


– బూర్ల రామాంజనేయులు, ప్రత్తిపాడు ఎమ్మెల్యే



దేశంలో హిందీ, బెంగాలీ తర్వాత ఎక్కువమంది మాట్లాడే భాష తెలుగు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లతో పాటు యానాంలో తెలుగు అధికారిక భాష. ప్రపంచ భాషల్లో ఎక్కడా లేని సౌందర్యం తెలుగుకు ఉంది. ప్రతి పదం చివరన అచ్చుతో ముగుస్తుంది. ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్‌గా తెలుగుకు గుర్తింపు ఉంది. సంస్కృతంలోని పదాలను కూర్చి రూపొందించిన భాష తెలుగు. ఒడిశా, కర్ణాటక, తమిళనాడు, కేరళ, పంజాబ్, ఛత్తీస్‌గఢ్, అండమాన్ నికోబార్ దీవుల్లోనూ తెలుగు మాట్లాడుతున్నారు. తెలుగులోని తియ్యదనాన్ని చిన్నారులకు నేర్పాలి.

అమ్మభాష ఔన్నత్యాన్ని కాపాడుకుందాం

– ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



మాతృభూమి, మాతృదేశం, మాతృమూర్తి.. ఈ మూడు అంశాలనూ మరువలేని మానవతతో కూడిన తెలుగుజాతి మనది. ఎక్కడ ఉన్నా, ఎలా జీవిస్తున్నా మనందరినీ కలిపే ఏకైక భాష మన అమ్మభాష. అలాంటి భాష ఔన్నత్యం, మాధుర్యాన్ని పరిరక్షించేందుకు ఈ మహత్తర సభలను ఏర్పాటుచేయడం ఆనందంగా ఉంది. తెలుగుభాష ప్రాచుర్యాన్ని కాపాడటానికి, లలిత కళలను ఆదరించడానికి, ప్రోత్సహించడానికి ప్రదర్శించిన కళారూపాలు ఆకట్టుకున్నాయి.

గుదిగుచ్చిన అక్షరాలు.. కళకు ప్రతిరూపాలు!



స్టాల్‌లో నవకాంత్

అక్షరాలనే ఒద్దికగా గుదిగుచ్చి విభిన్న రూపాలను తీర్చిదిద్దుతున్నారు తెలంగాణలోని వనపర్తి జిల్లా ఆత్మకూరుకు చెందిన నవకాంత్. గీతలతో కాకుండా అక్షరాలతో చిత్రాలు, లోగోలు, సినిమా టైటిల్స్‌ను ఆయన అలవోకగా రాసేస్తారు. అందంగా రాసే కళ అయిన క్యాలిగ్రఫీలోనూ దిట్ట. ప్రపంచ తెలుగు మహాసభల్లో ఆయన ఏర్పాటు చేసిన అక్షరశిల్పి స్టాల్ పలువురిని ఆకట్టుకుంది. అందులో తెలుగు అక్షరాలను పేర్చి తీర్చిదిద్దిన వివిధ డిజైన్లను ప్రదర్శించారు. తన ప్రతిభను మెచ్చి సినిమా టైటిల్స్, లోగోలు తీర్చిదిద్దడానికి చిత్ర నిర్మాతలూ సంప్రదిస్తున్నారని నవకాంత్ చెప్పారు.

– ఈనాడు, అమరావతి; న్యూస్‌టుడే – గుంటూరు సాంస్కృతికం

సాహితీ సాగరాన.. యువ కవితా కెరటాలు

తెలుగు రచనల్లో నవతరం పరవళ్లు

ఈనాడు – అమరావతి

సమాజ అసమానతలు, ప్రకృతి, వ్యక్తిత్వ వికాసం, విద్య, మహిళల జీవితం, సనాతన ధర్మం, కాలుష్య పోకడలు... ఇలా అన్ని రంగాలనూ స్పృశిస్తూ మనసులోని భావాలకు అక్షర రూపమిస్తూ సాహిత్యంలో యువరక్తం పరవళ్లు తొక్కుతోంది. గుంటూరులో జరుగుతున్న ప్రపంచ తెలుగు మహాసభలు.. వేదికగా యువ కవులు, కవయిత్రులు, రచయితలు తమ రచనలు, కవిత్వాలను చెప్పారు. ఈ సందర్భంగా 'ఈనాడు'తో కొందరు తమ భావాలను పంచుకున్నారిలా...



సుధామూర్తి నాకు స్ఫూర్తి

– పుచ్చా చిన్మయి, విజయవాడ

నేను ఇంటర్ రెండో ఏడాది చదువుతున్నా. అమ్మానాన్నలు పుస్తకాల్ని చదివించడం ద్వారా చిన్ననాడే తెలుగుపై ఇష్టం ఏర్పడేలా చేశారు. బాలభారతం, నీతికథలు ఎక్కువగా చదివా. కవిత్వం రాస్తుంటా. 9వ తరగతిలో ఉన్నప్పుడు రాష్ట్ర ప్రభుత్వం బాల ప్రతిభా పురస్కారం అందించింది. చేప జీవితాన్ని స్పృశిస్తూ రాసిన 'గాజు గదిలో' కవిత్వం మంచి గుర్తింపును తెచ్చింది. విద్యావ్యవస్థలోని లోపాలపై 'బాల ఖైదీ', కాలుష్యంపై 'ప్రకృతి బ్రహ్మ' కవిత్వాలను రాశా. ఆడపిల్ల జీవితంలోని ఒడుదొడుకులు, ఎంచుకున్న రంగంలో విజయం సాధించేందుకు పడే తపనపై నవల రాయాలనుకుంటున్నా. ఇన్ఫోసిస్ నారాయణమూర్తి సతీమణి సుధామూర్తి జీవితం నాకు స్ఫూర్తి.

ప్రకృతే సాహిత్యం వైపు నడిపించింది

– పి.హిమలక్ష్మి, ఎచ్చెర్ల, శ్రీకాకుళం జిల్లా



కవయిత్రిగా తొలిసారి తెలుగు మహాసభల్లో పాల్గొని.. మొదటిసారి కవిత్వాన్ని వినిపించడం ఆనందాన్నిచ్చింది. 'ప్రకృతి నా నేస్తం' కవిత్వాన్ని వినిపించా. చిన్నతనం నుంచి తెలుగన్నా.. ప్రకృతి అన్నా ఇష్టం. ఇదే నన్ను సాహిత్యం వైపు నడిపించింది. పరిసరాల్ని చూస్తూ ఆరాధిస్తూ కవితలు రాస్తా. ఇప్పటిదాకా 150 వచన కవిత్వాలు రాశా.

ప్రశంసలు అందుకోవడం ఆనందదాయకం

– తోట సుస్మిత, కాకినాడ జిల్లా



నేను బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నా. మా అత్త మంచాల శ్రీలక్ష్మి కవితలు రాసి వాటిలోని పదాల అర్థాలను వివరించేవారు. తెలుగు పదాల్లో ఇంత అర్థం దాగుంటుందా అని అనిపించేది. ఆ భావనే నన్ను కవిత్వం వైపు నడిపించింది. 'మౌనం మహత్యం' అనే వచన కవిత్వం తొలిసారి రాశా. అది వేదిక మీదున్న గొప్ప రచయితలు, కవుల ప్రశంసలు అందుకోవడం ఆనందాన్నిచ్చింది.

శ్రీశ్రీ మహాప్రస్థానంతో బీజం

– కె.నవీన్‌కుమార్, తిరుపతి



తిరుపతిలో నిర్వహించిన తెలుగు మహాసభలకు తొలిసారి విద్యార్థిగా హాజరయ్యా. అప్పుడు కవి సమ్మేళనంలో శ్రీశ్రీ కవిత్వం గురించి తెలిసింది. ఆయన రాసిన రచనలపై ఇష్టం ఏర్పడి 'మహా ప్రస్థానం' చదివా. అందులోని ప్రతి పదమూ నా మనసుకు హత్తుకుంది. అప్పటి నుంచి సాహిత్యం వైపు అడుగులేశా. ఆలయాల గొప్పతనాన్ని వివరిస్తూ రాసిన 'పంచాక్షరి' కవిత్వంతో గుర్తింపు వచ్చింది. తెలుగు గొప్పతనాన్ని వివరిస్తూ 'అమ్మ నేర్పిన మొదటి అమ్మ తెలుగు' కవిత్వాన్ని చెప్పా.

సాహిత్య అకాడమీ అవార్డు లక్ష్యం

– కాపురపు రవికుమార్, ఎంబీఏ, మంచిర్యాల



'విరాగి' కలం పేరుతో రచనలు చేస్తున్నా. పదో తరగతిలో తెలుగు మాస్టారు చెప్పిన గుర్రం జాషువా పద్యాలు సాహిత్యంపై ఇష్టాన్ని పెంచాయి. ఏడేళ్లుగా రాస్తున్నా. సమాజం-అసమానతలు, ప్రకృతి వర్ణనపై రచనలు చేయడం ఇష్టం. 'కలం కనే కలలు' మంచి పేరు తెచ్చిపెట్టింది. 8 సంకలనాలను పూర్తి చేశా. సాహిత్య అకాడమీ అవార్డు లక్ష్యం.

ఆంగ్లంలో చదివినా... తేట తెలుగును వదల్లేదు

– నక్కిన ధర్మేస్, బొబ్బిలి లంక, తూర్పుగోదావరి



మొదటి నుంచీ నాది ఆంగ్ల మాధ్యమం. డిగ్రీ పూర్తి చేశా. తెలుగుపై మమకారంతో వ్యాసరచన పోటీల్లో పాల్గొనేవాడిని. గ్రామస్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు 150 బహుమతులు సాధించా. 2021 నుంచి కవిత్వం రాయడం మొదలుపెట్టా. వ్యక్తిత్వ వికాసం, సామాజిక అంశాలు, విద్యపై ఎక్కువ కవితలు రాస్తున్నా. 25 కవి సమ్మేళనాలకు హాజరయ్యా. 'కెరటంలా పైకే ఉండాలి చూపు' అనే వచన కవిత్వానికి 'జాస్తి యువ కవి' అవార్డు దక్కింది.


ఈనాడు

అమెరికా దురాక్రమణ గర్హనీయం!

ఇతర దేశాల వ్యవహారాల్లో తలదూర్చే అమెరికన్ సంస్కృతికి చరమగీతం పాడతానని గతంలో వాగ్దానం చేసిన ట్రంప్- తనను తాను శాంతి కాముకుడిగా అభివర్ణించుకున్నారు. ఏడు యుద్ధాలను ఆపిన తనకెందుకు నోబెల్ బహుమతి ఇవ్వరని వాపోయారు. పైకి ఇలాంటి పోసుకోలు కబుర్లు ఎన్ని చెప్పినా, ప్రపంచాధిపత్యం కోసం వెంపర్లాడే అగ్రరాజ్య దుష్ట స్వభావాన్ని ట్రంప్ నిండా ఒంటబట్టించుకున్నారు. పైగా ఒంటెత్తు పోకడలతో ఆర్థిక వ్యవస్థలను తీవ్ర ఒడుదొడుకులకు గురిచేశారు. ఒకవైపు శాంతి వచనాలు పలుకుతూనే తన ఏలుబడిలో దాదాపు ఏడు దేశాలపై బాంబులు కురిపించారు. ఆరు వందలకుపైగా గగనతల దాడులు జరిపించారు. వెనెజువెలా అపార చమురు నిక్షేపాలపై కన్నేసిన ట్రంప్ అందుకు అడ్డుగా ఉన్న ఆ దేశాధ్యక్షుడు నికోలస్ మదురోను గద్దె దింపాలని పంతంపట్టారు. మాదకద్రవ్యాల సరఫరా, అక్రమ వలసల నెపంతో వెనెజువెలాపైకి తమ సేనలను దొడ్డిదారిన పంపి మదురో దంపతులను బంధించి తీసుకెళ్లారు. అంతర్జాతీయ చట్టాలూ కట్టుబాట్లను తుంగలో తొక్కి, ఓ దేశాధినేతను కుట్రపూరితంగా పదవీచ్యుతుణ్ని చేయడం అమెరికా దురాక్రమణవాదానికి నిదర్శనం. విశ్వశాంతి సంరక్షకురాలిగా చెప్పుకొనే అగ్రరాజ్యం- వెనెజువెలా సార్వభౌమత్వాన్ని కబళించడం గర్హనీయం!

సహజవనరుల నిల్వలు దండిగా ఉన్న లాటిన్‌అమెరికాపై తన బలప్రయోగ పట్టు నిలబెట్టుకోవడానికి మొదటి నుంచీ అమెరికా తీవ్రంగా యత్నిస్తోంది. ఆ క్రమంలోనే గ్వాటెమాలా, నికరాగువా, చిలీ, బ్రెజిల్, బొలీవియా, ఈక్వెడార్, కొలంబియా, పనామా వంటి చోట్ల మితవాద తిరుగుబాట్లు, సైనిక నియంతలను ప్రోత్సహించి ప్రభుత్వాలెన్నింటినో కూల్చింది. ఎంతోమంది మరణాలకు కారణమైంది. దశాబ్దాలుగా తమకు కొరకరాని కొయ్యలా మారిన వెనెజువెలాను ఎలాగైనా దారికి తెచ్చుకోవాలని కుతంత్రాలకు తెగబడిన ట్రంప్- డ్రగ్స్ అక్రమ రవాణా ముఠాకు నాయకుడిగా మదురోపై నిందలేశారు. కరీబియన్ తీరంలో నౌకలపై దాడులకు తెగబడ్డారు. ట్రంప్ ఆరోపిస్తున్నట్లు అమెరికాలో అత్యధిక మరణాలకు కారణమవుతున్న ఫెంటానిల్ వెనెజువెలా నుంచి రావట్లేదు. అగ్రరాజ్య జాతీయ మాదకద్రవ్య ముప్పు అంచనా నివేదికే ఈ విషయాన్ని స్పష్టం చేసింది. కాబట్టి వెలకట్టలేని చమురు సంపదను కొల్లగొట్టడానికే వెనెజువెలాపై ట్రంప్ గురిపెట్టారన్నది బహిరంగ రహస్యం!

వెనెజువెలాపై పశ్చిమ దేశాల ఆంక్షల నేపథ్యంలో అక్కడి 80శాతం చమురును ప్రస్తుతం చైనాయే చౌకగా కొనుగోలు చేస్తోంది. మరోవైపు గల్ఫ్ దేశాలు సంపన్న రాజ్యాలతోనే కాకుండా ఇతర దేశాలతోనూ సంబంధాల బలోపేతానికి ప్రాధాన్యమిస్తున్నాయి. అమెరికాను కాదని స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునేందుకూ మొగ్గుచూపుతున్నాయి. అంతర్జాతీయ వాణిజ్యంలో డాలర్‌కు ప్రత్యామ్నాయ కరెన్సీల వినియోగానికి గళమెత్తుతున్న బ్రిక్స్ కూటమిలో చేరడానికి అవి ఆసక్తి చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో వెనెజువెలాను వశంచేసుకుంటే అమెరికా ఇంధన భద్రతకు కలిసొస్తుందన్నది ట్రంప్ దురాలోచన! అరుదైన లోహాల కోసం బీజింగ్‌తో బేరాలాడుతుంటే, లాటిన్ అమెరికాలో చైనా ప్రభావాన్ని తగ్గించడానికి, పెట్రో డాలర్ ఆధిపత్యాన్ని కాపాడుకోవడానికి ఇది అక్కరకొస్తుందన్నది ఆయన భావన! అలా వెనెజువెలాపై దండెత్తిన ట్రంప్- తరవాతి వంతు మెక్సికో, క్యూబా, కొలంబియా తదితరాలేనని గుడ్లురుముతున్నారు. కీలక ఖనిజాలకోసం గ్రీన్‌లాండ్‌నూ ఆయన గుప్పిటపట్టే ప్రమాదముంది. అమెరికా బాటలోనే తైవాన్‌ను చైనా చుట్టుముడితే ప్రపంచం పెను ఉద్రిక్తతల మయమవుతుంది. అంతర్జాతీయ శాంతిభద్రతలకు అశనిపాతమవుతున్న అగ్రరాజ్య పెత్తందారీతనాన్ని అన్ని దేశాలూ ముక్తకంఠంతో ఖండించాలి!



ప్రపంచంలో ప్రతిభావంతులు ఎందరో ఉన్నారు. కానీ సరైన సమయంలో సరైన చోటులో ఉన్నవారు, పనిచేయడానికి సరైన రంగాన్ని ఎంచుకున్నవారు మాత్రమే విజేతలుగా నిలుస్తారు.

– ఎస్.ఆర్.శ్రీనివాస వరదన్
గణిత శాస్త్రవేత్త, ఏబెల్ ప్రైజ్ గ్రహీత

మహా భక్తులు

శ్రీవైష్ణవ సంప్రదాయంలో 12 మంది ఆళ్వారులు ఉంటారు. ఆళ్వారులంటే లోతులను మునిగినవారని ఒక భావన. కాపాడేవారని, పరిపాలకులని, భగవంతుడిని భిన్నార్థాలున్నాయి. శ్రీమన్నారాయణుడే పరబ్రహ్మమని, పరంధాముడని ప్రకటించిన మహా భక్తులు ఆళ్వారులు. వీరు తమిళంలో రచించిన స్తోత్రాలను పాశురాలంటారు. నాలుగువేల పాశురాలు గల 'నాలాయిరం' అనే దివ్య ప్రబంధాన్ని ద్రావిడ వేదమన్నారు.

భిన్న సామాజిక నేపథ్యం కలిగిన ఆళ్వార్లలో మొదటి ముగ్గురిని మొదలాళ్వార్లంటారు. ఈ ముగ్గురు పొయ్, భూత, పేయ్ ఆళ్వార్లు. శ్రీమన్నారాయణుడి శంఖమైన పాంచజన్యం, గద కౌమోదకి, ఖడ్గం నందకం... అంశలతో జన్మించిన ఈ ముగ్గురూ విశ్వక్సేనుల నుంచి మంత్రోపదేశం పొంది దేశసంచారం చేశారు. తిరుమళిసైఆళ్వార్ సుదర్శన చక్రాంశతో జన్మించారు. ఆయన బుట్టలు, చేటలు అల్లి అమ్ముతుండేవారు. వైష్ణవ సిద్ధాంతంలో ప్రముఖమైన నమ్మాళ్వార్ చింతచెట్టు తొర్రలో నివసించేవారు. 108 దివ్యదేశాల్లోని స్వాములను కీర్తించారని సంప్రదాయం చెబుతోంది. నమ్మాళ్వారు ఆత్మవంటివారని మిగిలిన పదకొండు మంది అవయవాలని భావిస్తారు. నమ్మాళ్వారు తన 35వ ఏట ముక్తిపొందినట్లు పరమపదించారు. ఆయన శిష్యుడు మధురకవి ఆళ్వారు నమ్మాళ్వారు రచించిన దివ్య ప్రబంధాలను ప్రచారం చేశారు. వేదాలు, కావ్యాలు అధ్యయనం చేసిన ఆయన శ్రీమన్నారాయణుడి గణాల్లో ప్రముఖమైన కుముదుడి అంశతో జన్మించినట్లు భక్తుల విశ్వాసం. విల్లిపుత్తూరుకు చెందిన విష్ణుచిత్తుడే పెరియాళ్వార్. గరుడాంశతో జన్మించిన ఆయన నిత్యం స్వామికి తులసిమాలలు, రంగురంగుల పూలదండలు సమర్పించేవారు. మధుర పాలకుడైన వల్లభదేవుడు మోక్షసాధనకు సులభమైన మార్గం తెలుసుకోవాలని అన్ని దేశాల విద్వాంసులను ఆహ్వానించారు. కొంత ధనాన్ని మూట కట్టి స్తంభానికి వేలాడగట్టించి ఎవరి వాదన సరైనదైతే ఆ మూట కింద పడుతుందని ప్రకటించారు. విష్ణుచిత్తుడు వేదాల నుంచి ప్రమాణాలు చూపి పరతత్వాన్ని నిరూపించారు. మహానందంతో 12 పాశురాలను గానం చేశారు. కేరళలో రాజ్యమేలిన కులశేఖరాళ్వార్ ముకుందమాలను రచించారు.



అంతర్యామి

విష్ణుచిత్తుడి పెంపుడు కూతురు ఆండాళ్ గోదాదేవిగా ప్రసిద్ధి. తిరుప్పావై దివ్య ప్రబంధాన్ని లోకానికి ఉపదేశించారు. తిరుమంగై ఆళ్వారు హరి వేదిలోనే దాసుడు అంశగా ప్రసిద్ధి. శ్రీరంగనాథుడే ఆయనకు ఆప్తుడై ఉపదేశించాడు. విప్రనారాయణుడే తొండరడిప్పొడి ఆళ్వారు. దేవదేవి అనే వేశ్యా వలలో చిక్కుకొని అనుగ్రహాన్ని పొందుతారు. నారాయణుని గుండెపై ఉండే శ్రీవత్సమనే పుట్టుమచ్చ అంశ అంటారు. లోకసారంగముని, తిరుప్పాణాళ్వారు భుజాలపై మోసుకుని రంగనాథుని సన్నిధికి తీసుకుపోయినట్టు ఒక ఉదంతం బహుళ ప్రచారంలో ఉంది. ఈ ఆళ్వారును మునివాహనుడంటారు. మొదటి ముగ్గురు తప్ప మిగిలిన ఎనిమిది మంది క్రీ.శ 6-10 శతాబ్దాల మధ్య జీవించినట్టు ఆధునిక పరిశోధకులు పేర్కొంటున్నారు.

– డాక్టర్ దామెర వెంకట సూర్యారావు

కృష్ణా వివాదం ముగిసేదెన్నడు?



కృష్ణానదీ జలాల వివాదానికి పరిష్కారం లభిస్తుందా? కృష్ణా ట్రైబ్యునల్-2 తీర్పు రాష్ట్రాల మధ్య సమస్యను పరిష్కరిస్తుందా? అనే చర్చ వాడివేడిగా జరుగుతోంది. ఇలాంటి తరుణంలో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, ఏపీ ప్రతిపాదించిన గోదావరి-నల్లమలసాగర్ ప్రాజెక్టు గురించి తెలంగాణలోని అధికార, విపక్షాల మధ్య వాదోపవాదాలు జరుగుతున్నాయి. కృష్ణా బేసిన్‌లో పరిస్థితిని గమనిస్తే- ట్రైబ్యునల్ తీర్పు తరవాత కూడా నీటి వినియోగంలో తెలుగు రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం, అవగాహన కీలకమని అర్థమవుతుంది. కృష్ణాబేసిన్‌లోని రెండు ప్రధాన ప్రాజెక్టులు ఉమ్మడిగానే ఉన్నాయి. వీటిని కృష్ణానదీ యాజమాన్య బోర్డుకు అప్పగించి దశాబ్దం దాటినా, నీటి వినియోగంలో వివాదాలు కొలిక్కి రాలేదు సరికదా, బోర్డు పనితీరు నామమాత్రమే అవుతోంది.

బచావత్ ట్రైబ్యునల్ కృష్ణా బేసిన్‌లో 75శాతం నీటి లభ్యతను(2130 టీఎంసీలను) పరిగణనలోకి తీసుకుని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 811 టీఎంసీలు కేటాయించింది. 2000 మే తరవాత ఈ తీర్పును సమీక్షించి, నీటి లభ్యత ఎక్కువగా ఉంటే పంపిణీ చేయడానికీ అవకాశం కల్పించింది. తదనుగుణంగా 2004లో ఏర్పాటైన బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ 2013లో తుదితీర్పు వెలువరించింది. బచావత్ ట్రైబ్యునల్ 75శాతం నీటి లభ్యత కింద చేసిన కేటాయింపులను కొనసాగిస్తూనే- 65శాతం నీటి లభ్యత(అయిదేళ్లలో మూడేళ్లు తప్పనిసరిగా ఉంటాయని అంచనా), 50శాతం సరాసరి నీటి లభ్యత కింద లెక్కగట్టింది. బచావత్ ట్రైబ్యునల్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటకలకు కలిపి పంపిణీ చేసిన 2,130 టీఎంసీలకు మించి మరో 448 టీఎంసీలు కృష్ణాలో అందుబాటులో ఉన్నట్లు తేల్చింది. ఇందులో మహారాష్ట్రకు 81 టీఎంసీలు, కర్ణాటకకు 173 టీఎంసీలు కేటాయించడంతో పాటు ఆలమట్టి ఎత్తును 524.25 మీటర్ల వరకు అనుమతించింది. దీనివల్ల కర్ణాటకకు ఆలమట్టిలోనే 130 టీఎంసీల అదనపు వినియోగం ఉంటుంది. 2130 టీఎంసీలకు మించి నీరు చేరినప్పుడు శ్రీశైలం, నాగార్జునసాగర్‌లలో 150 టీఎంసీలను నిల్వ చేసుకుని క్యారీ ఓవర్ స్టోరేజీకి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు అవకాశం కల్పించింది. కానీ, ఏనాడూ క్యారీ ఓవర్ స్టోరేజీ కోసం నీటిని నిల్వ చేయలేదు. అయితే, బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ ఇందులో మార్పులు చేసింది. క్యారీ ఓవర్‌లో 30 టీఎంసీలను 65 శాతం నీటి లభ్యత కింద, మిగతా 120 టీఎంసీలను సరాసరి కింద ఇచ్చింది. దీనివల్ల 2,130 టీఎంసీలకు మించి వచ్చినప్పుడు నిల్వ చేసుకునే అవకాశం కోల్పోవడమే కాదు, 2,384 టీఎంసీలకు మించి వస్తే కానీ ఉమ్మడి ఏపీకి బ్రిజేష్ ట్రైబ్యునల్ 2013లో ఇచ్చిన కేటాయింపులు కార్యరూపం దాల్చవు. ఆలమట్టి ఎత్తుకు అనుమతించడంతో జూరాల, శ్రీశైలంలోకి ప్రవాహం జాప్యమవుతోంది.

ఎవరి వాటా ఎంత?

బచావత్ కేటాయింపులకు మించి బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ ఇచ్చిన నీటిని కర్ణాటక, మహారాష్ట్రలు వాడుకున్న తరవాతే క్యారీ ఓవర్ కింద కేటాయించిన జలాలు అందుబాటులోకి వస్తాయని ఇక్కడ గుర్తించాలి. కాబట్టి, ఈ నిర్ణయం తమకు నష్టదాయకమంటూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో తీర్పు అమలు నిలిచిపోయింది. పునర్విభజన తరవాత తెలంగాణ కూడా ఈ వ్యాజ్యంలో భాగమైంది. రాష్ట్ర పునర్విభజన చట్టం మేరకు తెలుగు రాష్ట్రాల మధ్య ప్రాజెక్టుల వారీగా కేటాయింపులను నిర్ణయించే బాధ్యతను బ్రిజేష్ ట్రైబ్యునల్‌కే కేంద్రం అప్పగించింది. మొత్తం నీటిలో ఏ రాష్ట్ర వాటా ఎంతన్నది తేల్చిన తరవాతే... ప్రాజెక్టుల వారీగా కేటాయింపులు; తక్కువ నీటి లభ్యత ఉన్నప్పుడు ఎంతమేర జలాలను వినియోగించుకోవాలన్నది ట్రైబ్యునల్ నిర్ధారిస్తుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు బచావత్ ట్రైబ్యునల్ కేటాయించిన 811 టీఎంసీలకు తోడు బ్రిజేష్ ట్రైబ్యునల్ మరో 194 టీఎంసీలు కేటాయించింది. వీటికి పోలవరం ద్వారా కృష్ణాలోకి మళ్లించే 80 టీఎంసీలలో నాగార్జునసాగర్ ఎగువన వినియోగించుకోవడానికి అవకాశమున్న 45 టీఎంసీలు జతకలిస్తే మొత్తం 1,050 టీఎంసీలు అవుతుంది. వీటిలో ఏ రాష్ట్ర వాటా ఎంతన్నది ప్రస్తుతం విచారణ చేపడుతున్న కృష్ణా ట్రైబ్యునల్-2 తేల్చాల్సి ఉంది. ఈ తీర్పు రెండు తెలుగు రాష్ట్రాలకు కీలకం కానుంది.

గోదావరి నీటి మళ్లింపు ఇలా...

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై జరుగుతున్న చర్చలో- గోదావరి నుంచి కృష్ణాలోకి మళ్లించే 45 టీఎంసీల నీటి వినియోగం అంశం ప్రధానమైనది. రోజూ ఒకటిన్నర టీఎంసీల వినియోగంతో 60 రోజుల్లో 90 టీఎంసీల నీటిని మళ్లించేలా ఈ పథకాన్ని 2015లో చేపట్టారు. చిన్ననీటి వనరులకు కేటాయింపు ఉండీ వినియోగించుకోని 45 టీఎంసీలనూ; గోదావరి నుంచి కృష్ణాలోకి మళ్లించే నీటిలో 45 టీఎంసీలనూ ఈ ప్రాజెక్టుకు కేటాయిస్తూ 2022 ఆగస్టు 18న తెలంగాణ ప్రభుత్వం జీవోఆర్‌టీ-246 జారీ చేసింది. నిజానికి 1978 ఆగస్టులో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రుల మధ్య బెంగళూరులో ఓ ఒప్పందం కుదిరింది. ఇది గోదావరి జలవివాద ట్రైబ్యునల్(జీడబ్ల్యూడీటీ) అవార్డులో భాగమైంది. సింగూరు ప్రాజెక్టు వల్ల ముంపునకు గురయ్యే ప్రాంతంలో భూసేకరణ, పునరావాసం కర్ణాటక చేపట్టడం, దీనికయ్యే పరిహారాన్ని ఆంధ్రప్రదేశ్ చెల్లించడంతోపాటు పలు ప్రాజెక్టుల గురించీ అంగీకారం కుదిరింది. పోలవరానికి 150 అడుగులతో కేంద్ర జలసంఘం అనుమతి లభించిన తరవాత- ఈ ప్రాజెక్టులో భాగంగా కృష్ణా బేసిన్‌లోకి మళ్లించే 80 టీఎంసీలను ఎలా వినియోగించుకోవాలో కూడా ఒప్పందం జరిగింది. ఇందులో కర్ణాటక, మహారాష్ట్రలు కలిపి 35 టీఎంసీలు... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 45 టీఎంసీలు వాడుకునేలా నిర్ణయించారు. గోదావరి నుంచి 80 టీఎంసీల నీటిని కృష్ణాలోకి మళ్లించడానికి అయ్యే పూర్తి ఖర్చును మాత్రం ఏపీ భరించాల్సి ఉంటుంది. గోదావరి జలాలపై అయిదు రాష్ట్రాల మధ్య పూర్తి అంగీకారం కుదిరిన మూడు నెలల్లోగా పోలవరం డీపీఆర్‌ను సీడబ్ల్యూసీకి సమర్పించడానికి ఆంధ్రప్రదేశ్ అంగీకరించింది. 80 టీఎంసీల కంటే అధికంగా నీటిని మళ్లించే సందర్భంలోనూ, పై నిష్పత్తిలోనే పంపిణీ జరగాలని నిర్ణయించారు.

ఆ ప్రతిపాదనలు వెనక్కి...

నల్గొండ జిల్లాలో మూడు లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు శ్రీశైలం ఎడమగట్టు కాలువ(ఎస్ఎల్‌బీసీ) నిర్మాణానికి 1982లో ప్రభుత్వం జీవో జారీ చేసింది. పోలవరం ద్వారా మళ్లించే 45 టీఎంసీలలో 30 టీఎంసీలను ఈ ప్రాజెక్టుకు కేటాయించాలని 1986 ఫిబ్రవరిలో కేంద్ర జలసంఘానికి ప్రతిపాదనలు పంపింది. అయితే, పోలవరం ప్రాజెక్టుకు తామింకా ఆమోదం తెలపలేదు కాబట్టి దీన్ని పరిశీలించలేమంటూ జలసంఘం అదే ఏడాది ఆగస్టులో ప్రతిపాదనలను వెనక్కి పంపించేసింది. ఎస్ఎల్‌బీసీ కింద ప్రతిపాదించిన ఆయకట్టుకే 1995లో ఏఎంఆర్‌పీని ప్రభుత్వం చేపట్టింది. 2003 నాటికి ఈ ప్రాజెక్టు పూర్తయ్యి ఆయకట్టుకు నీరందాయి. ఎత్తిపోతలు కాకుండా గ్రావిటీ ద్వారా నీరందించడానికి 2005లో ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు చేపట్టారు. 2009లో పోలవరానికి కేంద్ర జలసంఘం అనుమతి ఇచ్చింది. 2013లో అప్పటి ఇంజినీర్-ఇన్-చీఫ్ మురళీధర్ సారథ్యంలోని స్టేట్ లెవల్ స్టాండింగ్ కమిటీ 30 టీఎంసీలు ఎస్ఎల్‌బీసీకి, మిగిలిన 15 టీఎంసీలు మిగులు జలాల ఆధారంగా చేపట్టిన ప్రాజెక్టుల కింద తాగునీటి అవసరాలకు కేటాయించాలని సిఫార్సు చేసింది. అయితే, దీని ఆధారంగా ప్రభుత్వం ఎలాంటి ఉత్తర్వులూ జారీ చేయలేదు. కానీ, అదే ఏడాది ఆగస్టులో జూరాల నుంచి 70టీఎంసీల నీటిని మళ్లించేలా డీపీఆర్ తయారీకి ఉత్తర్వులు జారీ చేసింది.

తీర్పు ఎలా ఉండనుంది?

రాష్ట్ర విభజన తరవాత జూరాల నుంచి కాకుండా శ్రీశైలం నుంచి నీటిని మళ్లించేలా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలను తెలంగాణ ప్రభుత్వం చేపట్టింది. మరోవైపు, పోలవరం ద్వారా మళ్లించి నాగార్జునసాగర్ ఎగువన వాడుకోవడానికి ఉద్దేశించిన 45 టీఎంసీలను తమకు ఇవ్వాలని కృష్ణా బోర్డుకూ, కేంద్ర జలసంఘానికీ విజ్ఞప్తి చేసింది. ఆ మేరకు కేంద్ర జలసంఘం మాజీ ఛైర్మన్ బజాజ్ నేతృత్వాన కమిటీ ఏర్పాటైంది. కానీ- నీటి కేటాయింపులను తేల్చాల్సింది ట్రైబ్యునలే తప్ప, కమిటీలు కాదని ఏపీ వాదించడంతో బజాజ్ కమిటీ సిఫార్సులు చేయలేదు. దాంతో, పోలవరం ద్వారా మళ్లించే నీటిలో వాడుకునే 45 టీఎంసీలలో ఏపీ, తెలంగాణాల వాటాలను తేల్చే బాధ్యతను బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్‌కే కేంద్రం అప్పగించింది. చిన్ననీటి వనరుల్లో తెలంగాణ 45 టీఎంసీలు వాడుకోవడం లేదన్నదానిపై ఏపీఅభ్యంతరం వ్యక్తం చేసింది. కృష్ణాబేసిన్‌లో తెలంగాణకు చిన్ననీటి వనరుల కింద 89.15 టీఎంసీల కేటాయింపులే ఉండగా, 'మిషన్ కాకతీయ' కింద చెరువులు అభివృద్ధి చేసిందని, ఇందుకోసం బేసిన్‌లో పనులు చేపట్టి నీటి వినియోగ సామర్థ్యాన్ని 149.56 టీఎంసీలకు పెంచిందంటూ బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ దృష్టికి ఏపీ తీసుకెళ్లింది. ఇందుకోసం ఇచ్చిన 420కి పైగా జీఓలను సమర్పించింది. ఈ నేపథ్యంలో, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న 1050 టీఎంసీలపై ట్రైబ్యునల్ ఇచ్చే తీర్పు కీలకం కానుంది.

– ఎం.ఎల్.నరసింహారెడ్డి

మంచుకొండల్లో లావెండర్ పరిమళం

ఉగ్రవాద కార్యకలాపాలతో ఉక్కిరిబిక్కిరై, ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో సేద్యం సరిగ్గా సాగని జమ్మూకశ్మీర్ ఇప్పుడు లావెండర్ పరిమళాలు అద్దుకుంటోంది. శాస్త్ర పారిశ్రామిక పరిశోధన మండలి(సీఎస్ఐఆర్) ఆధ్వర్యంలో కశ్మీర్ లోయకు అరోమా మిషన్ పరిచయం అయ్యింది. దీంతో ఇప్పుడు అక్కడ లావెండర్ పూల పరిమళాలు గుబాళిస్తూ రైతులకు భారీ లాభాలు కురిపిస్తున్నాయి.



జమ్మూకశ్మీర్ రైతులు లావెండర్ నూనె, ఎండబెట్టిన లావెండర్ పువ్వుల విక్రయం ద్వారా మంచి లాభాలను ఆర్జిస్తున్నారు. కొందరు లావెండర్ మొక్కల మీద తేనెటీగల్ని వదిలి ప్రత్యేకమైన తేనెను తయారు చేస్తున్నారు. బల్గేరియాలో మాత్రమే దొరికే ఈ రకం తేనె కిలో రూ.15వేల వరకు పలుకుతుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం భారత్‌లో వైద్య, సుగంధ మొక్కల డిమాండ్ విలువ 2050 నాటికి అయిదు లక్షల డాలర్లకు చేరుతుందని అంచనా. అందులో లావెండర్ నూనె వాటా రూ.8,993 కోట్లుగా ఉంటుందని లెక్కగట్టారు. లావెండర్ వంటి ఖరీదైన సుగంధ తైలాల దిగుమతిని తగ్గించి, దేశీయంగా స్వావలంబన సాధించాలనే లక్ష్యంతో సీఎస్ఐఆర్ 2016లో అరోమా మిషన్‌కు శ్రీకారం చుట్టింది. దేశవ్యాప్తంగా ఆరు వేల హెక్టార్లలో సుగంధ తైలాల సాగు చేపట్టింది. దాదాపు 45వేలమంది రైతులకు శిక్షణ ఇచ్చింది. జమ్మూకశ్మీర్‌లోని దోడా జిల్లాలో 600 మంది రైతులతో 165 హెక్టార్లలో లావెండర్ పూల పెంపకాన్ని ప్రారంభించింది. ఇది అక్కడి వ్యవసాయ రంగ ముఖచిత్రానికి కొత్త సొబగులద్దింది.

లాభాల గుబాళింపు...

ఇప్పుడు లావెండర్ పూల నూనె కిలో రూ.10వేలు పలుకుతోంది. హెక్టారుకు 40-60 లీటర్ల వరకు నూనె తీస్తున్నారు. కిలో ఎండిన పువ్వుల ధర వెయ్యి రూపాయల వరకు పలుకుతోంది. ఒక కనాల్(125 సెంట్లు) భూమిలో సాగుచేస్తే 80-90 కిలోల లావెండర్ పూలు ఉత్పత్తవుతాయని సీఎస్ఐఆర్-ఐఐఐఎం జమ్మూ డైరెక్టర్ జబీర్ అహ్మద్ వివరించారు. ఒక హెక్టారులో మొక్కజొన్న వేస్తే రూ.40-60 వేల ఆదాయం వచ్చే రైతుకు, లావెండర్ సాగు రూ.3.5 లక్షల నుంచి రూ.6లక్షల వరకు రాబడి తెచ్చిపెట్టిందన్న గణాంకాలు దీని లాభాల గుబాళింపునకు నిదర్శనం. తొలి దశలో 2018-22 వరకు లావెండర్ తోటల్ని పెంచిన దోడా జిల్లాలోని బదేర్వా ఇప్పుడు లావెండర్ క్యాపిటల్‌గా వాసికెక్కింది. ఆ అయిదేళ్లలో ఇక్కడ 165 హెక్టార్లలో సాగుచేసిన 600 మంది రైతులు రూ.5 కోట్లకు పైగా ఆదాయాన్ని కళ్లజూశారు. ఈ విజయగాథ జమ్మూకశ్మీర్‌లోనే కాదు, హిమాచల్‌ప్రదేశ్ వంటి ఇతర హిమాలయ ప్రాంత రాష్ట్రాలనూ ఆకర్షించింది. దోడా జిల్లా రైతులు రెండో దశలో 915 హెక్టార్లలో లావెండర్ పండించారు. మూడోదశకు వచ్చేసరికి సాగు 2,400 హెక్టార్లకు పెరిగింది. దాంతో అరోమా మిషన్‌ను మరింతగా విస్తృతపరచేందుకు సీఎస్ఐఆర్- లావెండర్‌తోపాటు జెరేనియం, సిట్రోనెల్లా, సాల్వియా వంటి పంటల సాగుకు ప్రణాళికలు రూపొందించింది.

యువత, మహిళలకు ఉపాధి


చర్మసౌందర్య ఉత్పత్తులు, సెంట్లు, ఔషధాలు, లేపనాల తయారీలో లావెండర్‌ను విరివిగా వాడతారు. ఇందుకు అవసరమైన 50 డిస్టిలేషన్ ప్లాంట్లను కూడా సీఎస్ఐఆర్ జమ్మూకశ్మీర్‌లో ఏర్పాటు చేయించింది. తద్వారా యువత, మహిళలకు కూడా ఉపాధి లభిస్తోంది. అరోమా మిషన్ ద్వారా సేద్య రంగంలో నూతన ఒరవడి సృష్టించినట్లు కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. రాష్ట్రపతి నుంచి 'రాష్ట్రీయ విజ్ఞాన పురస్కారం' పొందిన అరోమా మిషన్- దేశవ్యాప్తంగా 3,500 లావెండర్ స్టార్టప్‌లు పుట్టుకురావడానికి దోహదపడటం విశేషం. సుగంధ తైలాలనిచ్చే మొక్కల సాగు, వాటి నుంచి నూనె తీసే డిస్టిలేషన్ ప్లాంట్ల నిర్వహణతో పాటు సబ్బులు, అగరవత్తులు, హైడ్రో సాల్స్ తయారీ, ఎండుపూల సేకరణ, విక్రయం, ఎగుమతులు వంటి ప్రక్రియల్లో ఈ అంకుర సంస్థలు ముందుకెళుతున్నాయి. వీటి ద్వారా యువ పారిశ్రామికవేత్తలు ఏటా సగటున రూ.65లక్షల వరకు ఆదాయం ఆర్జిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. అరోమా మిషన్ తొలి దశలోనే దేశార్థికానికి రూ.660 కోట్లు అందించింది. స్టార్టప్‌ల రాబడి కలిస్తే ఇది మరింత పెరుగుతుంది. లావెండర్ విప్లవ స్ఫూర్తిని రైతులంతా అందిపుచ్చుకుని, తమ ప్రాంతాలకు అనువైన, అధికాదాయాన్నిచ్చే కొత్తతరం పంటల సాగుపై దృష్టి సారించాలి. అప్పుడే లాభాల గుబాళింపు దేశమంతా వ్యాపిస్తుంది.

– శ్యాంప్రసాద్ ముఖర్జీ కొండవీటి

చిన్నదేగా అనుకోవద్దు!

అక్కడ వాన కురిస్తే ఇక్కడ జలుబు చేస్తుంది... అనడం వింటుంటాం. ఎక్కడో దూరంగా జరిగిన సంఘటనకు అతిగా స్పందించేవారిని చూసి వ్యంగ్యంగా ఇలా అంటారు. నిజానికి ఇది అతిశయోక్తి ఏమీ కాదు. అక్షరాలా, అంకెల్లో నిరూపణ అయిందే. దాన్ని 'బటర్‌ఫ్లై ఎఫెక్ట్' అంటారు. 'బ్రెజిల్‌లో సీతాకోకచిలుక రెక్కలు రెపరెపలాడిస్తే, టెక్సాస్‌లో టోర్నడో వస్తుంది' అన్నది అసలు వాక్యం. దీని వెనక కథ, వివిధ రంగాల్లో దాని వినియోగం జరుగుతున్న తీరు ఆసక్తికరం.

ఎడ్వర్డ్ లారెంజ్ అమెరికాకు చెందిన గణిత, వాతావరణ శాస్త్రవేత్త. 1961లో ఆయన భవిష్యత్తులో వాతావరణం ఎలా ఉంటుందో అంచనా వేసే ఓ ప్రాజెక్టులో పనిచేస్తున్నారు. పీడనం, గాలి వేగం, ఉష్ణోగ్రత వంటి



అంశాలకు చెందిన గణాంకాలు ఉపయోగించి కంప్యూటర్ సాయంతో తుపాన్ల తీవ్రత, నష్టాలు అంచనా వేస్తున్నారు. ఆయా అంశాలకు సంబంధించి 0.506127 గణాంకంతో కొన్ని ఫలితాలు సాధించారు. తరవాత ప్రయోగంలో ఈ సంఖ్యను మూడు దశాంశ స్థానాలకు కుదించి, 0.506 నమోదు చేసి ఫలితాలు రాబట్టారు. చాలా చిన్న తేడా కాబట్టి మార్పేమీ ఉండకపోవచ్చని భావించారు. కానీ ఆయన అంచనాలు తప్పాయి. ఫలితం పూర్తిగా మారిపోయింది. మొదటిది ప్రశాంత వాతావరణాన్ని సూచిస్తే, రెండోది తుపాన్ లాంటి పరిస్థితిని సూచించింది. ఎందుకిలా జరిగిందని తెల్చుకోడానికి ఏకంగా పదేళ్లు పరిశోధించారు. ఏదైనా ఓ సంక్లిష్టమైన అంశంలో చిన్న మార్పు కూడా పెను పరిణామాలకు దారితీస్తుందని వివరిస్తూ 1972లో పరిశోధనా పత్రం ప్రచురించారు. వాతావరణ అంచనాల్లో కచ్చితత్వం ఎందుకు ఉండదో.. అంచనాలు తలకిందులయ్యే అవకాశమెలా ఉందో తెలియజేస్తూ రూపొందించిన ఆ పత్రం పేరే... 'బ్రెజిల్‌లో సీతాకోకచిలుక రెక్కలు ఆడిస్తే టెక్సాస్‌లో టోర్నడో వస్తుందా?' ఓ చిన్న విషయం, మరో పెద్ద ఘటనకు కారణం కావచ్చని తెలియజేస్తూ ఈ పోలిక వాడారు. మొదట ఆయన సీగల్ పక్షిని పేర్కొన్నా మరింత కవితాత్మకంగా ఉంటుందని సీతాకోకచిలుకగా మార్చారు.

అనంతర కాలంలో ఈ సిద్ధాంతం మీద చాలా పరిశోధనలు జరిగాయి. కేయాస్ థియరీ లాంటి కీలకమైన సిద్ధాంతాలను రూపొందించారు. ఇక, దీనికీ మనకీ ఏంటి సంబంధం అన్న విషయానికి వస్తే... బిజినెస్ నుంచి సైకాలజీ వరకు ఇప్పుడీ సిద్ధాంతాన్ని వాడని రంగం లేదు. ఉదాహరణకు కొవిడ్-19... ఎక్కడో పుట్టిన ఒక చిన్న వైరస్ ప్రపంచాన్ని ఎలా గజగజలాడించిందో చూశాం. దాన్ని మనుషులకు వర్తింపచేసుకుంటే- జీవితం గురించీ, చదువూ ఉద్యోగ వ్యాపారాల గురించీ బోలెడు కలలు కంటారు. వాటిని నెరవేర్చుకునే క్రమంలో చిన్న చిన్న విషయాలను నిర్లక్ష్యం చేస్తుంటారు. దానికి ఒక్కోసారి భారీ మూల్యం చెల్లించుకోవాల్సి రావచ్చు. ఒక చిన్న అలవాటు, కాస్త అజాగ్రత్త... మొత్తంగా కలలన్నింటినీ పేకమేడల్లా కూల్చేయొచ్చు. కాబట్టి జాగ్రత్తపడమని హెచ్చరించడానికే 'బటర్‌ఫ్లై ఎఫెక్ట్' అన్న మాట వాడతారు.

– మధు శానాల

పాటల తోటలో..!



హాయ్ బుజ్జీ!!

హాయ్ నేస్తాలూ..! చిన్నప్పటి నుంచే మనకు స్కూల్లో రైమ్స్ చెప్పడం, చిన్నచిన్న గేయాలు పాడటం అలవాటే కదా! మనకు బాగా నచ్చిన గేయాలైతే గుక్కతిప్పుకోకుండా చెప్పేస్తాం. అలాగే ఓ నేస్తం కూడా చక్కగా పాటలు పాడుతూ బహుమతులూ, అవార్డులు కూడా సొంతం చేసుకుంటోంది..!

మిజోరంలోని లుంగ్లీ ప్రాంతానికి చెందిన ఎస్తేర్ లాల్దుహమ్మి హ్నామ్‌తేకి తొమ్మిది సంవత్సరాలు. తన పాటలతో అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. మూడేళ్ల వయసు ఉన్నప్పటి నుంచే పాటలు పాడటం ప్రారంభించిందట ఈ ఫ్రెండ్. 2020లో ఒకసారి ఎ.ఆర్. రెహమాన్ మ్యూజిక్ కాన్సర్ట్‌లో ఎస్తేర్ 'మా తుఝే సలామ్' పాట పాడింది. దానికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అయింది. అప్పటి నుంచి తను పాడే పాటలకూ అభిమానులు పెరిగిపోయారు. ఎస్తేర్ పాడిన 'జనగణమన, వందేమాతరం, మా తుఝే సలాం..' పాటలకైతే మిలియన్లలో వ్యూస్ ఉన్నాయి. అంతేకాదు నేస్తాలూ.. అస్సాం రైఫిల్స్‌కు సంబంధించిన ప్రత్యేక గీతాన్ని కూడా తనే పాడింది. ఆ వీడియో వారం రోజుల్లోనే 30లక్షల వ్యూస్ సంపాదించుకుంది. అలా తన ప్రతిభతో ప్రముఖుల ప్రశంసలతో పాటుగా పలు బహుమతులూ దక్కించుకుంది.

అంతేకాకుండా వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పిల్లలకు కేంద్ర ప్రభుత్వం అందించే.. ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కారం అవార్డును, ఆర్ట్‌అండ్ కల్చర్ విభాగంలో ఎస్తేర్ అందుకుంది. తనకు యూట్యూబ్‌లో 12 లక్షలమంది, ఇన్‌స్టాలో 2 లక్షలమంది ఫాలోవర్లు ఉన్నారు. మరో విషయం ఏంటంటే.. ఆమె కథతో 'ఎ స్టార్ ఈజ్ బార్న్' అనే పేరుతో 2023లో ఒక డాక్యుమెంటరీ కూడా చేశారు. ఈ నేస్తం విశేషాలు మీకెలా అనిపించాయి! ★

తెలుగు నుడి.. వెలుగు మడి

రెండో రోజూ ఆకట్టుకున్న ప్రపంచ తెలుగు మహాసభలు

తెలుగు అక్షరాలు తోరణాలయ్యాయి... అమ్మభాషలో పదాలు మన సుల్లో సందడి చేశాయి.. అచ్చులు.. హల్లులు పోటీ పడుతూ తల్లి భాష వైభవాన్ని కళ్లముందు కదలాడించాయి. ఆకట్టుకునే సంప్రదాయ వస్త్రధారణలు.. అంతకు మించిన నృత్య రూపకాలు.. అక్కడక్కడా సంధులు, సమాసాలతో అలంకారాలను పలికిన పండితులు.. అడుగడుగునా ప్రాచీన తెలుగు వైభవాన్ని ప్రస్ఫుటించారు. భాషా పరిరక్షణకు బ్రహ్మరథం పట్టిన అభిమానులతో మూడో ప్రపంచ తెలుగు మహాసభల ప్రాంగణం పులకించిపోయింది. మారిషస్ అధ్యక్షుడు ధరమ్ బీర్ గోకుల్ దంపతులు ఈ వేడుకలకు హాజరుకాగా.. నిర్వాహకులు ఘనంగా స్వాగతించి సత్కరించారు. మారిషస్ - భారత్ మధ్య ఉన్న మూలాలను, తెలుగు ప్రజలు, భాషతో ఉన్న అనుబంధాన్ని నెమరు వేసుకోవడం కనిపించింది. రెండో రోజూ అదే ఉత్సాహంతో సాగిన ప్రసంగాలు.. కవులు, ప్రముఖులకు సత్కారాలతో ఐదు వేదికలపైనా సందడి కనిపించింది.


పార్వతీ పరమేశ్వరుల నృత్యరూపకం


తెలుగుతల్లికి సహస్ర నీరాజనం పేరుతో కవులకు సన్మానం


మారిషస్‌లో జరగనున్న తెలుగు మహాసభల ఒప్పంద పత్రాలు చూపుతున్న గజల్ శ్రీనివాస్, బృందావన్ పార్థసారథి, ధరమ్‌బీర్ గోకుల్ తదితరులు

కమనీయం.. కవి సమ్మేళనం


మహిళా అష్టావధానం నిర్వహిస్తున్న బులుసు అపర్ణ

ప్రపంచ తెలుగు మహాసభల్లో జాషువా, కరుణశ్రీ కవి సమ్మేళన వేదికగా ఆదివారం కార్యక్రమాలు జరిగాయి. కవి సమ్మేళనంలో పాల్గొనేందుకు వెయ్యి మందికి పైగా కవుల పేర్లు ముందుగానే నమోదు చేసుకున్నారు. ఉదయం 9 గంటల సమయంలో మొదలైన కవితల ఝరి రాత్రి వరకు కొనసాగింది. రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా పలువురు కవులు ఈ వేదికగా కవితలు వినిపించారు. తల్లిదండ్రులు, గురువు, దైవం, సామాజిక రుగ్మతలపై.. ఇలా పలు అంశాలపై కవులు వారి శైలిలో కవిత్వాలను వినిపించారు. కార్యక్రమాన్ని సమన్వయకర్తలు కొల్లి రమావతి, ఎస్ఎస్ఆర్ కొల్లూరి, కొత్తగూడెం రాజేష్‌లు పర్యవేక్షించారు. కవి సమ్మేళనంలో పాల్గొన్న వారికి జ్ఞాపికలు అందించి సత్కరించారు. – ఈనాడు, అమరావతి

భాషాభిమానులకు పసందు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: ప్రపంచ తెలుగు మహాసభల్లో మహాకవి శ్రీనాథ కవి సదస్సుల వేదికన ఆదివారం జరిగిన కవి సదస్సులు భాషాభిమానులను కట్టిపడేశాయి. ఆదివారం ఉదయం నుంచి మొదలైన సదస్సు రాత్రి వరకూ కొనసాగింది. నూతన సాహిత్య ప్రక్రియ సదస్సు, తెలుగు గజల్, అవధాన సాహిత్యం, భక్తి, చలనచిత్ర, హాస్య వ్యంగ్య సాహిత్యం, ప్రభుత్వ రంగ సంస్థల్లో తెలుగు వికాసం, రాష్ట్రేతర తెలుగు సంఘాల సదస్సు, అష్టావధానంపై సదస్సులు జరిగాయి. భాషాభిమానులు ఆయా సదస్సుల్లో ఆశీనులయ్యేందుకు కుర్చీలు నిండిపోవడం గమనార్హం. కొందరు నిలబడి మరీ సదస్సులను వీక్షించారు. ప్రధానంగా హాస్యవ్యంగ్య సాహిత్య సదస్సులో పలువురు పద్యాలు, చిన్న చిన్న కథలతో హాస్యాన్ని పండించారు. సమన్వయకర్తలు చక్రావధానుల రెడ్డప్ప ధవేజి, పంతుల వెంకటేశ్వరరావులు పర్యవేక్షించారు. సదస్సుల్లో పాల్గొన్న సభాధ్యక్షులు, వక్తలు, అతిథులకు ప్రశంసాపత్రం, జ్ఞాపికలు అందించి శాలువాలతో సత్కరించారు. బులుసు అపర్ణ నిర్వహించిన మహిళా అష్టావధానం సాహితీవేత్తలను ఆకట్టుకుంది. రాత్రి 10 గంటలు దాటినా ఈ అవధాన ప్రక్రియను వీక్షించేందుకు కవులు, రచయితలు వేచి ఉండడం గమనార్హం. అష్టావధానం ఆసాంతం పలు చలోక్తులతో ఆహూతులను ఆకట్టుకుంది. ఇదే వేదికపై జరిగిన హాస్య వ్యంగ్య సాహిత్య సదస్సులో పాల్గొన్న డాక్టర్ గురవారెడ్డి, హాస్య బ్రహ్మ శంకరనారాయణ, డాక్టర్ రామ్‌కుమార్, ఎంసీ దాస్, జయంతి నర్సింహారావు తదితరులను వేదిక సమన్వయకర్తలు సత్కరించారు.

ఆద్యంతం... ఆసక్తికరం



గుంటూరులోని శ్రీసత్యసాయి ఆధ్యాత్మిక నగరిలో ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో 3వ ప్రపంచ తెలుగు మహాసభలు రెండోరోజైన ఆదివారం అట్టహాసంగా జరిగాయి. నందమూరి తారక రామారావు ప్రధాన వేదికపై ఉదయం తెలుగు వెలుగుల సభ పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో మారిషస్ దేశాధ్యక్షుడు ధరమ్ బీర్ గోకుల్, జ్యోతిష్మఠ్ జగద్గురు ఆదిశంకరాచార్య పీఠం ఉత్తరాధికారి స్వామి ప్రత్యక్ చైతన్య ముకుందానందగిరి శంకరాచార్య మహరాజ్ పాల్గొన్న కార్యక్రమం వైభవంగా జరిగింది. విదేశీ అధ్యక్షుడు తెలుగుభాషపై సందేశం ఇవ్వడంతో సభికుల నుంచి అనూహ్య స్పందన లభించింది. ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ దివ్యఅతిథి, ముఖ్యఅతిథి, విశిష్ట అతిథులను సభకు పరిచయం చేసి వారి ప్రాధాన్యాన్ని వివరించారు. ఇదే వేదికపై సాయంత్రం తెలుగు వైభవ సభలో త్రిపుర గవర్నర్ ఎన్. ఇంద్రసేనారెడ్డితోపాటు రాష్ట్రేతరులు తెలుగులో చేసిన ప్రసంగాలు సభికులను ఆలోచింపజేశాయి.

స్కాన్ చెయ్.. మహనీయుల చరిత్ర తెలుసుకో..



తెలుగు భాషకు మూల పురుషులు, భాషా ప్రగతికి కృషి చేసిన కవుల గురించి వినే ఉంటారు. నన్నయ.. తిక్కన.. ఎర్రాప్రగడ.. శ్రీనాథుడు.. అన్నమయ్య.. ఇలా తెలుగును దశదిశలా వ్యాపింపజేసిన ఎందరో మహానుభావులు ఉన్నారు. అయితే వారి చిత్రాలు, జీవిత చరిత్ర, విశేషాలను సులువుగా తెలుసుకునేందుకు గుంటూరులో నిర్వహిస్తున్న 3వ ప్రపంచ తెలుగు మహాసభలు వేదికగా నిలిచాయి. అలనాటి మహనీయులతో పాటు కవులు, కవయిత్రులు, సినీ రంగంలో తెలుగు ఖ్యాతిని విస్తరింపజేసిన పలువురి ఫొటోలతో ఏర్పాటు చేసిన ప్రదర్శన మహాసభకు విచ్చేసిన వారిని ఆకట్టుకుంది. ఆయా ఫొటోలపై మహనీయుల పేర్లు, జీవిత చరిత్ర తెలుసుకునేలా క్యూఆర్ కోడ్‌లు ఏర్పాటు చేశారు. వాటిని స్కాన్ చేస్తే.. వారి వివరాలన్నీ తెలుసుకునేలా ఆంధ్ర సారస్వత పరిషత్ అవకాశం కల్పించింది.

8న ఖేలో ఇండియా గిరిజన క్రీడా జట్ల ఎంపికలు

విజయవాడ క్రీడలు: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో 8న కాకినాడ డీఎస్‌ఏ మైదానంలో ఖేలో ఇండియా రాష్ట్ర గిరిజన క్రీడా జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తామని శాప్ ఎండీ భరణి తెలిపారు. విలువిద్య, అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, హాకీ, ఈత, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్ క్రీడాంశాల్లో స్త్రీ, పురుషుల జట్లను ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి గల గిరిజన క్రీడాకారులు ఆధార్ కార్డు, పుట్టిన తేదీ ధ్రువపత్రంతో హాజరుకావాలని కోరారు.

పలకరించె పుస్తకం.. పులకించె సమస్తం

భారీగా తరలివచ్చిన పుస్తక ప్రియులు...

విజయవాడలోని 36వ పుస్తక మహోత్సవానికి ఆదివారం సందర్శకులు పోటెత్తారు. ఆదివారం సెలవు కావడంతో మధ్యాహ్నం నుంచే భారీగా తరలివచ్చి పెద్ద సంఖ్యలో పుస్తకాలను కొనుగోలు చేశారు. పుస్తక మహోత్సవం ఆరంభమైన మూడో రోజే ఇంత భారీ సంఖ్యలో పుస్తక ప్రియులు తరలిరావడంతో ప్రాంగణం మొత్తం కిక్కిరిసిపోయింది. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 9గంటల వరకూ ప్రదర్శన కొనసాగింది. ప్రాంగణంలోని డాక్టర్ బి.వి.పట్టాభిరామ్ సాహిత్య వేదికపై పుస్తకాల ఆవిష్కరణలు, సాహితీ సదస్సులు జరిగాయి. జయంత్ నారలీకర్ ప్రతిభా వేదికపై చిన్న పిల్లల కార్యక్రమాలను నిర్వహించారు. ★ పుస్తకానికి ఉన్న ప్రాధాన్యం ఏమిటనేది విజయవాడ పుస్తక మహోత్సవంలో ప్రత్యక్షంగా కనిపిస్తోంది. చారిత్రక నవలల నుంచి విజ్ఞానం, సాహిత్యం వరకు అన్నింటినీ వదలకుండా పుస్తక ప్రియులు కొనుగోలు చేస్తున్నారు. ప్రముఖుల జీవిత చరిత్రల నుంచి ఆధ్యాత్మిక పుస్తకాల వరకూ అన్నింటికీ మంచి డిమాండ్ ఉంటోంది. విజయవాడ పుస్తక మహోత్సవంలో మొత్తం 300కు పైగా స్టాళ్లను ఏర్పాటు చేయగా.. అన్నీ పుస్తకప్రియులతో కళకళలాడుతున్నాయి. ఈ నెల 2 నుంచి ఆరంభమైన పుస్తక మహోత్సవం ఆదివారంతో మూడు రోజులు ముగిసింది. ఈ నెల 12 వరకూ ప్రదర్శన కొనసాగుతుంది. ఈ నెల 6న విజయవాడలోని మొగల్రాజపురం సిద్దార్థ కళాశాల నుంచి పుస్తక మహోత్సవం జరిగే ఇందిరాగాంధీ మైదానం వరకూ పుస్తక ప్రియుల పాదయాత్ర జరుగుతుంది.


ఇందిరాగాంధీ స్టేడియంలో స్టాళ్ల వద్ద కిక్కిరిసిన పాఠకులు


పుస్తకాన్ని పరిశీలిస్తున్న పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ప్రాంగణంలో పుస్తక 'ఈనాడు'

★ **ప్రధాన సాహిత్య వేదికపై:** సాయంత్రం 6 నుంచి 7 వరకు: పాతికేళ్ల కవిత 2001-2005 సదస్సు, అధ్యక్షులుగా శ్రీసత్యాజీ వ్యవహరిస్తారు. వక్తలు ఖాదర్ మొహియుద్దీన్, కవయిత్రి కడలి సత్యనారాయణ, అనిల్‌డ్యాని
★ **ప్రతిభా వేదికపై:** చిన్నారులకు క్విజ్ పోటీలు

– ఈనాడు, అమరావతి

బుజ్జాయిలకు ప్రేమతో..


ట్రాలీలో చిన్నారిని తీసుకొస్తూ..


కొడుకును ఎత్తుకుని తీసుకెళ్తూ..


సెల్ఫీ దిగుతూ...

చిరిగిన చొక్కా అయినా తొడుక్కో.. ఓ మంచి పుస్తకం కొనుక్కో.. అని కందుకూరి వీరేశలింగం పంతులు చెప్పిన విధంగా.. ఈ చిత్రాలు చూస్తే ఇప్పటికీ పుస్తక ప్రియులు తగ్గలేదని.. పుస్తకానికి ఉన్న విలువ మరింత పెరిగిందని అర్థమవుతోంది. ఇందిరాగాంధీ స్టేడియంలో ఏర్పాటు చేసిన 36వ పుస్తక మహోత్సవంలో చంటి బిడ్డలను భుజాన ఎత్తుకుని, వాకర్‌లో తీసుకుని, వీపుపై మోసుకుని..ఇలా తల్లిదండ్రులు చిన్నారుల అభిరుచికి తగ్గ పుస్తకాలు కొనడానికి వచ్చారు.

– ఈనాడు, అమరావతి

'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' నేడు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలో ఈ నెల 5వ తేదీ సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించనున్నట్టు కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. అన్ని మండల కేంద్రాలు, మున్సిపల్/ నగరపాలక సంస్థ కార్యాలయాలు, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల్లో అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. విజయవాడ కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి పీజీఆర్ఎస్‌లో వినతి పత్రాలు స్వీకరించనున్నట్టు వివరించారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జిల్లా స్థాయి పీజీఆర్ఎస్ పరిధిలో రెవెన్యూ క్లినిక్ అందుబాటులో ఉంటుందని వివరించారు.

మీకోసం వెబ్‌సైట్‌లోనూ...

ప్రజలు తమ సమస్యల అర్జీలను మీకోసం వెబ్‌సైట్ Meekosam.ap.gov.in లోనూ దాఖలు (నమోదు) చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు. ఇందులో దాఖలైన అర్జీల స్థితి, సంబంధిత సమాచారాన్ని తెలుసుకునేందుకు 1100 నంబరుకు నేరుగా ఫోన్ చేయవచ్చని కలెక్టర్ వివరించారు.

పండగ వేళ.. పశ్చిమ బైపాస్‌పై జాగ్రత్త

అసంపూర్తి పనులతో పొంచి ఉన్న ప్రమాదాలు

ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే, గన్నవరం

పశ్చిమ బైపాస్‌లో ఇప్పటికే తాత్కాలిక రాకపోకలు మొదలయ్యాయి. వాహనాలు వెళుతున్నా ఇంకా పూర్తి కాని పనులు ఉండడంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. సంక్రాంతి నేపథ్యంలో రద్దీ మూడు రెట్లు పెరుగుతుంది. దీంతో ప్రమాదాలు మరింత పెరిగే అవకాశాలున్నాయి. దీనికి అధికారులతో పాటు వాహన చోదకులు అత్యంత అప్రమత్తంగా ఉండాల్సిన తరుణమిది.


గొల్లపూడి సమీపంలో ప్రమాదకరంగా మలుపు తిరుగుతున్న వాహనాలు



రోజుకు 30వేలకు పైగా వాహనాలు..

★ చినఆవుటపల్లి నుంచి గొల్లపూడికి 30 కి.మీ మేర పశ్చిమ బైపాస్ దాదాపు పూర్తి కావడంతో కొంత కాలం కిందట ప్రయాణానికి అనుమతించారు. ప్రస్తుతం రోజుకు 10వేలకు పైగా వాహనాలు ప్రయాణిస్తున్నాయి. ★ హైదరాబాద్-విశాఖ మధ్య రాకపోకలు సాగించేవారికి విజయవాడ నగరంలో ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా సంక్రాంతి నేపథ్యంలో దాదాపు ఇదే బైపాస్‌పై వెళ్లనున్నారు. దీంతో ప్రయాణికుల సంఖ్య 30వేలకు పైగా పెరుగుతుందని అంచనా. 30 కి.మీ ప్రయాణంలో మూడు ప్రాంతాల్లో అత్యంత అప్రమత్తంగా ఉండాల్సి ఉంది.

అలసత్వం వహిస్తే అంతే..

☛ **జక్కంపూడి-అంబాపురం** మధ్య పాములకాలువ వంతెన నిర్మాణం చేపట్టకపోవడంతో ప్రస్తుతం వాహనాలు తాత్కాలిక మార్గంలో ఒకేవైపు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇక్కడ తాజాగా రెండు ప్రమాదాలు జరిగాయి. వాహనదారులు ఈ ప్రాంతంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలి. అధికారులు వెంటనే అక్కడ వేగ నియంత్రికలు, సూచికలు, లైటింగ్ ఏర్పాటు చేయాలి. ☛ **హైదరాబాద్ నుంచి** వచ్చేవారు గొల్లపూడి సమీపంలో పశ్చిమ బైపాస్‌లో ప్రవేశించే చోట అనుసంధానం పనులు పూర్తికాలేదు. చాలా ఇరుకుగా ఉండడంతో ప్రమాదకరంగా ఉంది. భారీ నుంచి చిన్న వాహనాలు ఈ ఇరుకు మార్గంలోనే వెళ్తుండడంతో గందరగోళం నెలకొంటోంది. గ్రామానికి దూరంగా ఉండడంతో ప్రమాదాలు జరిగినా సమాచారం రావడమూ కష్టమే. అక్కడ లైట్లు, సూచికలు ఏర్పాటు చేయాలి. ట్రాఫిక్ పోలీసుల పహారా అవసరం.

☛ **చినఆవుటపల్లి దగ్గర** ఎన్‌హెచ్16, పశ్చిమ బైపాస్ అనుసంధానం పనులు జరుగుతున్నాయి. విశాఖ-హైదరాబాద్ రాకపోకలకు, విజయవాడ నుంచి ఎన్‌హెచ్-16 మీదుగా విశాఖ వెళ్లే వారితో రద్దీగా ఉంది. మలుపు తిరిగే సమయంలో రెప్పపాటులో ప్రమాదాలు జరుగుతున్నాయి. పిన్నమనేని ఆస్పత్రి, వైద్య కళాశాల నుంచి వచ్చేవారు నిత్యం రహదారిపై నడుస్తుంటారు. సమీపంలోని ఫ్లైఓవర్ మీదుగా వేగంగా వాహనాలు రావడంతో అదుపు కావడం లేదు. ఇక్కడ ఫుట్ ఓవర్ వంతెన నిర్మాణం చేపట్టాలి.

క్రీడాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే ధ్యేయం

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ఏపీని క్రీడాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. శాప్ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతి జిల్లాలో వసతులు కల్పించి, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యమని తెలిపారు. క్రీడాకారులకు గత బకాయిలు సుమారు రూ.16 కోట్లు విడుదల చేశామని, వచ్చే నెలలో మరో రూ.8 కోట్లు ఇస్తామని తెలిపారు. క్రీడా పాలసీపై వివిధ వర్గాల నుంచి వచ్చిన సూచనలను పరిగణనలోకి తీసుకున్నామని, అవసరమైన మార్పులు చేస్తామని తెలిపారు. ఒలింపిక్స్, కామన్వెల్త్, ఏషియన్ గేమ్స్ లక్ష్యంగా 'శాయ్' విధానాన్ని రాష్ట్రంలోనూ అనుసరించాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. క్రీడా వసతులకు సుమారు రూ.54 కోట్ల విలువైన ప్రాజెక్టులకు టెండర్లు పూర్తి చేశామని, పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. విజయవాడ ఐజీఎంసీ స్టేడియం, గుంటూరు బీఆర్ స్టేడియాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. కబడ్డీ సంఘంలో కొంత కాలంగా వివాదాస్పద పరిస్థితి నెలకొందని, ఓ మహిళ 28 మంది క్రీడాకారుల ధ్రువపత్రాలు నకిలీవని ఆరోపిస్తూ ఫిర్యాదు చేయగా.. శాప్ త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విచారణలో కొంతమంది పుట్టిన తేదీ ధ్రువ పత్రాలు నకిలీవని తేలగా.. వారిపై కేసు నమోదైనట్లు చెప్పారు. ప్రోత్సాహకాల కోసం క్రీడా యాప్‌లో క్రీడాకారులు, అన్ని క్రీడా సంఘాలు ఈ నెల 15వ తేదీలోపు తమ ధ్రువపత్రాలను అప్‌లోడ్ చేయాలని కోరారు. శాప్ బోర్డు సభ్యుడు ఎస్.సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న రవి, సంతోష్

కలెక్టరేట్‌లో రెవెన్యూ దర్బార్

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : రెవెన్యూ సమస్యల పరిష్కారం వేగవంతం కానుంది. ఒక అధికారి ఉంటే మరో అధికారి అందుబాటులో లేరనే ప్రశ్న ఉత్పన్నం కాదు. జిల్లా, డివిజన్ స్థాయి రెవెన్యూ అధికారులతో పాటు, జిల్లాలోని మొత్తం 20 మంది తహసీల్దార్లు ఒకే చోట కలెక్టరేట్‌లో అందుబాటులో ఉండనున్నారు. విజయవాడ కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రతి సోమవారం ఉదయం 10.30 గంటల సాయంత్రం 5 గంటల వరకు రెవెన్యూ క్లినిక్‌లను నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా రెవెన్యూ ఫిర్యాదులను వేగంగా, నాణ్యతతో పరిష్కరించేందుకు వీటిని ఏర్పాటు చేస్తున్నారు. సమస్యల పరిష్కారానికి సానుభూతితో పాటు స్పష్టత, పారదర్శకత ముఖ్యమని అధికారులకు ఇప్పటికే కలెక్టర్ జి.లక్ష్మీశ దిశానిర్దేశం చేశారు. ఆర్డీవోలు, తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు ఆయా గ్రామాలకు సంబంధించిన అన్ని రికార్డులను అందుబాటులో ఉంచేలా ఆదేశాలు జారీ చేశారు.



వేదిక మార్పు..

కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రతి సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అదే రోజున రెవెన్యూ క్లినిక్‌లనూ నిర్వహించాల్సి రావడంతో.. పీజీఆర్ఎస్ వేదికను ఆవరణలోని ఏపీఎస్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ హాలులోకి మార్పు చేయనున్నట్టు సమాచారం.


ఆరు కౌంటర్ల ఏర్పాటు

రెవెన్యూ క్లినిక్‌లో మొత్తం ఆరు కౌంటర్లు (టేబుళ్లు) ఉంటాయి. వీటిలో మొదటిది హెల్ప్ డెస్కుగా పని చేస్తుంది. ఇక్కడకు వచ్చిన అర్జీదారులకు తగు సూచనలు, సలహాలు ఇస్తుంది. మిగతా 5 కౌంటర్లు మ్యుటేషన్, 22ఏ భూములు తదితర విభాగాలతో ఉంటాయి. అర్జీలను నమోదు చేయించడం, ధ్రువపత్రాల పరిశీలన ఉంటాయి. ఆయా సమస్యల పరిష్కారానికి అవసరమైన పత్రాలను ఇవ్వాల్సిందిగా అధికారులు మార్గనిర్దేశం చేస్తారు.

వీటిపై అడగొచ్చు..

★ అడంగల్‌లో తప్పుల సవరణ (భూ వ్యత్యాసాలు, భూ వర్గీకరణ, విస్తీర్ణ సవరణ, సర్వే నంబరులో తప్పులు తదితరాలు). ★ ఎఫ్ లైన్‌లో అర్జీలు, రీ సర్వే సమస్యలు, జాయింట్ ఎల్పీఎం సమస్యలు. ★ ఆర్వోఆర్ అప్పీలు చేసుకోవడం. ★ 22ఏ నిషేధిత భూముల రిజిస్టరు నుంచి పట్టా భూములను తొలగించడం. ★ ఆక్రమణల తొలగింపు, ఆర్వోఎఫ్ఆర్ పట్టా, డీ పట్టా సమస్యలు, ఇళ్ల స్థలాల పట్టాలు. ★ భూ సేకరణ ఇబ్బందులు ★ ఇతర రెవెన్యూ సంబంధిత సమస్యలు

కాంచీపురం పెరుమాళ్ సిల్క్స్ షోరూమ్ ప్రారంభం



జ్యోతి వెలిగిస్తున్న కమలానంద భారతి స్వామీజీ, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితరులు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: విజయవాడ బందర్ రోడ్డులోని పీవీపీ మాల్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన కాంచీపురం పెరుమాళ్ సిల్క్స్ షోరూమ్‌ను ఆదివారం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, కమలానంద భారతి స్వామీజీ, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వస్త్ర వ్యాపారానికి విజయవాడ కేరాఫ్ నిలిచిందని, ఈ షోరూమ్ ద్వారా 100 మందికి ఉపాధి కల్పించడం అభినందనీయమని అన్నారు. నాణ్యమైన వస్త్రాలను తక్కువ ధరకు అందుబాటులో ఉంచారని తెలిపారు. షోరూమ్ అధినేత అయ్యూ రవి మాట్లాడుతూ... రాజమహేంద్రవరం, తిరుపతి, నెల్లూరు ప్రాంత ప్రజల విశేష ఆదరణతో విజయవాడలో నాలుగో షోరూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు. వివాహాది శుభకార్యాలకు అనుగుణంగా పట్టు వస్త్రాలు తయారు చేయిస్తున్నట్లు చెప్పారు. తమ వద్ద గద్వాల్, పోచంపల్లి, ధర్మవరం పట్టుచీరలు రూ.399 నుంచి రూ.2 లక్షల వరకు ఉన్నాయని పేర్కొన్నారు. రూ.999కు కంచి పట్టుచీర మగ్గం వర్క్ బ్లౌజ్, వన్ గ్రామ్ పద్దాలు అందిస్తున్నట్లు ప్రకటించారు.

ఐఏఎస్ అధికారి భార్య మృతి

వైద్యుల సమాచారం మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

పటమట, న్యూస్‌టుడే: అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరిన ఐఏఎస్ అధికారి భార్య చికిత్స పొందుతూ మృతి చెందారు. ఐఏఎస్ అధికారి జి.కె.కిశోర్‌కుమార్ ఏపీ మిషన్ ఫర్ క్లీన్ కృష్ణా గోదావరి కెనాల్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. ప్రస్తుతం విజయవాడ మొగల్రాజపురంలో భార్య సత్యవతి (42), ఇద్దరు పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నారు. కిడ్నీ సంబంధిత వ్యాధితో సత్యవతి గత నెల 24 నుంచి 27వ తేదీ వరకు నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేరి చికిత్స తీసుకుని డిశ్చార్జి అయ్యారు. గొంతు ఇన్ఫెక్షన్ కారణంతో మళ్లీ గత నెల 31న అదే ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. ఈ నెల 3న ఆమె సోదరి సరితకు ఫోన్ చేసి 'గొంతు ఇన్ఫెక్షన్ వల్ల మాట్లాడలేకపోతున్నా. డిశ్చార్జి అయ్యాక మీ ఇంటికి వస్తాను' అని తెలిపారు. చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి 1.20 గంటలకు హఠాత్తుగా మృతి చెందారు. ఆసుపత్రి వైద్యులు పటమట పోలీసులకు మెడికో లీగల్ కేసు కింద సమాచారం అందించారు. కార్డియాక్ అరెస్ట్ లేదా ఇతర కారణాల వల్ల మృతి చెందినట్లు రిపోర్టులో పేర్కొన్నారు. పోలీసులు ఆసుపత్రికి చేరుకుని ఐఏఎస్ అధికారిని విచారించారు. మృతిపై ఎవరూ అనుమానాలు వ్యక్తం చేయలేదు. తమకు కేసు అవసరం లేదని తెలిపారు. మెడికో లీగల్ కేసు కింద ఆసుపత్రి నుంచి సమాచారం ఇచ్చిన నేపథ్యంలో కేసు నమోదు చేయాలని పోలీసులు పేర్కొన్నారు. దాంతో సోదరి సరిత ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పటమట సీఐ పవన్ కిశోర్ తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీనిపై ఐఏఎస్ అధికారిని పోలీసులు ప్రశ్నించగా... 'అదే గదిలో నేను సోఫాలో పడుకున్నాను. రాత్రి 1.20 గంటల సమయంలో లేచి చూసే సరికి ఆమె అపస్మారక స్థితిలో ఉంది. వెంటనే కేకలు వేయడంతో ఆసుపత్రి సిబ్బంది వచ్చారు' అని తెలిపారు. మృతురాలి శరీర భాగాలను పరీక్షల నిమిత్తం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపామని, నివేదిక ఆధారంగా తదుపరి దర్యాప్తు చేస్తామని పోలీసులు పేర్కొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కేజీ రూ.ల్లో)



విజయవాడ: బ్రాయిలర్ ఫాం రేట్ రూ. 152 లైవ్ రూ. 179 చర్మ సహిత - 260, చర్మ రహిత - 295. [illegible] లైవ్ రూ. 175, 184, 186 చర్మ సహిత - 300 [illegible]

వ్యక్తి జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దేది విద్యే



పాఠశాల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, డైరెక్టర్లు

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: కన్వెన్షన్ శ్రీభవిష్య విద్యా సంస్థలు ఉత్తమ ఫలితాలు సాధించడం అభినందనీయమని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. ఆదివారం ఆధ్వర్యంలో పోలిక్లినిక్ రోడ్డులోని గాయత్రి నగర్‌లో నూతనంగా ప్రారంభించే శ్రీభవిష్య గ్లోబల్ పాఠశాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ... వ్యక్తి జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దేది విద్య ఒక్కటే అన్నారు. శ్రీభవిష్య డైరెక్టర్లు మాట్లాడుతూ.. తల్లిదండ్రుల అభిరుచి మేరకు వచ్చే విద్యా సంవత్సరం నుంచి పాఠశాల రంగంలోకి అడుగు పెడుతున్నామని తెలిపారు. ప్రతి విద్యార్థి ఐఐటీ, నీట్ లాంటి జాతీయ స్థాయి పోటీల్లో విజయం సాధించేలా విద్యార్థులకు అత్యుత్తమ శిక్షణ అందిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం ఐఐటీ, నీట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను డైరెక్టర్లు సత్కరించారు.

బ్యాడ్మింటన్ పోటీలకు వర్సిటీ జట్టు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకు రాజమహేంద్రవరంలోని జీఎస్ఎల్ వైద్య కళాశాలలో జరిగే దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల మహిళా బ్యాడ్మింటన్ పోటీలో పాల్గొనే కృష్ణా వర్సిటీ జట్టును ఎంపిక కమిటీ ఛైర్మన్ వీవీ సుబ్రహ్మణ్యం కుమార్ ఆదివారం వెల్లడించారు. జట్టులో ఎ. శ్రీరజిని, కె. ఉమామహేశ్వరి, పి. అపర్ణ (ఎస్‌డీఎం సిద్ధార్థ మహిళా కళాశాల), ఒ. ప్రశాంతి (ఎస్వీడీ సిద్ధార్థ న్యాయ కళాశాల, కానూరు), టి. లక్ష్మీసాయిదుర్గ (విజయ వ్యాయామ విద్య కళాశాల, నున్న), చైతన్యశ్రీ (ఆంధ్రా లయోలా కళాశాల) చోటు దక్కించుకున్నారు. ఎంపికైన జట్టు సభ్యులను కళాశాల కన్వీనర్ సీహెచ్ కృష్ణారావు, అధ్యాపకులు అభినందించారు.

6 నుంచి చెస్ పోటీలు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: నగరంలోని సప్తగిరి డిగ్రీ కళాశాలలో ఈ నెల 6, 7వ తేదీల్లో కృష్ణా విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల పురుషుల చెస్ ఛాంపియన్‌షిప్, వర్సిటీ జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తామని పోటీల కార్యనిర్వాహక కమిటీ ఛైర్మన్ ఆర్. రఘురామ్ తెలిపారు. పోటీలో తలపడే జట్లు 6వ తేదీ ఉదయం 8 గంటల్లోపు మూడు సెట్ల అర్హత పత్రాలతో పాటు క్రీడాకారుల గుర్తింపు కార్డులతో హాజరు కావాలని సూచించారు. కళాశాల జట్టు లేకుండా ఎంపిక పోటీలో పాల్గొనే ఆసక్తి గల క్రీడాకారులు అదే రోజు సాయంత్రం 5 గంటలకు తగు అర్హత పత్రాలతో కళాశాలలో రిపోర్టు చేయాలన్నారు. మరిన్ని వివరాలకు 90322 47932 నంబరులో సంప్రదించాలని సూచించారు.

తిరువూరు
• తిరువూరు • మైలవరం

సూక్ష్మ యూనిట్ల ప్రోత్సాహానికే పీఎంఎఫ్ఎంఈ


మాట్లాడుతున్న మెప్మా పీడీ మురళీకృష్ణ

కొండపల్లి, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లోని సూక్ష్మ యూనిట్లను ప్రోత్సహించేందుకు పీఎం ఎఫ్ఎంఈ (ప్రధానమంత్రి మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఫార్మలైజేషన్) ఆవిర్భవించిందని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ పి.మురళీకృష్ణ అన్నారు. పథకంపై మెప్మా రిసోర్స్ పర్సన్స్‌కు అవగాహన కార్యక్రమాన్ని కొండపల్లి పురపాలిక కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎఫ్ఎంఈని ఐదేళ్ల క్రితమే దేశంలో ప్రవేశ పెట్టిందని, దాన్ని మరింత బలోపేతం చేసే క్రమంలో ప్రతి మహిళా చిన్న వ్యాపార యూనిట్ ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కుటీర పరిశ్రమలు విస్తృతమైన నేపథ్యంలో వినియోగదారులకు ఉత్తమ సేవలు అందుతాయని చెప్పారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ప్రతి చోటా ఏర్పాటు చేసే వీలుందని, ఇందుకు డీఆర్‌పీ సాయంతో ఆసక్తి కలిగిన మహిళలు పీఎం ఎఫ్ఎంఈని సద్వినియోగం చేసుకోవచ్చని చెప్పారు. యూనిట్ ఏర్పాటులో మహిళలు 10 శాతం పెట్టుబడి పెడితే మిగిలిన డబ్బు బ్యాంకులు రుణంగా అందజేస్తాయని చెప్పారు. రుణాలు తీసుకొన్న వారికి 35 శాతం సబ్సిడీ ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో పురపాలిక సంఘ ఛైర్మన్ చిట్టిబాబు, వైస్ ఛైర్మన్ శ్రీను, కమిషనర్ వెంకటరత్నం, ఉద్యాన శాఖాధికారి బాలాజీ, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ శ్రీధర్ పాల్గొన్నారు.

హిందూ సమాజం ఐక్యంగా ఉండాలి


మాట్లాడుతున్న వివేకానంద స్వామీజీ

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: హిందూ సమాజం ఐక్యంగా ఉండాలని వివేకానంద స్వామీజీ అన్నారు. ఇబ్రహీంపట్నం ఎ.కాలనీలో హిందూ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజం ఐక్యంగా సంఘటితంగా ఉండాలని, ప్రతి పౌరుడు దేశభక్తి, పితృభక్తి కలిగి ఉండాలని చెప్పారు. సమాజంలో నైతిక విలువలతో జీవించాల్సిన అవసరం ఉందన్నారు. సాటి వారి పట్ల ప్రేమ కలిగి సోదరభావం చూపించి కుటుంబాలను పటిష్ఠం చేసుకోవాలని చెప్పారు. భారతదేశ సంస్కృతి పురాతన కాలం నాడే ఎంతో జ్ఞానాన్ని మనకు ఇచ్చిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో పవన్‌కుమార్, ఆర్ఎస్ఎస్ ముఖ్యులు సురాజ్‌మూర్తి, భాజపా నాయకులు రఘునాథరెడ్డి, యుగంధర్, రాంబాబు, మల్లేశ్వరి, జనసేన నాయకులు అక్కల రామ్మోహనరావు, సురేష్ పాల్గొన్నారు.

గొల్లపూడి, న్యూస్‌టుడే : హిందూ ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి హిందువుపై ఉందని చైతన్య తపోవనం అధ్యక్షురాలు మాతా శివానంద సరస్వతి పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ స్థాపించి వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా హిందూ సమ్మేళనం గొల్లపూడిలోని రామాలయం వద్ద ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హిందువులంతా ఐక్యంగా ఉండాలని, వందేళ్లలో ఆర్ఎస్ఎస్ కీలక పాత్ర పోషించిందని వెల్లడించారు. హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేసినట్లుగా తెలిపారు. ఆర్ఎస్ఎస్ ఏపీ ప్రాంత ప్రముఖ్ పుట్టా శేషు, భాజపా నాయకుడు బాల కోటేశ్వరరావు, ఆర్ఎస్ఎస్ కార్యకర్త కాపూరి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

తిరువూరు న్యూస్‌టుడే : తిరువూరు పట్టణ పరిధిలోని 11 కేవీ ఎస్ఎస్‌పీ ఫీడర్‌లో విద్యుత్తు లైన్ల మరమ్మతుల కారణంగా ధార పూర్ణయ్య టౌన్‌షిప్‌లో సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు విద్యుత్తు శాఖ ఏఈ కృష్ణారెడ్డి తెలిపారు.

ముళ్లపొదల తొలగింపు

స్పందనకు వందనం.. విస్సన్నపేట, న్యూస్‌టుడే: విద్యుత్తు సరఫరాలో హెచ్చుతగ్గులు శీర్షికన 'ఈనాడు'లో ఆదివారం ప్రచురితమైన వార్తకు పంచాయతీ, విద్యుత్తు శాఖాధికారులు స్పందించారు. ఈవో కేశవ హరికృష్ణ కుమార్, ఏఈ విజయభాస్కర్ ఆధ్వర్యంలో స్థానిక టీచర్స్ కాలనీలో విద్యుత్తు స్తంభాలకు, సూచికలకు అల్లుకున్న పిచ్చి తీగలను, పొదలను కార్మికులతో తొలగించే చర్యలు చేపట్టారు.

రూ. కోట్ల వ్యయం.. అయినా విషప్రాణుల భయం

అధ్వానంగా జగనన్న కాలనీ రహదారులు

నివాసం ఉండాలంటే హడల్


పూరగుట్టలో పొదలమాటున కనిపించని అంతర్గత రహదారి

మైలవరం, న్యూస్‌టుడే

గత రాత్రి మైలవరం పరిధిలోని ఊరికి దూరంగా ఉన్న పూరగుట్ట కాలనీలో అర్ధరాత్రి కొండచిలువ సంచారం స్థానికులను పరుగులు పెట్టించింది. పొదల నుంచి పాకుతూ నివాసాల సమీపానికి వచ్చి మాయమవుతుండగా అంతా కలిసి ధైర్యంగా కొట్టి చంపేశారు. నిత్యం ఏదో ఒక మూల నుంచి విషసర్పాలు వస్తున్నా జాగ్రత్తలు పడుతున్న వారిని కొండచిలువ సంచారం హడలెత్తించింది. మూడేళ్లలో ఇలాంటి ఉదంతాలు అనేకం ఉన్నాయి. గత ప్రభుత్వం కాలనీల పేరిట స్థలాలు కేటాయించినా, రహదారుల అభివృద్ధి పూర్తి చేయక దిన దిన గండంగా బతకాల్సి వస్తోందని అనేక కాలనీల్లో పేదలు వాపోతున్నారు.

★ అప్పట్లో పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు కొంత భూమి ప్రైవేటుగా కొన్నారు.. కొన్ని చోట్ల ప్రభుత్వ భూములను విభజించి పంచారు. రహదారుల మెరక పేరిట రూ.కోట్లలో బిల్లులు పొందారు. అయినా నేటికీ సరిగా నడిచేందుకు వీలులేని రహదారులు ఉన్నాయి. నివసించేందుకు భయపడేలా ఉన్నా, అభివృద్ధి కాలనీలంటూ గొప్పలు చెప్పారు. తీరా చూస్తే.. నిత్యం ఎక్కడో చోట విష సర్పాల సంచారంతో నివాసం ఉండే కొద్దిమంది భయభ్రాంతులకు గురవుతున్నారు. నియోజకవర్గంలోనే సుమారు 20 వేలకు పైగా నివేశన స్థలాలకు పట్టాలివ్వగా, సౌకర్యాల లేమితో నేటికీ అందులో కనీసం నాలుగో వంతు నిర్మాణాలు పూర్తి కాలేదు. దీంతో మూడొంతుల కాలనీల్లో అసౌకర్యాలే కనిపిస్తున్నాయి.

★ తూతూమంత్రంగా రహదారులు ఏర్పాటు చేసినా ప్రస్తుతం నడవాలన్నా కనీసం దారి కనిపించనివి సగానికి పైగా దర్శనమిస్తున్నాయి. అరకొరగా నిర్మించిన ఇళ్లల్లో నివాసాలు ఉండటం, చుట్టుపక్కన పునాదుల్లో పిచ్చిచెట్లే దర్శనమిస్తుండటంతో ఇల్లు కట్టినా చాలామంది తాళాలకే పరిమితం చేశారు. మైలవరం, పొందుగల పంచాయతీల మధ్యలో గల పూరగుట్ట కాలనీలో ఇటువంటి దృశ్యాలు వీధివీధినా కనిపిస్తున్నాయి. అక్కడ సుమారు 50కి పైగా అంతర్గత రహదారుల మెరక పేరిట రూ.కోట్ల నిధులు వెచ్చించారు. అయినా ఏ ఒక్క రోడ్డులో నిర్భయంగా వెళ్లే పరిస్థితి లేదు. ఆరు నెలల కిందట కిందట ప్రధాన రహదారిని సీసీ రోడ్డుగా కొంతమేరకు అభివృద్ధి చేశారు. అధికారులు స్పందించి పేదల కాలనీల్లో పిచ్చిచెట్లు తొలగించే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నూతన చట్టంపై గ్రామసభలు

ఇబ్రహీంపట్నం గ్రామీణం, మైలవరం, న్యూస్‌టుడే : ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలం, మైలవరం మండలంలోని గ్రామాల్లో సోమవారం వికసిత్ భారత్ రోజ్‌గార్ ఆజీవిక మిషన్ యాక్టు-2025పై నేటి నుంచి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శకుంతల, ఉపాధి హామీ పథకం ఏపీవో ప్రమీల, మైలవరం ఎంపీడీవో అనూరాధ తెలిపారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం బదులుగా కేంద్ర ప్రభుత్వం వీబీ జీ ఆర్ఏఎం జీ చట్టం-2025 చేసినందువల్ల పంచాయతీ కార్యాలయాల వద్ద గ్రామసభలు నిర్వహించి గ్రామస్థులకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. గ్రామసభల్లో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సిబ్బంది హాజరై.. చట్టంలోని వివరాలను వివరించి గ్రామస్థులకు అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు.

11 నుంచి వాలీబాల్ పోటీలు

కొణిజెర్ల (గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని కొణిజెర్లలో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా 11, 12, 13 తేదీల్లో ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దాతల సహకారంతో విజేతలకు వరుసగా రూ.20,116 రూ.16,116 రూ.12,116 అందజేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు 10లోపు 90526 96948 నంబరులో సంప్రదించాలని, ప్రవేశ రుసుం రూ.599 చెల్లించాలని సూచించారు.

మధిర కాల్వకు సాగర్ జలాలు

గంపలగూడెం : ఎన్నెస్పీ రెండో జోన్ పరిధిలోని మధిర బ్రాంచి కెనాల్‌కు ఆదివారం ఖమ్మం జిల్లా కల్లూరు మండలం కప్పలబంధం నియంత్రిక నుంచి 980 క్యూసెక్కుల సాగర్ జలాలు విడుదల య్యాయని ఏఈ మహేష్‌బాబు తెలిపారు. గంపలగూడెం మండల సరిహద్దులోని 23వ కి.మీ. వద్దకు 371 క్యూసెక్కులు చేరగా దిగువన మేజర్ల వారీగా గంపలగూడెం 20, ఊటుకూరు-1కి 45, పెదకొమిర 20, మధిర 40, నిదానపురం 72 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు.

రంగుల మహోత్సవానికి సర్వం సిద్ధం

జగ్గయ్యపేట గ్రామీణం: శ్రీ గోపయ్య సమేత తిరుపతమ్మ పరివార దేవతల రంగుల మహోత్సవానికి పట్టణంలోని రంగు బజారు ముస్తాబైంది. అమ్మవారు జగ్గయ్యపేట వస్తున్న సందర్భంగా రంగుబజార్‌లో పందిళ్లు వేసి విద్యుత్తు దీపాలు, ముగ్గులతో అందంగా అలకరించారు. సోమవారం అమ్మవారు పెనుగంచిప్రోలులో బయలుదేరి మంగళవారం ఉదయానికి ఇక్కడకు చేరుకుంటుంది.

అదుపు తప్పితే కాల్వలోకే..


వంతెన ఒరిగి కూలిన రక్షణ దిమ్మెలు

విస్సన్నపేట-విజయవాడ ఆర్అండ్‌బీ రహదారి నుంచి అన్నారావుపేట వెళ్లే రహదారిలో వెన్నెస్ సూజి వీడు బ్రాంచి కాల్వపై ఉన్న వంతెన రక్షణ దిమ్మెలు విరిగి ప్రమాదభరితంగా ఉంది. గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో వంతెన రెయిలింగులు విరిగి పడిపోయాయి. వాహనాలు అదుపు తప్పితే కాల్వలో పడే ప్రమాదం ఉందని వాహన చోదకులు వాపోతున్నారు. అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, రెడ్డిగూడెం

ఎనిమిదేళ్లయినా ఎదురుచూపులే..



గత ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి అసంపూర్తి భవనాలు పిచ్చిచెట్లు ముళ్లపొదల చాటున దాగేలా చేసింది. గత తెదేపా ప్రభుత్వ హయాంలో మైలవరం తారక రామానగర్ సమీపంలోని ప్లాట్లలో నిర్మాణం ప్రారంభించిన అంగన్‌వాడీ కేంద్రం శ్లాబ్ దశ ముంగిట నిలిచింది. ప్రభుత్వం మారాక ఆయా నిర్మాణాల పట్ల వైకాపా నిర్లక్ష్యంగా వ్యవహరించటంతో నేటికీ పొదలమాటున ఉంది. కొద్ది మొత్తం వెచ్చిస్తే నిర్మాణం పూర్తయ్యే అవకాశం ఉన్నా, ఎవరూ పట్టించుకోవడం లేదు. – న్యూస్‌టుడే, మైలవరం

పిరమిడ్‌ను తలపించేలా..



పొలాల్లో పిరమిడ్లు ఏంటని ఆశ్చర్యపోకండి.. ఖరీఫ్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని పౌర సరఫరాల శాఖ ద్వారా ప్రభుత్వం పెద్దఎత్తున కొనింది. అందుకు తగినట్లుగా దాదాపు 48 గంటల వ్యవధిలో రైతుల ఖాతాల్లో నగదు జమ చేసింది. గ్రామాల నుంచి ఎక్కడికక్కడే సమీపంలో ఉన్న మిల్లులకు నిత్యం పదుల సంఖ్యలో లారీలు, ట్రాక్టర్ల ద్వారా వందల టన్నుల ధాన్యాన్ని తరలించారు. మైలవరం మండలం చంద్రగూడెంలో జాతీయ రహదారి పక్కన గల ఒక మిల్లుకు ఇలా తరలించిన ధాన్యంతో మిల్లు ప్రాంగణం నిండిపోగా, పక్కనున్న పొలంలో పెద్దఎత్తున నిల్వ చేయటంతో చూపరులకు పిరమిడ్లలా కనిపిస్తున్నాయి.– న్యూస్‌టుడే, మైలవరం

మంచమే ప్రపంచం.. అందదే అదనపు సాయం


మంచానికి పరిమితమైన సుభానీ

తిరువూరు పట్టణం 6వ వార్డులో నివాసముండే షేక్ జెన్ని, ఫరీదాబేగం దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు షేక్ సుభానీ (13) పుట్టుకతోనే దివ్యాంగుడు. తల్లిదండ్రులు రోజువారీ కూలీలు. కుమారుడికి తలలో నరాలు సరిగా పని చేయని కారణంగా విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుల నిర్ధారణతో ధ్రువపత్రం తీసుకున్నారు. ప్రస్తుతం ఇస్తున్న దివ్యాంగ పింఛను రూ.6 వేల నుంచి రూ.15 వేలకు పేరు మార్చేందుకు ఆన్‌లైన్‌లో నమోదు చేయించారు. అయితే పేరు నమోదు చేసినా కొత్త పింఛను ఇవ్వడం లేదు. కుమారుడి పోషణ భారం పెరిగి వైద్యఖర్చులు, దైనందిన అవసరాలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు వాపోయారు. అధికారులు న్యాయం చేయాలని కోరారు. – న్యూస్‌టుడే, తిరువూరు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

? స్థానిక సప్తగిరి గ్రామీణ బ్యాంకు సమీపంలోని కాలువ పూడిక ఏర్పడి మురుగు పారక అవస్థలు పడుతున్నాం. పూడిక తీసి మురుగు తొలగేందుకు చర్యలు చేపట్టాలి. -నారాయణరావు

✔ సమస్య మా దృష్టికి వచ్చింది. సిబ్బందితో కాలువ పూడిక తీయించి మురుగు తొలగించేందుకు చర్యలు చేపడతాం. - బసవ లింగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి –న్యూస్‌టుడే, జి.కొండూరు

స్పందనకు వందనం.. ✦ఎన్టీటీపీఎస్ పాతగేటు సమీపంలో రక్షిత తాగునీటి పైపులైన్ పగిలి నీరు వృథా అవుతోందని 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా స్థానికుడు షరీఫ్ ఫిర్యాదు చేశాడు. పురపాలక సంఘ కమిషనర్ వెంకటరత్నం దీనికి స్పందించి.. పైపులైన్‌కు ఆదివారం మరమ్మతులు చేయించారు.
✦ కొండపల్లి విద్యుత్తు వినియోగదారుల సేవా కేంద్రం రహదారిలో మురుగు నిలిచి కాల్వ నిండిందని, దుర్వాసన భరించలేక పోతున్నామని స్థానికులు పేర్కొన్నారు. దీనికి పురపాలిక సంఘ కమిషనర్ వెంకటరత్నం స్పందించి ఆదివారం సిబ్బందితో పారిశుధ్య పనులు చేయించారు. -న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం

వివాహితను బెదిరిస్తున్న వ్యక్తిపై కేసు

గొల్లపూడి, న్యూస్‌టుడే : కలిసి ఉన్నప్పుడు దిగిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో పెడతానని వివాహితను బెదిరిస్తున్న వ్యక్తిపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. గొల్లపూడి పాత పోస్టాఫీసు రోడ్డులో మహిళ (33) కుటుంబ సభ్యులతో కలిసి ఉంటోంది. గతంలో విద్యాధరపురం రావి చెట్టు సెంటర్ వద్ద నివాసం ఉండేది. ఆమెకు పితాని రామకృష్ణ అలియాస్ కిట్టూతో కొన్నేళ్లుగా పరిచయం ఉంది. రామకృష్ణతో పరిచయం కారణంగా భర్తతో విభేదాలు ఏర్పడ్డాయి. కొన్నాళ్లుగా రామకృష్ణ.. వివాహిత తనతో దిగిన ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పెడతానని బెదిరిస్తున్నాడు. బంధువులకు ఆ ఫొటోలు చూపించి బెదిరించటం, రోడ్డుపై అరవటం చేస్తున్నాడు. మద్యం తాగి ఇంటికి వచ్చి వేధిస్తున్నాడు. దీంతో వివాహిత భవానీపురం పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గంపలగూడెం : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా రహదారిపై జరిగిన ప్రమాదంలో గాయపడి విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గంపలగూడేనికి చెందిన కోట శ్రీనివాసరావు (47) మృతి చెందినట్లు హెడ్ కానిస్టేబుల్ ఆర్లగడ్డ రాజశేఖర్ ఆదివారం తెలిపారు. గత నెల 31న రహదారిపై నడిచి వెళుతున్న శ్రీనివాసరావును ద్విచక్ర వాహనం ఢీకొట్టగా తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి తుదిశ్వాస విడిచాడు. భార్య మార్తమ్మ ఫిర్యాదు మేరకు ద్విచక్ర వాహనదారుడు టి.గోపిపై హెచ్‌సీ రాజశేఖర్ కేసు నమోదు చేశారు. ఆదివారం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం చేయించి.. కుటుంబ సభ్యులకు అప్పగించారు.

9 మంది జూదరులు అరెస్టు : గంపలగూడెం : మండలంలోని తునికిపాడు శివారు భగవానులపురంలో ఆదివారం 9 మంది జూదరులను అరెస్టు చేసి.. కొంత నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై జి.అనిల్ తెలిపారు.

రహదారిపై గుంతలు.. ప్రయాణానికి ఇక్కట్లు



చెవుటూరులో వడ్డెర కాలనీకి వెళ్లే రహదారి మధ్యలో గుంత ఏర్పడి రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. గతంలో ఇరువైపులా సీసీ రోడ్డు మధ్య కాల్వ ఉండటంతో తూము ఏర్పాటు చేశారు. తూము విరిగి గుంత పడి ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. కాల్వపై చప్టా ఏర్పాటు చేయాలని గతంలో పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అవస్థలు తొలగించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, జి.కొండూరు


కొణిజెర్లలో రహదారిపై గుంత

మండలంలోని కొణిజెర్ల ఎస్టీకాలనీ సమీప మలుపు వద్ద ఆర్అండ్‌బీ రహదారిపై ఏర్పడిన గుంత ప్రమాదకరంగా ఉంది. నెలల తరబడి గుంతకు మరమ్మతులు చేయక వాహనదారులు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారని గ్రామస్థులు తెలిపారు. సింగిల్ రోడ్డుపై వాహనాల రద్దీ ఎక్కువగా ఉన్నా అధికారులు మరమ్మతులు చేయకుండా నిర్లక్ష్యంగా ఉన్నారని ఆగ్రహిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు గుంతను పూడ్చించి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.–న్యూస్‌టుడే, కొణిజెర్ల (గంపలగూడెం)

సందడిగా ముందస్తు సంక్రాంతి సంబరాలు


భోగి మంట వేస్తున్న అపార్టుమెంట్ వాసులు

గొల్లపూడి, న్యూస్‌టుడే : గొల్లపూడిలో ముందస్తు సంక్రాంతి సంబరాలను ఆదివారం సాయి ఆవాస అపార్టుమెంట్ కమిటీ అధ్యక్షుడు వంశీ ఆధ్వర్యంలో నిర్వహించారు. అపార్టుమెంటు వాసులు భోగి మంటలు వేశారు. మహిళలు ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో సందడి చేశారు. గొబ్బెమ్మలు పెట్టారు. గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల గానం ఆకట్టుకున్నాయి. సహపంక్తి భోజనాలు చేశారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



కార్యక్రమంలో ఏడీ శశికళ, ఏవో టిప్పుసుల్తాన్ తదితరులు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : విస్సన్నపేట సబ్ డివిజన్ పరిధిలో రైతు పంటల విస్తీర్ణానికి సరిపడా యూరియా నిల్వలు ప్రైవేటు డీలర్లు, సొసైటీల వద్ద ఉన్నాయని విస్సన్నపేట ఏడీ కె.శశికళ తెలిపారు. అన్నదాతలు ఆందోళన చెందవద్దని సూచించారు. విస్సన్నపేటలో ఆదివారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డీలర్లు ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యూరియా నిల్వల సమాచారాన్ని బోర్డులో రాయాలని తెలిపారు. ఈ-పాస్ ద్వారా విక్రయించాలని లేని పక్షంలో అనుమతులు రద్దు చేస్తామని చెప్పారు. కొన్న రైతులు కూడా తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి షేక్ టిప్పుసుల్తాన్, ఏఈవో ఉషారాణి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా బ్రెయిలీ జయంతి


చిత్రపటానికి పూలమాలలు వేసిన ప్రముఖులు


పెనుగొలనులో విద్యార్థులు, గ్రామస్థులు

తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు గ్రంథాలయంలో లూయిస్ బ్రెయిలీ 217వ జయంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ షేక్ అబ్దుల్ హుస్సేన్ మాట్లాడుతూ నేడు బ్రెయిలీ లిపి ద్వారా ఎంతో మంది అంధులకు చదుకునే అవకాశం కలిగిందని.. తద్వారా ఉద్యోగ రంగాల్లో రాణిస్తున్నారని వివరించారు. టి.ఆంజనేయులు, రాంప్రదీప్, పి.నాగాచారి, వై.ప్రతాప్‌రెడ్డి, గ్రంథపాలకురాలు కె.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

పెనుగొలను (గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని పెనుగొలనులో ఆదివారం ప్రపంచ బ్రెయిలీ దినోత్సవం సందర్భంగా లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి నివాళి అర్పించారు. బ్రెయిలీ లిపిని కనిపెట్టి ఎందరో చూపులేని వారికి ఆయన అక్షరజ్యోతిని వెలిగించారని వక్తలు అన్నారు. విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పురాణ ప్రవచనాలు

నందిగామ గ్రామీణం: నందిగామ ముక్కోటి మండపంలో ఆదివారం రాష్ట్రపతి పురస్కార గ్రహీత డాక్టర్ అద్దంకి శ్రీనివాస్(విజయవాడ) చేసిన పురాణ ప్రవచనాలు భక్తులను ఆకట్టుకున్నాయి భగవద్గీత, తిరుప్పావై పారాయణం తదితర ఆధ్యాత్మిక అంశాలను వివరించారు. వాకాని రామకృష్ణశేషసాయి (తిరుపతి) సుందరాకాండ పురాణ ప్రవచనం ఆకట్టుకుంది. ఎం.శ్రీనివాసరాజేష్‌కుమార్, ఎంవీ సింహాచలశాస్త్రి భాగవతార్ తదితరులు కూడా వేదపారాయణం, హరికథాగానం వినిపించారు. అతిథులను ఉత్సవ కమిటీ కన్వీనర్ దీవి వెంకటరత్నమాచార్యులు, టీవీ సుబ్రహ్మణ్యం తదితరులు సత్కరించారు.


ఊటుకూరు : గుడిలో తిరుప్పావై పాశురాలు పఠించిన మహిళలు


గంపలగూడెం : రామాలయంలో దీపోత్సవం

భక్తిశ్రద్ధలతో గోదా రంగనాథులకు ధనుర్మాస పూజలు

గంపలగూడెం, న్యూస్‌టుడే : ధనుర్మాసోత్సవం సందర్భంగా మండల పరిధిలోని గోసవీడు, నెమలి, గంపలగూడెం, వినగడప, ఊటుకూరు, పెనుగొలను గ్రామాల పరిధిలోని వైష్ణవాలయాల్లో ఆదివారం గోదా రంగనాథుల పూజలు నిర్వహించారు. అర్చకులు, భక్తులు పాల్గొని తిరుప్పావై పాశురాలు పఠించారు. మూలవిరాట్లను పూలతో అలంకరించి దీపోత్సవం చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

వేడుకగా నగర సంకీర్తన


కార్యక్రమంలో సభ్యులు

ఇబ్రహీంపట్నం గ్రామీణం : ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఇబ్రహీంపట్నం రాధా మాధవ భక్త సమాజం ఆధ్వర్యంలో ఆదివారం తెల్లవారుజామున ఎన్టీటీపీఎస్ సెక్యూరిటీ కాలనీలో నగర సంకీర్తన నిర్వహించారు. తొలుత వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం భక్త సమాజం సభ్యులు సెక్యూరిటీ కాలనీకి చేరుకున్నారు. అక్కడ అర్చకులు సాయి, శివ స్వాములు దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలతో భక్తులు వెంట రాగా నగర సంకీర్తనకు బయలుదేరారు. ఈ సందర్భంగా కాలనీవాసులు సంకీర్తన బృందానికి స్వాగతం పలికి హారతులు ఇచ్చారు. అందరూ కలిసి వేంకటేశ్వర స్వామి గీతాలు ఆలపిస్తూ భజనలు చేస్తూ కాలనీలో పర్యటించి తిరిగి ఆలయానికి చేరుకున్నారు. ఆలయ కమిటీ భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేసింది.

రామాలయంలో హనుమాన్ చాలీసా పారాయణం

తిరువూరు : తిరువూరు కోదండ రామాలయంలో ఆదివారం ధనుర్మాసం సందర్భంగా హనుమాన్ చాలీసా పారాయణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వీరాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులు హనుమాన్ చాలీసా పఠించారు. ఆలయ ప్రాంగణం భక్తుల నామస్మరణతో మార్మోగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

శ్రీరామచంద్రస్వామికి జన్మ నక్షత్రం పూజలు


ఊటుకూరులో మూలవిరాట్‌కు పూజలు

ఊటుకూరు (గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని ఊటుకూరు కోదండ రామాలయంలో ఆదివారం స్వామి జన్మ నక్షత్రమైన పునర్వసు సందర్భంగా సీతారామచంద్రస్వామి మూలవిరాట్‌కు అర్చకులు విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణ చేశారు. భక్తులు దర్శించుకున్నారు.

కూలాయా.. గాయపరుస్తాయ్



విజయవాడ- విస్సన్నపేట ఆర్అండ్‌బీ రహదారిలో మద్దులపర్వ గ్రామం దగ్గర వరి పొలాల రహదారి మార్జిన్‌లో ఎండిన పెద్ద చెట్లు ప్రమాదభరితంగా ఉన్నాయి. నిత్యం రద్దీగా ఉండే రహదారిలో ఎండిన చెట్ల కొమ్మలు విరిగి పడితే ప్రమాదాలు జరుగుతాయని వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. దిచక్ర వాహనదారులు ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని వాపోతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు ఎండిన చెట్లు తొలగించే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, రెడ్డిగూడెం



ఉత్తమ సంస్థల్లో ఉన్నత విద్య

చదువు

e-mail: edc@eenadu.in

దేశంలోని ప్రముఖ సంస్థల్లో కేంద్రీయ విశ్వవిద్యాలయాలు ముఖ్యమైనవి. వీటిలో ఉన్నత విద్య పూర్తి చేసుకున్నవాళ్లు ఉజ్జ్వల భవిష్యత్తును సొంతం చేసుకోవచ్చు. అనుభవజ్ఞులైన బోధన సిబ్బంది, వసతి, సౌకర్యాలు ఇక్కడ మెరుగ్గా ఉంటాయి. ఈ సంస్థలు అందించే పీజీ కోర్సుల్లో ప్రవేశానికి కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్టు(సీయూఈటీ)లో ప్రతిభ చూపాలి. ఇటీవలే ఆ ప్రకటన వెలువడింది.

సీయూఈటీ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహిస్తుంది. ఇందులో సాధించిన స్కోరుతో కేంద్రీయ విశ్వవిద్యాలయాలతోపాటు కేంద్ర ఆధ్వర్యంలో నడుస్తోన్న విద్యాసంస్థలు, రాష్ట్రీయ విశ్వవిద్యాలయాలు, డీమ్డ్ యూనివర్సిటీలు, ప్రైవేటు విద్యా సంస్థల్లోనూ చదువుకోవచ్చు. ఫిజిక్స్, పొలిటికల్ సైన్స్... కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్... ఎకనామిక్స్, ఇంగ్లిష్... ఇలా విద్యార్థులు చేరాలనుకున్న విభాగంలో పరీక్ష రాసి, దేశవ్యాప్తంగా ఆ సబ్జెక్టుల్లో ఉన్న సీట్లకు పోటీపడవచ్చు. తెలుగు రాష్ట్రాల విద్యార్థులు తొలి ప్రాధాన్యమిచ్చే హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలోని పీజీ సీట్లన్నీ సీయూఈటీతోనే భర్తీచేస్తారు. ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ- హైదరాబాద్, సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ- విజయనగరం, సమ్మక్క సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ-ములుగు, ఏపీ సెంట్రల్ యూనివర్సిటీ- అనంతపురంలో ప్రవేశాలకూ ఈ స్కోరే ప్రామాణికం. జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ- న్యూఢిల్లీ, బెనారస్ హిందూ యూనివర్సిటీ- వారణాసి, పాండిచ్చేరి యూనివర్సిటీ, జామియా మిలియా ఇస్లామియా... ఇలా జాతీయ స్థాయిలో పేరున్న సంస్థల్లోనూ చదివే అవకాశం దక్కుతుంది. సీయూఈటీ స్కోరుతో రాష్ట్రీయ విశ్వవిద్యాలయాలు పీజీ ప్రవేశాలు నిర్వహించే ఉమ్మడి పరీక్షను ఎంచుకోవచ్చు. సీయూఈటీలో సాధించిన స్కోరుతో ప్రవేశం పొందలేని విశ్వవిద్యాలయాలు వివిధ దరఖాస్తు చేసుకోవాలి. సంస్థల వారీ అర్హతల్లో స్వల్ప మార్పులు ఉంటాయి.

విద్యార్హత

ఇప్పటికే డిగ్రీ పూర్తిచేసుకున్నవారు, ప్రస్తుతం చివరి ఏడాది కోర్సుల్లో ఉన్న విద్యార్థులు సీయూఈటీ పీజీకి దరఖాస్తు చేసుకోవచ్చు. పలు కోర్సులకు ఏదైనా డిగ్రీ సరిపోతుంది. మిగిలినవాటికి డిగ్రీలో సంబంధిత సబ్జెక్టు చదవడం తప్పనిసరి. కొన్ని సంస్థల్లో ఎంట్రీ కోర్సులూ ఉన్నాయి. బీటెక్ చదివినవారు అర్హులు. అన్ని కోర్సులకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఎన్‌టీఏ వెబ్‌సైట్‌లో బులెటిన్, ఎఫ్ఏక్యూస్ పూర్తిగా చదివి వివరాలు తెలుసుకోవాలి.

పరీక్ష

ఆన్‌లైన్‌లో ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. పరీక్షలో పేపర్ వారీ 75 ప్రశ్నలు ఇంగ్లిష్, హిందీ మాధ్యమాల్లో వస్తాయి. వ్యవధి 90 నిమిషాలు. భాషలు, సాహిత్యం ప్రశ్నపత్రాలు సంబంధిత భాషలోనే ఉంటాయి. కొన్ని పరీక్షలు మాత్రం ఇంగ్లిష్‌లోనే నిర్వహిస్తారు. ప్రతి సరైన సమాధానానికి 4 మార్కులు. తప్పు జవాబుకు ఒక మార్కు తగ్గిస్తారు.

సన్నద్ధత

- దాదాపు ప్రశ్నలన్నీ డిగ్రీ సబ్జెక్టుల నుంచే వస్తాయి. అందువల్ల అకడమిక్ పుస్తకాలే బాగా అధ్యయనం చేయాలి.
- పాఠ్యాంశాలు చదవడం పూర్తయిన తర్వాత సీయూఈటీ గత ప్రశ్నపత్రాలను గమనించాలి. ప్రశ్నల తీరు, పాఠ్యాంశాల అభిప్రాయ ప్రాధాన్యం పరిశీలించాలి. సన్నద్ధతను అందుకు అనుగుణంగా మార్చుకోవాలి.
- పాఠ్యపుస్తకాల్లోని ప్రాథమికాంశాలను ఎక్కువ ప్రాధాన్యంతో చదవాలి. అనువర్తనం, ముఖ్యాంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి.
- కేంద్రీయ విశ్వవిద్యాలయాలు పీజీ కోర్సుల్లో ప్రవేశానికి గతంలో నిర్వహించిన పరీక్షల ప్రశ్నపత్రాలూ ఉపయోగపడతాయి. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో ఇవి అందుబాటులో ఉన్నాయి.
- సైన్స్, మ్యాథ్స్ సబ్జెక్టుల్లో పరీక్షలు రాస్తున్నవారు ఐఐటీలు నిర్వహించే జామ్ పాత ప్రశ్నపత్రాలను అధ్యయనం చేయడం మేలు చేస్తుంది.
- పరీక్షకు ముందు ఆరేడు మాక్ టెస్టులు రాసి, ఫలితాలు విశ్లేషించుకుని, సన్నద్ధత కొనసాగిస్తే మేటి సంస్థలో సీటు పొందవచ్చు.

ముఖ్య సమాచారం

ఆన్‌లైన్ దరఖాస్తులు: జనవరి 14 వరకు స్వీకరిస్తారు. **దరఖాస్తు ఫీజు:** (రెండు టెస్టు పేపర్ల వరకు) జనరల్ అభ్యర్థులకు రూ.1400. ఓబీసీ - నాన్ క్రీమీ లేయర్/ జనరల్- ఈడబ్ల్యూఎస్‌లకు రూ.1200, ఎస్సీ/ ఎస్టీ/ థర్డ్ జెండర్‌కు రూ.1100, దివ్యాంగులకు రూ.1000. అదనపు టెస్టు పేపర్కు (ప్రతి పేపర్కు) జనరల్ అభ్యర్థులు రూ.700, మిగిలినవాళ్లు రూ.600 చెల్లించాలి. **పరీక్షలు:** మార్చిలో నిర్వహిస్తారు. తేదీల వివరాలు తర్వాత ప్రకటిస్తారు. **వెబ్‌సైట్:** https://exams.nta.nic.in/registration-for-cuetpg-2026/

కొన్ని కోర్సులు

ఎంఏ: తెలుగు, ఇంగ్లిష్, హిందీ, కన్నడ, ఉర్దూ, సంస్కృతం, బెంగాలీ, హిస్టరీ, జాగ్రఫీ, లింగ్విస్టిక్స్, అరబిక్, ఫ్రెంచ్, జర్మన్, పర్షియన్, రష్యన్, చైనీస్, ఫిలాసఫీ, ఎడ్యుకేషన్, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, సోషియాలజీ, సైకాలజీ, సోషల్ వర్క్, ఆంత్రోపాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, మాస్ కమ్యూనికేషన్, మ్యూజియాలజీ.

ఎమ్మెస్సీ: ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ, బోటనీ, కంప్యూటర్ సైన్స్, మ్యాథ్స్, స్టాటిస్టిక్స్, హోమ్ సైన్స్, బయో కెమిస్ట్రీ, టెక్ జియో ఫిజిక్స్, జియాలజీ, హెల్త్ సైకాలజీ, అప్లైడ్ జియాలజీ, మెడికల్ టెక్నాలజీ, బయో ఇన్ఫర్మాటిక్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, అప్లయిడ్ మైక్రో బయాలజీ, స్టాటిస్టిక్స్ అండ్ కంప్యూటింగ్, మ్యాథ్స్ అండ్ కంప్యూటింగ్, కంప్యుటేషనల్ సైన్స్ అండ్ అప్లికేషన్స్, ఫోరెన్సిక్ సైన్స్, ఆగ్రో ఫారెస్ట్రీ, ఫుడ్ టెక్నాలజీ, ప్లాంట్ బయోటెక్నాలజీ, ఎన్విరాన్‌మెంటల్ టెక్నాలజీ.

✦ ఎంబీఏ, ఎంసీఏ, ఎంఎడ్, ఎంపీఎడ్, ఎంఎడ్ స్పెషల్ ఎడ్యుకేషన్, ఎంఎల్ఐఎస్సీ, ఎంపీహెచ్, ఎల్ఎల్ఎం, ఎంకామ్, టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్, కార్పొరేట్ కమ్యూనికేషన్ మేనేజ్‌మెంట్, పబ్లిక్ మేనేజ్‌మెంట్ అండ్ ఇండస్ట్రియల్ రిలేషన్స్... ఇలా దాదాపు కోర్సులు ఉన్నాయి.



డిగ్రీ (బీఎస్సీ) చేశాను. ఈ కోర్సుతో సాఫ్ట్‌వేర్/ టెక్ ఉద్యోగాలకు అవకాశం ఉంటుందా? ఎంబీఏ (ఐటీ) చదవడానికి వీలవుతుందా? - డి.కిరణ్‌కుమార్

ఎంబీఏకి అవకాశం ఉందా?

నేటి ఉద్యోగ ప్రపంచంలో వివిధ డిగ్రీల మధ్య సరిహద్దులు వేగంగా చెరిగిపోతున్నాయి. సైన్స్ చదివినవారు సైన్స్‌కే, ఆర్ట్స్ గ్రూపు వాళ్లు ఆ విభాగానికే పరిమితం అన్న భావన ఒకప్పుడు ఉండేది. కానీ ఇప్పుడు డిగ్రీ నేపథ్యం ఏదైనప్పటికీ నచ్చిన స్పెషలైజేషన్‌తో ఎంబీఏ చదువుకోవచ్చు.

ఎంబీఏ(ఐటీ)లో కంప్యూటర్ అంశాలతో పాటు బిజినెస్, టెక్నాలజీల అనుసంధానం గురించి నేర్చుకుంటారు. కంప్యూటర్ ప్రోగ్రామింగ్ ఎక్కువగా నేర్పించబడదు. ఐటీ సిస్టమ్స్ ఎలా పనిచేస్తాయి, సాఫ్ట్‌వేర్ ప్రాజెక్టులు ఎలా నిర్వహించాలి, డేటాను వ్యాపార నిర్ణయాలకు ఎలా ఉపయోగించాలి అనే అంశాలపై అవగాహన కల్పిస్తారు.

ఎంబీఏ(ఐటీ) కోర్సులో ప్రవేశానికి కంప్యూటర్ సైన్స్ లేదా ఇంజినీరింగ్ డిగ్రీ తప్పనిసరి కాదు. ఏదైనా విశ్వవిద్యాలయం నుంచి కనీసం మూడేళ్ల వ్యవధితో ఏ డిగ్రీ పూర్తి చేసినవారైనా ఎంబీఏ ఐటీలో చేరొచ్చు.

మేనేజ్‌మెంట్ రంగంలో రాణించాలంటే డేటా విశ్లేషణ, లాజికల్ థింకింగ్, సృజనాత్మకత, సమస్యా పరిష్కారం లాంటి నైపుణ్యాలు అవసరం. ముఖ్యంగా హెల్త్‌కేర్, ఫార్మా, బయోటెక్ ప్రాజెక్టుల్లో బీఎస్సీ లైఫ్ సైన్సెస్, ఎంబీఏ (ఐటీ)ల కలయికకు మంచి డిమాండ్ ఉంది.



ఎంబీఏ(ఐటీ) నేరుగా కోడింగ్ ఉద్యోగాల కోసం కాదని గుర్తుంచుకోవాలి. కాబట్టి ఎంబీఏతో పాటు ఎంఎస్ ఎక్సెల్, ఎస్‌క్యూఎల్, పవర్ బీఐ, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ టూల్స్ నేర్చుకుంటే ఉద్యోగ అవకాశాలు మరింతగా మెరుగవుతాయి.

ఎంబీఏ (ఐటీ)తో బిజినెస్ అనలిస్ట్, ఐటీ ప్రాజెక్ట్ మేనేజర్, సిస్టమ్స్ అనలిస్ట్, ప్రొడక్ట్ మేనేజర్ (టెక్), ఐటీ కన్సల్టెంట్, డిజిటల్ ఆపరేషన్స్ మేనేజర్ లాంటి హోదాల్లో ఉద్యోగాలు లభిస్తాయి. సాఫ్ట్‌వేర్ సంస్థల్లోనే కాకుండా బ్యాంకింగ్, హెల్త్‌కేర్, ఫార్మాస్యూటికల్, ఈ-కామర్స్, ఎడ్యుటెక్ రంగాల్లో కూడా ఈ ఉద్యోగాలు అందుబాటులో ఉంటాయి.

- ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

నాన్ టీచింగ్ పోస్టులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, డిజైన్ అండ్ మాన్యుఫాక్చరింగ్, కర్నూలు... వివిధ విభాగాల్లో 16 నాన్-ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

● టెక్నికల్ ఆఫీసర్: 02 ● అసిస్టెంట్ రిజిస్ట్రార్: 01 ● జూనియర్ టెక్నికల్ సూపరింటెండెంట్: 02 ● జూనియర్ సూపరింటెండెంట్: 02 ● స్టాఫ్ నర్స్: 01 ● ఫిజికల్ ట్రైనింగ్ ఇన్‌స్ట్రక్టర్: 01 ● జూనియర్ టెక్నీషియన్(కంప్యూటర్ సెంటర్): 01 ● జూనియర్ టెక్నీషియన్(మెకానికల్ డిపార్ట్‌మెంట్): 01 ● జూనియర్ టెక్నీషియన్(సీఎస్‌ఈ డిపార్ట్‌మెంట్): 02 ● జూనియర్ టెక్నీషియన్(ఈసీఈ డిపార్ట్‌మెంట్): 01 ● జూనియర్ అసిస్టెంట్: 02

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగాల్లో డిగ్రీ, బీఈ/బీటెక్, ఎంటెక్, ఎమ్మెస్సీ, ఎంసీఏ, డిప్లొమా, ఐటీఐతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 27-45 ఏళ్ల మధ్య ఉండాలి. **వేతన శ్రేణి:** నెలకు పోస్టు ప్రకారం రూ.21,700 - రూ.1,77,500. **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌లకు రూ.500. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళలు, ఈఎస్ఎంలకు ఫీజు లేదు. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 24. **ఎంపిక:** రాత పరీక్ష, ఇంటర్వ్యూ, స్కిల్ టెస్టులతో. **వెబ్‌సైట్:** https://iiitk.ac.in/NonnTeachingnRecruitment/page

సీయూఈటీ-యూజీ

దేశవ్యాప్తంగా కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, ఇతర విద్యాసంస్థల్లో 2026-27 విద్యాసంవత్సరానికి యూజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే సీయూఈటీ ప్రకటన వెలువడింది.

NATIONAL TESTING AGENCY

● కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ యూజీ)-2026 **అర్హత:** ఇంటర్మీడియట్/ తత్సమానం. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హాజరవుతున్నవారూ దరఖాస్తు చేసుకోవచ్చు. **ఎంపిక:** పరీక్ష ఆధారంగా. **దరఖాస్తు రుసుము:** జనరల్- మూడు సబ్జెక్టుల వరకు రూ.1000, అదనంగా ఒక్కో సబ్జెక్టుకూ రూ.400. ఓబీసీ/ ఈడబ్ల్యూఎస్- మూడు సబ్జెక్టులకు రూ.900; అదనంగా ఒక్కో సబ్జెక్టుకూ రూ.375. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు/ ట్రాన్స్‌జెండర్ - మూడు సబ్జెక్టులకు రూ.800; అదనంగా ఒక్కో సబ్జెక్టుకూ రూ.350. **ఆన్‌లైన్ దరఖాస్తుకు గడువు తేదీ:** 30.01.2026. **పరీక్షలు:** మే 11 నుంచి 31 వరకు నిర్వహిస్తారు. **వెబ్‌సైట్:** https://cuet.nta.nic.in/

ఐఐఎం లఖ్‌నవూలో

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం), లఖ్‌నవూ... తాత్కాలిక ప్రాతిపదికన నాన్-ఫ్యాకల్టీ ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. **పోస్టులు:** 38 **హోదాలు:** మేనేజర్, సీనియర్ మేనేజర్, డిప్యూటీ/ అసిస్టెంట్/ జూనియర్ మేనేజర్, ప్రోగ్రామ్ అసిస్టెంట్. **అర్హత:** పోస్టు ప్రకారం కనీసం 60 శాతం మార్కులతో యూజీ/పీజీతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి. **వయసు:** 45 ఏళ్లు మించకూడదు. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 19-01-2026. **ఎంపిక:** ఇంటర్వ్యూతో. **వెబ్‌సైట్:** https://www.iiml.ac.in/

సావిత్రీబాయి ఫులె ఆశయాలు నెరవేరుద్దాం



డైరీ ఆవిష్కరిస్తున్న మంత్రులు సవిత, కొల్లు రవీంద్ర, ముఖ్యకార్యదర్శి సత్యనారాయణ, నాయకులు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: సావిత్రీబాయి ఫులె ఆశయాలను అమలు చేసిన తొలి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ అని మంత్రి ఎస్.సవిత పేర్కొన్నారు. తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన బీసీ, ఓబీసీ ఉద్యోగుల రాష్ట్ర మహా సభలో 26 జిల్లాల కమిటీలను ప్రకటించారు. ఈసందర్భంగా సంఘం డైరీ, క్యాలెండర్‌లను మంత్రులు సవిత, కొల్లు రవీంద్ర ఆవిష్కరించారు. అనంతరం మంత్రి సవిత మాట్లాడుతూ.. తెదేపాలోనే బీసీలకు రాజకీయ ప్రాధాన్యం ఉందని చెప్పారు. మహాత్మా జ్యోతిరావు ఫులె, సావిత్రీబాయి ఫులె ఆశయాల సాధనకు ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో కృషి చేస్తున్నారని తెలిపారు. బీసీ, ఓబీసీ వర్గాల అభివృద్ధికి విద్య కీలకమని డీఎస్సీ, సివిల్ సర్వీసెస్ కోచింగ్, బీసీ హాస్టళ్లు, గురుకుల పాఠశాలల ఆధునికీకరణ ద్వారా ప్రభుత్వం వారికి మద్దతు ఇస్తుందన్నారు. చట్టసభల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలుపై తీర్మానం కేంద్రానికి పంపిన విషయాన్ని ప్రతి బీసీ గుర్తించాలన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. అమరావతిలో బీసీ, ఓబీసీ ఉద్యోగుల కోసం మహాసభ నిర్వహించడం ప్రాధాన్యం కల్పించిందని చెప్పారు. బీసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని అందుకు తమ సహకారం ఉంటుందన్నారు. గత ప్రభుత్వం మాట్లాడితే కేసులు పెట్టి జైళ్లలో వేసిందన్నారు. జ్యోతీరావు ఫులె జయంతి ఏప్రిల్ 11ను ప్రభుత్వ సెలవుగా ప్రకటించాలని, బీసీ అట్రాసిటీ చట్టం అమలు చేయాలని చెప్పారు. బీసీ వెల్ఫేర్ ముఖ్య కార్యదర్శి సత్యనారాయణ, బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు వీర బ్రహ్మం, అప్పారావు, హేమలత తదితరులు పాల్గొన్నారు.

'విద్యుత్తు రంగ ప్రైవేటీకరణను ఆపాలి'



మాట్లాడుతున్న రామకృష్ణ. వేదికపై సంఘాల నాయకులు

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే : ప్రభుత్వరంగ విద్యుత్తు సంస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని, ఉద్యోగ సంఘాలు ఒక తాటిపైకి వచ్చి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం విజయవాడలో ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండర్ వర్కర్స్ యూనియన్ (హెచ్ 64), ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించిన రెడ్ పవర్ డైరీ-2026 ఆవిష్కరణ సభలో ఆయన మాట్లాడారు. కేంద్రం. . ప్రభుత్వరంగ సంస్థలు, పరిశ్రమలు, ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేస్తోందని ఆరోపించారు. విద్యుత్తు సవరణ చట్టం-2025ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జాతీయ నాయకుడు ఓబులేసు మాట్లాడుతూ.. కార్మిక సమస్యల పరిష్కారానికి, న్యాయమైన హక్కుల సాధనకు ఏఐటీయూసీ ఎన్నో పోరాటాలు చేసిందని చెప్పారు. రాష్ట్ర కార్యదర్శి ఎం.బాలకాశి మాట్లాడుతూ... మీటర్ రీడర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఒప్పంద కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరారు. ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బి.రామలింగారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొన్నా శివయ్య మాట్లాడుతూ.. విద్యుత్తు రంగాన్ని ప్రైవేటీకరణ నుంచి రక్షించేందుకు ఉద్యమాలను మరింత ఉద్ధృతం చేస్తామని ప్రకటించారు. జేఎల్ఎం గ్రేడ్-2 అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎం.మల్లికార్జునరెడ్డి, సుధీర్‌బాబు మాట్లాడుతూ.. ఎనర్జీ అసిస్టెంట్లకు సర్వీస్ రూల్స్ అమలు చేయడంలో సంఘం కృషి చేసిందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్‌ను ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్‌లో విలీనం చేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ, వివిధ సంఘాల నాయకులు, ఉద్యోగులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

గోమాతకు సీమంతం



గోవుకు పూజ చేస్తున్న మహిళలు

న్యూస్‌టుడే, చందర్లపాడు: ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు గ్రామ మహిళలు గోమాతకు వైభవంగా సీమంతం చేసి తమ గోభక్తిని చాటుకున్నారు. రైతు చంద్ర సురేష్ పెంచుకుంటున్న ఆవు గర్భం దాల్చి తొమ్మిదో నెల కావస్తోంది. గోమాతలోనే దేవుళ్లందరూ కొలువై ఉంటారని, పూజలు చేస్తే సకల సౌభాగ్యాలు కలుగుతాయని భావించిన గ్రామ మహిళలు ఈ వేడుక నిర్వహించారు. గోవును శుభ్రం చేసి పసుపు రాసి కుంకుమ బొట్లు పెట్టి, పూల దండలు వేసి అలంకరించి చుట్టూ ప్రదక్షిణ చేశారు. ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.


పుస్తక మహోత్సవంలో.. ఆధ్యాత్మిక ప్రపంచం

కిక్కిరిసిపోతున్న స్టాళ్లు..

ఈనాడు, అమరావతి



వేద పాఠశాల విద్యార్థుల సందడి



విజయవాడ పుస్తక మహోత్సవానికి.. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా పెద్ద సంఖ్యలో జనం తరలివస్తున్నారు. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక విశేషాలతో కూడిన స్టాళ్లు ఆదివారం కిక్కిరిసిపోయాయి. గత ఏడాదితో పోలిస్తే ఆరంభం నుంచి పుస్తకాల కొనుగోళ్లు బాగా జరుగుతున్నాయని స్టాళ్ల నిర్వాహకులు పేర్కొంటున్నారు. ఆధ్యాత్మిక పుస్తకాలతో పాటు యోగా, ధ్యానం లాంటి ఆరోగ్య సంబంధమైన పుస్తకాలను కొనుగోలు చేసేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపిస్తున్నారు. ప్రస్తుతం ఉరుకులు పరుగుల జీవితంలో యోగ, ధ్యానం, మెడిటేషన్ లాంటివి అత్యవసరంగా మారిపోయాయి. శారీరక వ్యాయామం కంటే.. మానసిక ప్రశాంతత, ఒత్తిడిని తగ్గించుకోవడంపై అధిక శాతం మంది దృష్టి పెడుతున్నారు. అందుకే ఈ రకమైన పుస్తకాల కొనుగోళ్లు సైతం బాగా జరుగుతున్నాయి.



ఆసక్తిగా పరిశీలిస్తున్న మహిళలు

భారీగా తరలివస్తున్న వయోపారులు..

పుస్తక మహోత్సవానికి పిల్లలు, యువతతో పాటు.. వయోపారులు సైతం పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. వీళ్లు అధికంగా ఆధ్యాత్మిక స్టాళ్లలోని పుస్తకాలను కొనుగోలు చేస్తున్నారు. ❖ హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్, ధ్యానం, సత్యోదయం, హృదయపథం, విధిరూపకల్పన, ది హార్ట్‌ఫుల్‌నెస్ వే లాంటి పుస్తకాలు స్టాళ్లలో కొలువుదీరాయి. యోగా, పూర్ణయోగాకు సంబంధించిన పుస్తకాలు ఉన్నాయి. ❖ ఆధ్యాత్మిక, సద్గురు ప్రవచనాలు, రామానుజచార్యుల రచనలు, రామకృష్ణ మిషన్ ప్రచురణలను అధికంగా యువత కొనుగోలు చేస్తున్నారు. ❖ వివేకానంద జీవిత చరిత్ర, రచనలు, సూక్తులు, పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. రాజయోగం, నైతిక విలువలు, మానసిక స్థితులు, ఆత్మజ్ఞానం, ఆధ్యాత్మిక గ్రంథాలు, ప్రకృతి చికిత్స, యోగాసనాలు, ప్రాణాయామం, హిందూ ధర్మం, ధార్మిక కృతుల శాస్త్రాన్ని వివరించే గ్రంథాలు ఉన్నాయి.

విద్యార్థులతో సాహిత్యం చదివించాలి

ఈనాడు, అమరావతి



మాట్లాడుతున్న బి.నాగరాజు

'పుస్తక పఠనంతోనే విద్యార్థుల మనసు వికసిస్తుంది. ప్రస్తుతం మార్కులు, ర్యాంకుల గోలలో పడి వారిలోని సృజనాత్మకత బయటకు రాకుండా చేస్తున్నారని' రాష్ట్ర విద్య పరిశోధన శిక్షణ మండలి(ఎస్‌సీఈఆర్‌టీ) రిసోర్స్‌పర్సన్ బి.నాగరాజు పేర్కొన్నారు. 36వ విజయవాడ పుస్తక మహోత్సవంలో 'విద్యార్థులు-సాహిత్యం' అంశంపై ఆదివారం సాయంత్రం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. సాహిత్యం అనేది కచ్చితంగా విద్యార్థులతో చదివించాలన్నారు. అది వారి మానసిక వికాసానికి దోహదపడుతుందనే విషయం గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం పుస్తక పఠనం విద్యార్థులకు దూరం అవ్వడానికి ప్రధాన కారణం తల్లిదండ్రులేనన్నారు. చిన్నప్పటి నుంచి వారిని సముదాయించడానికి మొబైల్‌ను చేతికి అందించడమే దీనికి కారణమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో.. నైతిక విలువలను విద్యార్థుల్లో పెంచేందుకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నట్లు నాగరాజు వెల్లడించారు. ప్రస్తుతం మనబడి మ్యాగజైన్‌ను కూడా విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ప్రభుత్వం ముద్రిస్తోందని తెలిపారు.

పుస్తక పఠనాన్ని వ్యసనంగా మార్చాలి



సాంబశివరావు

పిల్లలు, విద్యార్థుల్లో సాహిత్యాభిలాష, పఠనాసక్తిని పెంపొందించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, అధ్యాపకులపైనే ఆధారపడి ఉంటుందని.. తెలుగు పండితులు, రచయిత గుమ్మా సాంబశివరావు పేర్కొన్నారు. విద్యార్థులకు పుస్తక పఠనాన్ని ఒక వ్యసనంగా మార్చాలన్నారు. ఈ అంశంపై సదస్సు పెట్టినందుకు నిర్వాహకులను అభినందించాలన్నారు. 'పాఠశాల, కళాశాల, విశ్వవిద్యాలయం.. ఈ మూడు స్థాయిల్లో విద్యార్థులకు సాహిత్యాన్ని వివిధ రూపాల్లో పరిచయం చేయాలి. పాఠశాల స్థాయిలో శతకాలు, కథలు చెప్పాలి. పిల్లల్లో సృజనాత్మక, విమర్శనాత్మక శక్తిని పెంపొందించాలంటే తప్పనిసరిగా పుస్తకాలను పఠించే అవకాశం కల్పించాలి. హైస్కూల్ స్థాయిలోని విద్యార్థులతో.. ప్రముఖుల జీవిత చరిత్రలను చదివించాలి. వాళ్ల వ్యక్తిత్వ వికాసానికి అవి పునాదులుగా పనికొస్తాయి. జీవితం విలువ.. ఎలా ఎదగాలనే తపన పెరుగుతుంది. కళాశాల స్థాయిలో పుస్తకాలను వారికి దగ్గర చేయాలి. సాహిత్యం అంటే.. కథలు, కవితలు, సైన్స్ రచనలు ఏవైనా కావొచ్చు. వాటన్నింటినీ చదివేలా చేయాలి. విద్యార్థులతో రాయించే అభ్యాసం చేయిస్తే.. అది వారి భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడుతుంది. విద్యార్థుల్లోని శక్తి.. వారి రాతల ద్వారా బయటకొస్తుంది. విశ్వవిద్యాలయాల స్థాయిలోని వారిని ప్రోత్సహిస్తే.. పరిశోధనాత్మక దృక్పథంతో కూడిన సాహిత్యం వస్తుంది. దానిని వెలికితీసేందుకు ప్రయత్నం చేయాలి.' అని గుమ్మా సాంబశివరావు పేర్కొన్నారు. సభాధ్యక్షులుగా తెలుగు అనువాదకులు రహ్మానుద్దీన్ వ్యవహరించారు. కార్యక్రమంలో 'ఈనాడు' ఆంధ్రప్రదేశ్ సంపాదకులు ఎం.నాగేశ్వరరావు, విజయవాడ పుస్తక మహోత్సవ సంఘం అధ్యక్షులు టి.మనోహర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నన్ను బెదిరించారు.. చంద్రబాబును జైల్లో పెట్టారు

- ప్రస్తుతం రాజకీయాలు మాట్లాడలేను
- గోవా గవర్నర్ అశోక్‌గజపతిరాజు



మాట్లాడుతున్న గోవా గవర్నర్ అశోక్‌గజపతిరాజు, వేదికపై కామినేని శ్రీనివాస్, విజయలక్ష్మి గజపతిరాజు, గోకరాజు గంగరాజు, స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే-విజయవాడ సిటీ: 'రాష్ట్రంలో బెదిరించే వాళ్లు ఉన్నారు... నన్ను కూడా బెదిరించారు. చంద్రబాబును జైల్లో పెట్టారు. వాళ్ల వల్ల ఆయన 53 రోజులు జైల్లో ఉండాల్సి వచ్చింది. వారి బెదిరింపులకు లొంగకండి. ఎంత కాలం బెదిరిస్తారు? ఏం చేస్తారు? ప్రస్తుతం రాజకీయాలు మాట్లాడలేను. గవర్నర్‌గా అవకాశం రావడం మర్చిపోలేని అనుభూతి. 100 శాతం అక్షరాస్యత ఉన్న రాష్ట్రంలో పని చేయడం చాలా ఆనందంగా ఉంది. భోగాపురం విమానాశ్రయానికి ట్రయిల్ రన్ పూర్తి కావడం, నా పుట్టిన రోజు నాడు దాన్ని ప్రారంభించేందుకు ముహూర్తం కుదిరింది. రిబ్బన్లు కత్తిరించి నిద్రపోవడం కాదు. పూర్తి చేయాల్సిన అవసరం ఉంది.' అని గోవా గవర్నర్ అశోక్‌గజపతిరాజు అన్నారు. మహారాజా అర్బన్ బ్యాంకు విజయవాడ శాఖ ప్రారంభోత్సవం సందర్భంగా ఆదివారం విజయవాడలోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఏర్పాటు చేసిన ఇష్టాగోష్ఠిలో ఆయన పాల్గొని మాట్లాడారు.

జనాభా తిరోగమనం ప్రమాదకరం: 'గోవా, కేరళ వంటి రాష్ట్రాల్లో సైతం జనాభా తిరోగమనంలో ఉంది. దేశం కూడా నెమ్మదిగా ఆ దశలోకి వెళుతోందా అన్న అనుమానం వస్తోంది. ఎక్కువ మంది యువత ఉన్న దేశం మనది. జనాభా పెరగకపోతే 25 ఏళ్ల తర్వాత జపాన్, అమెరికాలా మారిపోతాం. ఇప్పటికైనా మేల్కొంటే మంచిది. బంగ్లాదేశ్ యుద్ధం, ఆపరేషన్ సిందూర్ చూశాక ప్రపంచంలో మనం ఎవరికీ తీసిపోము అనిపించింది' అని అశోక్ గజపతి రాజు తెలిపారు.

పీపీపీ విధానం ఇప్పుడు వచ్చింది కాదు..: సభాపతి అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ.. 'జాతీయ రహదారుల అభివృద్ధి కోసం వాజ్‌పేయీ పాలనలోనే పీపీపీ విధానం వచ్చింది. ఇప్పుడు సృష్టించింది కాదు. దీనిపై బురద జల్లేందుకే తప్పుడు ప్రచారం చేస్తున్నారు. రాష్ట్ర భవిష్యత్తు దృష్ట్యా రాజకీయాలకు అతీతంగా అందరూ సహకరించాలి. అశోక్‌గజపతిరాజు కోరుకొండ సైనిక పాఠశాలకు ఆ రోజుల్లోనే 250 ఎకరాలు దానం చేశారు. ఇటీవల విమాన శిక్షణ కేంద్రం ఏర్పాటుకు సైతం విలువైన భూములు ఇచ్చారు. ఎన్నో సవాళ్లు అధిగమించి మోదీ సహకారంతో రాష్ట్రాన్ని నడిపిస్తున్నాం' అని అన్నారు. కార్యక్రమంలో కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, విజయనగరం ఎమ్మెల్యే అతిథి విజయలక్ష్మీగజపతిరాజు, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, మహారాజా బ్యాంకు వ్యవస్థాపకుడు రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

వసుంధర

vasundhara@eenadu.in

మాది పల్లెటూరు. ఒక్కతే అమ్మాయి. పక్క ఊళ్లో ఇంటర్ చదువుతోంది. పైచదువులకి సిటీకి వెళ్లి, హాస్టల్‌లో ఉండి చదువుకుంటా అంటోంది. అంతదూరం పంపాలంటే నాకేమో కంగారు. అందుకే మా దగ్గరే ఉండి, ఏదో ఒక డిగ్రీ చేయమంటే కాదంటోంది. నా భవిష్యత్తు పాడు చేస్తున్నావంటూ ఏడుస్తోంది. తనను అలా ఆపి పొరపాటు ఏమైనా చేస్తున్నానా? - ఓ సోదరి

అంతదూరం పంపాలంటే కంగారు!

డియర్ వసుంధర



డా. స్వాతి పైడిపాటి
మానసిక నిపుణురాలు

మీకు చదువు విలువ తెలుసు కాబట్టే, పక్క ఊరికి పంపి మరీ మీ అమ్మాయిని చదివిస్తున్నారు. తనూ రోజూ ప్రయాణాలు చేస్తూ చదువుతోందంటే ఇష్టంతోనే కదా! అయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో అమ్మాయిని దూరంగా పంపి చదివించాలంటే తల్లిగా భయపడటం సహజమే. కానీ కళాశాలలే చాలావరకూ హాస్టల్ వసతిని కల్పిస్తున్నాయి. అలాంటి దానిలో మెరిట్ సీటు సంపాదించుకునేలా ప్రోత్సహించండి. తను కోరుకున్న మంచి సంస్థలో చదువుతుంది, భద్రత రీత్యా మీకూ భయముండదు. పైగా అప్పుడప్పుడూ మీరూ వెళ్లి చూసి రావొచ్చు. అప్పుడు బెంగ కూడా ఉండదు. ఈరోజుల్లో చాలామంది అమ్మాయిలు పైచదువుల కోసం నగరాలే కాదు, దేశాలూ దాటుతున్నారు. తనేదో కెరియర్‌లో ఉన్నతంగా ఎదగాలనుకుంటోంది. ప్రోత్సహించండి, అవసరమైన జీవన నైపుణ్యాలు నేర్పిస్తూ, లోకం పోకడ గురించి చెబుతూ ధైర్యం, ఆత్మవిశ్వాసాల్ని నింపండి. తప్పకుండా రాణిస్తుంది.

రోగ నిరోధకత పెంచాలంటే...



పిల్లల్లో పోషకాల లేమి రోగనిరోధకతను బలహీన పరుస్తుంది. దీన్ని మెరుగు పరుచుకోవాలంటే... చిన్నారులకు పెట్టే ఆహారంలో వైవిధ్యం ఉండేలా చూడాలి. అంటే అన్ని రకాల పోషకాలు వారికి అందించాలి. ముఖ్యంగా కొన్ని కీలకమైన పోషకాలు ఇవ్వడంపై దృష్టి పెడితే మేలు. అందులో మాంసకృత్తులు, సూక్ష్మపోషకాలు (బి-కాంప్లెక్స్, విటమిన్-ఎ, సి, ఐరన్, జింక్, ఫోలిక్ యాసిడ్ వంటివి...) ఉండేలా చూసుకోవాలి. ఇందుకోసం పాలు, పాల ఉత్పత్తులు, ఆకుకూరలు, కాయగూరలు, పండ్లు, పొట్టుతో ఉన్న గింజధాన్యాలు... ఇలా అన్నింటినీ ఉపయోగించి వివిధ వంటకాలను చేసి పెట్టండి. ఒకే రకం, ఒకే రుచి అయితే వాటిని వారు ఇష్టపడకపోవచ్చు. కాబట్టి కొత్తదనాన్ని వారు ఆస్వాదించేలా చేస్తే... పోషకాలూ అందుతాయి. ఇలా చేస్తూనే మరో వైపు నెమ్మదిగా చక్కెరలు, ప్రాసెస్డ్ ఫుడ్స్ వంటివి తగ్గించడానికి ప్రయత్నించండి. ముఖ్యంగా కెలోరీలు... తక్కువ పోషకాలు ఉండే నూడుల్స్, పాస్తా, చిప్స్, బిస్కట్లు, క్యాండీస్ వంటి వాటిని పూర్తిగా తగ్గించాలి. వాటికి బదులుగా వెజిటెబుల్ కట్‌లెట్, చీజ్ దోశ, రగ్డా, ఢోక్లా, ఫ్రెంచ్ టోస్ట్, ఛోలే మసాలా, గ్రిల్డ్ వెజిటబుల్స్, పండ్లు, కూరగాయలతో రకరకాల స్నాక్స్ చేసి తినిపిస్తే సరి. ఈ పోషకాహారంతో పాటు చిన్నారులకు శారీరక శ్రమ ఉండేలా ఇండోర్ గేమ్స్ ఆడించండి. స్కిప్పింగ్, యోగా, డాన్స్ లాంటివి చేయించండి.

జాతీయ వేదికపై విద్యార్థినుల సత్తా!

ఇద్దరు వ్యవసాయ విద్యార్థినులు. తమ ప్రతిభతో జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. ఒకరు గణతంత్ర వేడుకల్లో పరేడ్‌లో పాల్గొనే అవకాశాన్ని దక్కించుకోగా... మరొకరు వికసిత్ భారత్ యంగ్ లీడర్ ఛాంపియన్‌షిప్‌లో సత్తా చాటుతున్నారు. ఆ విశేషాలను చెప్పుకొచ్చారిలా...

గమ్యం.. 'రాష్ట్రపతి మెడల్' శ్రావణం కావ్యశ్రీ



మాది సూర్యాపేటలోని రామాపురం. నాన్న శ్రావణం సైదయ్య, అమ్మ నాగజ్యోతి. మాది వ్యవసాయాధారిత కుటుంబం. కాబట్టే, నాకూ ఆ రంగంపై ఆసక్తి. అశ్వారావుపేటలోని వ్యవసాయ కళాశాలలో అగ్రికల్చర్ బీఎస్సీ ఫైనల్ ఇయర్ చదువుతున్నా. స్కూల్లో ఉన్నప్పుడు పీపుల్ లీడర్ జెండా పట్టుకుంటే పోలీసులు, విద్యార్థులు వెనక పరేడ్‌లో రావడం చూడటానికి చాలా బాగుండేది. 9, 10 తరగతుల్లో లీడర్‌గా నేనూ ఉన్నా. ఆ తరవాత అవకాశం రాలేదు. డిగ్రీలో ఎన్‌ఎస్‌ఎస్‌లో వాలంటీర్‌గా చేరా. మా ప్రోగ్రామ్ ఆఫీసర్ స్రవంతి సలహాతో 'రిపబ్లిక్ పరేడ్' పోటీల్లో పాల్గొన్నా. కాలేజీ, యూనివర్సిటీ, రీజనల్, జోనల్, ఫైనల్... ఇలా అయిదు స్థాయుల్లో పోటీలుంటాయి. పరేడ్, కల్చరల్ అంశాలను పరీక్షించడంతోపాటు ఇంటర్వ్యూనీ నిర్వహిస్తారు. వీటితోపాటు ఫిజికల్ ఫిట్‌నెస్‌లోనూ అర్హత సాధించాలి. వెస్ట్ జోన్ నుంచి తుది పోటీలో 200 మందిని పరీక్షించి, చివరగా 40 మందిని ఎంపికచేశారు. అందులో నేనూ ఒకరిని. ప్రస్తుతం దిల్లీలో గణతంత్ర దినోత్సవ పరేడ్ కోసం శిక్షణ తీసుకుంటున్నా. రాష్ట్రపతి ముందు పరేడ్‌లో పాల్గొంటున్నానన్న అనుభూతి మాటల్లో చెప్పలేనిది. గణతంత్ర వేడుకలు పూర్తయ్యాక రాష్ట్రపతి, ప్రధానిని కలుస్తాం. సర్టిఫికెట్‌నీ ఇస్తారు. నిజానికి ఈ పోటీలో గతంలోనూ పాల్గొన్నా. కానీ మధ్యలోనే వెనుదిరిగా. ఈసారి పట్టుదలగా ఇక్కడివరకూ వచ్చా. పరేడ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారికి రాష్ట్రపతి మెడల్ ఇస్తారు. దానికోసం మరింత ఉత్సాహంగా సాధన చేస్తున్నా. చిన్న గ్రామాల నుంచి వచ్చాం, అందరికంటే వెనక ఉన్నాం అనుకుంటాం చాలాసార్లు. మన ఆశయం పెద్దదైతే, సాధించాలన్న పట్టుదల ఉంటే ఎవరూ మనల్ని ఆపలేరని నమ్ముతా. నా వరకూ అమ్మానాన్నలు, గురువుల ప్రోత్సాహం, స్నేహితుల తోడ్పాటు ఉండటం అదృష్టం.

ఊహించని అవకాశం సోమసాని సాత్విక



యాదాద్రి భువనగిరి జిల్లాలోని రాజాపేట మా సొంతూరు. నాన్న సురేందర్ కాలేజీ ప్రిన్సిపల్‌గా చేశారు. అమ్మ గీత మండల ఆఫీసులో కంప్యూటర్ ఆపరేటర్. నేను ప్రస్తుతం అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నా. ఇటీవల కాలేజ్ గ్రూప్‌లో క్విజ్ ఉంది, ఆసక్తి ఉన్నవారు పాల్గొనొచ్చు అంటే ప్రయత్నించా. అప్పటికి అది వికసిత్ భారత్ యంగ్ లీడర్ ఛాంపియన్‌షిప్ అని తెలియదు. యువత మేధస్సు, వారి ఆలోచనలతోనే వికసిత్ భారత్ సాధ్యమన్న ఉద్దేశంతో జాతీయ స్థాయిలో ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. క్విజ్‌లో ఎంపికయ్యాక ఒక వ్యాసం రాయమని అడుగుతూ మెయిల్ వచ్చింది. పది టాపిక్స్ ఇస్తే నేను 'స్మార్ట్ అండ్ సస్టైనబుల్ అగ్రికల్చర్'ని ఎంచుకున్నా. ఇక్కడా ఎంపికయ్యాక హైదరాబాద్‌లో పీపీటీ ప్రెజెంటేషన్ ఇచ్చా. పంటలు పండిస్తూనే సౌరశక్తి ఉత్పాదన, దాని వల్ల ఎలా ఖర్చు తగ్గించొచ్చో చెప్పా. అలా ఈ రాష్ట్ర స్థాయి పోటీలోనూ ఎంపికయ్యాక దిల్లీలో జరిగే నేషనల్స్‌కు ఎంపికైనట్లు మెయిల్ వచ్చింది. అక్కడా జనవరి 8-12 వరకు జరిగే కార్యక్రమంలో నా ఆలోచనలను పంచుకోవాల్సి ఉంటుంది. అలా అన్ని రాష్ట్రాల నుంచీ అభ్యర్థులు వస్తారు. అక్కడా ఎంపికైతే ప్రధాని నరేంద్ర మోదీ ముందు ప్రెజెంటేషన్ ఇచ్చే అవకాశం ఉంటుంది. నిజానికి నేను ఎంబీబీఎస్ చదవాలనుకున్నా. ఆ అవకాశం రాకపోవడంతో వ్యవసాయ విద్య వైపు వచ్చా. పోటీలో భాగంగా వ్యవసాయం మీద రిసెర్చ్ చేయడం మొదలుపెట్టాక నా ఆలోచనా తీరే మారింది. టెక్నాలజీల గురించీ తెలుసుకున్నా. వ్యవసాయమంటే నష్టమన్న అభిప్రాయమే చాలామందిది. ఇంకా పాత పద్ధతులనే అనుసరిస్తుండటం వల్లే ఇలా! టెక్నాలజీ వాడకం, సరికొత్త విధానాలను అవలంబించడం ద్వారా లాభాలు సాధించొచ్చు, యువతకీ ఉపాధి చూపించొచ్చు. భవిష్యత్తులో దానిపై పనిచేస్తా. అనుకోకుండా వచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటా.

- శనిగారపు సతీష్, భద్రాద్రి కొత్తగూడెం

వంటింటి వ్యర్థాలు... పోషకాలు!



మొక్కలు పెంచడం అందరికీ సరదానే. కొన్నాళ్లు బాగానే పూసినా తర్వాత ఆ మట్టిలో సారం తగ్గి నిర్జీవంగా మారిపోతుంటాయి. ఇలాంటప్పుడు దాన్ని సులువుగా ఎలా సారవంతం చేసుకోవాలో తెలుసా?



- ఒక ఖాళీ కుండీని తీసుకోండి. అడుగున ఒక లేయర్ చిన్న చిన్న రాళ్లు వేయండి. ఆపై రెండు వరుసల్లో మట్టిని వేసి ఉంచండి. దీనిపై కూరగాయల వ్యర్థాలు, పండ్ల తొక్కలు వంటివి వేసి పైన మరోసారి మట్టి వేయండి. ఇలా ఒకదాని తర్వాత మరొకటి వేస్తూ కాసిని నీళ్లు చల్లుతూ ఉండండి. నెలరోజుల లోపే ఆ మట్టి సారవంతంగా మారుతుంది.
- మొక్క చుట్టూ ఉండే మట్టి తరచూ బిగుసుకుపోతుంది. అలాకాకుండా ఉండాలంటే ఎండిన ఆకుల్ని పొడి చేసి మట్టిలో కలిపేయండి. ఇది మట్టిని గట్టిపడనివ్వదు.
- ఆరోగ్యానికి మంచిదని గుడ్డు తింటాం కదా! వ్యర్థం అని పెంకుల్ని పారేయకండి. వాటిని ఎండబెట్టి పొడి చేయండి. ఓ టేబుల్ స్పూన్ పొడి తీసుకుని అరచెక్క నిమ్మరసం కలిపి కరగనివ్వండి. తర్వాత ఓ దీన్ని నీళ్లల్లో కలిపి మొక్కలపై స్ప్రే చేస్తే సరి. కాల్షియం అంది ఆరోగ్యంగా ఉంటాయి.
- వాడేసిన టీ పొడి, కాఫీ గింజలను పారేయకండి. వీటిని నేరుగా మట్టిలో కలిపినా, నీళ్లల్లో కలిపి చల్లినా మంచిదే. వీటిల్లోని నత్రజని ఆకులను నిగనిగలాడేలా చేసి మొక్కనూ ఆరోగ్యంగా ఉంచుతుంది.
- బియ్యం, పప్పులు కడిగిన నీళ్లను పారబోయకండి. మొక్కలకు పోస్తే ఇవి మట్టిలో సూక్ష్మపోషకాలను పెంచుతాయి. అంతే కాదు, ప్రతి ఆరునెలలకోసారి కాస్తంత అయినా కొత్త మట్టిని కలపడం మంచిది.

అలసటగా అనిపిస్తుంటే...

ఇంటి బాధ్యతలు, ఆఫీసు పనులు అంటూ చాలా అలసిపోతుంటాం. దీంతో ఏ కాస్త ఖాళీ దొరికినా విశ్రాంతి కోసం ఓ రెండు నిమిషాలు కునుకు తీయాలనుకుంటాం. అయితే, అది మాత్రమే ఉపశమనం ఇవ్వదంటున్నారు నిపుణులు. మరేం చేయాలనేదేగా మీ ప్రశ్న... అయితే, ఇది మీకోసమే.



- అలసటగా ఉన్నప్పుడు గోరువెచ్చని నీటితో స్నానం చేయండి. వీలైతే ఒంటికి నూనె రాసి నలుగు పెట్టుకోండి. తలస్నానం చేయండి. ఇది మీకెంతో హాయినిస్తుంది. అయితే, ఈ నీటిలో కాస్త ఎసెన్షియల్ ఆయిల్ ఎప్సమ్ సాల్ట్‌ని కూడా చేరిస్తే ఒత్తిడీ దూరమవుతుంది.
- తీరికలేని పనులతో మనసంతా చికాకుగా ఉందా? ఇలాంటప్పుడు నిద్రా సరిగా పట్టదు. ఇది పోవాలంటే శ్వాస మీద దృష్టిపెట్టి ధ్యానం చేయండి. ఇలా కనీసం ఓ అరగంటైనా కూర్చోగలిగితే ఎంత ఉల్లాసంగా ఉంటుందో!
- విశ్రాంతి అని చెప్పి... మంచంపై నడుం వాల్చి ఫోన్ చూస్తున్నారా? మీకు దొరికిన కొద్ది సమయాన్ని సాంకేతికత లాగేసుకుంటుంది. విశ్రాంతి శరీరంతో పాటు కళ్లకీ అవసరమేనని మర్చిపోవద్దు. గ్యాడ్జెట్స్‌ని దూరంగా పెట్టి ఏ పెయింటింగో వేయండి. గార్డెనింగ్ చేయండి. మీ మనసుకీ విశ్రాంతి దొరుకుతుంది.
- తరచూ అలసటగా అనిపిస్తుంటే... అసలు మీరు ఎంత మేర మీకు కావలసిన పోషకాల్ని అందించే ఆహారాన్ని తీసుకుంటున్నారో పరిశీలించుకోండి. ఎందుకంటే వాటి లోపం వల్లా ఇలా జరగొచ్చు. విటమిన్లు, ఖనిజాలు... వంటి న్యూట్రియంట్స్ అన్నీ ఉండేలా సమతులాహారాన్ని తీసుకోండి. ఇవన్నీ మీ అలసటను పోగొడతాయి. కొత్త ఉత్సాహాన్నిస్తాయి.

ఓటమిని మరిపించిన గెలుపు!



ఓటమికి భయపడేవారు ఎప్పటికీ విజేతలు కాలేరు. అపజయం కూడా పాఠమే అనుకుంటేనే విజయతీరాలకు చేరువవుతారు. అందుకు ఉదాహరణ జగిత్యాల డెప్యూటీ కలెక్టర్(ట్రైనీ) కన్నం హరిణి!

ప్రేరణ


సొంతూరు కరీంనగర్. తండ్రి రమేశ్, తల్లి జ్యోతి ప్రభుత్వ ఉపాధ్యాయులు. వరంగల్ నిట్ నుంచి బీటెక్ చేశాక, 2019లో ఓ ఐటీ కంపెనీలో చేరారు హరిణి. మంచి వేతనం, హైదరాబాద్‌లో ఉద్యోగం. కొవిడ్ లాక్‌డౌన్ రావడంతో... ఇంటి నుంచే పనిచేశారు. అప్పుడే తన అక్క ప్రభుత్వ ఆసుపత్రిలో మెడికల్ ఆఫీసర్‌గా ప్రజలకు ప్రత్యక్షంగా సేవలందించడాన్ని చూశారు హరిణి. ప్రజాసేవ చేయడంలో ఉన్న తృప్తి వేరని అర్థం చేసుకున్నారు. దాంతో సివిల్స్ సాధించాలని ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఇంట్లో ఇష్టం లేకున్నా, తన నిర్ణయాన్ని కాదనలేకపోయారు.

ఆన్‌లైన్ పాఠాలు వింటూ ఇంట్లోనే ప్రిపేర్ అయ్యారు హరిణి. విజేతల స్ఫూర్తిగాథలు చదివేవారు. 2022లో మొదటిసారి సివిల్స్ రాస్తే 0.1 మార్కుల తేడాతో మెయిన్స్‌కు అర్హత సాధించలేకపోయారు. రెండోసారి ఒక్క మార్కు తగ్గడంతో అదే ఫలితం. లక్ష్యాన్ని చేరుకోకపోవడంతో తీవ్ర మానసిక ఒత్తిడికి లోనయ్యారు. ధ్యాన సాధన, భగవద్గీత పఠనంతో క్రమంగా దాన్నుంచి బయటపడ్డారు. ఆ సమయంలో సివిల్స్ టాపర్ అనుదీప్ దురిశెట్టి ఇంటర్వ్యూ చూసి మరో ప్రయత్నంచేశారు. అదీ విఫలయత్నమే అయ్యింది. అధైర్య పడలేదు. సివిల్స్ రాస్తూనే 2022, 23, 24లో టీజీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షలూ రాసి మంచి ప్రతిభ చూపారు. మొదటి రెండూ రద్దవగా, '24లో 55వ ర్యాంకుతో డెప్యూటీ కలెక్టర్‌గా ఎంపికయ్యారు. - చల్లారం రామచంద్రారెడ్డి, కరీంనగర్

'కుటుంబ సభ్యులూ, స్నేహితుల ప్రోత్సాహంతో పాటు క్లిష్ట సమయంలో ఆత్మవిశ్వాసం, సానుకూల దృక్పథం కీలకం. పరీక్షలు ఉన్నా లేకున్నా, రోజూ 8-10 గంటలు చదివే దాన్ని. ప్రజలు ఎంతో నమ్మకంతో ప్రభుత్వ అధికారుల దగ్గరకు వస్తారు. దాన్ని వమ్ముచేయకుండా పనిచేస్తా. మహిళా సాధికారతకు ప్రాధాన్యం ఇస్తా' - హరిణి.

స్వీట్ హోమ్

ఈ మొక్కలు... ఎప్పటికీ వాడిపోవు..!





ఈ మొక్కలకి నీరు అవసరం లేదు. ఎండ సోకనక్కర్లేదు... వాడిపోతాయన్న భయమూ ఉండదు. ఎందుకంటే ఇవన్నీ క్రోషె పనితనంతో ఊలు, దారంతో తయారైనవి. ఇలా ఇప్పటి వరకూ స్వెటర్లు, కర్టెన్లు, టేబుల్ రన్నర్లు, మ్యాట్‌లు, కోస్టర్లనే చూశాం. కానీ, ఇప్పుడు మొక్కలూ అందుబాటులోకి వచ్చాయి. మనకు నచ్చిన రంగులు, ఆకృతుల్లో ఇవి దొరుకుతున్నాయి. సృజనాత్మకతను, వ్యక్తిగత అభిరుచులకు మేళవించి ఆధునిక హంగులతో తయారుచేశారు వీటిని. అందుకే ఏరికోరి ఈ క్రోషె ప్లాంట్స్‌ని ఇల్లు, ఆఫీస్ డెస్క్, బెడ్‌సైడ్ టేబుల్‌పై ప్రత్యేకంగా అలంకరించుకునేందుకు ఇష్టపడుతున్నారు జెన్ జీ అమ్మాయిలు. అంతే కాదు, 'ఊలుతో అల్లిన మొక్క ఒక్కటి ఉన్నా చాలు... గది మొత్తం పచ్చదనంతో నిండిన భావన కలిగి ప్రశాంతంగా అనిపిస్తుంద'ంటున్నారు. అందుకే సాధ్యమైనన్ని ఎక్కువ మొక్కల్ని డెకార్‌లో భాగం చేసుకుంటున్నారు. చేతితో అల్లిన ఈ క్రోషె మొక్కల్ని చూసినవాళ్లు తప్పక మంత్రముగ్ధులు అవ్వాల్సిందే. మీకూ నచ్చాయా?



మెలిపెట్టి... కిక్ ఇవ్వండి!

రక్ష

దాడి చేయడానికి వచ్చిన వ్యక్తి మోచేతిని గట్టిగా పట్టుకుని మెలితిప్పాలి. దాంతో ఆ వ్యక్తి మన అదుపులోకి వస్తాడు. అప్పుడు మోకాలిమీద గట్టిగా కిక్ ఇవ్వాలి. ఒకేసారి చేతిమీదా, కాలిమీదా దాడిచేయడంవల్ల ఇది చాలా ప్రభావవంతంగా పనిచేస్తుంది. దాంతో అవతల వ్యక్తి పూర్తిగా కూలబడిపోతాడు. తర్వాత వీలైతే ముక్కు, కళ్లు, గొంతు మీద కూడా గాయపరిచి అక్కడ నుంచి తప్పించుకోవచ్చు. ఒడ్డూ పొడుగుతో సంబంధం లేకుండా దీన్ని ఎంత బాగా ప్రాక్టీసు చేస్తే అంత ధైర్యంగా అమలుచేయొచ్చు. ఇలాంటి ఆత్మరక్షణ నైపుణ్యాలు కొన్నైనా నేర్చుకుని కొత్త సంవత్సరంలో ధైర్యంగా ముందుకు వెళ్లండి.





– ప్రతిభ తక్కడపల్లి, మార్షల్ ఆర్ట్స్ నిపుణురాలు

ఆహ్వానం




సంక్రాంతి ముచ్చట్లు

తెల్లని మేఘాల్లా కమ్మిన పొగమంచు... వణికించే చలి... దాన్ని తప్పించుకోవడానికి కాగే చలిమంటలు... వాటి చుట్టూ పోగుపడే కబుర్లు... ఎన్నో సంప్రదాయాలు, మరెన్నో ఆత్మీయతలు... సంక్రాంతి చుట్టూ అల్లుకునే జ్ఞాపకాలు ఎన్నెన్నో! మారుతున్న కాలానికి తగ్గట్టుగా కొన్ని కొనసాగినా, కనుమరుగైనవే ఎక్కువ. ఒకసారి ఆ జ్ఞాపకాల దొంతరని తట్టి లేపండి. సంక్రాంతికి మీ ప్రాంతానికే పరిమితమైన సంప్రదాయాల్నీ, మర్చిపోలేని అనుభూతుల్నీ 'వసుంధర'తో పంచుకోండి. పేరు, ఊరు వివరాలతోపాటు ఫొటోలనూ పంపడం మర్చిపోవద్దు మరి!

రంగవల్లిక


16 చుక్కలు
6 వరుసలు
6 వచ్చేవరకూ





గట్ల సంధ్యారాణి
పాల్వంచ

15 చుక్కలు
8 వచ్చేవరకూ





నీరజ ధూర్జటి
హైదరాబాద్





దున్న లక్ష్మి
అమలపాడు

21 చుక్కలు
1 వచ్చేవరకూ

9154091911 నంబరుకు వాట్సాప్ చేయొచ్చు.

మా చిరునామా:
వసుంధర, ఈనాడు
ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిల్మ్‌సిటీ,
అనాజ్‌పూర్,
అబ్దుల్లాపూర్‌మెట్ మండలం,
రంగారెడ్డి జిల్లా,
తెలంగాణ - 501 512.
Email:vasundhara@eenadu.in

సోమనాథ్.. అచంచల విశ్వాస ప్రతీక



నరేంద్ర మోదీ,
భారత ప్రధాని,
శ్రీ సోమనాథ్ ట్రస్ట్ ఛైర్మన్

సోమనాథ్.. ఈ పేరు తలచుకుంటే చాలు మన హృదయాలు, మనసులలో సగర్వభావన నిండిపోతుంది. భారత ఆత్మకు ఇదో శాశ్వత ఉద్ఘోషణ. పశ్చిమతీరంలో గుజరాత్‌లో ప్రభాస్ పాటణ్ వద్ద ఈ మహత్తర ఆలయం కొలువైంది. ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఇదొకటి. 'సౌరాష్ట్రే సోమనాథం చ' అని మొదలయ్యే స్తోత్రం.. తొలి జ్యోతిర్లింగంగా దీనికున్న ప్రాధాన్యానికి ప్రతీక. సోమనాథ్ శివలింగ దర్శనంతో పాప ప్రక్షాళన జరుగుతుందని, మరణానంతరం స్వర్గానికి చేరుతారని 'సోమ లింగం నరో దృష్ట్వా సర్వపాపైః ప్రముచ్యతే! లభతే ఫలం మనోవాంఛితం మృతః స్వర్గం సమాశ్రయేత్!!' శ్లోకం మనకు చెబుతుంది. లక్షల మంది భక్తుల నీరాజనాలు అందుకున్న సోమనాథ్‌పై విదేశీ దురాక్రమణదారులు అనేక దండయాత్రలు చేశారు. ఐతిహాసిక పుణ్యక్షేత్రంపై గజనీ మహమ్మద్ క్రూర, హింసాత్మక దండయాత్ర చేసింది 1026 జనవరిలోనే. ఆలయానికి పూర్వవైభవం దిశగా అప్రతిహతంగా సాగిన కృషివల్ల వెయ్యేళ్ల తర్వాత కూడా ఆలయ దివ్యదీప్తి నేల నలుచెరగులా భాసిల్లుతోంది. ఇలాంటి ప్రయత్నాల్లో ఒక ఘట్టానికి 2026లో 75 ఏళ్లు పూర్తవుతుంది. ఆలయ పునరుద్ధరణ తర్వాత 1951 మే 11న ఆనాటి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ సమక్షంలో ఆలయంలో భక్తులకు మళ్లీ దర్శనభాగ్యం కలిగింది.

చదివితే హృదయం బరువెక్కుతుంది

సోమనాథ్ ఆలయంపై జరిగిన దాడి, విధ్వంసాన్ని చారిత్రక గ్రంథాలు సవివరంగా నమోదుచేశాయి. అవి చదివితే మన గుండె చలించిపోతుంది. ఎంతగా హింస, క్రూరత్వం, విషాదం ఉన్నాయనేది ప్రతి వాక్యం చెబుతుంది. అవి కాలంతోపాటు చెరిగిపోనివి. సోమనాథ్‌కు ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాశస్త్యం ఉంది. మన సమాజానికిది ఎంతో గొప్ప ఆర్థిక బలాన్నిస్తోంది. నౌకావాణిజ్యం చేసేవారు ఈ ఘనతర చరితను సుదూర ప్రాంతాలకు తీసుకువెళ్లారు. తొలిదాడి జరిగిన వెయ్యేళ్ల సోమనాథ్ గాథ దాని విధ్వంసం ద్వారా కాకుండా కోట్లమంది భరతమాత బిడ్డల అచంచల ధైర్యసాహసాల ద్వారా నిర్వచించవచ్చని నేనెంతో సగర్వంగా చెప్పగలను. తొలి దాడి కలిగించిన ప్రేరేపణతో



1026 తర్వాత పలుమార్లు ఈ చారిత్రక ఆలయంపై దాడులు జరిగాయి. మన సంస్కృతిని, ప్రజల్ని బానిసలుగా చేయడానికి అలా బీజం పడింది. దాడి ప్రయత్నం జరిగిన ప్రతిసారీ ఆలయాన్ని కాపాడుకునేందుకు ప్రజలు దృఢంగా అడ్డుపడ్డారు. కొందరు ప్రాణత్యాగం చేశారు. 1890లలో స్వామీ వివేకానంద ఈ పుణ్యస్థలిని సందర్శించారు. దక్షిణాదిలోని ఆలయాలు, సోమనాథ్ క్షేత్రం వంటివి మనకెంతో విజ్ఞానాన్ని అందిస్తాయని, పుస్తకాల్లో లేని చరిత్రను చెబుతాయని ఆయన పేర్కొన్నారు. ఎన్ని దాడులు జరిగినా, ఎన్ని తరాలు మారినా ఇలాంటి ఆలయాలు ప్రజల్ని మరింత బలవంతుల్ని చేశాయి. అదే జాతీయ జీవన స్రవంతి ప్రత్యేకత. దానిని అనుసరిస్తే వైభవోపేతంగా ఉంటాం. దానిని వదిలేస్తే మరణమే.

నెహ్రూ విముఖత

స్వాతంత్ర్యానంతరం సోమనాథ్ ఆలయ పునర్నిర్మాణ పవిత్ర కర్తవ్యం సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ చేతుల్లోకి వచ్చింది. ఆలయాన్ని అదేచోట తిరిగి నిర్మిస్తామని ఆయన 1947 దీపావళి సమయంలో ప్రకటించారు. 1951 మే 11న ఆలయం తిరిగి భక్తులకు అందుబాటులోకి వచ్చింది. అది చూడటానికి పటేల్ ఈ భూమ్మీద లేరు. మాజీ ప్రధాని నెహ్రూ ఈ ఆలయ పరిణామంపై పెద్ద ఉత్సాహంతో లేరు. రాష్ట్రపతి, కేంద్రమంత్రులు ఈ ప్రత్యేక కార్యక్రమానికి వెళ్లకూడదని ఆయన కోరుకున్నారు. బాబూ రాజేంద్రప్రసాద్ మాత్రం దృఢంగా నిలబడ్డారు. సోమనాథ్ ఒక ఆశాదీపం. వెయ్యేళ్ల తర్వాత కూడా సోమనాథ్ వద్ద సాగర కెరటాలు మనకు ఒక విషయాన్ని చెబుతుంటాయి. విద్వేషం, మతమౌఢ్యం అనేవి క్షణకాలం పాటు విధ్వంసం సృష్టించవచ్చేమోగానీ విశ్వాసం, కట్టుబాట్లకు ఉన్న శక్తి శాశ్వతమని అవి ఘోషిస్తుంటాయి. సోమనాథ్ మహాదేవుని ఆశీస్సులతో విశ్వమానవ సంక్షేమానికి మనం మున్ముందుకు వెళ్తనే ఉంటాం. జై సోమనాథ్!

తెలంగాణ నేతల వ్యాఖ్యలతో..
ఏపీలో రాజకీయ లబ్ధికి వైకాపా యత్నం

మంత్రి నిమ్మల రామానాయుడు

ఈనాడు, అమరావతి: తెలంగాణలోని అధికార, విపక్ష నేతల మధ్య వ్యాఖ్యలను ఆంధ్రప్రదేశ్ విషయంలోకి చొప్పించడం ద్వారా రాజకీయ లబ్ధి పొందేందుకు వైకాపా ప్రయత్నిస్తోందని జల వనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ధ్వజమెత్తారు. 'అనుమతులు తీసుకోకుండా.. రాయలసీమ ఎత్తిపోతల పథకానికి 2020 మే 5న జగన్ ఆమోదం తెలిపారు. అదేనెల 20న పనుల నిలుపుదలకు ఎన్‌జీటీ ఉత్తర్వులు(స్టే) ఇచ్చింది. తద్వారా జగన్ రాయలసీమకు తీరని ద్రోహం చేశారు' అని విరుచుకుపడ్డారు. అవినీతి కరపత్రికలో అబద్ధాలు అచ్చేసినంత మాత్రాన రాష్ట్ర ప్రజలు జగన్‌ను నమ్మే పరిస్థితిలేదని వ్యాఖ్యానించారు. ఆదివారం ఆయన ఓ వీడియో సందేశం విడుదల చేశారు. 'నీళ్లు కావాలా? గొడవలు కావాలా అంటే మేం నీళ్లే కావాలంటాం.. కాళేశ్వరం నుంచి నీటిని తెలంగాణ ఉపయోగిస్తున్నప్పుడు.. దిగువన ఉన్న పోలవరం ద్వారా ఆంధ్రప్రదేశ్ నీరు వాడుకుంటే తప్పేంటి? ప్రతి ఏడాది 3 వేల టీఎంసీలు సముద్రంలో కలుస్తుంటే.. అందులో 200 టీఎంసీల వినియోగించుకుంటే అభ్యంతరం ఎందుకు?' అని ప్రశ్నించారు. 'రాయలసీమలో నీటిపారుదల ప్రాజెక్టులకు తన ఐదేళ్ల పాలనలో జగన్ కేటాయించింది రూ.2 వేల కోట్లు మాత్రమే. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిన్నరలోనే రూ.8 వేల కోట్లు సీమ ప్రాజెక్టులకే ఖర్చు పెట్టాం. పుంగనూరు బ్రాంచి కెనాల్ 738 కిలోమీటర్ వరకు, మడకశిర బ్రాంచి కెనాల్ 493 అమరాపురం చెరువు వరకు కృష్ణా జలాల్ని తీసుకెళ్లిన ఘనత చంద్రబాబుదే. శ్రీశైలందేవరయం తర్వాత.. చంద్రబాబు హయాంలోనే రాయలసీమ చెరువుల్లో జలకళ సంతరించుకుంది. నిజానికి, నిరంతరం, నిబద్ధతతో నీటి వెత్త నిర్వహణ చంద్రబాబు.. అబద్ధాలు, అభూత కల్పనలకు ప్యాంటు చొక్కా వేస్తే జగన్ అని విమర్శించారు.

డబ్బులు రిఫండ్ చేయండి..
పరిహారం చెల్లించండి

గచ్చిబౌలి ఏఐజీ ఆసుపత్రిని ఆదేశించిన జిల్లా వినియోగదారుల కమిషన్

ఈనాడు, హైదరాబాద్: మందుల బిల్లులపై అధిక ఛార్జీలు వసూలు చేశారంటూ గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రిపై అందిన ఫిర్యాదుపై రంగారెడ్డి జిల్లా వినియోగదారుల కమిషన్ తీర్పు వెలువరించింది. ఫిర్యాదుదారుకు రూ.3,50,775.. 9 శాతం వడ్డీతో రిఫండ్ చేయడంతోపాటు రూ.30 వేల పరిహారం, కేసు ఖర్చుల కింద రూ.10,000 చెల్లించాలని ఆదేశించింది. వినియోగదారుల సంక్షేమ నిధికి రూ. లక్ష చెల్లించాలని పేర్కొంది. ఏపీలోని మాచర్లకు చెందిన ఎం.శివనారాయణ ఫిర్యాదులో తెలిపిన వివరాల ప్రకారం.. కిడ్నీ సమస్యతో బాధపడుతున్న తన భార్యను చికిత్స నిమిత్తం 2022లో గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రిలో చేర్పించారు. ఆ సమయంలో మెరోపెనెమ్ 1జీఎం ఇంజక్షన్ మొత్తం 79 డోసులు ఇచ్చారు. ప్రతి డోసుకు రూ.4,750.19 ఛార్జ్ వేశారు. బయట అదే ఇంజక్షన్ రూ.700కే కొనుగోలు చేశానంటూ.. ఫిర్యాదుదారు వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. ఫిర్యాదుదారు ఆరోపణలు అవాస్తవమని ఏఐజీ తరఫు అడ్వకేట్ వాదనలు వినిపించారు. మెరోపెనెమ్ 1జీఎం ఇంజక్షన్‌ను రూ.4,730-రూ.4,750కు ఆసుపత్రి కొనుగోలు చేసిందని.. అదే ధర రోగికి ఛార్జ్ చేసిందని తెలిపారు. వాదనలు విన్న వినియోగదారుల కమిషన్.. ఫిర్యాదుదారుకు పరిహారం చెల్లించాలని ఆదేశించింది.

ఎమర్జెన్సీ నా జీవితాన్ని మలుపు తిప్పింది

- సభల్లో పూలకు బదులు పుస్తకాలు ఇవ్వండి
- విజయవాడ పుస్తక మహోత్సవంలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



'ముక్కలైన స్వాతంత్ర్యం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, చిత్రంలో వల్లీశ్వర్, ఎమెస్కో విజయ్‌కుమార్, రచయిత రామ్‌మాధవ్, ఆర్‌ఎస్‌ఎస్ ఏపీ ప్రచారక్ ఆదిత్య, పార్థసారథి

ఈనాడు, అమరావతి: 'రాజ్యాంగం ప్రజాస్వామ్య జీవన విధానానికి పునాది.. దాన్ని పట్టుకుని తిరిగినా.. పూజించినా ఫలితం లేదు.. రాజ్యాంగ స్ఫూర్తిని గ్రహించి.. ఆచరించినప్పుడే ఫలితం దక్కుతుంది. హక్కులతో పాటు బాధ్యతలు తెలుసుకుని సక్రమంగా నిర్వహించాలి. ఎవరి పని వారు సవ్యంగా చేయడమే నిజమైన దేశభక్తి' అని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. విజయవాడలో జరుగుతున్న పుస్తక మహోత్సవంలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. వివిధ స్టాళ్లను పరిశీలించారు. రచయిత రామ్‌మాధవ్ రచించిన 'ముక్కలైన స్వాతంత్ర్యం', 'మన రాజ్యాంగం-మన ఆత్మగౌరవం' పుస్తకాల తెలుగు అనువాదాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'ఈ రోజుల్లో సత్యానికి దగ్గరగా.. సంచలనానికి దూరంగా ఉండి ప్రజలకు జ్ఞానాన్ని అందించే పుస్తకాలు చాలా తక్కువగా వస్తున్నాయి. ఈ రెండు పుస్తకాల్లో ఆ సుగుణాలు కనిపించాయి. రామ్‌మాధవ్ దేశ విభజన ముందు జరిగిన పరిణామాలు, మత మార్పిళ్లు, జిన్నా ప్రవర్తనలో మార్పులు, ముస్లిం లీగ్ ఏర్పాటు, మత ప్రాతిపదికన దేశాన్ని చీల్చడం, వంటి అనేక అంశాలను కూలంకషంగా వివరించారు. మత ప్రాతిపదికన దేశం విడిపోయినా ఎందరో ముస్లింలు దేశంలోనే ఉన్నారు. వారంతా నా దృష్టిలో జాతీయవాదులే. ఈ పుస్తకాలను అందరూ చదవాలి' అని వెంకయ్య నాయుడు సూచించారు. 'కాంగ్రెస్ ప్రభుత్వం ఎమర్జెన్సీ రూపంలో ప్రజలను ఇబ్బందులు పెట్టింది. ఆ పరిణామం నా జీవితాన్ని మార్చింది. విద్యార్థి నాయకుడిగా ఉన్న నన్ను 18 నెలలు జైల్లో పెట్టారు. దీంతో నేను రాజకీయాల వైపు చూశాను. దేశంలోనే రెండో అత్యున్నత పదవిని వరించే స్థాయికి వెళ్లాను' అని గుర్తు చేసుకున్నారు.

పుస్తకం హస్తభూషణం..

'సభలు, సమావేశాలకు వెళ్లినప్పుడు శాలువాలు, పుష్పగుచ్ఛాలు, పూలమాలలు ఇస్తున్నారు. వీటివల్ల ప్రయోజనం లేదు. పుస్తక మహోత్సవంలో పుస్తకాలు ఇవ్వడం బాగుంది. ఇదే సంప్రదాయం అన్ని సభల్లోనూ రావాలి. వంద ఊర్లు తిరిగినా తెలుసుకోలేని విషయాలు ఒక్క పుస్తకం చదివి తెలుసుకోవచ్చు. అందుకే పుస్తకం హస్తభూషణం అంటారు. ప్రతి గ్రామంలో గ్రంథాలయాలు, సేవాలయాలు, దేవాలయాలు ఉండాలి. వీటి ఏర్పాటుకు సేవా సంఘాలు, ప్రవాస భారతీయులు ముందుకు రావాలి' అని వెంకయ్యనాయుడు అన్నారు

అంబేడ్కర్ రాజ్యాంగ రచనలో కీలకం..

పుస్తక రచయిత రామ్‌మాధవ్ మాట్లాడుతూ, '1905లో బెంగాల్‌ను మతం పేరుతో విభజిస్తే దేశం అట్టుడికింది. బ్రిటిష్ ప్రభుత్వమే ఈ నిర్ణయం తప్పు అని ఒప్పుకుని వెనక్కి తీసుకుంది. రాష్ట్రాన్ని విడదీస్తేనే తట్టుకోలేని భారతీయులు 1947లో మతం పేరుతో దేశాన్నే చీల్చినా అంగీకరించారు. ఆ మధ్య సమయంలో ఏ పరిణామాలు ఈ మార్పులో కీలక భూమిక పోషించాయి అనే విషయాలను 'ముక్కలైన స్వాతంత్ర్యం' పుస్తకంలో ఆవిష్కరించాను' అని తెలిపారు. 'రాజ్యాంగం రూపొందించడంలో జరిగిన కృషి.. అంబేడ్కర్ పాత్ర, పీఠికలో గాంధీ పేరు మొదటపెట్టి తర్వాత తొలగించాల్సి రావడం వంటి అనేక పరిణామాలు 'మన రాజ్యాంగం.. మన ఆత్మగౌరవం' పుస్తకంలో వివరించా' అని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ ఏపీ ప్రచారక్ ఆదిత్య, ఈ పుస్తకాలను తెలుగులోకి అనువదించిన వల్లీశ్వర్, పార్థసారథి, పుస్తక మహోత్సవ నిర్వాహకులు పాల్గొన్నారు.

అభివృద్ధి మార్గంలో భోగాపురం ఓ మైలురాయి: జగన్

ఈనాడు, అమరావతి: భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో తొలి విమానం విజయవంతంగా ల్యాండింగ్ కావడం ఏపీ అభివృద్ధి మార్గంలో ఓ మైలురాయి అని వైకాపా అధినేత జగన్ తెలిపారు. విమానాశ్రయం నిర్మాణంలో అసాధారణ ప్రతిభ చూపిన జీఎంఆర్ గ్రూపునకు ఎక్స్ వేదికగా ఆయన అభినందనలు తెలిపారు.

ప్రజలకు జగన్ క్షమాపణ చెప్పాలి: మంత్రి కొండపల్లి

ఈనాడు, విజయనగరం: భోగాపురం విమానాశ్రయం విషయంలో మాజీ సీఎం జగన్ ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నారని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుర్ర లేనోళ్లే భోగాపురం విమానాశ్రయం నిర్మిస్తారని గతంలో వ్యాఖ్యానించిన జగన్.. నేడు ఉత్తరాంధ్ర ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండు చేశారు. ఆదివారం విమానాశ్రయం ఆవరణలో మాట్లాడారు.

'భోగాపురం'పై నిస్సిగ్గుగా జగన్ అబద్ధాలు

ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడి ధ్వజం

ఈనాడు, దిల్లీ: భోగాపురం విమానాశ్రయాన్ని తానే నిర్మించినట్లు మాజీ సీఎం జగన్ నిస్సిగ్గుగా అబద్ధాలు చెబుతున్నారని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ధ్వజమెత్తారు. ఎన్నికల ముందు హడావుడిగా కొబ్బరికాయ కొట్టడం తప్పితే ఇంకేమీ చేయని జగన్.. ఇప్పుడు చంద్రబాబు కష్టంతో సాధించుకున్న క్రెడిట్‌ను దోచుకోవడానికి తన బరితెగింపుతనాన్ని మరోసారి బయటపెట్టుకున్నారని మండిపడ్డారు. ఆయన ఆదివారం ఇక్కడ విలేకర్లతో మాట్లాడారు. "భోగాపురం వద్ద అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మించాలని ప్రణాళిక రచించి, అందుకుతగ్గ భూసేకరణను చంద్రబాబు పూర్తిచేస్తే జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత కోర్టు కేసులు, వివాదాలు సృష్టించి ఆ ప్రాజెక్టును మూలన పడేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు భోగాపురం ఎయిర్‌పోర్టు అవసరమా? చెన్నై, ముంబయి విమానాశ్రయాలకే తక్కువ భూమి ఉన్నప్పుడు ఇక్కడ వేల ఎకరాలెందుకని రైతులను రెచ్చగొట్టి ప్రాజెక్టును అడ్డుకున్నారు. నాడు వద్దన్న నోటితోనే నేడు ఈ ప్రాజెక్టు తన గొప్పతనం అని చెప్పుకోవడానికి సిగ్గనిపించడం లేదా? ఈ విమానాశ్రయానికి చంద్రబాబు శ్రీకారం చుడితే నాటి పౌరవిమానయాన శాఖ మంత్రిగా ఉన్న ఉత్తరాంధ్ర పెద్ద దిక్కు అశోక్ గజపతిరాజు కేంద్రం నుంచి అనుమతులు ఇప్పించారు. మాన్సాస్ ట్రస్ట్ ద్వారా కోట్ల రూపాయల విలువైన 120 ఎకరాల భూమిని ఏవియేషన్ ఎడ్యుసిటీ కోసం దానంగా ఇచ్చి తన మహోన్నత వ్యక్తిత్వాన్ని చాటుకున్నారు. ఇప్పటికైనా ఇతరుల క్రెడిట్‌ను దోచుకోవాలన్న కుటిలయత్నాలను జగన్ మానేసి, ఉత్తరాంధ్రకు చేసిన అన్యాయానికి ఇప్పటికైనా అక్కడి ప్రజలకు క్షమాపణలు చెప్పాలి" అని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు డిమాండ్ చేశారు.

గన్నవరం విమానాశ్రయానికి నిరంతరాయంగా విద్యుత్

నేడు కొత్త సబ్‌స్టేషన్‌ను ప్రారంభించనున్న మంత్రి గొట్టిపాటి

ఈనాడు, అమరావతి: గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయానికి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేసేందుకు వీలుగా రూ.30.65 కోట్లతో నిర్మించిన 132/33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం ప్రారంభించనున్నారు. ఈ మేరకు ఇంధన శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. 'విద్యుత్ మౌలిక సదుపాయాలను పెంచడంలో భాగంగా గన్నవరం విమానాశ్రయం దగ్గర దీన్ని నిర్మించాం. ఇక్కడ ఏటీసీ టవర్ నిర్మాణంలో ఉంది. విమానాశ్రయ విస్తరణ పనులూ జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో పట్టణ, పారిశ్రామికాభివృద్ధి పెరుగుతోంది. వాటికి అవసరమైన విద్యుత్ మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేస్తున్నాం" అని పేర్కొంది.

తొలిదశలో గుర్తిస్తే.. చికిత్స వారం రోజులే

ప్రపంచవ్యాప్తంగా ఏటా సుమారు 10 లక్షల మంది స్క్రబ్ టైఫస్ బారినపడుతున్నట్లుగా అధ్యయనాలు చెబుతున్నాయని డాక్టర్ ఎంవీ రావు పేర్కొన్నారు. "మన దేశంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్, తమిళనాడు, పుదుచ్చేరి, సిక్కిం తదితర రాష్ట్రాల్లో కేసులు నమోదవుతున్నాయి. జ్వరం వచ్చిన తొలిరోజుల్లోనే ఇతర జ్వర కారక పరీక్షలతో పాటు.. స్క్రబ్ టైఫస్ పరీక్ష చేయించుకోకపోవడమే ముప్పునకు మూల కారణం. గతంలో గ్రామాల్లో ఎక్కువగా ఈ కేసులు కనిపించేవి. ఇటీవల పట్టణాల్లోనూ కనిపిస్తున్నాయి. గడ్డి నేలపై.. ఇసుక దిబ్బల్లో పడుకున్నప్పుడు ఈ పురుగు కుట్టే అవకాశాలున్నాయి.

సిగరెట్‌తో కాల్చినట్లుగా మచ్చ

అధిక జ్వరం, కండరాల నొప్పులు, తీవ్రమైన తలనొప్పి, దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, వాంతులు, బలహీనత వంటి సాధారణ లక్షణాలతోనే ఈ వ్యాధి మొదలవుతుంది. సకాలంలో గుర్తించకపోతే.. ప్రాణాంతకంగా మారుతుంది. అన్ని అవయవాల పనితీరును దెబ్బతీస్తుంది. కొద్దిమందిలో ఇది కుట్టిన దగ్గర.. సిగరెట్‌తో కాల్చితే ఎలా మచ్చ పడుతుందో.. అలా ఏర్పడుతుంది. ఇక్కడి నుంచి బ్యాక్టీరియా లింఫ్ నోడ్స్‌కు వ్యాప్తి చెందుతుంది. ముఖ్యంగా తొడలు, బాహువులు, మెడ, జననేంద్రియ ప్రాంతాల్లో ఎక్కువగా ఈ మచ్చ కనిపిస్తుంది. కొంతమందిలో కనపడదు" అని డాక్టర్ ఎంవీ రావు తెలిపారు.



నిర్ధారణ ఇలా..

వ్యాధి నిర్ధారణకు చాలామంది సీఆర్‌పీ టెస్ట్ చేస్తుంటారు. నిజానికి సీఆర్‌పీ అనేది అన్ని సందర్భాల్లో అవసరం లేదు. ఇది ఇన్‌ఫ్లమేషన్ గురించి చెబుతుందే తప్ప.. జబ్బు నిర్ధారణ పరీక్ష కాదు. ఈ జబ్బును నిర్ధారించడానికి ఇమ్యునోక్రోమటోగ్రఫిక్ టెస్ట్ (ఐసీటీ) చేస్తారు. యాంటీబాడీ ఎలీసా చేస్తారు. ఇది అత్యంత విశ్వసనీయ పరీక్ష. ఈ టెస్ట్ ఇప్పుడు అన్ని చోట్లా అందుబాటులో ఉంది.



సకాలంలో చికిత్స అందకపోతే?

"ఈ పొద పురుగు కుట్టిన 7-10 రోజుల్లో లక్షణాలు కనిపిస్తాయి. జ్వరం వచ్చినప్పుడు.. మామూలుగా మలేరియా, టైఫాయిడ్, డెంగీ తదితర పరీక్షలన్నీ చేస్తారు. చాలా సందర్భాల్లో టైఫాయిడ్‌కు ఫాల్స్ పాజిటివ్ వస్తుంటుంది. దీంతో టైఫాయిడ్‌కు మందులు వాడి.. స్క్రబ్ టైఫస్‌ను వదిలేస్తారు. వ్యాధి ముదిరితే సాధారణంగా ఇచ్చే యాంటీ బయాటిక్స్ పనిచేయవు. జ్వరం తగ్గదు. 5-7 రోజులు గడిచేసరికి నెమ్మదిగా అన్ని అవయవాలపై దుష్ప్రభావం చూపిస్తుంది. గుండె, కిడ్నీ, కాలేయం, మెదడు, ఊపిరితిత్తుల పనితీరును దెబ్బతీస్తుంది. ఊపిరి తీసుకోవడంలో ఉక్కిరిబిక్కిరి, శ్వాసకోశాల్లో నీరు చేరడం, రక్తపోటు పడిపోవడం, కిడ్నీలు, కాలేయం పనితీరు దెబ్బతినడం వంటి ప్రమాదకర సమస్యలు తలెత్తుతాయి. ముఖ్యంగా 60 ఏళ్లు పైబడిన వారిలో, గర్భిణుల్లో తీవ్రత అధికంగా ఉంటుంది. అక్యూట్ రెస్పిరేటరీ డిస్ట్రెస్ సిండ్రోమ్(ఏఆర్‌డీఎస్) బారినపడిన వారిలోనూ ప్రమాదం ఎక్కువ. సకాలంలో ఈ జబ్బును గుర్తించి చికిత్స అందిస్తే.. త్వరగా తగ్గుముఖం పడుతుంది. డాక్సీసైక్లిన్, అజిత్రోమైసిన్ వంటి సాధారణ యాంటీ బయాటిక్స్‌తో నయమవుతుంది. పిల్లలు, గర్భిణులకు అజిత్రోమైసిన్ ఐదు రోజులు పాటు ఇవ్వాలి. మిగిలిన వారికి డాక్సీసైక్లిన్ వారం రోజులు ఇవ్వచ్చు. తొలిదశలో గుర్తిస్తే.. దీనికి చికిత్స వారం రోజులే" అని డాక్టర్ ఎంవీ రావు వివరించారు.

- ఈనాడు, హైదరాబాద్

ఎవరిలో ఈ జబ్బు ఉన్నట్లు అనుమానించాలంటే..



- జ్వరం మూణ్నాలుగు రోజులైనా తగ్గకపోతే.
- ప్లేట్‌లెట్లు కూడా తగ్గితే.
- శ్వాస సమస్యలతో పాటు.. కళ్లలో పసుపు రంగు కనిపిస్తుంటే.
- తెల్ల రక్తకణాలు పెరిగితే.
- బహుళ అవయవాల సమస్యలు తలెత్తితే.

పొదలు, గడ్డి ప్రదేశాల్లో జాగ్రత్తలు ముఖ్యం

- పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి.
- పొలాలు, అడవులు, పొదలు, పార్కుల్లో పనిచేసేవారు, ఆ ప్రదేశాలకు వెళ్లినవారు శరీరాన్ని కప్పి ఉంచే దుస్తులు ధరించాలి.
- పాదాలకు రక్షణగా సాక్సు బూట్లు వేసుకోవాలి.
- పొలాలు, పార్కుల్లో కూర్చునే ముందు.. దుప్పటి వంటిది కింద పరుచుకోవాలి.
- శరీరంపై ఏదైనా పురుగు పాకుతున్నట్లు అనిపిస్తే వెంటనే దులిపేసుకోవాలి.
- ఇంటికొచ్చాక దుస్తులను గట్టిగా దులపాలి. పురుగులను గుర్తిస్తే వేడి నీటిలో ఉతకాలి.
- శరీరంపై తడి ఉండకుండా చూసుకోవాలి.
- ఇళ్లలో, పరిసరాల్లో పొదలు, గడ్డి దట్టంగా పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- ఈ పురుగులు ఎలుకల శరీరానికి అతుక్కుని జీవించే అవకాశం ఉంటుంది. అందుకే ఇంట్లో ఎలుకలు లేకుండా చూసుకోవాలి.
- పెంపుడు జంతువులు బయట తిరిగి వస్తే వాటి శరీరంపై కూడా పురుగులున్నాయేమో పరిశీలించాలి.

భారీగా విస్తరించిన సూర్య నెట్‌వర్క్

అద్దె ఖాతాల కేసులో మిగిలిన వారి కోసం గాలింపు

ఈనాడు, అమరావతి: బ్యాంకు ఖాతాలను తెరిపించి, ఆ వివరాలను ఫిలిప్పీన్స్‌కు పంపిస్తున్న ముఠా నెట్‌వర్క్ విజయవాడలోనే కాకుండా పలు జిల్లాలకు విస్తరించినట్లు తెలిసింది. ఈ గ్యాంగ్ మూలాలను ఛేదించేందుకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇప్పటి వరకు 199 బ్యాంకు ఖాతాలను గుర్తించారు. ఈ ఖాతాదారుల చిరునామాలను తీసుకుని, వారిని పిలిపించి విచారించనున్నారు. మరింత మందితో కరెంట్ ఖాతాలను తెరిపించి, వాటిని ఫిలిప్పీన్స్‌కు పంపే పనిలో నిందితులు ఉన్నట్లు తెలిసింది. ప్రధాన నిందితుడు సూర్య చాలా జిల్లాల్లో పలువురిని ఏజెంట్లుగా నియమించుకున్నాడు. వారి ద్వారా డబ్బు ఆశ చూపించి అమాయకులకు గాలం వేసి ఖాతాలు తెరిపిస్తున్నాడు. ఆదివారం ఉదయం నిందితులు సూర్య శ్రీనివాస మణికంఠ, కృష్ణారెడ్డి, సౌభాగ్యలక్ష్మిని మూడో ఏసీజేఎం కోర్టు న్యాయాధికారి తిరుమలరావు నివాసంలో పోలీసులు హాజరుపరచగా.. ఈనెల 16 వరకు రిమాండ్ విధించారు. అనంతరం వారిని కారాగారానికి తరలించారు.

ప్రతి ఖాతాకు రూ.20 వేల కమీషన్


కరెంటు ఖాతా వివరాలు ఫిలిప్పీన్స్‌లో ఉన్న మహిళకు చేరగానే.. సూర్యకు ఒక్కోదానికి రూ.20 వేలు కమీషన్‌గా అందేది. ఈ కేసులో పరారీలో ఉన్న మరో నిందితురాలు పార్వతికి, ఫిలిప్పీన్స్‌కు టెలిగ్రామ్ ద్వారా వివరాలు పంపించేవాడు. నిందితుల ఖాతాలు, లావాదేవీలను పోలీసులు పరిశీలిస్తున్నారు. సూర్య.. మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేరున ఎమ్మెల్యే స్టిక్కర్‌ను తెనాలిలో సంపాదించాడు. తెనాలి వెళ్లినప్పుడు అక్కడ షేక్ వాషిద్‌కు చెందిన కార్ల ఏజెన్సీలో కారును అద్దెకు తీసుకునేవాడు. ఆ సమయంలో కారులో ఎమ్మెల్యే స్టిక్కర్లు చూశాడు. వాషిద్‌ను అడిగి ఒక స్టిక్కర్‌ను తీసుకున్నాడు. వాషిద్ సోదరుడు గతంలో ఎమ్మెల్యే వద్ద పనిచేసినట్లు గుర్తించారు. తన పేరున ఉన్న స్టిక్కర్ గురించి విచారించాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్, నగర సీపీని కోరినట్లు తెలిసింది.

విద్యావాడనే సృష్టించిన.. సిద్ధార్థ!

- విజయవాడ కేంద్రంగా వెలిసి.. 50 ఏళ్లలో లక్షల మందిని తీర్చిదిద్దిన సంస్థ
- విద్యా చైతన్యం తీసుకురావడమే లక్ష్యంగా ఏర్పాటు
- స్వర్ణోత్సవాల్లో 'సిద్ధార్థ అకాడమీ'



1975లో ఏర్పాటు చేసిన తొలి సిద్ధార్థ కళాశాల



స్వర్ణోత్సవ లోగో



సిద్ధార్థ అకాడమీ కార్యాలయం

ఈనాడు, అమరావతి: సమాజంలో లాభాపేక్ష లేకుండా విద్యా వ్యాప్తి చేయాలని 5 దశాబ్దాల కిందట చేసిన ఓ ఆలోచనే.. నేటి సిద్ధార్థ అకాడమీ. 50 ఏళ్ల తన ప్రస్థానంలో లక్షల మందిని ఉన్నత స్థానాల్లో కూర్చోబెట్టి, నేడు సగర్వంగా స్వర్ణోత్సవాలు నిర్వహించుకుంటోంది. అకుంఠిత దీక్ష క్రమశిక్షణకు తోడు.. అత్యుత్తమ విధానాలతో సమాజంలో ప్రత్యేక స్థానం నిలుపుకొంది. లాభాపేక్ష లేకుండా అన్నిరకాల విద్యాసంస్థలను స్థాపించి.. విజయవాడను విద్యావాడగా మార్చింది. 1974లో విజయవాడలో అరకొరగా ఉన్న విద్యా సంస్థల్లో సీట్లు దొరక్క విద్యార్థులు ఇబ్బంది పడుతుండడంతో నగరానికి చెందిన ప్రముఖులు వై.వి.రావు, ఎం.సుబ్బారావు కలిసి కళాశాలను ఏర్పాటు చేయాలని భావించారు. నగర ప్రముఖులు సంఘంగా ఏర్పడి.. పేద, మధ్య తరగతికి చదువులు చేరువ చేయాలనేది వారి లక్ష్యం. అదే స్ఫూర్తితో ఆ రోజుల్లో విజయవాడలోని ప్రముఖ వైద్యులు పిన్నమనేని వెంకటేశ్వరరావును సంప్రదించారు. ఆయన సూచన మేరకు 'అకాడమీ ఆఫ్ జనరల్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్' పేరుతో వెంకటేశ్వరరావు అధ్యక్షుడిగా, వై.వి.రావు కార్యదర్శిగా, ఎం.సుబ్బారావు కోశాధికారిగా సొసైటీని రిజిస్ట్రేషన్ చేశారు. ఇక్కడే అకాడమీకి బీజం పడింది. ఆ తర్వాత నాటి ఉమ్మడి రాష్ట్ర హైకోర్టు సీజే జస్టిస్ ఆవుల సాంబశివరావు, ప్రముఖ పత్రికా సంపాదకులు నార్ల వెంకటేశ్వరరావు సూచన మేరకు పేరులో 'అకాడమీ' ముందు 'సిద్ధార్థ' అని స్థిరపడింది. అలా.. 1975లో మొగల్రాజపురంలో 'సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్' ఏర్పాటు చేశారు. ఇది 'పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ..' పేరుతో కొనసాగుతోంది.

క్రమశిక్షణకు మారుపేరు

అప్పట్లో వంద మంది తలా రూ.10 వేలు వేసి, సొసైటీగా ఏర్పడి విద్యాసంస్థను ఆరంభించాలనుకున్నారు. ఊహించని విధంగా 250 మంది సభ్యులుగా చేరారు. జీవితకాల సభ్యులుగా ఉన్న వీరంతా అకాడమీ లాభం ఆశించకూడదనే నిబంధన పెట్టుకొని, నేటికీ ఆచరిస్తున్నారు. ఈ స్ఫూర్తితోనే 1981లో అకాడమీ ఏర్పాటు చేసిన విజయవాడలోని సిద్ధార్థ ప్రభుత్వ వైద్య కళాశాలను నాటి సీఎం ఎన్టీ రామారావు సూచన మేరకు ప్రభుత్వానికి అప్పగించారు. సిద్ధార్థ విద్యా సంస్థల పర్యవేక్షణకు జీవితకాల సభ్యుల నుంచి మూడేళ్లకోసారి 21 మందితో పాలకవర్గాన్ని ఎన్నుకుంటారు. అధ్యాపకుల నియామకాల నుంచి విద్యావిధానాల వరకూ ప్రతి విషయంలోనూ క్రమశిక్షణకే పెద్దపీట వేస్తున్నారు.

విద్యా వృక్షం


ప్రస్తుతం సిద్ధార్థ విద్యా వృక్షం కింద మూడేసి ఇంటర్, డిగ్రీ, పీజీ కళాశాలలు, రెండు పాఠశాలలు, ఇంజినీరింగ్ కళాశాలలు, మెడికల్, డెంటల్, ఫార్మసీ, హోటల్ మేనేజ్‌మెంట్, బీఈడీ, న్యాయ, నర్సింగ్‌లో డిప్లొమా, డిగ్రీ కళాశాలలున్నాయి. 2024 నుంచి సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్.. డీమ్డ్ విశ్వవిద్యాలయం కూడా వచ్చింది. ఈ విద్యా సంస్థలన్నింటిలో కలిపి మొత్తం 28 వేల మంది విద్యాభ్యాసం చేస్తున్నారు.

ఉన్నత లక్ష్యాలతో ముందుకు..

– పాలడుగు లక్ష్మణరావు, సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి

ఇప్పటి వరకు సిద్ధార్థ విద్యా సంస్థల నుంచి వెయ్యి బ్యాచ్‌లలో లక్షల మంది విద్యార్థులు చదువులు పూర్తి చేసుకున్నారు. ఉన్నత లక్ష్యాలతో ఆరంభించి, ఉత్తమ విలువలతో కొనసాగిస్తున్న సంస్థ ఇది. అన్ని ప్రధాన దేశాల్లోనూ మా విద్యార్థులున్నారు.

కొత్త పని అంటే భయపడుతున్నారా?



ఓ కొత్త పని మొదలుపెట్టేముందు మీకు భయంగా అనిపించొచ్చు. అంతమాత్రాన మీకు ఆ పని చేసే సామర్థ్యం లేదని కాదు. ఇంతకు ముందు మీరు అలాంటి ప్రయత్నం చేయలేదని మాత్రమే అర్థం. మీ మీద మీకు నమ్మకం కుదిరేవరకూ ఎదురుచూస్తూ కూర్చుంటే ఆ పనిని ఎప్పటికీ మొదలుపెట్టలేరు. కాబట్టి ధైర్యంతో ముందడుగు వేసి పనిచేసుకుంటూ పోతుంటే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.

– వేరా జో బస్టోస్, మెంటల్ పెర్ఫార్మన్స్ కోచ్

న్యాయవాదులకు మార్గదర్శి సీతారామయ్య

- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీనరసింహ

ఈనాడు, విశాఖపట్నం; న్యూస్‌టుడే, విశాఖ లీగల్: 'వృత్తిని ఎడమ చేత్తో, ధర్మ కార్యం కుడి చేత్తో చేయాలని మా నాన్న జస్టిస్ కోదండరామయ్య చెప్పే వారు. అదే దివంగత న్యాయవాది సీతారామయ్య చేసి, చూపించారు' అని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీనరసింహ అన్నారు. ఆదివారం విశాఖ జిల్లా కోర్టు ఆవరణలో ప్రముఖ న్యాయవాది, దివంగత ఎంకే సీతారామయ్య(ఎంకేఎస్) చిత్రపటం ఆవిష్కరణకు జస్టిస్ శ్రీనరసింహ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సీతారామయ్య విలువలతో కూడిన 200 మంది జూనియర్ న్యాయవాదులను తయారు చేశారన్నారు. ఒక వ్యక్తి కన్నుమూసినా ఆయన కీర్తి గురించి మాట్లాడుకోవడమే కాకుండా, చిత్రపటం ఆవిష్కరణను ఊరి పండగలా నిర్వహించడం అసాధారణ విషయమని పేర్కొన్నారు. 'స్వతంత్ర భారతావనిని ముందుకు తీసుకెళ్లడంలో ఆయన వంద శాతం కృషి చేశారు. 'జయంతి తే సుకృతినో రససిద్ధాః కవీశ్వరః' (ఎవరైతే మంచి పనులు చేస్తారో వారి కీర్తికి ఎప్పటికీ మరణ భయం లేదు) అనే కాళిదాసు శ్లోకం ఆయనకు సరిగ్గా సరిపోలుతుందని నా భావన. ఆయన వ్యక్తిగత జీవితం, క్రీడలు, వృత్తి జీవితానికి పూర్తి న్యాయం చేశారని అర్థమవుతోంది'' అని పేర్కొన్నారు. 'ప్రాక్టీసు చేస్తున్నప్పుడు సహచరులతో ఎలా ప్రవర్తించాలనే దానికి ఎంకేఎస్ ఒక ఉదాహరణ. మంచివారని, సహాయ బుద్ధి ఉన్న వారని అందరూ చెబుతున్నారు. తన బాధ్యతలు చూసుకుంటూ, సాయం చేస్తూ అందరికీ మార్గదర్శకంగా నిలిచారు. బార్ అసోసియేషన్‌కు 3 సార్లు అధ్యక్షుడిగా పనిచేశారు. క్రీడా అసోసియేషన్లు, ఆర్య వైశ్య సంఘానికి సేవలందించారు' అని జస్టిస్ శ్రీనరసింహ ప్రశంసించారు.



దివంగత సీనియర్ న్యాయవాది ఎంకే సీతారామయ్య చిత్రపటం ఆవిష్కరణలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీనరసింహ, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సీహెచ్ మానవేంద్రనాథ్‌రాయ్, జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ రవి చీమలపాటి, జస్టిస్ వి.శ్రీనివాస్, జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప, జస్టిస్ వి.గోపాలకృష్ణారావు, జస్టిస్ హరిహరనాథశర్మ, జస్టిస్ తుహిన్‌కుమార్, విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్ రాజు, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎం.కె.శ్రీనివాస్, రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఎస్.కృష్ణమోహన్ ★ కార్యక్రమానికి హాజరైన న్యాయమూర్తులు, న్యాయవాదులు

స్ఫూర్తి పొందాలి..

న్యాయవాది సీతారామయ్య సేవలను ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు కొనియాడారు. జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ మాట్లాడుతూ.. 'బార్ అసోసియేషన్‌లో సీనియర్ న్యాయవాదుల చిత్రపటాలు చూసి జూనియర్లు స్ఫూర్తి పొందాలి. న్యాయవాదులు పేదలకు న్యాయం అందించాలి. న్యాయమూర్తి ఎదుట ఎలా ప్రవర్తించాలో నేర్చుకోవాలి' అని తెలిపారు. జస్టిస్ బట్టు దేవానంద్ మాట్లాడుతూ న్యాయవాద వృత్తిలో ఎంకేఎస్ తన గురువు అని, ఆయనో బ్రాండ్ అని పేర్కొన్నారు. జస్టిస్ రవి చీమలపాటి మాట్లాడుతూ జూనియర్ న్యాయవాదులు ఎంకేఎస్‌ను అనుసరించాలన్నారు. జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప మాట్లాడుతూ న్యాయ వ్యవస్థకు సేవ చేసిన వ్యక్తిని సమాజం ఎప్పుడూ మరిచిపోదన్నారు. జస్టిస్ వి.శ్రీనివాస్.. సీతారామయ్య వాదనలు గుర్తు చేసుకున్నారు. జస్టిస్ హరిహరనాథశర్మ మాట్లాడుతూ ప్రవర్తనతో వేల మందిని ప్రభావితం చేయవచ్చనే దానికి ఎంకేఎస్ చక్కటి ఉదాహరణగా చెప్పుకొచ్చారు. సీతారామయ్య జూనియర్ న్యాయవాదులను ప్రోత్సహించేవారని జస్టిస్ గోపాలకృష్ణారావు తెలిపారు. 200 మంది న్యాయవాదులను తీర్చిదిద్దిన ఏకైక సీనియర్ న్యాయవాది సీతారామయ్య అని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గేదెల తుహిన్ కుమార్ కొనియాడారు.

'ఈనాడు'లో జస్టిస్ శ్రీనరసింహ ప్రసంగం చదివి

''ఆంగ్లంలో మాట్లాడాలని సిద్ధమై సభకు వచ్చా. ఆదివారం ఉదయం 'ఈనాడు' మొదటి పేజీలో జస్టిస్ శ్రీనరసింహ 'మాతృ భాషతోనే గౌరవం' అనే ప్రసంగం చదివి ఆలోచన మార్చుకున్నా. అందుకే తెలుగులో మాట్లాడుతున్నా'' అని బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వి.రవీంద్ర ప్రసాద్ వివరించారు.

◆ అనంతరం బార్ అసోసియేషన్ సభ్యులు.. జస్టిస్ శ్రీనరసింహ, హైకోర్టు న్యాయమూర్తులను సత్కరించారు. కార్యక్రమంలో హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కృపాసాగర్, విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్ రాజు, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎం.కె.శ్రీనివాస్, రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఎస్.కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ఎంకే శ్రీనివాస్ సభాధ్యక్షత వహించగా, సీతారామయ్య కుమారుడు సీనియర్ న్యాయవాది వెంకటేష్ వందన సమర్పణ చేశారు.

సిరులిచ్చే మన పంట.. వట్టివేరు

- విదేశీయులు గుర్తించి అధిక లాభాలు ఆర్జిస్తున్నారు
- వరిచేను గట్లపై అంతరపంటగానూ వేసుకోవచ్చు
- అంతర్జాతీయ మార్కెట్‌లో లీటరు నూనె రూ.28వేలు

'ఈనాడు' ముఖాముఖిలో శాస్త్రవేత్త ఎస్.కె.బాబు


వివిధ జిల్లాల నుంచి వచ్చినవారికి వట్టివేరు సాగుపై అవగాహన కల్పిస్తున్న ఎస్.కె.బాబు

ఈనాడు, అమరావతి, ఈనాడు డిజిటల్, మచిలీపట్నం, న్యూస్‌టుడే గూడూరు: 'వట్టివేళ్లు అనగానే చల్లటి గాలి వస్తుందని, కిటికీలకు ఉపయోగించే తెరలుగా వాడుతుంటారనే అనుకుంటారు. కానీ వాటి ప్రయోజనాలు.. సాగుతో వచ్చే లాభాలు చాలానే ఉంటాయి. అతి తక్కువ పెట్టుబడితో సిరులు కురిపించే పంటే వట్టివేరు' అని ఎకో గ్రీన్ యూనిట్ అధినేత, ప్రముఖ శాస్త్రవేత్త ఎస్.కె.బాబు పేర్కొన్నారు. తమిళనాడుకు చెందిన బాబు పదేళ్లుగా వట్టివేళ్ల సాగుపై పరిశోధనలు చేస్తున్నారు. కృష్ణాజిల్లా గూడూరు మండలం పినగూడురు లంకలోని సౌభాగ్య గోసదన్‌కు ఆయన ఇటీవల వచ్చారు. వట్టివేళ్లతో రైతులకు వచ్చే లాభాలు, మార్కెటింగ్, మెరుగైన సాగు విధానాల గురించి 'ఈనాడు' ముఖాముఖిలో ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. ఆయన మాటల్లోనే..

కొన్ని దేశాల్లో భారీ ఆదాయ వనరు

వట్టివేళ్లలో ఔషధగుణాలున్నాయి. వీటిని సుగంధద్రవ్యాలు, చర్మ ఆరోగ్యం, సౌందర్య ఉత్పత్తులు, ఆయుర్వేద ఔషధాల తయారీలో ఉపయోగిస్తారు. పొలాల గట్లపై అంతరపంటగా వట్టివేళ్లను వేసుకోవచ్చు. 10-12 నెలల్లో ఒక్కో మొక్క నుంచి కనీసం 3 కిలోల వేరు, కిలో గడ్డి వస్తాయి. కిలో వేళ్ల ధర రూ.250 ఉంటుంది. దీనినుంచి తీసే నూనె లీటరు ధర అంతర్జాతీయ మార్కెట్‌లో రూ.28వేలు. అనేక దేశాల్లో దీనికి జన్యుపరమైన మార్పులు జరిగాయి. ప్రస్తుతం హైతీ రకానికి చెందిన వట్టివేళ్లకు బాగా డిమాండ్ ఉంది. దీని గడ్డిని పొడిగాచేసి ఆహారంగా తినొచ్చు.

మనదైన పంటపై కొరవడిన అవగాహన

వట్టివేళ్ల సాగులో భారత్ ప్రపంచంలో ఆరోస్థానంలో ఉంది. మన దేశానికి చెందిన మొక్కే అయినా ఈ పంటపై అవగాహన లేక వెనుకపడ్డాం. మట్టి కోతకు గురికాకుండా, నీటిశుద్ధికి ఉపయోగపడుతుంది. ఉత్తర్‌ప్రదేశ్‌లో ఎక్కువ సాగు చేస్తున్నారు. థాయ్‌లాండ్ లాంటి దేశాల్లో నీటిశుద్ధికి నేటికీ దీన్నే ఉపయోగిస్తున్నారు. ఎకో గ్రీన్ యూనిట్ ద్వారా తొలుత శ్రీలంకలో వట్టివేళ్ల సాగు మొదలైంది. అక్కడ 150 గ్రామాల్లో పొలాలు, ఇంటి ఆవరణల్లో సాగు చేస్తూ.. మంచి ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు.


వట్టివేరు పెరిగే తీరు చూపిస్తున్న ఎస్.కె.బాబు

విక్రయానికి చెన్నై అనుకూలం

వట్టివేళ్ల ఉత్పత్తులను విక్రయించేందుకు లఖ్‌నవూకు ఎక్కువగా వెళ్తున్నారు. కానీ చెన్నై, బెంగళూరులోనూ డిమాండ్ ఉంది. చెన్నై దగ్గర కాబట్టి విక్రయానికి అనుకూలం. ఆయుర్వేద మందులు, సబ్బుల తయారీకి దీని పొడి ఉపయోగిస్తున్నారు.


వట్టివేళ్లతో తయారైన సబ్బు, సిరప్, ఆయుర్వేద పొడులు

సులభంగా పెంచుకోవచ్చు

వట్టివేళ్ల సాగుకు ఇసుక నేలలు బాగా అనుకూలం. ఎర్ర, నల్లమట్టి నేలల్లోనూ కొబ్బరిపీచు కలిపి సాగు చేయొచ్చు. సిమెంటు కుండీల్లోనూ పెంచొచ్చు. డ్రమ్ములు, ఇతర పాత్రల్లోనూ మిద్దెలపై, ఇంటి ఆవరణల్లో సాగు చేసుకోవచ్చు.

భూమిలోకి ఏడు అడుగులు

వట్టివేళ్లు సుమారు ఏడు అడుగుల మేర భూమి లోపలికి వెళ్తాయి. నాలుగు అడుగుల ఎత్తు, అడుగు వెడల్పుతో ఉండే సిమెంటు తొట్టెలో అడుగున నాలుగు అంగుళాల కంకర, దానిపై మట్టి, ఘన జీవామృతం, కొబ్బరిపీచు కలిపి వట్టివేళ్లు సాగుచేయొచ్చు. అంతరపంట కింద ఎకరాకు 810 కుండీలను పెట్టుకోవచ్చు.

విజయరాం సత్ఫలితాలు సాధించారు

సిమెంటు కుండీల్లో వట్టివేళ్లను సాగు చేస్తూ.. కృష్ణా జిల్లా పినగూడురులంకలోని సౌభాగ్య గోసదన్‌లో విజయరాం సత్ఫలితాలు సాధించారు. సిమెంటు కుండీల నుంచి వేళ్లను సులభంగా బయటకు తీసుకోవచ్చు. వారానికి మూడుసార్లు రోజు మార్చి రోజు నీటితడి అందిస్తే సరిపోతుంది.

కలబంద కలిపితే మరింత లాభం

డ్రమ్ము మధ్యలో వట్టివేరు, చుట్టూ కలబంద సాగుచేస్తే మేలు. కలబందలోని నత్రజని వట్టివేరుకు మేలుచేస్తుంది. ఏడాది తర్వాత వట్టివేళ్లతో పాటు.. కలబంద ఆకులు కిలో రూ.50 చొప్పున ఎకో గ్రీన్ కొనుగోలు చేస్తుంది. అందుకే రెండూ కలిపి వేసి మంచి ఆదాయం పొందవచ్చు.

చదువుతోనే సమాజంలో గౌరవం

- మంత్రి నారాయణ
- ఏపీజే అబ్దుల్ కలాం అంతర్జాతీయ పాఠశాలకు శంకుస్థాపన

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: చదువుతోనే సమాజంలో గౌరవం వస్తుందని మంత్రి నారాయణ పేర్కొన్నారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు నగరం పరమేశ్వరినగర్‌లోని వక్ఫ్ బోర్డుకు చెందిన ఐదెకరాల స్థలంలో డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం అంతర్జాతీయ పాఠశాల ఏర్పాటుకు ఆదివారం మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నెల్లూరులో 94 వేల ఇళ్లు ఉండగా, 84 వేల ఇళ్లను సందర్శించానన్నారు. అప్పుడే పేదలకు నాణ్యమైన విద్య అందించాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. నగరంలోని 15 పాఠశాలల అభివృద్ధికి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీద మస్తాన్‌రావు, డీఎస్సార్ కన్‌స్ట్రక్షన్స్ ప్రతినిధి సుధాకర్‌రెడ్డి, డాక్టర్ భాస్కర్, సీఎం రమేశ్, రెడ్డి ల్యాబ్స్, టీవీఎస్ కంపెనీ నుంచి సహకారం తీసుకున్నట్లు వివరించారు. అంతర్జాతీయ పాఠశాల ఏర్పాటుకు రూ.20 కోట్ల వరకు ఖర్చు అవుతుందని, దీన్ని ఎన్‌సీసీ గ్రూపు డిజైన్ చేసిందన్నారు. నిధులను సీఎస్సార్ ద్వారా సమకూరుస్తామన్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ మైనార్టీలు అంటే సీఎం చంద్రబాబుకు ఎంతో అభిమానమన్నారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు రాష్ట్ర ఛైర్మన్ అబ్దుల్ అజీజ్, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నగర ఇన్‌ఛార్జి మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, నుడా ఛైర్మన్ శ్రీనివాసులురెడ్డి, శాసనమండలి మాజీ ఛైర్మన్ షరీఫ్, మంత్రి నారాయణ కుమార్తె శరణి పాల్గొన్నారు.


పాఠశాల శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, శాసనమండలి మాజీ ఛైర్మన్ షరీఫ్, వక్ఫ్ బోర్డు రాష్ట్ర ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ తదితరులు

కుల వెలివేతతో కుటుంబం అదృశ్యం

- ఆత్మహత్య చేసుకుంటామని వీడియో విడుదల
- వారి ఆచూకీ కోసం గాలిస్తున్న పోలీసులు

ముసునూరు, న్యూస్‌టుడే: ఏలూరు జిల్లా ముసునూరు మండలం లోపూడిలో ఓ కుటుంబాన్ని కులం నుంచి వెలివేశారనే కథనం ఆదివారం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడంతో కలకలం రేగింది. పోలీసుల కథనం మేరకు.. లోపూడి గ్రామానికి చెందిన బోట్ల కనకారావు నాటు సారా విక్రయిస్తుంటాడు. ఇటీవల ఎక్సైజ్ అధికారులు అతనిపై కేసు నమోదు చేయగా, న్యాయస్థానం నాలుగు రోజులు రిమాండ్ విధించింది. అతను జైలు నుంచి బయటకు వచ్చిన తరువాత కుల పెద్దలు పంచాయితీ పెట్టి బాధితుడి కుటుంబాన్ని మోకాళ్లపై నిలబెట్టారు. నాటు సారా విక్రయాలు మానేయాలని, రూ.లక్ష జరిమానా కట్టాలని ఆదేశించారు. లేకుంటే కుల బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు. దానికి కనకారావు అంగీకరించలేదు. దాంతో ఈ నెల 3న కులస్థుల ఇళ్లకు వెళ్లి.. కనకారావు కుటుంబాన్ని కులం నుంచి వెలివేశామని, ఎవరూ వారితో మాట్లాడొద్దని కుల పెద్దలు హుకుం జారీ చేశారు. మనస్తాపానికి గురైన కనకారావు.. భార్య, ఇద్దరు కుమారులతో కలిసి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకుంటున్నామని, దానికి కుల పెద్దలైన సుదగాని రాంబాబు, చలమాల వెంకటేశ్వరరావు, వీరంకి గంగరాజు, పంది శ్రీనివాసరావు, ఆరేపల్లి నాగేశ్వరరావు, శ్రీరాములు కారణమని పేర్కొంటూ సెల్ఫీ వీడియోను సామాజిక మాధ్యమాల్లో ఆదివారం ఉదయం విడుదల చేశారు. అనంతరం ఆ కుటుంబం అదృశ్యమైంది. వారి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. బాధితుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో కుల పెద్దలను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.



షేర్ల కొనుగోలులో ఈ పొరపాట్లు చేయొద్దు

- మీ స్నేహితులు ఏ కంపెనీల షేర్లను కొంటే మీరూ అవే కొనడం.
- కొన్నిరోజుల్లోనే అనూహ్య స్థాయిలో పెరిగిన షేర్లకు ఆకర్షితులై వాటిని కొనుగోలు చేయడం.
- సామాజిక మాధ్యమాల్లో ఎవరో చెప్పిన సలహాలను విని షేర్లలో పెట్టుబడి పెట్టడం.

ఇలాంటి పొరపాట్లు చేస్తే నష్టపోయే ముప్పుంది. షేర్లు కొనే ముందు ఆయా కంపెనీల మూలాలు, వ్యాపార తీరుతెన్నులను కూలంకషంగా అధ్యయనం చేసిన తర్వాతే నిర్ణయం తీసుకోండి.

– డానీ చెంగ్, ఇన్‌ఫ్లుయెన్సర్

ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమం

- వచ్చేనెల 12న దేశవ్యాప్త సమ్మె
- సీఐటీయూ మహాసభల్లో జాతీయ ప్రధాన కార్యదర్శి కరీం వెల్లడి

ఈనాడు, విశాఖపట్నం: ప్రజలు ఐక్యంగా ఉంటే ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడవచ్చని సీఐటీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎలమరం కరీం పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, రాష్ట్రాల సమైక్యత దెబ్బతింటోందని, లౌకికత్వం సవాళ్లను ఎదుర్కొంటోందని చెప్పారు. సీఐటీయూ 18వ అఖిల భారత మహాసభల సందర్భంగా ఆదివారం విశాఖలో బహిరంగ సభ నిర్వహించారు. కరీం మాట్లాడుతూ ''ప్రైవేటీకరణ విధానాలను కార్మిక సంఘాలు వ్యతిరేకించాలి. ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిస్తున్నాం. ప్రభుత్వరంగ సంస్థలను కాపాడడం, కొత్తగా తీసుకొచ్చిన కార్మిక చట్టాల రద్దు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని గతం మాదిరిగానే కొనసాగించాలనే డిమాండ్లతో ఈ సమ్మె చేపడుతున్నాం'' అని వెల్లడించారు.



సభలో మాట్లాడుతున్న కరీం. వేదికపై సీఐటీయూ నాయకులు ★ విశాఖ వీధుల్లో సీఐటీయూ ర్యాలీ

విశాఖ ఉక్కును రక్షించే ప్రయత్నమేది?: 'కేంద్రం కొత్తగా తీసుకొచ్చిన కార్మిక చట్టాలతో కార్మికులు హక్కులు కోల్పోతారు. యూనియన్లు ఏర్పాటు చేయడానికి, న్యాయపరమైన వేతనాల కోసం ఉద్యమించడానికి వీలుండదు. ఏపీలో ప్రస్తుత సీఎం, మాజీ సీఎం విశాఖ స్టీల్‌ప్లాంటు రక్షణకు ఏం చర్యలు తీసుకున్నారు'' అని కరీం ప్రశ్నించారు. సీఐటీయూ జాతీయ అధ్యక్షుడు సుదీప్ దత్తా మాట్లాడుతూ కార్మిక శక్తిని ప్రభుత్వాలకు చూపాలని, విశాఖ ఉక్కు పరిరక్షణకు వీరోచిత పోరాటం చేస్తున్నామన్నారు. అంతకుముందు డాబాగార్డెన్స్ అంబేడ్కర్ విగ్రహం నుంచి సభా ప్రాంగణం వరకు ఎర్రజెండాలు చేతబూని భారీ ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ ఉపాధ్యక్షులు తపన్‌సేన్, హేమలత, రామకృష్ణన్, సౌందరరాజన్, కార్యదర్శి సీహెచ్ నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక: సభలో సీఐటీయూ జాతీయ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జాతీయ అధ్యక్షుడిగా సుదీప్ దత్తా, ప్రధాన కార్యదర్శిగా ఎలమరం కరీం, కోశాధికారిగా సాయిబాబు, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ కన్వీనర్‌గా ఏఆర్ సింధూతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన 13 మందిని ఉపాధ్యక్షులుగా, మరో 23 మందిని కార్యదర్శులుగా ఎన్నుకున్నారు.


శ్రీదేవి, భూదేవి పల్లకీల వద్ద నుంచి స్వామివారివైపు పూలబంతులు విసురుతున్న అర్చకులు

తిరుమలలో కోలాహలంగా ప్రణయ కలహోత్సవం

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి ఆలయంలో ఆదివారం ప్రణయ కలహోత్సవం కనువిందు చేసింది. ఏటా వైకుంఠ ఏకాదశి తర్వాత ఆరో రోజు, అధ్యయనోత్సవంలో 17వ రోజు ఈ ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. సాయంత్రం నాలుగు గంటలకు మలయప్ప స్వామివారు పల్లకీలో పుష్కరిణి వద్దకు రాగా, అమ్మవార్లు వేర్వేరు పల్లకీలపై వచ్చి ఎదురుగా నిలుచున్నారు. పురాణపఠనం జరుగుతుండగా అమ్మవార్ల తరఫున జీయంగార్లు పూల బంతులను వేటకు వెళ్లి వచ్చిన స్వామివారి వైపు మూడుసార్లు విసిరారు. స్వామివారు బెదిరినట్లుగా నటించి తానేమీ తప్పు చేయలేదని అమ్మవార్లను ప్రాధేయపడ్డారు. అనంతరం అమ్మవార్లు శాంతించి స్వామివారికి ఇరువైపులా చేరి కర్పూరహారతులు అందుకుని ఆలయానికి చేరుకున్నారు. అనంతరం ఆస్థానం నిర్వహించారు. ఈ ఉత్సవంలో శ్రీనమ్మాళ్వార్ రచించిన ఆళ్వార్ దివ్యప్రబంధంలోని పాసురాలను నిందాస్తుతి శైలిలో అర్చకులు పారాయణం చేశారు. పెద్దజీయర్, చిన్నజీయర్, తితిదే అదనపు ఈవో వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, పారుపత్తేదారు హిమంతగిరి, పోటు ఏఈవో మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనాలకు కొనసాగుతున్న రద్దీ


ఒక్కరోజే రూ.5 కోట్ల హుండీ కానుకలు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవేంకటేశ్వర స్వామివారి వైకుంఠ ద్వార దర్శనాలకు భక్తులు తరలివస్తున్నారు. రద్దీకి అనుగుణంగా తితిదే అధికారులు చర్యలు చేపడుతున్నారు. సర్వదర్శనంతో పాటు పరిమిత సంఖ్యలో రూ.300 ప్రత్యేక ప్రవేశదర్శనం, శ్రీవాణి భక్తులకు, వీఐపీలకు బ్రేక్ దర్శనాలు కల్పిస్తున్నారు. ఐదో రోజైన శనివారం వైకుంఠ ద్వారం ద్వారా 88,662 మంది భక్తులు దర్శించుకున్నారు. హుండీ కానుకలు భారీగా.. రూ.5.05 కోట్లు అందాయి. 24,417 మంది తలనీలాలు సమర్పించారు. ఆదివారం సాయంత్రానికి 50 వేలమంది భక్తులు దర్శించుకున్నారు. తితిదే అదనపు ఈవో వెంకయ్యచౌదరి మాట్లాడుతూ ఐదోరోజు శనివారం సర్వదర్శనానికి విచ్చేసిన సామాన్య భక్తులకు ఏఐ సాంకేతికత సాయంతో క్యూలైన్‌లో ప్రవేశించిన 12 గంటల్లోపే దర్శనం చేయించినట్లు చెప్పారు. ఈ నెల 8వ తేదీ వరకు ఇదేవిధంగా భక్తులకు త్వరితగతిన దర్శనం కల్పించేందుకు అధికారులు సమష్టిగా కృషిచేస్తున్నట్లు వెల్లడించారు.

7న చంద్రబాబు పోలవరం సందర్శన

ఈనాడు, అమరావతి: పోలవరం ప్రాజెక్టును ఈ నెల ఏడో తేదీన సీఎం చంద్రబాబు సందర్శించనున్నారు. ఉదయం 10:20 గంటలకు ఉండవల్లి నివాసం నుంచి హెలికాప్టర్‌లో పోలవరం ప్రాజెక్టుకు బయలుదేరుతారు. అనంతరం ప్రాజెక్టును సందర్శిస్తారు. సాయంత్రం విజయవాడలో సిద్ధార్థ అకాడమీ గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో పాల్గొంటారు.

పుష్పగిరిలో శ్రీకృష్ణుడి గీతోపదేశం కుడ్య శిల్పం గుర్తింపు



ఒంటిమిట్ట, వల్లూరు, న్యూస్‌టుడే: వైఎస్సార్ కడప జిల్లా వల్లూరు మండలంలోని ప్రసిద్ధి చెందిన పుష్పగిరి చెన్నకేశవ స్వామి ఆలయ గోడపై శ్రీకృష్ణుడు గీతోపదేశం చేస్తున్న అరుదైన కుడ్య శిల్పాన్ని గుర్తించినట్లు రచయిత, చరిత్రకారుడు బొమ్మిశెట్టి రమేష్ ఆదివారం తెలిపారు. 'సాధారణంగా అన్ని చిత్రాల్లో శ్రీకృష్ణుడు నిల్చొని. . కూర్చున్న అర్జునుడికి సందేశమిచ్చినట్లు చూస్తాం. ఇక్కడ మాత్రం అందుకు భిన్నంగా శ్రీకృష్ణుడు కూర్చోగా అర్జునుడు నిలబడి ఉన్నారు' అని పేర్కొన్నారు. కురుక్షేత్ర యుద్ధం చేయడానికి అర్జునుడు సంకోచిస్తున్నప్పుడు తన కర్తవ్యాన్ని నిర్వర్తించాలని, భగవంతునిపై భారం వేసి ధర్మం కోసం పోరాడమని శ్రీకృష్ణుడు చెప్పే సన్నివేశాన్ని ఆనాటి శిల్పులు ఎక్కడాలేని విధంగా చెక్కారని వివరించారు. అర్జునుడు శ్రీకృష్ణుడి ఎడమ వైపు నిలబడి, ధనస్సును పట్టుకుని రెండు చేతులు జోడించి నమస్కరిస్తున్నట్లు శిల్పాన్ని మలిచారని వెల్లడించారు.

తమిళనాడు, పశ్చిమబెంగాల్‌లో ఎన్డీయేదే విజయం

కేంద్రమంత్రి అమిత్ షా ధీమా



చెన్నై (ఆర్కేనగర్), న్యూస్‌టుడే: తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లలో ఈ ఏడాది జరగనున్న శాసనసభ ఎన్నికల్లో ఎన్డీయేదే విజయమని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. తమిళనాడులోని పుదుకోట్టై జిల్లా పల్లత్తివయల్ ప్రాంతంలో ఆదివారం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. తమిళనాడులో డీఎంకే ప్రభుత్వం అవినీతికి మారుపేరుగా మారిందని, ఇక్కడి మంత్రులపై అవినీతి కేసులున్నాయని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఏ పని చేయాలన్నా 20 శాతం కమీషన్ డీఎంకే నేతలకు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. మరోవైపు మహిళలకు భద్రత లేదని, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ ఉద్యోగులు, నర్సులు వీధుల్లోకి వచ్చి తమ డిమాండ్ల కోసం పోరాడే పరిస్థితి నెలకొందని విమర్శించారు. నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తమిళ భాషాభివృద్ధికి పెద్ద ఎత్తున కృషి చేస్తోందని పేర్కొన్నారు.

రూ.1,464 కోట్ల నకిలీ ఇన్వాయిస్‌ల ముఠా గుట్టురట్టు

నలుగురు నిందితుల అరెస్టు


అధికారులు స్వాధీనం చేసుకున్న ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, సిమ్‌కార్డులు, నకిలీ రబ్బర్ స్టాంపులు

ఈనాడు, బెంగళూరు: అంతర్రాష్ట్ర స్థాయిలో లావాదేవీలు, సరకు తరలింపు లేకున్నా.. నకిలీ జీఎస్టీ ఇన్వాయిస్‌లు (బిల్లులు) సృష్టించే ముఠాను కర్ణాటక వాణిజ్య పన్నుల శాఖ అధికారులు పట్టుకున్నారు. ఆదివారం బెంగళూరులో వారు ఈ వివరాలు వెల్లడించారు. ''ఇంటెలిజెన్స్ సమాచారం మేరకు బెంగళూరు, చెన్నై, వేలూరు, పెర్నాంపట్టు ప్రాంతాల్లో చేపట్టిన సోదాల్లో రూ.1,464 కోట్ల విలువైన నకిలీ బిల్లులు లభ్యమయ్యాయి. తమిళనాడుకు చెందిన ఇర్ఫాజ్ అహ్మద్, నఫీజ్ అహ్మద్, బెంగళూరుకు చెందిన ఎద్దుల ప్రతాప్, రేవతిలను అదుపులో తీసుకుని ఆర్థిక నేరాల ప్రత్యేక కోర్టులో ప్రవేశపెట్టాం. నిందితుల నుంచి 24 ఫోన్లు, 51 సిమ్‌కార్డులు, రెండు పెన్‌డ్రైవ్‌లు, పలు బ్యాంకుల స్టేట్‌మెంట్లు, రబ్బర్ స్టాంపులను స్వాధీనం చేసుకున్నాం. సిమెంట్, ఇనుప, ఉక్కుతో పాటు పలు నిర్మాణ సామగ్రి రవాణాకు సంబంధించిన నకిలీ ఇన్‌పుట్ ట్యాక్స్ బిల్లులనూ గుర్తించాం. తమిళనాడు, కర్ణాటకల్లో నకిలీ కంపెనీల పేరిట ఈ బిల్లులు సృష్టించినట్లు తేలింది'' అని అధికారులు వివరించారు.

'మత్స్య'కారుడికి పండుగ'ప్ప!



యానాం పరిధి దరియాలతిప్ప వద్ద గోదావరిలో ఓ మత్స్యకారుడి గాలానికి ఆదివారం 24 కిలోల పండుగప్ప చిక్కింది. ఇటీవల ఇంత పెద్ద పండుగప్ప చిక్కలేదని స్థానికులు తెలిపారు. 'చెరువుల్లో పెంచే పండుగప్ప చేపలు గరిష్ఠంగా ఆరు కిలోల వరకే పెరుగుతాయి. నది చేప కావడంతో ఇంతలా పెరిగింది. దీని రుచి కూడా ఎక్కువగా ఉంటుంది' అని మత్స్యకారులు వివరించారు. ఈ చేపను రూ.16 వేలకు విక్రయించారు. వీటి మాంసంలో ప్రొటీన్లు, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా ఉంటాయని యానాం మత్స్యశాఖ ఏడీ దడాల గొంతెయ్య చెప్పారు.

– న్యూస్‌టుడే, యానాం



రైలుపై పరుగులు తీస్తున్న యువకుడు

రైలు పైకెక్కి యువకుడి వీరంగం

మతిస్థిమితం లేదని గుర్తింపు

కంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: భువనేశ్వర్ నుంచి తిరుపతి వెళ్లే సూపర్‌ఫాస్ట్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు పైకెక్కి పశ్చిమబెంగాల్‌కు చెందిన ఓ యువకుడు వీరంగం వేసిన ఘటన శ్రీకాకుళం జిల్లా సోంపేట రైల్వేస్టేషన్‌లో చోటుచేసుకొంది. ప్రయాణికులు, స్థానిక రైల్వే సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం మధ్యాహ్నం 3.25 గంటల సమయంలో రైలు ప్రయాణికులతో సోంపేట స్టేషన్‌కు చేరుకుంది. బిజయ్ సర్కార్ అనే యువకుడు ఆ సమయంలో అకస్మాత్తుగా రైలు పైకి ఎక్కడంతో గందరగోళం నెలకొంది. స్టేషన్ మాస్టర్ సత్యనారాయణ బెహరా వెంటనే రైల్వే ట్రాక్‌పై విద్యుత్తు సరఫరాను నిలిపివేయించారు. బిజయ్ సర్కార్ సుమారు 20 నిమిషాల పాటు రైలు పైభాగంలో అటూఇటూ పరుగులు తీశాడు. దీంతో సుమారు అర గంట పాటు రైలు నిలిచిపోయింది. పలాస రైల్వే పోలీసులు అక్కడికి చేరుకుని అతన్ని అదుపులోకి తీసుకున్నారు. యువకుడిని మతిస్థిమితం లేనివాడిగా గుర్తించారు.

సిలబస్ కంటే.. ఆచరణాత్మక బోధనే ముఖ్యం

- తల్లిదండ్రుల ఆలోచన పరిధి పెరగాలి
- 'ఈనాడు-రిసొనెన్స్' వెబినార్‌లో నిపుణులు



వెబినార్‌లో పాల్గొన్న డా.పద్మావతి తుంగతుర్తి, డా.కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి, ఎన్.పూర్ణచంద్రరావు, సమన్వయకర్త ప్రొ.నీలమేఘశ్యామ్ దేశాయ్

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: విద్యార్థులకు పాఠ్యపుస్తకాల్లోని సిలబస్ కంటే ఉపాధ్యాయులు చెప్పే బోధన విధానమే ప్రధానమని నిపుణులు స్పష్టం చేశారు. పిల్లలు ఎదగాలంటే తల్లిదండ్రుల ఆలోచనా పరిధి సైతం పెరగాలని అభిప్రాయపడ్డారు. విద్యాసంస్థలు కూడా బాధ్యత తీసుకొని పిల్లల్లో ఒత్తిడి తట్టుకునే సామర్థ్యమూ పెంచాల్సిన అవసరం ఉందని చెప్పారు. 'సిలబస్‌పై సందిగ్ధం.. పిల్లల భవిష్యత్తుపై బెంగా?' అనే అంశంపై ఆదివారం ఈనాడు-రిసొనెన్స్ విద్యాసంస్థలు సంయుక్తంగా ఆన్‌లైన్ వెబినార్ నిర్వహించాయి. విద్యావేత్తలు డా.కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి, డా.పద్మావతి తుంగతుర్తి, ఎన్.పూర్ణచంద్రరావు పాల్గొన్నారు. ప్రొ.నీలమేఘశ్యామ్ దేశాయ్ సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ ఉచిత వెబినార్‌లో వారు అందించిన విలువైన సలహాలివి.

బోర్డు పరీక్షలుండాలి

ఇంటర్ వరకు విద్యార్థులు తమ విద్యాసంస్థలను ఎంచుకుంటారు. తర్వాత కళాశాలలే విద్యార్థులను ఎంపిక చేస్తాయి. ఈ సందర్భంలో తిరస్కరణ జరిగినప్పుడు ఎక్కువ మంది కుంగుబాటుకు గురవుతున్నారు. దీన్ని సమర్థంగా ఎదుర్కోవాలంటే చిన్న వయసులోనే బోర్డు పరీక్షలు రాయాలి. పదోతరగతిలో 10/10 జీపీఏ సాధించినవారు.. పోటీపరీక్షల్లో చిన్న ప్రశ్న పూర్తి చేయడానికి అత్యధిక సమయం తీసుకుంటున్నారు. పాఠశాల స్థాయి నుంచే ఆచరణాత్మక బోధన ఉంటే సత్ఫలితాలు ఉంటాయి. రాష్ట్రీయ మిలిటరీ స్కూల్స్ (ఆర్ఎంఎస్), నవోదయ వంటి ప్రవేశ పరీక్షలు రాస్తూ.. ఆప్టిట్యూడ్, రీజనింగ్ వంటి సబ్జెక్టులపై పట్టు సాధిస్తే ఐఐటీ, జేఈఈ వంటి పరీక్షలకు సన్నద్ధం అవుతున్నట్లే.

– ఎన్.పూర్ణచంద్రరావు

స్వతంత్రంగా ఎదిగేలా ప్రోత్సహించాలి

విద్యావ్యవస్థలో గణనీయమైన మార్పుల నేపథ్యంలో విద్యార్థులకు కాన్సెప్ట్ ఆధారంగా విద్య నేర్పించాలి. విద్యార్థులకు సిలబస్సే ప్రామాణికం కాదు. ఎలా బోధిస్తున్నాం.. ఏమేరకు అర్థం చేసుకుంటున్నారు? అనేదే ముఖ్యం. ఏడో తరగతి బోర్డు పరీక్షను తొలగించాక దేశ విద్యావ్యవస్థలో కష్టాలు మొదలయ్యాయి. ఎస్సెస్సీ వరకు బోర్డు పరీక్ష లేకపోవడంతో పిల్లల్లో చదువుపై అశ్రద్ధ పెరుగుతోంది. విద్యార్థులకు జేఈఈ, నీట్‌లు మాత్రమే ప్రపంచం కాదు. ప్రపంచంలో చోటు చేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా వారు స్వతంత్రులుగా ఎదిగేలా ప్రోత్సహించాలి. పారిశ్రామికవేత్తలుగా తయారు చేయాల్సిన బాధ్యత విద్యాసంస్థలు, తల్లిదండ్రులపై ఉంది. అప్పటివరకూ సీబీఎస్ఈ చదివిన విద్యార్థులు.. ఇంటర్ తర్వాత 90 శాతానికి పైగా స్టేట్‌బోర్డుకు మారిపోతుండటంతో కొంత అనిశ్చితికి లోనవుతున్నారు.

– డా.కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి

తల్లిదండ్రులకూ అవగాహన

స్టేట్‌బోర్డులో రాష్ట్రస్థాయి విషయాలు ఉంటే.. సీబీఎస్ఈలో దేశవ్యాప్తంగా ఉన్న అంశాలను సిలబస్‌గా పొందుపరుస్తారు. పిల్లల అభిరుచిమేరకు తల్లిదండ్రులకు కూడా స్టేట్‌బోర్డు, సీబీఎస్ఈపై అవగాహన ఉండాలి. భవిష్యత్తులో విద్యార్థులు జాతీయ స్థాయి పరీక్షలు రాసినప్పుడు స్టేట్‌బోర్డులో చదివినవారికి కొంత ఇబ్బంది కలిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో పిల్లల ఎదుగుదలతో పాటు వారి తల్లిదండ్రుల ఆలోచన పరిధి పెరగాలి. అప్పుడే వాళ్లకు ఏది అవసరమో తెలుస్తుంది. తెలుగు రాష్ట్రాల్లోని స్టేట్‌బోర్డులలో చదివితే తప్పనిసరిగా తెలుగు భాషను నేర్చుకోవాలి. విద్యార్థులకు భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చే పక్షంలో ప్రాంతాలు బదిలీ కావాల్సి ఉంటుంది. అందుకు సిద్ధంగా ఉండాలి. ఐఐటీ, నీట్‌లతో పాటు వాటికి సమానమైనవి, సమాజానికి పనికొచ్చే వృత్తులు, ఉద్యోగాలు ఎన్నో ఉన్నాయి. వాటికీ విద్యార్థులను సన్నద్ధం చేయాలి.

– డా.పద్మావతి తుంగతుర్తి



పరిశ్రమ ప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న హోంమంత్రి అనిత. చిత్రంలో ఎమ్మెల్యే విజయకుమార్

నేను కెమిస్ట్రీ స్టూడెంట్ని.. అసలేం జరిగిందో చెప్పండి

- ఎస్‌వీఎస్ రసాయన పరిశ్రమను పరిశీలించిన హోంమంత్రి అనిత

రాంబిల్లి, అచ్యుతాపురం, న్యూస్‌టుడే: 'నేను కెమిస్ట్రీ స్టూడెంట్ని.. ఆ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని అసలేం జరిగిందో చెప్పండి' అని హోంమంత్రి వంగలపూడి అనిత ప్రశ్నించారు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లో శనివారం ప్రమాదం జరిగిన ఎస్‌వీఎస్ రసాయన పరిశ్రమను స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌తో కలిసి ఆమె ఆదివారం పరిశీలించారు. వీరు వెళ్లిన సమయంలో ప్రమాదానికి కారణాలు విశ్లేషించేందుకు పరిశ్రమ ప్రతినిధులు అక్కడ లేకపోవడంతో అనిత ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ప్లాంట్ హెడ్ ఎవరు? పిలవండి. మేం ఇక్కడికి వచ్చి నిల్చుంటే పరిశ్రమ తరఫున ఎవరూ రాకపోతే ఎలా? పిచ్చోళ్లు అనుకుంటున్నారా' అని ఆగ్రహించారు. కొంతసేపటికి ప్లాంట్ ఇన్‌ఛార్జి వచ్చి సెంటర్ ఫ్యూజ్ వద్ద స్పార్క్ జరిగి మంటలు అంటుకోవడంతో ప్రమాదం జరిగిందని సమాధానమిచ్చారు. అనంతరం మంత్రి స్పందిస్తూ.. కార్మికులు చనిపోతే ఎక్స్‌గ్రేషియా ప్రకటించి వెళ్లిపోవడానికి రాలేదని, తరచూ ప్రమాదాలు ఎందుకు జరుగుతున్నాయో తెలుసుకోవడానికి వచ్చానన్నారు. ప్రమాదకర రసాయనాలను ఎందుకింత నిర్లక్ష్యంగా ఉంచారని ప్రశ్నించారు. పరిశ్రమల శాఖ అధికారుల నుంచి ఫిర్యాదు తీసుకుని కంపెనీ యాజమాన్యంపై కేసు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించారు.

సాయిబాబా కుటుంబానికి అండగా ఉంటాం

- సీఎం చంద్రబాబు
- కృష్ణా జలాల అంశంపై త్వరలో మాట్లాడతానని వెల్లడి

బేగంపేట, న్యూస్‌టుడే: తన చివరి శ్వాస వరకు పిన్నమనేని సాయిబాబా తెలుగుదేశం పార్టీ కోసమే పనిచేశారని ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. ఇటీవల మృతిచెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, ఎన్టీఆర్ అభిమాన సంఘాల సమాఖ్య మాజీ అధ్యక్షుడు పిన్నమనేని సాయిబాబా కుటుంబసభ్యులను ఆదివారం సాయంత్రం హైదరాబాద్ బేగంపేటలోని వారి నివాసంలో పరామర్శించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. పార్టీకి విధేయుడిని కోల్పోవడం బాధాకరమన్నారు. సమైక్య రాష్ట్రంలో వికలాంగుల కార్పొరేషన్ ఛైర్మన్‌గా, ఎన్టీఆర్ అభిమానిగా ఎనలేని సేవలందించారని తెలిపారు. సాయిబాబా కుటుంబం చాలా సమస్యల్లో ఉన్నట్లు తెలిసిందని, వారికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కృష్ణా జలాల అంశంపై విలేకరులు అడిగిన ప్రశ్నకు చంద్రబాబు స్పందిస్తూ.. త్వరలో అన్ని విషయాలు మాట్లాడతానని తెలిపారు. ఆయన వెంట తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు, అరవింద్‌కుమార్ గౌడ్, మాజీ ఎంపీ కంభంపాటి రామ్మోహన్‌రావు, మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన ఉన్నారు.



సాయిబాబా కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న చంద్రబాబు. చిత్రంలో కంభంపాటి రామ్మోహన్‌రావు తదితరులు

దూసుకొచ్చిన మృత్యువు

కారును ఢీకొన్న లారీ.. ముగ్గురి మృతి

సోంపేట, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలం కొర్లాం జాతీయ రహదారి కూడలి వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృత్యువాత పడ్డారు. తీవ్రంగా గాయపడిన మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసుల వివరాల మేరకు.. కొర్లాం కూడలిలో ఇచ్ఛాపురం వైపు వెళ్తున్న లారీ ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి పక్క రోడ్డులో పలాస వైపు వెళ్తున్న కారును ఢీకొనడంతో ప్రమాదం చోటు చేసుకుంది. కారులో ఉన్న ఐదుగురిలో నలుగురు తీవ్రంగా గాయపడగా కనకలత(31) అక్కడికక్కడే మరణించారు. ఆమె విశాఖపట్నంలో రైల్వే ఏఈగా పనిచేస్తున్నట్లు సమాచారం. ఇటీవల స్వగ్రామమైన ఒడిశా రాష్ట్రంలోని మయూర్‌భంజ్ వెళ్లి తిరిగి విశాఖకు వస్తుండగా ఈ దారుణం జరిగింది. గాయపడిన నలుగురిని బారువ ఆసుపత్రికి తరలించగా అక్కడ ఏడాది వయసు ఉన్న బాబు ఆదిత్యతోపాటు బాలిక అభిలాష(8) మృతి చెందింది. కారు డ్రైవర్ నాగరాజుతోపాటు మరో బాలిక పరిస్థితి విషమంగా ఉండటంతో శ్రీకాకుళం ఆసుపత్రికి తరలించారు. మృతులంతా ఒకే కుటుంబ సభ్యులుగా పోలీసులు భావిస్తున్నారు. కారును ఢీకొన్న లారీ పంట పొలాల్లోకి దూసుకెళ్లగా.. డ్రైవర్ పరారీలో ఉన్నాడు.



కారులో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను బయటకు తీస్తున్న ప్రయాణికులు ★ అపస్మారక స్థితిలో ఉన్న చిన్నారి ఆదిత్యను ఎత్తుకున్న స్థానికులు

మార్చి 3న శ్రీవారి ఆర్జిత సేవల రద్దు

చంద్ర గ్రహణం దృష్ట్యా తితిదే నిర్ణయం

తిరుమల, న్యూస్‌టుడే: చంద్ర గ్రహణం కారణంగా మార్చి 3న తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆలయంలో అష్టదళ పాదపద్మారాధన, కల్యాణోత్సవం, సహస్ర దీపాలంకార సేవలను తితిదే రద్దు చేసింది. ఆరోజు ఉదయం 9 నుంచి సుమారు 10.30 గంటల పాటు ఆలయ తలుపులు మూసివేయనున్నారు. మధ్యాహ్నం 3.20కి చంద్ర గ్రహణం ప్రారంభమై సాయంత్రం 6.47కు పూర్తవుతుండగా గ్రహణ సమయానికి ఆరు గంటల ముందుగా ఆలయ తలుపులు మూసివేయడం ఆనవాయితీ. రాత్రి 7.30కు ఆలయ తలుపులు తెరిచి శుద్ధి, తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. రాత్రి 8.30 నుంచి భక్తులకు దర్శనాలు పునఃప్రారంభిస్తారు.

ఠాణాకు చేరిన గేదె గొడవ

వైద్య నివేదికతో తీర్పు

కోటా: ఆవు నాదంటే నాదంటూ ఇద్దరు రైతులు తగవు పడటం.. సగానికి నరికి పంచుకోమన్న పంచాయతీ పెద్దల తెలివైన తీర్పుతో తేలిన నిజం కథల్లో చదువుకున్నాం. రాజస్థాన్‌లోని కోటా జిల్లాలోనూ దాదాపు ఇలాంటి గొడవే కున్హాడీ పోలీస్‌స్టేషనుకు చేరింది. నారాయణ్ విహార్ గ్రామానికి చెందిన రామ్‌లాల్ నెల రోజుల కిందట తప్పిపోయిన తన గేదె, దూడల కోసం తీవ్రంగా గాలిస్తూ.. ఇంద్రజీత్ అనే ఆసామి ఇంటి ఆవరణలో కట్టేసి ఉండగా గుర్తించారు. ఇద్దరి మధ్య తగవు ముదిరి పోలీసులను ఆశ్రయించారు. తాను గేదెను రెండేళ్ల కిందట కొన్నానని, ఇప్పుడు దానికి ఏడేళ్లని ఇంద్రజీత్ వాదించారు. తన గేదెకు నాలుగైదేళ్ల వయసు ఉంటుందని, ఇటీవలే దూడకు జన్మ ఇచ్చినట్లు రామ్‌లాల్ తెలిపారు. ఈ పంచాయతీ ఎంతకూ తెగకపోవడంతో రైతుల వాదన నుంచే పరిష్కారం కనుగొన్నట్లు సీఐ కౌసల్యా వెల్లడించారు.



కున్హాడీ పోలీస్‌స్టేషను ఎదుట గేదె పంచాయతీ

గేదెను కోటాలోని ప్రభుత్వ వెటర్నరీ వైద్యశాలకు తరలించగా.. దాని దంతాలు, శారీరక స్థితిని పరిశీలించిన వెటర్నరీ వైద్యులు నాలుగైదేళ్ల వయసు ఉంటుందని నివేదిక ఇచ్చారు. దీంతో శనివారం రాత్రి గేదెతో పాటు దూడను రామ్‌లాల్‌కు స్వాధీనం చేసినట్లు సీఐ తెలిపారు. తన వాదనకు బలం చేకూర్చేలా ఇంద్రజీత్ ఎటువంటి ఆధారాలు చూపలేకపోయారన్నారు.

అంధుడే కానీ.. ఆగిపోలేదు

రాజస్థాన్‌లోని జైపుర్‌కు చెందిన చేతన్‌శర్మకు అనారోగ్యంతో చిన్నప్పుడే కంటిచూపు పోయింది. అయినా సంకల్పబలంతో ముందుకు సాగి ఉన్నతస్థాయికి చేరారు. అజ్మేర్‌లోని అంధుల పాఠశాలలో చదివి, బ్యాంకులో స్టెనో ఉద్యోగం సాధించారు. అనతికాలంలోనే చీఫ్ మేనేజరు స్థాయికి ఎదిగారు. అయినా ఇంకా ఏదో తపన. తనలా చూపు లేనివారికి అండగా నిలబడాలనే లక్ష్యంతో తొమ్మిదేళ్ల ముందుగానే రిటైర్మెంటు తీసుకొని, 'ఉద్ధవ్ విజన్ ఫౌండేషను' స్థాపించారు. దీని ద్వారా అంధులకు డిజిటల్ అక్షరాస్యత, నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ అవకాశాలు కల్పించి ప్రోత్సహిస్తున్నారు. ఈ సంస్థలో ఇప్పటిదాకా బ్రెయిలీ లిపి ద్వారా దాదాపు 5 వేల మంది తమ కలలను నిజం చేసుకున్నారు.




ఈటీవీ భారత్

వెనెజువెలా పరిణామాలు ఆందోళనకరం: భారత్

దిల్లీ: వెనెజువెలా పరిణామాలపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. ఆ దేశ అధ్యక్షుడు నికొలస్ మదురో, ఆయన భార్యను అమెరికా నిర్బంధించడంపై ఆదివారం విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ స్పందించింది. "వెనెజువెలాలో తాజా పరిణామాలు ఆందోళనకరం. అక్కడి పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నాం. ఆ దేశ ప్రజల శ్రేయస్సు, రక్షణకు భారత్ మద్దతును పునరుద్ఘాటిస్తున్నాం" అని ఒక ప్రకటనలో తెలిపింది. ప్రాంతీయ శాంతి, సుస్థిరతలను దృష్టిలో ఉంచుకొని భాగస్వాములందరూ ఈ సమస్యను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చింది.

నాడు మదురో సవాలు చేసినట్టే..!

కారకస్: వెనెజువెలా అధ్యక్షుడు మదురోను అమెరికా తాజాగా నిర్బంధించిన నేపథ్యంలో.. కొన్ని నెలల కిందట ట్రంప్‌ను ఉద్దేశిస్తూ ఆయన చేసిన ప్రసంగం వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది. "ధైర్యముంటే అధ్యక్ష భవనానికి వచ్చి నన్ను తీసుకెళ్లండి. మీకోసం నేను మిరాఫ్లోర్స్ (వెనెజువెలా అధ్యక్ష భవనం)లోనే ఎదురుచూస్తున్నా. ఆలస్యం చేయొద్దు" అని మదురో సవాలు విసరడం అందులో కనిపిస్తోంది. అచ్చం అలాగే అమెరికా సైన్యం శనివారం అధ్యక్ష భవనంలోకి వెళ్లి ఆయన్ను బందీగా తీసుకుపోవడం గమనార్హం. మదురో అరెస్టుకు సాయం చేసేవారికి అమెరికా నజరానాను గతంలో పెంచినప్పుడు.. ఆయన ఈ సవాలు విసరడం గమనార్హం.



కష్టాన్ని ఇష్టంగా మార్చుకోండి

ఆలోచనలు చేయడం సులువు. వాటిని అమలు చేయడం కష్టం. పైగా వాటి ఆచరణను స్థిరంగా దీర్ఘకాలం కొనసాగించడం మరింత కష్టం. ఆ మరింత కష్టాన్ని ఇష్టంగా చేసేవారికే అద్భుత ఫలితాలు సొంతమవుతాయి.

– జస్టిన్ వెల్ష్, సోలోప్రెన్యూర్

అడుగుపెట్టాక.. 5 నిమిషాల్లోనే బంధించారు!

- కారకాస్‌లో ఆపరేషన్ కోసం ఆగస్టు నుంచి అమెరికా ప్రణాళిక

ఇంటర్నెట్ డెస్క్: వెనెజువెలా అధ్యక్షుడు మదురోను బందీగా చేసుకునేందుకు అమెరికా ప్రత్యేక కమాండోలు పకడ్బందీగా చేపట్టిన ఆపరేషన్ ఆధునిక సైనిక చరిత్రలో ఎప్పటికీ గుర్తుండిపోతుంది! ఈ ఆపరేషన్ కోసం అగ్రదేశ వ్యూహకర్తలు నిరుడు ఆగస్టు నుంచే ప్రణాళిక రూపొందించుకున్నట్లు తెలుస్తోంది. తాజాగా అందిన వివరాల ప్రకారం- అమెరికా సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (సీఐఏ)కి చెందిన గూఢచారుల చిన్న బృందం 2025 ఆగస్టులోనే వెనెజువెలాలోకి ప్రవేశించింది. కారకాస్ చుట్టుపక్కల మదురో కదలికలపై నిఘా వేసింది. ఆయన కదలికలు బాగా తెలిసిన సన్నిహిత వ్యక్తి నుంచి కీలక సమాచారం సేకరించింది. అదే సమయంలో స్టెల్త్ డ్రోన్ల దళం కూడా కారకాస్‌పై నిశ్శబ్దంగా సంచరిస్తూ.. మదురో తిరిగే ప్రదేశాలకు సంబంధించిన మ్యాప్‌ను తయారు చేసింది.

ఇంటి నమూనాను సృష్టించి..

డెల్టాఫోర్స్ కమాండోలు ఈ ఆపరేషన్ కోసం కెంటకీలోని స్పెషల్ ఆపరేషన్స్ కమాండ్‌లో మదురో ఇంటి నమూనాను సృష్టించారు. దాన్ని ఆధారంగా చేసుకొని- స్టీల్ డోర్లను అత్యంత వేగంగా బద్దలు కొట్టడం సాధన చేశారు. అయితే ఇక్కడే ఓ చిక్కొచ్చి పడింది. అగ్రరాజ్యంతో ఉద్రిక్తతల నేపథ్యంలో మదురో మొత్తం ఎనిమిది ప్రదేశాల్లో మార్చి మార్చి తిరుగుతుండేవారు. రోజూ సాయంత్రం అయ్యేవరకూ.. ఆయన ఎక్కడ ఉంటారో అమెరికా నిఘావర్గాలు కచ్చితంగా ఊహించలేకపోయేవి. డెల్టాఫోర్స్ సాధన చేసిన నమూనా తరహా ఇంట్లోనే ఆయన ఉన్నట్లు ధ్రువీకరణ జరగడం ఆపరేషన్‌కు తప్పనిసరిగా మారింది.

ఎవరికీ అనుమానం రాకుండా..

ఏకంగా వెనెజువెలా అధ్యక్షుడిపైనే తాము గురిపెట్టామని ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు అమెరికా చర్యలు తీసుకొంది. సముద్రంలో మాదకద్రవ్యాలను తరలిస్తున్న పడవలపై వరుస దాడులు జరిపి.. 115 మందిని మట్టుబెట్టింది. గతవారం వెనెజువెలాలో ఓ పోర్టుపై సీఐఏ డ్రోన్ దాడి చేసింది. అదే సమయంలో అమెరికా ప్రభుత్వంతో మదురో సయోధ్య కుదుర్చుకోవాలనుకున్నారు. కానీ ఆ ప్రయత్నం విఫలమైంది.



బంధించిన వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను తరలిస్తున్న అమెరికా విమానం

డిసెంబరులో ట్రంప్ ఆమోదముద్ర

కారకాస్‌లో దాడికి డిసెంబరులో ట్రంప్ నుంచి గ్రీన్ సిగ్నల్ లభించింది. అయితే దాడి ఎప్పుడు చేయాలో నిర్ణయించే అధికారాన్ని పెంటగాన్, స్పెషల్ ఆపరేషన్స్ ప్లానర్స్‌కు ఆయన వదిలేశారు. శుక్రవారం రాత్రి 10.46 నిమిషాలకు ట్రంప్ నుంచి తుది ఆదేశాలు వెలువడ్డాయి.

స్టీల్‌రూంలోకి వెళ్లకముందే..

డెల్టా ఫోర్స్ కమాండోలు మదురో కాంపౌండ్‌లో దిగగానే.. అక్కడి ఆపరేషన్‌ను ఫ్లోరిడాలో ట్రంప్ ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించడం మొదలుపెట్టారు. కమాండోలు తొలుత పేలుడు పదార్థాలను వాడి కాంపౌండ్‌లోకి చొరబడ్డారు. తర్వాత మదురో ఉన్న గదిలోకి ప్రవేశించారు. భార్యతో కలిసి ప్రత్యేకమైన స్టీల్‌రూమ్‌లోకి వెళ్లేందుకు ఆయన యత్నించారు. అప్పటికే ఆ గదిపై పట్టు సాధించిన దళాలు మదురోను అదుపులోకి తీసుకొన్నాయి. వాస్తవానికి స్టీల్ గది డోర్ భారీగా ఉండటంతో.. దానిని మూయడం మదురోకు సాధ్యం కాలేదని ట్రంప్ వెల్లడించారు. కాంపౌండ్‌లోకి ప్రవేశించిన ఐదు నిమిషాల్లోనే మదురోను అమెరికా కమాండోలు బంధించడం విశేషం. ఒకవేళ ఆయన స్టీల్‌రూంలో తనను తాను బంధించుకుంటే.. చర్చల కోసం ఎఫ్‌బీఐ హోస్టేజ్ నెగోషియేటర్‌ను కూడా డెల్టాఫోర్స్ తమవెంట తీసుకొచ్చింది. కానీ ఆ అవసరం రాలేదు.

తర్వాత వంతు మీదే

లాటిన్ అమెరికా దేశాలకు ట్రంప్ హెచ్చరిక

వాషింగ్టన్: వెనెజువెలా అధ్యక్షుడు మదురోను అమెరికా సైన్యం బంధించిన అనంతరం ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ లాటిన్ అమెరికాలోని ప్రత్యర్థి దేశాలను హెచ్చరించారు. మెక్సికో, క్యూబా, కొలంబియా సైతం మాదక ద్రవ్యాలను తయారు చేస్తూ. . అక్రమంగా అమెరికాలోకి సరఫరా చేస్తున్నాయని ఆరోపించారు. అనేక ముఠాలకు ఈ దేశాలు ఆశ్రయమిస్తున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకోకపోతే తర్వాత వెనెజువెలా పరిస్థితే ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా చేపట్టిన చర్యల్లో భాగంగా ఆయా దేశాల్లోని డ్రగ్స్ ఉత్పత్తి చేసే ప్రయోగశాలలపై దాడులు చేయడానికి వెనుకాడబోమని ట్రంప్ స్పష్టం చేశారు. మరోవైపు అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ మాట్లాడుతూ.. ఇతర దేశాల నుంచి అమెరికాకు సరఫరా అవుతున్న డ్రగ్స్‌ను కట్టడి చేయడమే తమ అంతిమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ విషయంలో వెనెజువెలా తర్వాత క్యూబా, కొలంబియా వంటి దేశాలపైనా దృష్టి పెట్టే అవకాశం ఉందని తెలిపారు.



ఎనిమిదింబావు యుద్ధాలను పరిష్కరించా

ప్రపంచ వ్యాప్తంగా పలు ఘర్షణలు తానే పరిష్కరించినట్లు ట్రంప్ పునరుద్ఘాటించారు. 'నేను ఎనిమిదింబావు యుద్ధాలను పరిష్కరించా. ఆ పావు ఏంటో తెలుసా.. థాయ్‌లాండ్- కంబోడియా మధ్య ఉద్రిక్తత. అది మళ్లీ చెలరేగింది. కానీ నేను 5 గంటల్లోనే దాన్ని ఆపి శాంతి తీసుకొచ్చా. అందుకే దానికి ఒక పావు క్రెడిట్ తీసుకుంటున్నా. ఇప్పుడు నా లెక్క ఎనిమిదింబావు' అని ట్రంప్ చెప్పారు.

చమురు కోసం రక్తం చిందింపజేస్తారా..

- అమెరికా దాడులపై నిరసనలు




తుర్కియేలో ఆందోళన నిర్వహిస్తున్న ప్రజలు

దిల్లీ: వెనెజువెలాపై అమెరికా దాడులను నిరసిస్తూ పలు దేశాల్లో ఆందోళనలు జరిగాయి. అమెరికాతోపాటు తుర్కియే, నెదర్లాండ్స్, భారత్, పాకిస్థాన్ తదితర దేశాల్లో నిరసనలు జరిగాయి. చమురు కోసం రక్తం చిందించొద్దని ఆందోళనకారులు నినదించారు. నెదర్లాండ్స్‌లోని ఆమ్‌స్టర్‌డామ్‌లో వెనెజువెలా జెండాలతో నిరసన తెలిపారు. 'అమెరికా సామ్రాజ్యవాదాన్ని ఆపాలి. చమురు కోసం రక్తం చిందించొద్దు. ట్రంప్ ఉగ్రవాది' అనే ప్లకార్డులను ప్రదర్శించారు. తుర్కియేలో జరిగిన ఆందోళనల్లో భారీగా జనం పాల్గొన్నారు.

అమెరికా ఇచ్చిన మాట నిలబెట్టుకుంది

మచాడో



వాషింగ్టన్: అధ్యక్షుడు మదురోని నిర్బంధించి వెనెజువెలా ప్రజలకు అమెరికా మేలు చేసిందని ఆ దేశ ప్రతిపక్ష నేత, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మారియా కొరీనా మచాడో ప్రకటన చేశారు. గతంలో చట్టబద్ధమైన పాలన అందిస్తామని అమెరికా హామీ ఇచ్చిందని, ఆ వాగ్దానాన్ని ఆ దేశం నిలబెట్టుకుందని అన్నారు. వెనెజువెలా ప్రజలపై మదురో ఎన్నో దారుణమైన నేరాలు చేశారని, ఇప్పుడాయన అంతర్జాతీయ న్యాయాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలిపారు. 'దేశాన్ని తిరిగి నిర్మిస్తాం. రాజకీయ ఖైదీలకు విముక్తి కల్పిస్తాం. విదేశాలకు వలస వెళ్లిన మన పిల్లలను మళ్లీ స్వదేశానికి తీసుకొస్తాం" అని ఆమె స్పష్టంచేశారు. ఇన్నేళ్లుగా వెనెజువెలాలో ప్రజాస్వామ్యం కోసం సాగిన పోరాటం ఇప్పుడు కీలక మలుపు తిరిగిందని మచాడో వ్యాఖ్యానించారు. "మేం ఎన్నో సంవత్సరాలు పోరాడాం. అన్నింటినీ త్యాగం చేశాం. అది వృథా కాలేదు. జరగాల్సింది ఇప్పుడు జరుగుతోంది. ఇది ప్రజల క్షణం" అంటూ ఆమె పేర్కొన్నారు.

చమురుపై ఆంక్షలతో నియంత్రిస్తాం: రుబియో

వాషింగ్టన్: వెనెజువెలాను చమురుపై ఆంక్షల ద్వారా నియంత్రిస్తామని, నేరుగా పరిపాలించబోమని అమెరికా విదేశాంగశాఖ మంత్రి మార్కో రుబియో తెలిపారు. ఆ దేశ రోజువారీ వ్యవహారాల్లో జోక్యం చేసుకోబోమని స్పష్టం చేశారు. ఆదివారం ఆయన టీవీ టాక్ షోలో మాట్లాడారు. ప్రజల మేలు కోసం చమురు పరిశ్రమలో మార్పులు తెస్తామని, డ్రగ్స్ రవాణాను కట్టడి చేస్తామని తెలిపారు.

బియ్యం ఉత్పత్తిలో భారత్‌దే అగ్రస్థానం: చౌహాన్

దిల్లీ: బియ్యం ఉత్పత్తిలో చైనాను వెనక్కినెట్టి భారత్ ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలిచిందని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ఆదివారం వెల్లడించారు. 25 రకాల పంటలకు సంబంధించి 184 రకాల వంగడాలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కొత్త వంగడాలతో రైతులకు అధిక ఆదాయం సమకూరుతుందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. మొత్తం 150.18 మిలియన్ టన్నుల బియ్యం ఉత్పత్తితో ప్రపంచంలోనే ప్రథమస్థానంలో నిలిచిందన్నారు.

EENADU Vol: 52, Issue: 146 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

ఈనాడు సినిమా

తెలుగింటి సంక్రాంతి కొత్త సినిమా వినోదంతోనే పరిపూర్ణం అవుతుంది. ప్రతిసారీ మూడు నాలుగు సినిమాలు బాక్సాఫీస్ ముందు వరుస కడుతుంటాయంటే కారణం అదే! అభిమాన తార సినిమా ముచ్చట్లు చెప్పుకుంటూ పండగ చేసుకోవడంలో ఉన్న ఆనందమే ప్రత్యేకం అంటుంటారు సినీ ప్రేమికులు. ఆ అభిరుచికి తగ్గట్టే ఈసారి ఐదు తెలుగు సినిమాలు ప్రేక్షకుల ముందుకొస్తున్నాయి. రెండు అనువాద చిత్రాలొస్తున్నాయి. మొత్తంగా ఏడు సినిమాలతో... ఎనిమిది మంది కథానాయకులు తెరపై సందడి చేయనున్నారు. కథానాయికల సంఖ్య అయితే అంతకుమించి! ఒకొక్క సినిమాలో ఇద్దరు ముగ్గురు కనిపిస్తూ... అలరించనున్నారు.

నాకు హిందీ నేర్పండి!


'పరాశక్తి'

"నా మాతృభాషని కాపాడుకోవడానికి ఒక గొప్ప సైన్యం ఉందంటు"న్నారు నటుడు శివ కార్తికేయన్. ఆయన శ్రీలీల జంటగా నటించిన చిత్రం 'పరాశక్తి'. రవి మోహన్, అథర్వ మురళీ నటించారు. పొలిటికల్ యాక్షన్ డ్రామాగా సుధా కొంగర తెరకెక్కించారు. ఆకాశ్ భాస్కరన్ నిర్మాత. ఈ సినిమా ఈ నెల 10న రానుంది. ఈ సందర్భంగా చిత్రబృందం ఆదివారం 'తిరుగుబాటుకి ఒక స్వరం.. న్యాయానికి ఒక మూల్యం ఉందం"టూ ట్రైలర్‌ను ఆవిష్కరించింది. ఈ ట్రైలర్ "నాకు హిందీ నేర్పండి', 'మేము హిందీ మాట్లాడేవారికి వ్యతిరేకం కాదు" లాంటి సంభాషణలతో ఆద్యంతం ఆసక్తిగా సాగుతుంది. ఈ సినిమా 1960లలో తమిళనాడు లోని హిందీ వ్యతిరేక నిరసనల నేపథ్యంతో ఇద్దరు స్నేహితుల చుట్టూ తిరుగుతున్న కథాంశంతో రూపొందినట్లు ట్రైలర్‌తో స్పష్టమవుతోంది.

సొగసిరి సంక్రాంతి



హీరోలు చేసే డ్యాన్సులు, ఫైట్లు, విసిరే పంచ్‌లే కాదు... వాళ్ల సరసన కనిపిస్తూ కథానాయికలు చేసే సందడినీ ఎంతగానో ఇష్టపడుతుంటారు సినీ ప్రేమికులు. సినిమాలోని గ్లామర్‌కు ఉన్న మహత్తు అదే. అందుకే కథానాయికల ఎంపికలో ఎన్నెన్నో కసరత్తులు జరుగుతుంటాయి. సినిమాలో ఎంతమంది కథానాయికలు ఉంటే... ఆ సినిమాకి అంత ఆకర్షణ శక్తి ఉన్నట్టు లెక్క. ఈసారి సంక్రాంతికొస్తున్న మన సినిమాల్లో ఇద్దరేసి కథానాయికలు కనిపిస్తున్నారు. 'ది రాజాసాబ్'లో అయితే ముగ్గురున్నారు. మొత్తంగా చూస్తే డజను మందికిపైనే కథానాయికలు తెరపై కనిపించి కవ్వించనున్నారు. ఈసారి అందానికి పండగొచ్చినట్టుగా ఉంది.

'నాచే నాచే... కోయి యహా నాచే నాచే...' అంటూ ముగ్గురు కథానాయికలు ప్రభాస్‌ని చుట్టుముట్టి కవ్విస్తుంటే చూడాలని ఎవరికి మాత్రం ఉండదూ! ఇటీవల ప్రోమోగా విడుదలైన కొంచెం పాటని చూసే మాకు నచ్చే నచ్చే... అంటూ 'ది రాజాసాబ్' విడుదల కోసం ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. ప్రభాస్ కథానాయకుడిగా మారుతి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఈ నెల 9న రానున్న సంగతి తెలిసిందే. 8న రాత్రి నుంచే ఈ సినిమా సందడి షురూ కాబోతోంది. ఇందులో ప్రభాస్ సరసన మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధికుమార్ కథానాయికలుగా నటించారు. ఈ ముగ్గురూ అందంతో కట్టిపడేస్తున్నారు. మరి తెరపై వీరి సందడి ఎలా ఉంటుందో చూడాలి.

వరప్రసాద్‌గారితో మీసాల పిల్ల

చిరంజీవి కథానాయకుడిగా తెరకెక్కిన 'మన శంకరవరప్రసాద్‌గారు' ఈ నెల 12న రానున్న సంగతి తెలిసిందే. అనిల్ రావిపూడి తెరకెక్కించిన ఈ చిత్రంలో చిరంజీవి సరసన నయనతార కథానాయికగా నటించారు. మీసాల పిల్ల... అంటూ సాగే పాటతో ఇప్పటికే ఈ జోడీ సినిమాపై ఆసక్తిని రేకెత్తించింది. ఇందులో మరో అగ్ర కథానాయకుడు వెంకటేశ్ కీలక పాత్ర పోషించారు. నయనతారతోపాటు మరో కథానాయిక కేథరిన్ కూడా ఇందులో కీలక పాత్రని పోషించింది.

నారీ నారీ నడుమ...

ఇద్దరు భామల మధ్య నలిగిపోయే ఓ యువకుడి కథతో రూపొందిన సినిమానే 'నారీ నారీ నడుమ మురారి'. శర్వానంద్ హీరోగా నటించారు. సంయుక్త, సాక్షి వైద్య కథానాయికలు. రామ్ అబ్బరాజు దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 14న సాయంత్రం నుంచే ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రస్తుతం ప్రేమిస్తున్న అమ్మాయి, మాజీ ప్రేయసి మధ్య ఒకే ఆఫీస్‌లో ఉంటూ ఇబ్బందులు పడిన యువకుడిగా శర్వానంద్ ఇందులో కనిపిస్తున్నారు.

రాణితోపాటు మరొకరు

సంక్రాంతి పండగ బరిలో నిలిచిన మరో చిత్రం... 'అనగనగా ఒక రాజు'. పల్లెటూరు నేపథ్యంలో సాగే కథ ఇది. నవీన్ పొలిశెట్టి కథానాయకుడిగా నటించగా, ఆయన సరసన మీనాక్షి చౌదరి నటించారు. మారి దర్శకుడు. ఈ సినిమాలో ఒక రాజు, ఒక రాణితో పాటు... ప్రత్యేక గీతంలో మరో నాయిక శాన్వి మేఘన కూడా మెరుపులు మెరిపించనున్నారు. మొత్తంగా ఇందులోనూ ఇద్దరు కథానాయికలు సందడి చేస్తారన్నమాట. ఈ పండక్కి తమిళం నుంచి 'జన నాయకుడు', 'పరాశక్తి' చిత్రాలూ వస్తున్నాయి. విజయ్ హీరోగా నటించిన 'జన నాయకుడు' మన 'భగవంత్ కేసరి' సినిమాకి రీమేక్‌గా రూపొందింది. ఇందులో పూజాహెగ్డే కథానాయిక. ఇందులో మరో నాయిక మమితా బైజు కీలక పాత్ర పోషించారు. 'పరాశక్తి'లో శివ కార్తికేయన్ సరసన మన తెలుగమ్మాయి శ్రీలీల నటించారు. సుధా కొంగర తెరకెక్కించారు.

భర్త మహాశయుడి అల్లరి

ఇద్దరు కథానాయికలతో కలిసి సందడి చేయడం రవితేజకు కొత్త కాదు. 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' సినిమాలోనూ ఆయన ఇద్దరు భామలతో కలిసి అల్లరి చేస్తూ వినోదాలు పంచనున్నారు. కిశోర్ తిరుమల తెరకెక్కించిన చిత్రమిది. డింపుల్ హయాతి, ఆషికా రంగనాథ్ కథానాయికలు. ఇప్పటికే ఇందులోని వామ్మో వాయ్యో.., బెల్లా బెల్లా... పాటలు విడుదలై విశేష ఆదరణ పొందాయి. ఆయా పాటల్లో కథానాయికలు ఇద్దరూ అందంతోనూ, డ్యాన్స్‌తోనూ అదరగొట్టారు. ఈ చిత్రం ఈ నెల 13న రానుంది.



మెగాస్టార్‌ను సెలబ్రేట్ చేసుకుందాం



"మనల్ని టార్చర్ పెట్టే పెళ్లాం తరపు బంధువుల్ని.. మరీ ముఖ్యంగా అత్తగార్ని, మామగార్ని ఆడుకుంటుంటే ఉంటుందయ్యా పిచ్చ హై వస్తుంది" అంటున్నారు కథానాయకుడు చిరంజీవి. ఇప్పుడాయన.. నయనతార జంటగా అనిల్ రావిపూడి తెరకెక్కించిన చిత్రం 'మన శంకరవరప్రసాద్ గారు'. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మించారు. వెంకటేశ్ ప్రత్యేక పాత్ర పోషించారు. ఈ సినిమా ఈనెల 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే ఆదివారం తిరుపతిలో ఈ చిత్ర ట్రైలర్ విడుదల కార్యక్రమం జరిగింది. ఈ వేడుకలో అనిల్ రావిపూడి మాట్లాడుతూ.. "మెగాస్టార్ చిరంజీవిని నేను ఎలా చూపించాలనుకున్నానో, ఆయన నాకెలా ఇష్టమో, ఆయనలో ఏమి నచ్చుతుందో అలానే కథ రాశా. దానికితగ్గ ఎలిమెంట్స్ అన్నింటినీ నింపేశాం. ట్రైలర్‌లో చూసింది జస్ట్ గ్లింప్స్ మాత్రమే. మన శివశంకర్‌వరప్రసాద్ సినిమా 2.35 గంటలు టైమ్ మిషన్‌లో చుట్టేసి వచ్చినట్లు ఉంటుంది. ఇది నా గ్యారెంటీ. నేను రాసిన దానికంటే ప్రెజెంట్ చేయడంలో వందశాతం న్యాయం చేశారు చిరంజీవి. మెగా అభిమానులందరూ కుటుంబాలతో సినిమాకు రండి. మెగాస్టార్‌ను సెలబ్రేట్ చేసుకుందాం" అని అన్నారు. ఈ సినిమా సంక్రాంతి ట్రీట్ చాలా ఉత్సాహంగా.. పూర్తిగా మెగాస్టార్ మ్యాజిక్‌లా ఉంటుందని చెప్పారు కొణిదెల సుస్మిత. "ఇంటెలిజెన్స్ బ్యూరో.. రా ఏజెంట్.. నేషనల్ సెక్యూరిటీ అడ్వైజర్.. ఎలాంటి క్రిమినల్‌నైనా ఉతికి, పిండి ఆరేస్తాడు" అంటూ చిరు పాత్రను ఎలివేట్ చేసే డైలాగ్స్‌తో మొదలైన ట్రైలర్ ఆద్యంతం అలరించేలా సాగింది. ఈ ప్రచార చిత్రంలో కథను బయట పెట్టకుండా చిరు స్టైలింగ్, కామెడీ టైమింగ్, గ్రేస్‌ను కొత్తగా చూపిస్తూ ఆకర్షించే ప్రయత్నం చేశారు. ముఖ్యంగా శశిరేఖగా నయన్ పాత్ర చుట్టూ మంచి కామెడీ ట్రాక్‌ను అల్లుకున్నట్లు అర్థమవుతోంది. ఆమెకు.. చిరంజీవికి మధ్య వచ్చే సన్నివేశాలు కుటుంబ ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యేలా ఉన్నాయి. ఆఖర్లో హెలికాప్టర్‌లో వెంకటేశ్ ఎంట్రీ ఇవ్వడం.. "చూడటానికి మంచి ఫ్యామిలీమ్యాన్‌లా ఉన్నావు.. ఇలా మాస్ ఎంట్రీలు ఇస్తున్నావేంటి?" అని చిరు అడగడం.. "మాస్‌కే బాస్‌లా ఉన్నావ్.. నువ్వు ఫ్యామిలీ సైడ్ రాలేదా ఏంటి?" అని వెంకీ బదులివ్వడం ట్రైలర్‌కు ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలోనిర్మాతలు సాహు గారపాటి, పాటల రచయిత రామజోగయ్యశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, తిరుపతి(జీవకోన)

పొట్టేలు పోరాటం


యువన్‌కృష్ణ, అమ్ము, రిదాన్

మన కోడి పందేల్ని తలపించేలా... తమిళనాడులోని మధురై ప్రాంతంలో పొట్టేళ్ల పందేలు జరుగుతుంటాయి. ఆ నేపథ్యంలో సాగే కథతో రూపొందిన చిత్రమే 'జాకీ'. 2021లో వచ్చిన 'మడ్డి' ఫేమ్ డా. ప్రగభల్ దర్శకత్వం వహించిన చిత్రమిది. యువన్‌కృష్ణ, రిదాన్ కృష్ణాస్, అమ్ము అభిరామి ప్రధాన పాత్రలు పోషించారు. త్వరలోనే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా టీజర్‌ని విడుదల చేశారు. గ్రామీణ జీవితం, సంప్రదాయ క్రీడ, భావోద్వేగాల నేపథ్యంలో సాగే కథ ఇదని... పొట్టేళ్ల పోరాటాన్ని సహజంగా తెరకెక్కించేందుకు మూడేళ్లపాటు చిత్రబృందం మధురై ప్రాంతంలో పర్యటించి పక్కాగా చిత్రీకరణ చేసిందని సినీ వర్గాలు తెలిపాయి. ఈ చిత్రానికి శక్తిబాలాజీ సంగీతం అందిస్తున్నారు.

బాలీవుడ్‌లో తొలి అడుగు?

భాషతో సంబంధం లేకుండా తనదైన నటనతో సినీప్రియుల దృష్టిని ఆకర్షించింది మలయాళ నటి కల్యాణి ప్రియదర్శన్. గతేడాది విడుదలైన 'కొత్తలోక: చాప్టర్ 1' సినిమాలో ప్రధాన పాత్రలో నటించి.. బాక్సాఫీస్ వద్ద వసూళ్ల వర్షంతోపాటు సరికొత్త రికార్డులను సృష్టించింది. తాజాగా ఈ భామ హిందీ చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టనున్నట్లు సమాచారం. బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ హీరోగా జై మెహతా దర్శకత్వంలో 'ప్రలే' అనే చిత్రం రానున్నట్లు ఎప్పటినుంచో ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. జాంబీ థ్రిల్లర్‌గా రూపొందనున్న ఈ సినిమాలో కల్యాణి ప్రియదర్శన్ కథానాయికగా కనిపించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. కల్యాణి ప్రస్తుతం పలు తమిళ చిత్రాలలో నటిస్తోంది. రణ్‌వీర్ 'ధురంధర్' చిత్రంతో బాక్సాఫీస్ వద్ద వసూళ్ల వేటని కొనసాగిస్తున్నాడు. ఆయన తదుపరి 'ధురంధర్ 2' విడుదల తర్వాత 'ప్రలే' చిత్రీకరణను ప్రారంభించనున్నట్లు సన్నిహిత వర్గాల సమాచారం.



ఆధునిక జీవితానికి వ్యవసాయంతో ముడి


అరవింద్, త్రిగుణ్, పాయల్, మధుదీప్

"వ్యవసాయం చేసే విధానాల్లో మార్పు రావాలనే ఆలోచనతో చేసిన చిత్రమే 'మిస్టర్ వర్క్ ఫ్రమ్ హోమ్'' అన్నారు దర్శకుడు మధుదీప్. ఆయన తెరకెక్కించిన ఈ సినిమాలో త్రిగుణ్, పాయల్ రాధాకృష్ణ, అనీశ్ కురువిల్లా ప్రధాన పాత్రలు పోషించారు. అరవింద్ మండెం నిర్మించారు. ఈ చిత్ర టీజర్‌ను ఇటీవల హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో త్రిగుణ్ మాట్లాడుతూ.. "ఆధునిక జీవితాన్ని.. పాత పద్ధతిలో ఉన్న వ్యవసాయాన్ని ఎలా కలపొచ్చు అనేది ఈ సినిమాలో ఆసక్తికరంగా చూపించాం. వ్యవసాయానికి సంబంధించిన ముఖ్య విషయాల్ని చర్చిస్తూనే.. సినిమా చాలా వినోదాత్మకంగా సాగుతుంది" అన్నారు.

కొత్త ఏడాదిలో మెరుపులకు సిద్ధం



గతేడాది 'ఛావా', 'కుబేర', 'థమ్మా' 'ది గర్ల్ ఫ్రెండ్' లాంటి చిత్రాలతో మంచి విజయాల్ని తన ఖాతాలో వేసుకుంది అందాల తార రష్మిక. ఇప్పుడామె కొత్త ఏడాదిలో మెరుపులకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. బాలీవుడ్ కథానాయకుడు షాహిద్ కపూర్, రష్మిక, కృతి సనన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'కాక్‌టెయిల్ 2'. హోమి అదజానియా దర్శకత్వం వహిస్తున్నారు. ఈ రొమాంటిక్ కామెడీ డ్రామాను సెప్టెంబరులో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. "హిందీ ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకున్న 'కాక్‌టెయిల్'కు సీక్వెల్‌గా వస్తోన్న ఈ సినిమాను మునుపటి చిత్రం కన్నా ప్రత్యేకంగా తీర్చిదిద్దాలని నిర్ణయించుకుంది చిత్ర బృందం. ఇప్పటికే చిత్రీకరణ చివరి దశకు వచ్చేసింది. నిర్మాణానంతర పనుల్ని శరవేగంగా పూర్తి చేసి ద్వితీయార్ధంలో థియేటర్లలోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. త్వరలో ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటన రానుంద"ని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. మడాక్ ఫిల్మ్స్ నిర్మిస్తుంది.

దర్శకుడిగా మరోసారి?



'కుచ్ కుచ్ హోతా హై', 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్', 'బొంబాయి టాకీస్' లాంటి చిత్రాలతో దర్శకుడిగా మంచి క్రేజ్‌ను సంపాదించుకున్నారు కరణ్ జోహార్. ఇప్పుడాయన మరోసారి మెగా ఫోన్ పట్టబోతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన స్క్రిప్ట్‌ను పూర్తి చేసినట్లు సమాచారం. "ఇప్పుడు రాబోయే సినిమా కరణ్ తెరకెక్కించిన 'కభీ ఖుషీ కభీ ఘమ్' తరహాలో బలమైన ప్రేమ, కుటుంబం, భావోద్వేగాల నేపథ్యంలో ఉంటుంది. ధర్మ ప్రొడక్షన్స్ పతాకంపై భారీ బడ్జెట్‌తో దీన్ని రూపొందించాలనే ఆలోచనలో ఉన్నారు. ప్రీ ప్రొడక్షన్ పనులు ఈ ఏడాది ద్వితీయార్ధంలో ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఇందులో ఇద్దరు హీరోలు, ఇద్దరు కథానాయికలు కనువిందు చేయనున్నార"ని కరణ్ సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఆయన నిర్మాతగా పలు ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు.

'రిమ్‌జిమ్' గ్యాంగ్‌స్టర్


రాజ్ తిరందాస్, అజయ్ వేద్, బిత్తిరి సత్తి

అజయ్ వేద్, ప్రజన, రాహుల్ సిప్లిగంజ్ ప్రధాన పాత్రధారులుగా హేమ సుందర్ తెరకెక్కించిన చిత్రం 'రిమ్‌జిమ్'. జి సచేతన్ రెడ్డి, మానస, శ్రీనివాసరావు నిర్మించారు. బిత్తిరి సత్తి, రాజ్ తిరందాస్ కీలక పాత్రలు పోషించారు. ఇటీవలే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం నిర్మాణానంతర పనులు చేసుకుంటోంది. ఈ సందర్భంగా దర్శకుడు హేమ సుందర్ మాట్లాడుతూ.. "1990ల కాలంలో ఆంధ్రప్రదేశ్‌లో చోటుచేసుకున్న సంఘటనల ఆధారంగా ఈ గ్యాంగ్‌స్టర్ చిత్రం రూపొందించాం. ప్రేమ, స్నేహం ప్రధానాంశాలుగా బలమైన భావోద్వేగాలతో ఈ కథ సాగుతుంది. దీంట్లో రాహుల్ సిప్లిగంజ్ కీలక పాత్ర పోషిస్తూనే రెండు పాటలు ఆలపించారు. అవి సినిమాకి ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం" అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: కొక్కిలగడ్డ ఇఫ్రాయిం, ఛాయాగ్రహణం: వాసు పెండం.

ఐవోసీ ఈడీ దుర్మరణం

నోయిడా: ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అజయ్ గార్గ్ దుర్మరణం పాలయ్యారు. ఐవోసీ గ్యాస్ విభాగంలో పని చేస్తున్న గార్గ్, నోయిడా సెక్టార్ 104లోని ఏటీఎస్ వన్ హామ్లెట్ సొసైటీలో తన భార్యతో కలిసి హైరైజ్ భవనంలో నివసిస్తున్నారు. ఆదివారం ఉదయం 10.20 గంటల ప్రాంతంలో ఆయన 17వ అంతస్తులోని తన నివాసం నుంచి కిందపడి మరణించారని పోలీసులు చెప్పారు. బాల్కనీలోకి వచ్చి.. పొరపాటున కిందపడి మరణించారని భావిస్తున్నారు. కిందపడి, రక్తం మడుగులో ఉన్న గార్గ్‌ను గమనించిన స్థానికులు ఆయన్ను ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. అజయ్ కుమారుడు ముంబయిలో ఉద్యోగం చేస్తున్నారు.

ఈనాడు బిజినెస్

వెనెజువెలాపై అమెరికా నియంత్రణ.. చమురు ఉత్పత్తి పెంపు.. బకాయిలు వసూలవుతాయ్

వెనెజువెలా అధ్యక్షుణ్ని చెర పట్టి, ఆ దేశ చమురు రంగాన్ని అమెరికా చేతుల్లోకి తీసుకుంటున్న నేపథ్యంలో, మనదేశ చమురు రంగానికి ప్రయోజనం కలుగుతుందా.. బకాయిలు ఎదురవుతాయా అనే సందేహం అధికమవుతోంది. ఈ పరిణామం ఫలితంగా మనదేశ చమురు కంపెనీలకు లబ్ధి చేకూరుతుందని, భారీమొత్తం బకాయిలు వసూలవుతాయని అంచనా వేస్తున్నారు. వెనెజువెలా చమురు రంగాన్ని అమెరికా టేకోవర్ లేదా పునర్‌వ్యవస్థీకరణ చేస్తే, మన దేశానికి రావాల్సిన 1 బిలియన్ డాలర్ల (రూ.9000 కోట్ల) బకాయిలు మొత్తం లభించొచ్చు. ఆ దేశంలో మనదేశ కంపెనీలు నిర్వహిస్తున్న క్షేత్రాల నుంచి మెరుగైన చమురు ఉత్పత్తికి వీలయ్యే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఒకప్పుడు వెనెజువెలాకు అతిపెద్ద చమురు దిగుమతిదారుగా మనదేశం ఉండేది. గరిష్ఠ స్థాయిలో రోజుకు 4,00,000 బ్యారెళ్లకు పైగా చమురును అక్కడి నుంచి దిగుమతి చేసుకుంది. 2020లో ఆ దేశంపై అమెరికా ఆంక్షలు, నియంత్రణపరమైన ఇబ్బందులు పెరగడంతో మనదేశం చమురు కొనుగోళ్లను నిలిపివేసింది.



ఓఎన్‌జీసీ విదేశ్‌కు సానుకూలం

తూర్పు వెనెజువెలాలోని శాన్ క్రిస్టోబల్ చమురు క్షేత్రాన్ని ఓఎన్‌జీసీ విదేశ్ సంయుక్తంగా నిర్వహిస్తోంది. కీలకమైన టెక్నాలజీ, పరికరాలు, సేవలపై అమెరికా ఆంక్షలతో ఈ క్షేత్రంలో ఉత్పత్తి గణనీయంగా తగ్గింది. అక్కడ భారీ నిల్వలున్నా, మనకు ఉపయోగపడటం లేదు. ఈ చమురు క్షేత్రంలో 40% వాటా కలిగిన ఓఎన్‌జీసీ విదేశ్‌కు 2014 వరకు 536 మి. డాలర్ల (దాదాపు రూ.4,800 కోట్ల) డివిడెండ్లను చెల్లించడంలో వెనెజువెలా విఫలమైంది. అనంతర కాలానికి ఇంతే మొత్తాన్ని చెల్లించడానికి అవసరమైన ఆడిట్‌కు అనుమతి నిరాకరించడంతో, క్లెయిమ్ సెటిల్‌మెంట్ ఆగిపోయింది.

10 రెట్ల ఉత్పత్తి పెరిగే వీలు

ఒకవేళ అమెరికా ఆంక్షలు సడలిస్తే, గుజరాత్‌లోని మాతృసంస్థ ఓఎన్‌జీసీ చమురు క్షేత్రాల నుంచి రిగ్‌లు, ఇతర పరికరాలను శాన్ క్రిస్టోబల్‌కు ఓఎన్‌జీసీ విదేశ్ తరలించవచ్చు. ప్రస్తుతం రోజుకు 5,000-10,000 బ్యారెళ్లకు పడిపోయిన చమురు ఉత్పత్తిని 10 రెట్ల వరకు పునరుద్ధరించొచ్చని అధికారులు చెబుతున్నారు.

వెనెజువెలా నుంచి మళ్లీ చమురు ఎగుమతులు

అమెరికా నియంత్రణ వల్ల మళ్లీ ప్రపంచ దేశాలకు వెనెజువెలా నుంచి చమురు ఎగుమతులు ప్రారంభం కావొచ్చు. శాన్‌క్రిస్టోబల్ నుంచి 1 బిలియన్ డాలర్ల బకాయిలను కూడా ఓఎన్‌జీసీ విదేశ్ వసూలు చేసుకోగలదు. చెవ్రాన్ చమురు క్షేత్రాన్ని నిర్వహించి, ఎగుమతులు చేయడానికి ఆఫీస్ ఆఫ్ ది ఫారిన్ అసెట్స్ కంట్రోల్ (ఓఎఫ్ఏసీ) ఇచ్చిన అనుమతుల మాదిరిగానే, 'ప్రత్యేక లైసెన్స్' ఆంక్షల మినహాయింపులను ఓఎన్‌జీసీ విదేశ్ కోరుతోంది. వెనెజువెలాలోని మరిన్ని క్షేత్రాలను ఓఎన్‌జీసీ విదేశ్, ఇతర భారత సంస్థలు తీసుకుని, కారాబోబో-1 ప్రాంతం నుంచి ఉత్పత్తిని పునరుద్ధరించవచ్చు. కారాబోబో-1లో ఓఎన్‌జీసీకి 11%, ఐఓసీకి 3.5%, ఆయిల్ ఇండియాకు 3.5% చొప్పున వాటాలు ఉన్నాయి. శాన్ క్రిస్టోబల్, కారాబోబో-1లో మెజారిటీ వాటాదారుగా వెనెజువెలా ప్రభుత్వ చమురు కంపెనీ పెట్రోలియోస్ డి వెనెజువెలా ఎస్ఏ (పీడీవీఎస్ఏ) ఉంది.

భారత వాణిజ్యంపై ప్రభావం ఉండదు: జీటీఆర్ఐ

మన దేశ వాణిజ్యంపై అమెరికా-వెనెజువెలా పరిణామాల ప్రభావం నామమాత్రమేనని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ పేర్కొంది. 'ఆంక్షల తర్వాత వెనెజువెలాతో భారత వాణిజ్యం భారీగా తగ్గింది. 2024-25లో మొత్తం చమురు దిగుమతులు ఏకంగా 81.3% క్షీణించాయి. ద్వైపాక్షిక వాణిజ్యం కూడా స్వల్పంగానే ఉంద'ని జీటీఆర్ఐ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవ తెలిపారు. మన ఆర్థిక వ్యవస్థపై ఈ ప్రభావం పెద్దగా ఉండదన్నారు. 2024-25లో వెనెజువెలా నుంచి దిగుమతులు 364.5 మిలియన్ డాలర్లు (రూ.3,280 కోట్లు) మాత్రమే. ఇదే సమయంలో మన ఎగుమతులు 95.3 మి.డాలర్లు (రూ. 850 కోట్లు).

స్టార్‌లింక్ ఉచిత ఇంటర్నెట్ సేవలు

సంక్షోభంలో ఉన్న వెనెజువెలాలో, శాటిలైట్ ఆధారిత బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్ సేవలను ఉచితంగా అందిస్తామని ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ ప్రకటించింది. వెనెజువెలా ప్రజలకు తోడ్పాటు అందించేందుకు ఫిబ్రవరి 3 వరకు ఉచిత సేవలు అందిస్తామని మస్క్ వెల్లడించారు.

భవిష్యత్తులో ఏం జరగొచ్చంటే..

అమెరికా దాడుల తర్వాత, పీడీవీఎస్ఏ పునర్‌వ్యవస్థీకరణ అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. హీన పక్షంలో, పీడీవీఎస్ఏ వాటాను అమెరికా కంపెనీ లేదా ఏదైనా కొత్త సంస్థ స్వాధీనం చేసుకునే అవకాశం ఉంది. వెనెజువెలాకు అమెరికా ప్రధాన చమురు కంపెనీలు తిరిగి వెళ్తాయని ట్రంప్ ఇప్పటికే స్పష్టం చేశారు. కానీ అన్ని అంతర్జాతీయ కంపెనీలను అమెరికా భర్తీ చేయలేకపోవచ్చు. నైపుణ్యం, అనుభవం కారణంగా ఓఎన్‌జీసీ విదేశ్ వంటి కంపెనీలు అమెరికాకు అవసరం. అమెరికా, ఇతర అంతర్జాతీయ కంపెనీల సాయంతో వెనెజువెలా గత వైభవాన్ని మళ్లీ పునరుద్ధరించొచ్చని అంచనాలు ఉన్నాయి. వెనెజువెలా నుంచి వచ్చే చమురును శుద్ధి చేసే సామర్థ్యం రిలయన్స్ ఇండస్ట్రీస్, నయారా ఎనర్జీ, ఐఓసీ, హెచ్‌పీసీఎల్-మిత్తల్ ఎనర్జీ, మంగళూరు రిఫైనరీ వంటి దేశీయ సంస్థలకు ఉందని నిపుణులు వెల్లడిస్తున్నారు. భారత్-అమెరికా వాణిజ్య చర్చల నేపథ్యంలో రష్యా మీద ఆధారపడకుండా వేరే దేశాల నుంచి చమురు దిగుమతి చేసుకునే సౌలభ్యం మన దేశానికి లభిస్తుంది. వెనెజువెలా చమురు ఎగుమతులు ప్రారంభమైతే, ధరల్లో స్థిరత్వం వస్తుంది. ఇందుకు అనుగుణంగా ఒపెక్ ఉత్పత్తిని సర్దుబాటు చేసుకునే పరిస్థితులు నెలకొంటాయని అంటున్నారు.

ఈ ఏడాది ఏఐలో భారీ మార్పులొస్తాయ్

- వాస్తవ ప్రపంచంపై దృష్టి పెట్టండి
- మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల



ఈ ఏడాది కృత్రిమ మేధ (ఏఐ)లో భారీ మార్పులు వస్తాయని మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల అంచనా వేశారు. ఈ సాంకేతికతకు సంబంధించి, ప్రతి ఒక్కరూ కొత్తదనం దశను దాటి, వాస్తవ ప్రపంచ ప్రభావంపై దృష్టి పెట్టాలని సూచించారు. 'స్లాప్ వర్సెస్ సోఫిస్టికేషన్' వాదనల నుంచి ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు. 'లుకింగ్ ఎహెడ్ టు 2026' పేరిట బ్లాగ్‌లో పలు విషయాలను సత్య నాదెళ్ల పంచుకున్నారు. మానవ సామర్థ్యాలను పెంచడానికి ఏఐ ఒక టూల్‌గా ఉంటుందని, ప్రత్యామ్నాయం కాదని ఆయన స్పష్టం చేశారు. ఏఐ వ్యవస్థలను అభివృద్ధి చేయడంలో ప్రోడక్ట్ డిజైన్, సామాజిక పరిగణనల ప్రాముఖ్యతను గుర్తించాలన్నారు.

ఆఫీస్, విండోస్ స్థానంలో ఏఐ ఏజెంట్లు: వృత్తి జీవితానికి ఏఐ హానికరమంటూ మాట్లాడటాన్ని ఆపేయాల్సిన సమయం వచ్చిందని సత్య నాదెళ్ల పేర్కొన్నారు. ఏఐ పరిశ్రమ కొత్తదనం నుంచి మరిన్ని సవాళ్ల సమయంలోకి అడుగుపెట్టిందని వెల్లడించారు. పలు దశాబ్దాలుగా వేలాది కంపెనీలకు సేవలు అందించిన ఆఫీస్, విండోస్ సాఫ్ట్‌వేర్ స్థానంలో, ఏఐ ఏజెంట్‌లను వినియోగించాలని మైక్రోసాఫ్ట్ భావిస్తోందని తెలిపారు. ఏఐను స్వతంత్ర మేధస్సుగా చూడకూడదని, మానవ ఆలోచనలను పెంచే, ప్రజల లక్ష్యాల సాధనలో దోహదపడే టూల్‌గా చూడాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిక జీవితంలో ఏఐను ఎలా ఉపయోగిస్తారనే దానిపైనే.. ఈ సాంకేతికత వినియోగం ఆధారపడి ఉంటుందని వివరించారు. 'కోపైలట్, అనుబంధ ఉత్పత్తులను బలోపేతం చేయడానికి, మరిన్ని అధునాతన ఏఐ మోడళ్లపై మైక్రోసాఫ్ట్ పెట్టుబడులు పెడుతోంది. ఒక మోడల్ ఎంత శక్తివంతమైనది అనే దానిపైనే ఏఐ అసలు ప్రభావం ఆధారపడి ఉంటుంది. ప్రజలు దాన్ని ఎలా ఉపయోగిస్తారన్నదీ ముఖ్యమే' అని నాదెళ్ల అన్నారు.

హైదరాబాద్‌లో అమ్ముడవ్వాల్సిన ఇళ్లు తగ్గాయ్



అమ్ముడవ్వాల్సిన ఇళ్లు/ఫ్లాట్ల వివరాలు


నగరం	2025	2024	వృద్ధి/క్షీణత(%)
హైదరాబాద్	96,140	97,765	-2
ముంబయి (ఎంఎంఆర్)	1,79,228	1,80,964	-1
బెంగళూరు	64,863	52,807	23
పుణె	83,491	80,672	3
చెన్నై	33,434	28,423	18
కోల్‌కతా	29,007	26,542	9

గత ఏడాది (2025) ముగిసేసరికి హైదరాబాద్‌లో అమ్ముడవ్వాల్సిన ఇళ్లు/ఫ్లాట్ల సంఖ్య 96,140గా ఉన్నట్లు స్థిరాస్తి కన్సల్టెంట్ అనరాక్ తాజా నివేదికలో తెలిపింది. 2024లో ఈ సంఖ్య 97,765 కాగా, ఈసారి 2% తగ్గాయి. హైదరాబాద్ సహా దేశంలోని 7 ప్రధాన నగరాల్లో అమ్ముడవ్వాల్సిన ఇళ్లు/ఫ్లాట్లు 2025లో 5,76,617గా ఉన్నాయి. 2024లోని 5,53,073 ఇళ్లతో పోలిస్తే, ఇవి 4% అధికం. పలు నగరాల్లో గిరాకీని మించి, కొత్త ఇళ్ల సరఫరా ఉండటమే ఈ పరిస్థితికి కారణమని పేర్కొంది.

- గత ఏడాదిలో ఏడు ప్రధాన నగరాల్లో ఇళ్లు/ఫ్లాట్ల విక్రయాలు 14% తగ్గి 3,95,625కు చేరాయి. కొత్త ఇళ్ల సరఫరాలు 2% పెరిగి 4,19,170 ఇళ్లకు చేరినట్లు తెలిపింది.
- హైదరాబాద్, ముంబయిల్లో అమ్ముడవ్వాల్సిన ఇళ్లు తగ్గితే, దిల్లీ-ఎన్‌సీఆర్, పుణె, చెన్నై, బెంగళూరు, కోల్‌కతాల్లో పెరిగాయి.

జొమాటోలో ప్రతి నెలా 5,000 మంది గిగ్ వర్కర్ల తొలగింపు

- మళ్లీ అదే సంఖ్యలో నియామకాలు
- వ్యవస్థాపకుడు దీపిందర్ గోయల్



దిల్లీ: ప్రతి నెలా సుమారు 5,000 మంది గిగ్ వర్కర్లను తమ అనుబంధ సంస్థ జొమాటో నుంచి తొలగిస్తుంటామని, మళ్లీ అంతే సంఖ్యలో కొత్త వారిని నియమించుకుంటామని ఎటర్నల్ వ్యవస్థాపకుడు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దీపిందర్ గోయల్ తెలిపారు. మోసాలకు పాల్పడిన వారినే ఎక్కువగా తొలగిస్తుంటామని ఆయన స్పష్టం చేశారు. ఆహార డెలివరీ సంస్థలు 'ప్రతికూల పరిస్థితుల్లో పనిచేయిస్తున్నాయని, తగినంత వేతనాలు చెల్లించడం లేదని, కార్మికులకు సామాజిక భద్రత లేదంటూ' గిగ్ వర్కర్ల సంఘాలు పేర్కొంటుండగా, గోయల్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం జొమాటోలో మొత్తం 7.5 లక్షల మంది గిగ్ వర్కర్లు ఉన్నారని.. వీరిలో ప్రతినెలా 1.5-2 లక్షల మంది స్వచ్ఛందంగా ప్లాట్‌ఫాంను వీడుతున్నారని, మళ్లీ అదే సంఖ్యలో కొత్త నియామకాలు జరుగుతుంటాయని వివరించారు. మోసాలకు పాల్పడుతున్న వారినే తాము తొలగిస్తున్నట్లు తెలిపారు.

- ఒక వ్యక్తి వారానికి ఆరు రోజుల చొప్పున, రోజుకు 8-10 గంటల పాటు తమ ప్లాట్‌ఫాంలో పనిచేస్తే, రూ.25,000 పైనే అతని సంపాదన ఉంటుందని గోయల్ తెలిపారు. ప్రమాదాల్లో గిగ్ వర్కర్లు నష్టపోతే, బీమా పరిహారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు.
- వినియోగదారులు కూడా కొన్ని సమయాల్లో మోసపూరిత పనులకు పాల్పడుతున్నారని వెల్లడించారు. అందుకే కార్మికులతో పాటు వినియోగదారులకూ రేటింగ్ ఇచ్చేలా 'కర్మ' వ్యవస్థను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కోల్ ఇండియా అనుబంధ సంస్థ బీసీసీఎల్ ఐపీఓ 9 నుంచి

ఈ వారంలో మరో 4 ఎస్ఎంఈ పబ్లిక్ ఇష్యూలు



కోల్‌ఇండియా అనుబంధ సంస్థ భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్ (బీసీసీఎల్)తో పాటు మరో 4 చిన్న, మధ్యస్థాయి కంపెనీల (ఎస్ఎంఈ) ఐపీఓలు ఈ వారమే నిధులు సమీకరించబోతున్నాయి.

- బీసీసీఎల్ పబ్లిక్ ఇష్యూ ఈ నెల 9-13 తేదీల్లో ఉండనుంది. ధరల శ్రేణి, లాట్ పరిమాణం, ఇష్యూ నిర్మాణం వంటివి సోమవారం వెల్లడి కానున్నాయి.
- మిగతా 4 ఐపీఓలు ఎస్ఎంఈ విభాగం నుంచి రాబోతున్నాయి. ఇందులో గాబియన్ టెక్నాలజీస్ ఇష్యూ ముందుగా రాబోతోంది. 36 లక్షల షేర్లను విక్రయించడం ద్వారా రూ.29.16 కోట్లు సమీకరించబోతోంది. ధరల శ్రేణి రూ.76-81. జనవరి 6-8 తేదీల్లో ఈ ఐపీఓ ఉండనుంది. దీని తర్వాత విక్టరీ ఎలక్ట్రిక్ వెహికల్స్ ఇంటర్నేషనల్, యజుర్ ఫైబర్స్ ఐపీఓలు ఈనెల 7-9 తేదీల్లో రాబోతున్నాయి.
- విక్టరీ ఎలక్ట్రిక్ వెహికల్స్ ఇంటర్నేషనల్ రూ.34.56 కోట్లు సమీకరించే లక్ష్యంతో, ఐపీఓలో 84.3 లక్షల షేర్లను, ఒక్కోటి రూ.41 చొప్పున విక్రయించబోతోంది. యజుర్ ఫైబర్స్ 69.2 లక్షల షేర్లను విక్రయించడం ద్వారా రూ.120.4 కోట్లు సమీకరించనుంది. ధరల శ్రేణి రూ.168-174.
- రబ్బర్ విడిభాగాలు తయారు చేసే డిఫ్రెయిల్ టెక్నాలజీస్ ఐపీఓ ఈ నెల 9-13 తేదీల్లో రాబోతోంది. 18.6 లక్షల షేర్లను విక్రయించడానికి సిద్ధమవుతోంది. ధరల శ్రేణి వెల్లడించలేదు.

మేనకూరులో మరో సౌర ఫలకాల పరిశ్రమ

- రూ.3,538 కోట్ల పెట్టుబడులు
- వెబ్‌సోల్‌తో ప్రభుత్వం ఒప్పందం

నాయుడుపేట, న్యూస్‌టుడే: తిరుపతి జిల్లా మేనకూరు ప్రత్యేక ఆర్థిక మండలిలో వెబ్‌సోల్ రెన్యూవబుల్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.3,538 కోట్ల పెట్టుబడులతో సౌరఫలకాల తయారీ ప్లాంటు నెలకొల్పడానికి ఏపీ ఆర్థిక అభివృద్ధి బోర్డు (ఏపీఈడీబీ)తో ఒప్పందం చేసుకుంది. ప్రత్యేక ఆర్థిక మండలి భూముల్లో, కొత్తగా నోటిఫై చేసిన ప్రాంతంలో 120 ఎకరాల భూమిని ఏపీఐఐసీ కేటాయించింది. తన ఉత్పత్తి సామర్థ్యాన్ని 5.2 గిగావాట్లకు విస్తరించుకునే ప్రయత్నంలో, ఆధునిక సాంకేతిక పద్ధతుల ద్వారా సౌర ఫలకాలు తయారు చేయనున్నట్లు వెబ్‌సోల్ ఎండీ ఎస్.ఎల్.అగర్వాల్ తెలిపారు. 2028 నాటికి 2 వేల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. మొదటి దశలో 2 గిగావాట్లు, రెండో దశలో 2 గిగావాట్ల సౌర సెల్ తయారీ సామర్థ్యంతో ఇక్కడ ప్లాంటు నిర్మిస్తామన్నారు. ఇదే ప్రాంతంలో ప్రీమియర్ ఎనర్జీస్ రూ.1,743 కోట్లతో సౌరఫలకాల తయారీ పరిశ్రమను ఏర్పాటు చేస్తోంది.


కోడి గుడ్లు
5న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	600	తూ/ప గోదావరి	625
వరంగల్	602	విశాఖపట్నం	610
విజయవాడ	620	చిత్తూరు	683

పసిడిలో లాభాల స్వీకరణ!


కమొడిటీస్ ఈ వారం

పసిడి




పసిడి జనవరి కాంట్రాక్టు ఈవారం రూ.1,38,098 కంటే ఎగువన ట్రేడ్ కాకుంటే లాభాల స్వీకరణ కొనసాగే అవకాశం ఉంటుంది. రూ.1,34,067 కంటే దిగువకు వస్తే.. రూ.1,30,565 వరకు దిద్దుబాటు కావచ్చు. ఒకవేళ సానుకూల ధోరణిలో కదలాడితే రూ.1,39,364 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. ఈ స్థాయిని అధిగమిస్తే రూ.1,42,976; రూ.1,45,508 వరకు పెరగొచ్చు.

వెండి



వెండి మార్చి కాంట్రాక్టు రూ.2,45,386 కంటే ఎగువన కదలాడకుంటే.. షార్ట్ సెల్ పొజిషన్ల వైపు మొగ్గు చూపొచ్చు. అయితే రూ.2,21,342 వద్ద మద్దతు లభించొచ్చు. ఈ స్థాయిని కోల్పోతే రూ.2,06,086; రూ.1,89,671 వరకు దిగిరావచ్చు. ఒకవేళ రూ.2,53,015 కంటే పైకి వెళితే రూ.2,69,430; రూ.2,84,686 వరకు రాణించొచ్చు.

ప్రాథమిక లోహాలు



- రాగి జనవరి కాంట్రాక్టు రూ.1,244.95 కంటే దిగువకు వస్తే రూ.1,148.95; రూ.1,102 వరకు దిద్దుబాటు అవ్వొచ్చు. రూ.1,244.65 కంటే దిగువన చలించకుంటే మాత్రం లాంగ్ పొజిషన్ల వైపు మొగ్గు చూపొచ్చు.
- సీసం జనవరి కాంట్రాక్టుకు రూ.186.95 వద్ద స్టాప్‌లాస్ పెట్టుకుని, రూ.184.95 దిగువన షార్ట్ సెల్ చేయడం మంచిది. ఒకవేళ రూ.188.85 కంటే పైకి వెళితే రూ.195.85; రూ.202.70 వరకు పెరగొచ్చు.
- జింక్ జనవరి కాంట్రాక్టు రూ.319.35 కంటే ఎగువన కదలాడకుంటే షార్ట్ సెల్ పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.299.15 వద్ద మద్దతు లభించొచ్చు.
- అల్యూమినియం జనవరి కాంట్రాక్టుకు రూ.299.15 ఎగువన లాంగ్ పొజిషన్లను కొనసాగించొచ్చు లేదంటే మరిన్ని పొజిషన్లను జతచేసుకోవచ్చు. అయితే రూ.308 తర్వాత నుంచి లాభాలు స్వీకరించడం మంచిది.

ఇంధన రంగం



- ముడి చమురు జనవరి కాంట్రాక్టు రూ.5,252 కంటే పైన కదలాడితే రూ.5,344; రూ.5,409 వరకు పెరగొచ్చు. ఒకవేళ రూ.5,097 కంటే కిందకు వస్తే రూ.5,032; రూ.4,941 వరకు దిద్దుబాటు కావచ్చు.
- సహజవాయువు జనవరి కాంట్రాక్టు రూ.321.80 కంటే దిగువన కదలాడితే, మరింత కిందకు చేరొచ్చు. ఒకవేళ ఈ స్థాయి కంటే పైన చలిస్తే రూ.342.15; రూ.367.25 వరకు పెరగొచ్చు.

వ్యవసాయ ఉత్పత్తులు



- పసుపు ఏప్రిల్ కాంట్రాక్టుకు రూ.19,222 లక్ష్యంతో, రూ.17,531 ఎగువన లాంగ్ పొజిషన్లు కొనసాగించవచ్చు. ఒకవేళ ప్రతికూల ధోరణిలో చలిస్తే రూ.17,126 వద్ద మద్దతు లభించొచ్చు. ఈ స్థాయిని కోల్పోతే రూ.15,840; రూ.15,030 వరకు దిద్దుబాటు అవ్వొచ్చు.
- జీలకర్ర ఏప్రిల్ కాంట్రాక్టుకు రూ.23,370 వద్ద స్టాప్‌లాస్ పరిగణిస్తూ, షార్ట్ సెల్ పొజిషన్లు అట్టేపెట్టుకోవచ్చు. అయితే రూ.22,000 వద్ద మద్దతు లభించొచ్చు. ఈ స్థాయిని కోల్పోతే రూ.21,280; రూ.20,630 వరకు దిగి రావచ్చు. ఒకవేళ రూ.23,370 కంటే పైకి వెళితే రూ.24,020; రూ.24,740 వరకు పెరగొచ్చు.

– ఆర్ఎల్‌పీ కమొడిటీ అండ్ డెరివేటివ్స్

గతవారం కదలికలు ఇలా

కమొడిటీ	ప్రారంభం (రూ.లలో)	ముగింపు (రూ.లలో)	వృద్ధి/క్షీణత (శాతంలో)
పసిడి (ఫిబ్రవరి)	1,39,808	1,35,752	-2.90
వెండి (మార్చి)	2,47,194	2,36,599	-4.29
రాగి (జనవరి)	1,297.85	1,288.85	-0.69
సీసం (జనవరి)	183.45	182.75	-0.38
జింక్ (జనవరి)	313.05	306.85	-1.98
అల్యూమినియం (జనవరి)	301	302.60	0.53
ముడి చమురు (జనవరి)	5,182	5,161	-0.41
సహజ వాయువు (జనవరి)	354	332.80	-5.99
పసుపు (ఏప్రిల్)	17,200	18,412	7.05
జీలకర్ర (జనవరి)	22,500	22,720	0.98

సానుకూలతలున్నా.. అప్రమత్తతే

స్టాక్ మార్కెట్ ఈ వారం

- జీడీపీ ముందస్తు అంచనాలు కీలకం
- కార్పొరేట్ల డిసెంబరు త్రైమాసిక ఫలితాలు కూడా
- లోహ, వాహన, సిమెంటు షేర్లు రాణించొచ్చు

విశ్లేషకుల అంచనాలు



దేశీయ స్టాక్ మార్కెట్లలో, సమీప భవిష్యత్తులో సానుకూలతలు కొనసాగొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. భారత్-అమెరికా ఒప్పందం మరింత ఆలస్యమైతే, రూపాయి బలహీనపడొచ్చు. బుధవారం వెలువడే తొలి ముందస్తు జీడీపీ (2025-26) అంచనాల కోసం మదుపర్లు ఎదురు చూస్తున్నారు. 2026లో ఈక్విటీ మదుపర్లకు మెరుగైన ప్రతిఫలాలే కనిపించొచ్చని, అయితే విదేశీ పెట్టుబడుల ప్రవాహంపైనే ఆధారపడి ఉంటుందని చెబుతున్నారు. విదేశీ పోర్టుఫోలియో మదుపర్లు, ఈనెల తొలి 2 రోజుల్లోనే రూ.7,608 కోట్ల విక్రయాలు జరపడం గమనార్హం. గతేడాది తరహాలోనే ఈ ఏడాదిలోనూ నిఫ్టీ-50 లాభాలు ఉండొచ్చని, కార్పొరేట్ ఫలితాలు బాగుంటే, మరింత ప్రతిఫలం లభిస్తుందని ఓ బ్రోకరేజీ అంటోంది. ఈనెల 12న టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్ ఫలితాలు వెల్లడి కానున్నాయి. వివిధ రంగాలపై విశ్లేషకుల అంచనాలు ఇలా..

- ఆర్థిక ఫలితాలకు ముందు ఈవారం నిఫ్టీ **బ్యాంక్** రాణించొచ్చు. దీనికి 59,800-59,500 వద్ద కీలక మద్దతు ఉంది. 60,500-60,700 వద్ద నిరోధం ఎదురుకావొచ్చు. 59,500 దిగువన లాంగ్ పొజిషన్ల నుంచి ట్రేడర్లు బయటకు వచ్చే అవకాశం ఉన్నందున, సెంటిమెంటు బలహీనపడొచ్చు.
- **లోహ** కంపెనీల షేర్లు మరిన్ని లాభాలు అందించొచ్చు. కేంద్ర విధానాలు, స్థూల ఆర్థిక అంశాలు కలిసిరావొచ్చు. 'పడినప్పుడల్లా కొనుగోలు చేయడం' మంచి పద్ధతి అవుతుంది. స్వల్పకాలంలో నిఫ్టీ లోహ సూచీ సానుకూలంగానే కనిపిస్తోంది. ఓవర్‌బాట్ పరిస్థితుల వల్ల తక్కువ శ్రేణిలో కదలికలుండొచ్చు.
- **టెలికాం** కంపెనీ వొడాఫోన్ ఐడియా షేరుకు కొంత విక్రయాల ఒత్తిడి ఉండొచ్చు. ఏజీఆర్ బకాయిల విషయంలో లభించిన ఊరట ప్రభావం పెద్దగా కనిపించకపోవచ్చు. రూ.6 లక్ష్యంతో ఈ షేరును విక్రయించొచ్చని ఓ బ్రోకరేజీ చెబుతోంది. భారతీ ఎయిర్‌టెల్‌కు రూ.2,140 వద్ద నిరోధం, రూ.2,000 వద్ద మద్దతు కనిపిస్తోంది.
- **చమురు-గ్యాస్** కంపెనీల షేర్లు సమీప కాలంలో సానుకూల ధోరణిలో చలించొచ్చు. నిఫ్టీ ఆయిల్-గ్యాస్ సూచీకి 12,100-11,950 వద్ద మద్దతు, 12,600-12,700 వద్ద నిరోధం కనిపిస్తోంది.
- ఫలితాలకు ముందు **యంత్రపరికరాల** షేర్లు ఒక శ్రేణిలోనే చలించొచ్చు. ప్రధాన కంపెనీలన్నీ బలమైన ఆదాయ వృద్ధిని నమోదు చేయొచ్చు. అయితే ఆర్డర్లు రాక తగ్గడం, షేర్ల అధిక ధరల కారణంగా ఈ రంగ షేర్లకు విక్రయాల ఒత్తిడి ఏర్పడొచ్చు.
- **వాహన** కంపెనీల షేర్లు రాణించొచ్చు. రిటెయిల్ గిరాకీ కొనసాగుతుండడం, ఎగుమతులు బాగుండడం ఇందుకు నేపథ్యం. షేర్ల ధరలు అధికంగా ఉన్నా, ఫలితాలు బాగుంటాయన్న అంచనాల మధ్య కాస్త పెరగొచ్చనే భావిస్తున్నారు.
- కొంత స్తబ్దత తర్వాత విలువలు పుంజుకుంటుండడంతో, **ఐటీ** షేర్లు లాభాలు అందుకోవచ్చు. ఫెడ్ వడ్డీ రేటు కోతల అనంతరం క్లయింట్ల వ్యయాలు పెరగొచ్చన్న అంచనాలకు తోడు, ఏఐ ఆధారిత సేవలకు గిరాకీ పెరుగుతుండడం కలిసిరావొచ్చు.
- ఈ నెలలో **సిమెంటు** ధరలు పెరగొచ్చన్న అంచనాల మధ్య సిమెంటు రంగ షేర్లు మెరవవచ్చు. దక్షిణాది రాష్ట్రాల్లో 50 కిలోల బస్తా ధర రూ.20-30 వరకు పెరగొచ్చని హైదరాబాద్‌కు చెందిన ఒక సిమెంటు తయారీ కంపెనీ అంటోంది.
- **ఎఫ్ఎంసీజీ** కంపెనీల షేర్లు నష్టపోవచ్చు. ఈ సూచీ 54,000 - 57,500 స్థిరీకరణ శ్రేణిలో, దిగువ స్థాయి కంటే కిందకు రావడం ఇందుకు నేపథ్యం. సిగరెట్లపై ఎక్సైజ్ సుంకం విధించడంతో ఐటీసీ షేరు 2023 ఫిబ్రవరి తర్వాత అత్యంత కనిష్ఠ స్థాయి(రూ.350.05)కి చేరింది.
- ప్రభావం చూపే వార్తలు లేనందున **ఔషధ** కంపెనీల షేర్లు ఒక శ్రేణికి లోబడి ట్రేడవవచ్చు. త్రైమాసిక ఫలితాల కారణంగా రాబోయే వారాల్లో ఎంపిక చేసిన ఫార్మా షేర్లు కాస్త పెరగొచ్చు.

వాహన	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అశోక్ లేలాండ్	188.78	193.70	181.30
బజాజ్ ఆటో	9502.50	9804.50	9159.50
ఐషర్ మోటార్స్	7334.50	7422.80	7253.80
హీరో మోటోకార్ప్	5933.00	6100.30	5791.30
ఎం అండ్ ఎం	3802.40	3854.70	3717.10
మారుతీ	16960.00	17170.00	16618.00
టీవీఎస్ మోటార్	3847.80	3928.80	3785.20

ఎఫ్ఎంసీజీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
బ్రిటానియా ఇండస్ట్రీస్	5984.50	6077.80	5894.80
కోల్గేట్ పామోలివ్	2090.10	2116.50	2067.10
డాబర్ ఇండియా	522.60	543.30	488.60
ఇమామీ	522.55	534.90	511.90
హిందుస్థాన్ యునిలీవర్	2348.00	2378.30	2306.90
ఐటీసీ	350.05	366.50	337.00
మారికో	757.75	772.10	744.00

యంత్రపరికరాలు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భెల్	299.50	306.60	288.00
సీజీ పవర్	649.10	660.00	632.70
ఎల్ అండ్ టీ	4163.40	4200.00	4108.80
సీమెన్స్	3097.70	3149.90	3032.30
థెర్మాక్స్	3025.90	3097.60	2971.20

బ్యాంకింగ్	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	1001.60	1012.30	983.50
ఐసీఐసీఐ బ్యాంక్	1355.40	1370.10	1328.90
ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్	85.92	87.70	84.60
ఇండస్‌ఇండ్ బ్యాంక్	902.45	920.30	881.30
కోటక్‌మహీంద్రా బ్యాంక్	2195.10	2248.60	2153.80
పీఎన్‌బీ	125.35	127.00	123.00
ఎస్‌బీఐ	998.95	1023.00	971.90

చమురు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
రిలయన్స్ ఇండస్ట్రీస్	1592.30	1604.80	1572.00
బీపీసీఎల్	381.45	389.40	374.00
హెచ్‌పీసీఎల్	495.85	506.00	487.20
ఐఓసీఎల్	166.79	168.80	163.90
ఓఎన్‌జీసీ	241.46	245.30	236.00
ఆయిల్ ఇండియా	428.85	434.10	423.70

లోహ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హిండాల్కో	925.70	947.30	885.80
హిందుస్థాన్ జింక్	628.80	640.00	608.70
ఎన్ఎండీసీ	84.53	85.60	83.30
సెయిల్	147.47	149.80	145.80
టాటా స్టీల్	182.88	185.00	180.50
వేదాంతా	616.95	627.90	598.20

ఐటీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌సీఎల్ టెక్	1640.20	1654.00	1618.20
ఇన్ఫోసిస్	1640.40	1653.10	1621.10
పర్సిస్టెంట్ సిస్టమ్స్	6289.50	6382.50	6182.50
టీసీఎస్	3250.70	3276.30	3206.70
టెక్ మహీంద్రా	1612.00	1628.20	1593.80
విప్రో	269.00	275.40	262.90

ఔషధ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అరబిందో ఫార్మా	1,215.40	1,233.80	1,182.80
బయోకాన్	392.95	399.80	383.00
సిప్లా	1,511.60	1,528.50	1,490.10
డాక్టర్ రెడ్డీస్	1,256.10	1,271.50	1,228.30
గ్లెన్‌మార్క్ ఫార్మా	2,064.50	2,104.80	2,000.80
నాట్కో ఫార్మా	893.05	910.30	878.60

సిమెంటు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
ఏసీసీ	1748.80	1760.70	1731.10
అంబుజా సిమెంట్స్	565.40	571.70	555.00
ఇండియా సిమెంట్స్	445.40	454.60	431.70
శ్రీ సిమెంట్	27045.00	27338.30	26558.30
అల్ట్రాటెక్ సిమెంట్	11899.00	12045.70	11747.70

టెలికాం	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భారతీ ఎయిర్‌టెల్	2,106.30	2136.80	2082.80
ఎమ్‌టీఎన్ఎల్	36.77	37.20	36.10
టాటా కమ్యూనికేషన్స్	1790.10	1839.40	1758.80
వొడాఫోన్ ఐడియా	11.78	12.20	11.40

కరెంట్ అఫైర్స్

మాదిరి ప్రశ్నలు



◆ కామెరూన్ దేశ అధ్యక్షుడిగా ఇటీవల వరుసగా 8వసారి ఎవరు తిరిగి ఎన్నికయ్యారు? (92 ఏళ్ల ఈయన ఈ విజయంతో ప్రపంచంలోనే అత్యంత పెద్ద వయసు ఉన్న దేశాధ్యక్షుడిగా ఘనత సాధించారు. ఈ దేశ మొదటి అధ్యక్షుడు అహ్మదౌ అహిద్జో రాజీనామా తర్వాత 1982లో ఈయన తొలిసారిగా అధికారంలోకి వచ్చి ఇంకా కొనసాగుతున్నారు.) జ: పాల్ బియా

◆ 2025, అక్టోబరు 26న ఆగ్నేయాసియా దేశాల సంఘంలో అధికారికంగా 11వ సభ్యదేశంగా ఏది చేరింది? (కౌలాలంపూర్‌లో జరిగిన ASEAN శిఖరాగ్ర సమావేశంలో ఈ చరిత్రాత్మక చేరిక జరిగింది. ఇండోనేసియా నుంచి 2002లో స్వాతంత్ర్యం పొందిన ఈ దేశ రాజధాని దిలి.) జ: తూర్పు తైమూర్ (తైమూర్-లేస్తే అనే పేరుతో కూడా పిలుస్తారు.)


◆ భారత్ తొలిసారిగా యూకేకు జీఐ ట్యాగ్ చేసిన ఏ రెండు నిమ్మకాయ రకాలను ఎగుమతి చేసింది? జ: ఇండి లైమ్ (కర్ణాటక), పులియంగుడి లైమ్ (తమిళనాడు)

◆ రఫేల్ ఫైటర్ జెట్‌లో ప్రయాణించిన మొదటి భారత రాష్ట్రపతిగా ఇటీవల ద్రౌపది ముర్ము ఘనత సాధించారు. ఈమె ఏ రాష్ట్రంలోని అంబాలా వైమానిక దళం స్టేషన్ నుంచి రఫేల్ యుద్ధ విమానంలో 30 నిమిషాల పాటు ప్రయాణించారు? జ: హరియాణా

మరింత సమాచారం

అనుబంధాలకు ఆత్మీయ కొలమానాలు!

ప్రతి మనిషికి రక్త సంబంధం లేదా వివాహం ద్వారా బంధువులు ఏర్పడుతుంటారు. ఈ మానవ బంధాలను ఒక క్రమపద్ధతిలో ఉంచడానికి, వారి మధ్య సామాజిక సంబంధాల్లో గందరగోళం లేకుండా ఒకరినొకరు సులభంగా సంబోధించుకోవడానికి కొన్ని బంధుత్వ ప్రమాణాలను రూపొందించారు. అవి ఒక వ్యక్తికి, ఇతరులతో ఉన్న సంబంధం, హోదా, హక్కులు, బాధ్యతలను తెలియజేస్తాయి. సమాజంలో ప్రతి వ్యక్తికీ ప్రత్యేక స్థానాన్ని ప్రతిపాదిస్తాయి. సమాజ స్థిరత్వాన్ని కాపాడుతూ వ్యక్తులకు వారసత్వం, సామాజిక బాధ్యతలు సహజంగా అలవాటయ్యే విధంగా చేస్తాయి. అన్న, తమ్ముడు, అత్త, మామ, తాత, మనవడు మొదలైన కుటుంబ సంబంధాల తీరుతెన్నులను వివరించే ఆ ఆత్మీయ కొలమానాలపై పోటీ పరీక్షల అభ్యర్థులకు సంపూర్ణ అవగాహన ఉండాలి. మానవ శాస్త్రవేత్తలు సూచించిన బంధుత్వ ప్రమాణాల రకాలు, వాటి ఉద్దేశాలను అర్థం చేసుకోవాలి.




బంధుత్వ ప్రమాణాలు

ఒక సమాజంలోని వ్యక్తుల మధ్య ఉన్న సంబంధాలను గుర్తించడానికి, వారిని సంబోధించడానికి ఉపయోగించే పదజాలాన్నే బంధుత్వ ప్రమాణం అంటారు. ఇది ఒక వ్యక్తికి కుటుంబంలో, సమాజంలో నిర్దిష్ట స్థానాన్ని కల్పిస్తుంది. ప్రధానంగా రక్త సంబంధీకులను, వివాహం ద్వారా ఏర్పడే బంధువులను ఈ పదాలు వేరుచేస్తాయి. ఇందులోని 'వర్గీకరణ' పద్ధతిలో ఒకే పదాన్ని వేర్వేరు సంబంధాలకు వాడతారు. ఉదాహరణకు: ఇంగ్లిష్‌లోని 'అంకుల్' అనే పదం బాబాయి, పెద్దనాన్న, మామయ్య అందరికీ వర్తిస్తుంది. వర్ణనాత్మక పద్ధతిలో ప్రతి సంబంధానికి ఒక ప్రత్యేక పదం ఉంటుంది. ఉదాహరణకు: తెలుగులో తల్లికి, పినతల్లికి, మేనత్తకు వేర్వేరు పేర్లు ఉంటాయి. ఈ పదాలు కేవలం పిలుపులు మాత్రమే కాదు, ఆ వ్యక్తుల మధ్య ఉండాల్సిన బాధ్యతలు, హక్కులు, గౌరవ మర్యాదలను తెలియజేస్తాయి. సమాజంలో ఎవరిని వివాహం చేసుకోవచ్చు, ఎవరిని చేసుకోకూడదు అనే విషయాన్నీ ఈ పదాలు స్పష్టం చేస్తాయి.




జార్జ్ పీటర్ మర్డక్

ఆస్తి వారసత్వం, వంశం తండ్రి వైపు నుంచి వస్తుందా లేదా తల్లి వైపు నుంచి వస్తుందా అనేది ఈ నామకరణం ద్వారా తెలుస్తుంది. జార్జ్ పీటర్ మర్డక్, క్రోబర్, లూయీ అనే ప్రఖ్యాత మానవ శాస్త్రవేత్తలు బంధుత్వానికి సంబంధించి జరిపిన పరిశోధనల ఆధారంగా తొమ్మిది రకాల బంధుత్వ ప్రమాణాలను రూపొందించారు.




క్రోబర్

1 తరాల ప్రమాణం




ఈ ప్రమాణాన్ని ఆధారంగా చేసుకుని వివిధ తరాలకు చెందిన బంధువులను గుర్తిస్తారు. ఒక్కోతరంలోని బంధువులకు ఒక్కోరకం బంధుత్వ పదాలను ఉపయోగిస్తారు. ఒక వ్యక్తికి తన తరంలో అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లు ఉంటారు. అతడి పై తరంలో తల్లిదండ్రులు ఉంటారు. ఇంకా పై తరంలో తాతలు, ముత్తాతలు ఉంటారు. తన కింది తరంలో కుమారులు, కుమార్తెలు ఉంటారు.

2 లింగ నిర్ణయ ప్రమాణం



చాలా సమాజాల్లో లింగనిర్ణయ ప్రమాణం ఆధారంగా ఆడ, మగ తేడాలు తెలిపే బంధుత్వ పదాలను ఉపయోగిస్తారు. ఇవి స్త్రీ, పురుష లింగ భేదాన్ని సూచిస్తాయి. తల్లి, తండ్రి, భార్య, భర్త, కుమార్తె, కుమారుడు మొదలైన బంధుత్వ పదాలన్నీ వారి బంధుత్వ సంబంధంతోపాటు వారి లింగాన్ని కూడా సూచిస్తాయి.

3 వైవాహిక బాంధవ్య ప్రమాణం



సమాజంలో ప్రతి వ్యక్తికి చాలా వరకు ఏకరక్త బంధువులు, వైవాహిక బంధువులు ఉంటారు. అయితే ఎవరు ఏకరక్త బంధువులో, ఎవరు వైవాహిక బంధువులో సమాజమే నిర్ణయిస్తుంది. ఇందుకు అనుగుణంగానే బంధుత్వ పరిభాష రూపొందింది.

భారతీయ సమాజం

4 జ్ఞాతి బాంధవ్య ప్రమాణం



ఏక రక్త బంధువర్గంలోని ఒకే తరానికి చెందిన వారిలో ఒక వ్యక్తికి కొందరు దగ్గరి బంధువులు, మరికొందరు దూరపు బంధువులు అవుతారనే వాస్తవంపై ఈ ప్రమాణం ఆధారపడింది. ఒక వ్యక్తికి తన పినతండ్రి, పెదతండ్రి, మేనమామలు, వారి సంతానం కంటే తన తల్లిదండ్రులు, సోదరి, సోదరులు దగ్గరి బంధువులవుతారు. మిగతా వారంతా దూరపు బంధువులవుతారు. దంపతులకు బిడ్డ పుడితే ఆ బిడ్డ వారిద్దరికీ వంశానుక్రమ సంబంధం ద్వారా రక్తబంధువు అవుతుంది. వంశానుగత సంబంధాల వల్ల ఒక వ్యక్తికి బంధువైన వారు ఆ వ్యక్తి వంశజ్ఞులు అవుతారు. వారికి రెండో బిడ్డ పుడితే వంశానుక్రమానికి సంబంధించి కొత్త సంబంధాలు ఏర్పడతాయి. మొదటి బిడ్డకు, రెండో బిడ్డకు బంధుత్వం ఏర్పడుతుంది. ఈ బంధుత్వాన్నే జ్ఞాతీయత అంటారు. వీరు వంశానుక్రమాన్ని పంచుకుని పుట్టారు. అంటే ఒకే దంపతుల రక్తాన్ని పంచుకుని పుట్టారు. అందువల్ల వారు జ్ఞాతులు. జ్ఞాతులు, వంశానుగత బంధువులు ఏకరక్త బంధువులే. అయితే కొన్ని సమాజాలు ఇలాంటి భేదాన్ని పాటించవు. అందువల్ల జ్ఞాతులను, వంశానుగత బంధువులను కలిపి ఒకే బంధుత్వ పదంతో పిలుస్తారు. ఉదాహరణకు తల్లిని, తల్లి సోదరిని, తండ్రి సోదరిని ఒకే బంధుత్వ పదంతో పిలుస్తారు. కొన్ని సమాజాల్లో ఒక వ్యక్తి బిడ్డలకు, ఆ వ్యక్తి సోదరి, సోదరుల సంతానానికి ఒకే బంధుత్వ పదాన్ని ఉపయోగిస్తారు.

5 ద్విదాకరణ ప్రమాణం



ఈ ప్రమాణం ద్వితీయ బంధువులకు, తృతీయ బంధువులకు సంబంధించి ఉంటుంది. ఈ ద్విదాకరణ ప్రమాణం ప్రకారం ఒక వ్యక్తి మరొక వ్యక్తికి పురుషుడి ద్వారా బంధుత్వం అయితే ఒక బంధుత్వ పదాన్ని, స్త్రీ ద్వారా బంధువు అయితే మరొక బంధుత్వ పదాన్ని ఉపయోగిస్తారు. ఆ రెండు విధాలుగా బంధువులైన వారందరినీ ఒకే పదంతో ఉదహరిస్తే అది వర్గాత్మక బంధుత్వ పదమవుతుంది. ఉదాహరణకు తాత అనే పదం తండ్రి తండ్రికి, తల్లి తండ్రికి వర్తిస్తుంది. అలాగే మనవడు అనే పదం కొడుకు కొడుకుకి, కుమార్తె కొడుకుకి కూడా వర్తిస్తుంది.

6 ధ్రువత్వ ప్రమాణం




ఇద్దరు బంధువులు సంబోధించుకోడానికి ఒక్కొక్కరు ఒక్కో బంధుత్వ పదాన్ని ఉపయోగించడాన్ని ధ్రువత్వ ప్రమాణం అంటారు. అన్నదమ్ముల్లో ఒక వ్యక్తి 'అన్న' అంటే, రెండో వ్యక్తి 'తమ్ముడు' అంటాడు. ఇలాగే అక్కాచెల్లెళ్లు, భార్యాభర్తలు ఒకరినొకరు వేర్వేరు పదాలతో పిలుచుకుంటారు.

7 సాపేక్ష వయఃప్రమాణం



వయసు ఆధారంగా ఇద్దరు బంధువుల్లో ఒక వ్యక్తి రెండో వ్యక్తి కన్నా చిన్నవాడుగా లేదా పెద్దవాడుగా ఉంటారు. దీని ఆధారంగా ఇద్దరు సోదరుల్లో పెద్దవాడిని అన్న అని, చిన్నవాడిని తమ్ముడు అని వేర్వేరు బంధుత్వ పదాలతో పిలుచుకుంటారు.

8 వక్తృలింగ ప్రమాణం



కొన్ని సమాజాల్లో మాత్రమే ఈ ప్రమాణాన్ని అనుసరిస్తూ ఉంటారు. దీని ప్రకారం తండ్రిని కుమారుడు ఒక బంధుత్వ పదంతో, కుమార్తె మరొక బంధుత్వ పదంతో సంబోధిస్తారు.

9 మృత బాంధవ్య సూచిక ప్రమాణం

ఈ ప్రమాణాన్ని కూడా కొన్ని సమాజాల్లో మాత్రమే అనుసరిస్తూ ఉంటారు. దీని ప్రకారం ఒక వ్యక్తిని అతడు జీవించి ఉన్నప్పుడు ఒక బంధుత్వ పదంతో, చనిపోయిన తర్వాత మరొక బంధుత్వ పదంతో పిలుస్తారు.



రచయిత: బద్దం పురుషోత్తం రెడ్డి

TENTH English — **Glimpses of India**

Final Exams-2026 IMPORTANT Q & A

Section A: Reading Comprehension:

Q.No. 1-5: Read the following Passage carefully. **(5 x 2 = 10 marks)**

"Tea was first drunk in China," Rajvir added, "as far back as 2700 B.C.! In fact words such as tea, 'chai' and 'chini' are from Chinese. Tea came to Europe only in the sixteenth century and was drunk more as medicine than as beverage". The train clattered into Mariani junction. The boys collected their luggage and pushed their way to the crowded platform. Pranjol's parents were waiting for them. Soon they were driving towards Dhekiabari, the tea garden managed by Pranjol's father. An hour later, the car veered sharply off the main road. They crossed a cattle-bridge and entered Dhekiabari Tea Estate. **(Tea from Assam)**

Now, answer the following questions.

1. Who were the two friends mentioned in the passage?
2. When and where was tea first drunk?
3. In the sixteenth century in Europe, tea was drunk more as ......
   A) Medicine B) Beverage
   C) Both medicine and beverage
4. The train stopped in ......
   A) Mariani junction B) Dekiabari C) China
5. Who was working as the manager of a tea estate?
   A) Rajvir B) Pranjol C) Pranjol's father

Section B: Grammar and Vocabulary

Q.No.19: Change the following sentence into Passive Voice. **(2 Marks)**

1. Mother seagull brought the food.
2. She has written poems.
3. They have completed the project work.
4. The conductor is counting the money.
5. Students must submit the assignments by tomorrow.
6. They are constructing a new building.
7. Children complete the homework in time.
8. The post master gathered money.
9. Who teaches you English?
10. The police have solved the case and arrested two persons.

For Answers



Writer: A. Madhu babu

కాలుష్య నివారణకు క్లౌడ్ సీడింగ్!

మానవ సమాజం స్థిరంగా, సురక్షితంగా జీవించడానికి అవసరమైన, ముందుచూపుతో కూడిన సమగ్ర విధానమే విపత్తు నిర్వహణ. కేవలం ప్రకృతి విపత్తుల సమయంలో ప్రతిస్పందించడమే కాకుండా ఎప్పటికప్పుడు పర్యావరణాన్ని కాపాడుకోవడం కూడా అందులో భాగమే. దేశంలో కాలుష్యాన్ని నివారించడానికి అడవుల పెంపకం, జీవివైవిధ్యంలో కీలకమైన వన్యమృగాల పరిరక్షణ, వాటి కోసం జాతీయ పార్కులు, అభయారణ్యాల ఏర్పాటు, విస్తరణ తీరుతెన్నులతో పాటు సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన కోసం జరుగుతున్న తాజా ప్రయత్నాలు, ఆ దిశగా కనిపిస్తున్న పురోగతి, సంబంధిత అంశాలపై పోటీ పరీక్షార్థులకు తగిన పరిజ్ఞానం ఉండాలి. గత ఏడాదిలో భారత్, ఇరుగు పొరుగు దేశాల్లో సంభవించిన ప్రధాన ప్రకృతి, మానవ కారక విపత్తులు; అవి సృష్టించిన విధ్వంసం, వాటికి దారితీసిన పరిస్థితులపై వర్తమాన పరిణామాల ఆధారంగా ఒక అవగాహన ఏర్పరచుకోవాలి.

పర్యావరణం-విపత్తు నిర్వహణ

జీవవైవిధ్యం: ◆ ప్రపంచ జీవవైవిధ్య దినోత్సవం (మే 22), 2025 థీమ్: 'ప్రకృతితో సామరస్యం, స్థిరమైన అభివృద్ధి'. ◆ 2025 గోల్డ్‌మ్యాన్ ఎన్విరాన్‌మెంటల్ ప్రైజ్‌ను ఆరుగురు అట్టడుగు స్థాయి కార్యకర్తలకు అందించారు. సెమియా షుర్బి (ట్యునీషియా), బాట్మొంఖ్ (మంగోలియా), బెస్జానా గురి, ఒల్సి నికా (అల్బేనియా), కార్లోస్ మల్లో మోలినా (కెనరీ ఐలాండ్స్), మారిలోజ్ (పెరూ), లౌరినీ అలెన్ (యూఎస్ఏ) వీరిలో ఉన్నారు. పర్యావరణ పరిరక్షణలో సాహసోపేతమైన కృషికి వీరిని గుర్తించారు. భారత్‌కు చెందిన అలోక్ శుక్లా 2024లో గోల్డ్‌మ్యాన్ ఎన్విరాన్‌మెంటల్ ప్రైజ్ విజేత.

◆ 2024లో సుప్రీంకోర్టు నియమించిన కమిటీ రాజస్థాన్, గుజరాత్‌లో తీవ్రంగా అంతరించిపోతున్న గ్రేట్ ఇండియన్ బస్టర్డ్ (జీఐబీ)ను రక్షించడానికి విద్యుత్తు లైన్ల కోసం ప్రత్యేక కారిడార్లను ప్రతిపాదించింది.

◆ 2024లో జంతుజాల ఆవిష్కరణల్లో అపూర్వమైన పెరుగుదల నమోదైందని జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా నివేదించింది. అత్యధిక సంఖ్యలో కొత్త జాతులు ఉన్న రాష్ట్రంగా కేరళ అవతరించింది.

◆ 'ప్రాజెక్ట్ టైగర్'కు 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 2022లో భారత్‌లో పులుల జనాభా సర్వే విడుదలైంది. ఈ లెక్కల ప్రకారం భారత్‌లో పులుల జనాభా 3,167. ఇందులో మధ్యప్రదేశ్ (785), కర్ణాటక (563), ఉత్తరాఖండ్ (560) తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి.

2025 నాటికి..

భారత్‌లో మొత్తం 107 జాతీయ పార్కులు ఉన్నాయి. ఒడిశాలోని సిమ్లిపాల్ టైగర్ రిజర్వ్‌ను ఇటీవల 107వ జాతీయ పార్కుగా ప్రకటించారు. దేశంలో 58 టైగర్ రిజర్వ్‌లు ఉన్నాయి. ఇందులో 58వది మధ్యప్రదేశ్‌లోని మాధవ్ టైగర్ రిజర్వ్. దేశంలో 33వ ఏనుగుల సంరక్షణ కేంద్రంగా ఉత్తర్‌ప్రదేశ్‌లోని టెరాయ్ ఏనుగుల అభయారణ్యం నిలిచింది.



◆ అటవీ శాఖ 2025 సర్వే ప్రకారం సుందర్‌బన్స్ బయోస్ఫియర్ రిజర్వ్‌లో ఉప్పునీటి మొసళ్ల సంఖ్య పెరుగుతోంది. వీటి జనాభా 220 నుంచి 242 వరకు ఉంటుందని అంచనా.



దేశంలో మొదటి హార్న్‌బిల్ పరిరక్షణ కేంద్రం

తమిళనాడు ప్రభుత్వం కోయంబత్తూర్ జిల్లాలోని అన్నామలై టైగర్ రిజర్వ్‌లో దేశంలోనే మొదటి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ హార్న్‌బిల్ కన్జర్వేషన్‌ను ప్రారంభించింది. అడవుల పునరుత్పత్తికి హార్న్‌బిల్స్ ఎంతో ముఖ్యమైనవి. ఇవి స్థానిక చెట్ల విత్తనాలను వెదజల్లుతాయి. జీవవైవిధ్యం, అటవీ ఆరోగ్యాన్ని కాపాడతాయి. అటవీ రైతులుగా పిలిచే ఈ పక్షులు అంజూర, కానరియం లాంటి చెట్ల జాతుల పెరుగుదలకు తోడ్పడతాయి. వీటి క్షీణత మొత్తం పర్యావరణ వ్యవస్థలను, అటవీ ఆవాసాలపై ఆధారపడిన ఇతర వన్యప్రాణులను ప్రభావితం చేస్తుంది.



◆ పశ్చిమ కనుమల్లో రెండు కొత్త డంసెల్ ఫ్లై జాతులను గుర్తించారు. మహారాష్ట్ర, కేరళ పరిశోధకులు కొంకణ్ షాడో డంసెల్, క్రిమ్సన్ షాడో డంసెల్‌ను కనుక్కున్నారు. కొంకణ్ షాడో డంసెల్ మహారాష్ట్రలోని సింధుదుర్గ్ జిల్లాలో, క్రిమ్సన్ షాడో డంసెల్ కేరళలోని తిరువనంతపురం జిల్లాలో ఉన్నాయి. ఈ రెండూ 'షాడో డంసెల్' సమూహానికి చెందినవి.



తాజా పర్యావరణ అంశాలు

సుస్థిరాభివృద్ధి:

❖ సుస్థిరాభివృద్ధి నివేదిక-2025 ప్రకారం భారత్ సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సూచీలో 99వ స్థానంలో ఉంది. ఈ ర్యాంకింగ్‌లో ముందంజలో ఉన్న దేశాలు: 1) ఫిన్లాండ్ 2) స్వీడన్ 3) డెన్మార్క్. ❖ వాతావరణ మార్పులపై ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో జరిగే సమావేశాల్లో భాగంగా 30వ సదస్సు (కాప్ 30) 2025, నవంబరులో బ్రెజిల్‌లోని 'బెలెమ్'లో జరిగింది. ❖ సెంట్రల్ గ్రౌండ్ వాటర్ అథారిటీ 2024లో 'భు-నీర్' పోర్టల్‌ను ప్రారంభించింది. దేశంలోని 19 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో భూగర్భ జల నియంత్రణను క్రమబద్ధీకరించడం దీని లక్ష్యం.

❖ రామ్‌సర్ కన్వెన్షన్ ఆన్ వెట్‌ల్యాండ్స్ (కాప్-15) కాంట్రాక్టింగ్ పార్టీల సమావేశం 2025, జులైలో జింబాబ్వేలోని విక్టోరియా జలపాతం వద్ద జరిగింది.

స్వచ్ఛ సర్వేక్షణ్ 2024-25: స్వచ్ఛ సర్వేక్షణ్ ఫలితాల్లో దేశంలోని అత్యంత పరిశుభ్రమైన నగరాలుగా ఇందౌర్, సూరత్, నవీ ముంబయి తొలి మూడు స్థానాల్లో నిలిచాయి.

కాలుష్య నివారణ: దిల్లీలో విపరీతంగా పెరిగిపోతున్న వాయు కాలుష్యాన్ని నియంత్రించేందుకు క్లౌడ్ సీడింగ్ ప్రారంభించారు. కృత్రిమ వర్షపాతం ద్వారా కాలుష్యాన్ని తగ్గించాలనేది దీని లక్ష్యం. దిల్లీలో మొదటి క్లౌడ్ సీడింగ్‌ను 2025 ఆగస్టు-సెప్టెంబరు మధ్యలో నిర్వహించారు.

ఇటీవలి విపత్తులు

● భారత తూర్పు తీరాన్ని 2024, నవంబరులో తాకిన తుపాను 'ఫెంగల్'. ఇది తమిళనాడు, పుదుచ్చేరిలో తీరం దాటింది. 2023, డిసెంబరులో 'మిచాంగ్' తుపాను బంగాళాఖాతంలో ఏర్పడి గరిష్ఠ తీవ్రతకు చేరాక ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు, మచిలీపట్టణం మధ్య తీరాన్ని తాకింది. **మయన్మార్ భూకంపం:** 2025, మార్చిలో 7.7 తీవ్రతతో సంభవించిన భారీ భూకంపం మయన్మార్‌ను కుదిపేసింది. ముఖ్యంగా మండల్ నగరంలో పెను విధ్వంసం సృష్టించింది. ఇటీవల కాలంలో అత్యంత శక్తిమంతమైన భూకంపాల్లో ఇదొకటి.



మయన్మార్ భూకంపం

● జమ్ము-కశ్మీర్‌లోని రాంబన్ జిల్లాలో 2025, ఏప్రిల్‌లో కుండపోత వర్షం కారణంగా కొండచరియలు విరిగిపడటంతో పాటు ఆకస్మిక వరదలు సంభవించాయి. ప్రాణనష్టంతో పాటు గణనీయమైన మౌలిక సదుపాయాల నష్టం వాటిల్లింది.

● ఉత్తరాఖండ్‌లో ఉత్తర కాశీ జిల్లా భీర్ గంగానది తీరంలో 2025, ఆగస్టులో సంభవించిన మేఘ విస్ఫోటంతో ఆకస్మిక వరదలు వచ్చి విధ్వంసం సృష్టించాయి. సముద్ర మట్టానికి 8,600 అడుగుల ఎత్తులో ఉన్న పర్యాటక ప్రదేశమైన ధరాలి పట్టణాన్ని వరదలు ముంచెత్తాయి. ప్రాణనష్టంతో పాటు చాలామంది గల్లంతయ్యారు.



ఉత్తర కాశీలో వరదలు

● అస్సాం రాష్ట్రాన్ని 2024, జూన్‌లో భారీ వర్షాలు, వరదలు తీవ్రంగా ప్రభావితం చేశాయి. 109 మంది మృతిచెందగా, 19 జిల్లాల్లో కనీసం 1,325 గ్రామాలు మునిగిపోయాయి. కోపిలి బరాక్, కుషియారా లాంటి అనేక నదులు పొంగిపొర్లడంతో ఈ వరదలు మరింత తీవ్రమయ్యాయి.

● కేరళలోని వయనాడ్ జిల్లా వెల్లరిమలకొండ శ్రేణుల్లో 2024, జులై 30న కొండచరియలు విరిగిపడి 254 మంది మృతిచెందారు. 397 మంది క్షతగాత్రులవగా, 118 మంది గల్లంతయ్యారు. అటవీ నిర్మూలన, భూకంప సున్నితత్వం, పేలవమైన భవన నిర్మాణం కొండచరియలు విరిగిపడటానికి కారణాలుగా గుర్తించారు. ఆధునిక కేరళ చరిత్రలో అతి పెద్ద కొండచరియ విపత్తు ఇదే.

● 2025, జూన్ 30న సంగారెడ్డి జిల్లా, పాశమైలారంలోని ఓ రసాయన కర్మాగారంలో రియాక్టర్ యూనిట్ పేలిపోవడంతో 40 మంది మరణించారు, 53 మంది గాయపడ్డారు.

● చైనాలోని టిబెటన్ ప్రాంతం, నేపాల్‌లోని కొన్ని ప్రాంతాల్లో 2025, జనవరిలో 7.1 తీవ్రతతో సంభవించిన భూకంపం వందల ప్రాణాలు బలిగొంది. భూకంప కేంద్రం మౌంట్ ఎవరెస్ట్ ప్రాంతానికి సమీపంలోని లాసా టెర్రేన్‌లోని టింగ్రి కౌంటీలో ఉంది.

తొలి తోడేళ్ల అభయారణ్యం



దేశంలో తొలి తోడేళ్ల అభయారణ్యాన్ని ఝార్ఖండ్‌లో లతేహర్ జిల్లాలోని 'మహువాడనర్' అభయారణ్యంలో ఏర్పాటు చేశారు. 63 చ.కి.మీ. విస్తీర్ణంలో ఉన్న ఈ ప్రదేశంలో బూడిద రంగు తోడేళ్లను సంరక్షిస్తున్నారు. 1976లో స్థాపించిన పలామౌ టైగర్ రిజర్వ్‌లో మహువాడనర్ అభయారణ్యం ఒక భాగం. ఇక్కడి తోడేళ్లు ఐయూసీఎన్ రెడ్ లిస్ట్‌లో ఉన్నాయి. తోడేళ్లతో పాటు మచ్చల జింక, అడవి పంది, హైనా, ఎలుగుబంటి లాంటి జీవులున్నాయి.

మాదిరి ప్రశ్నలు

1. 1994లో వరల్డ్ కాన్ఫరెన్స్ ఆన్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సదస్సు జరిగిన యొకోహామ్ నగరం ఏ దేశంలో ఉంది?
   1) చైనా 2) తైవాన్ 3) జపాన్ 4) దక్షిణ కొరియా
2. దేశంలో ఏటా వరదకు గురయ్యే ప్రమాదమున్న ప్రాంతం ఎన్ని మిలియన్ హెక్టార్లు?
   1) 80 2) 45 3) 100 4) 150
3. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ ఏ నగరంలో ఉంది?
   1) చెన్నై 2) హైదరాబాద్ 3) బెంగళూరు 4) విశాఖపట్నం
4. హుద్ హుద్ తుపాను ఏ రకమైన విపత్తు?
   1) పెను తుపాను 2) తీవ్ర పెను తుపాను 3) సూపర్ సైక్లోన్ 4) అల్పపీడనం
5. ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సిస్టం (ఐఎన్‌సీఓఐఎస్) ఏ నగరంలో ఉంది?
   1) హైదరాబాద్ 2) చెన్నై 3) గోవా 4) ముంబయి
6. విపత్తు నిర్వహణలో ఏయే అంశాలు ఉంటాయి?
   1) నివారణ 2) సంసిద్ధత 3) నిర్మూలన 4) పైవన్నీ
7. 1999లో ఏ రాష్ట్ర తీరంలో ప్రమాదకర భారీ సూపర్ సైక్లోన్ సంభవించింది?
   1) ఒడిశా 2) ఆంధ్రప్రదేశ్ 3) తమిళనాడు 4) మహారాష్ట్ర
8. ఇంటర్నేషనల్ సునామీ ఇన్ఫర్మేషన్ సెంటర్ ఎక్కడ ఉంది?
   1) హానోలులు 2) గోవా 3) జకార్తా 4) మాల్దీవులు
9. సైక్లోన్ అనేది ఏ భాష నుంచి వచ్చింది?
   1) గ్రీకు 2) లాటిన్ 3) జపనీస్ 4) ఫ్రెంచ్

జవాబులు

1-3; 2-2; 3-1; 4-2; 5-1; 6-4; 7-1; 8-1; 9-1.



రచయిత: సక్కరి జయకర్

లాభనష్టాలు

ముఖ్యాంశాలు

- విక్రేత తన వస్తువును అమ్మే ధరను అమ్మకపు ధర అంటారు.
- వస్తువు కొనుగోలు చేయడానికి వినియోగదారుడు చెల్లించే మొత్తాన్ని కొనుగోలు ధర అంటారు.
- కొన్న వెల కంటే అమ్మిన వెల ఎక్కువ ఉంటే లాభం వస్తుంది
  లాభం (P) = అమ్మిన వెల (SP) – కొన్న వెల (CP)
- కొన్నవెల కంటే అమ్మిన వెల తక్కువగా ఉంటే నష్టం వస్తుంది.
  నష్టం (L) = కొన్న వెల (CP) – అమ్మిన వెల (SP)
- లాభశాతం $(P\%) = \frac{\text{లాభం}}{\text{కొన్నవెల}} \times 100$
- నష్టశాతం $(L\%) = \frac{\text{నష్టం}}{\text{కొన్నవెల}} \times 100$
- రుసుమును ఎల్లప్పుడూ ప్రకటన వెలపైనే లెక్కిస్తాం.
  రుసుము = ప్రకటన వెల – అమ్మిన వెల



జీతం తగ్గించి.. పెంచితే.. రుద్రకు కలిగే నష్టశాతం?

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
అరిథ్‌మెటిక్

మాదిరి ప్రశ్నలు

1. P అనే పట్టణ జనాభా 133575 నుంచి 138918కి పెరిగింది. అయితే జనాభా పెరుగుదల శాతం ఎంత?
1) 4% 2) 3% 3) 4.25% 4) 3.75%

సాధన: జనాభా పెరుగుదల = 138918 – 133575 = 5343

$$\text{పెరుగుదల శాతం} = \frac{5343}{133575} \times 100 = 4\%$$

సమాధానం: 1

2. వస్తువు ప్రకటన ధరపై 10% కమీషన్ ఇస్తే 20% లాభం వచ్చింది. కమీషన్ 20% గా పెంచితే వచ్చే లాభం ఎంత?
1) $6\frac{2}{3}\%$ 2) $\frac{20}{3}\%$ 3) $5\frac{1}{2}\%$ 4) $7\frac{1}{2}\%$

సాధన: ప్రకటన ధర రూ.100 అనుకుందాం
కమీషన్ 10% ఇస్తే వచ్చే సొమ్ము = 90
లాభం = 20%

$$\text{ఏజెంట్‌కు అయ్యే సొమ్ము} = \left(\frac{100}{120} \times 90\right) = \text{రూ. } 75$$

కొత్త కమీషన్ = రూ. 20, ఏజెంట్‌కు వచ్చే సొమ్ము = రూ. 80
కొత్త లాభం = 80 – 75 = రూ. 5

$$\text{కొత్త లాభశాతం} = \frac{5}{75} \times 100 = 6\frac{2}{3}\%$$

సమాధానం: 1

3. ఒక ఉపకరణాన్ని రూ. 220కి అమ్మితే 10% లాభం వచ్చింది. అయితే దాని ఉత్పత్తి వ్యయం ఎంత?
1) రూ. 150 2) రూ. 205 3) రూ. 198 4) రూ. 200

సాధన: $\text{ఉత్పత్తి వ్యయం (C.P)} = \left(SP \times \frac{100}{100 + \text{లాభ శాతం}}\right)$

$$= 220 \times \frac{100}{110} = \text{రూ. } 200$$

సమాధానం: 4

4. ఒక దుకాణదారుడు కేజీ రూ. 250 చొప్పున జీడిపప్పు కొన్నాడు. దాన్ని 50 గ్రాములు రూ. 10 చొప్పున అమ్మితే అతడు పొందే లాభ లేదా నష్టశాతం?
1) 20% నష్టం 2) 20% లాభం
3) 25% నష్టం 4) 25% లాభం

సాధన: 1000 గ్రాములు కొన్న వెల = రూ. 250
1000 గ్రాములు అమ్మిన వెల = రూ. 200
నష్టం = 250 – 200 = రూ. 50

$$\text{నష్టశాతం} = \frac{\text{నష్టం}}{\text{కొన్నవెల}} \times 100 = \frac{50}{250} \times 100 = 20\% \text{ నష్టం}$$

సమాధానం: 1

5. 20 వస్తువుల కొన్నవెల x వస్తువుల అమ్మకం ధరకు సమానం. అయితే దీనిలో 25% లాభం వస్తే x విలువ ఎంత?
1) 15 2) 18 3) 21 4) 16

సాధన: $x = \frac{\text{వస్తువుల సంఖ్య} \times 100}{100 + \text{లాభ శాతం}} = \frac{20 \times 100}{125} = 16$

సమాధానం: 4

6. ఒక వ్యక్తి రూ. 23500కు ఇంటిని కొని, రూ. 4500 ఖర్చుతో మరమ్మతులు చేయించాడు. అయితే అతడు ఇంటిని ఎంతకు అమ్మితే 15% లాభం వస్తుంది?
1) రూ. 30000 2) రూ. 32200
3) రూ. 35000 4) రూ. 33300

సాధన: ఇంటికి అయిన ఖర్చు = 23500 + 4500 = రూ. 28000
లాభశాతం = 15%

$$\text{లాభం} = \frac{28000 \times (100 + 15)}{100} = \text{రూ. } 32200$$

సమాధానం: 2

7. ప్రకటన ధరలో $\frac{2}{5}$వ వంతుకు ఒక వస్తువును అమ్మితే 25 శాతం నష్టం వచ్చింది. వస్తువు ప్రకటన ధర, అమ్మకం ధరల నిష్పత్తి ఎంత?
1) 2 : 5 2) 5 : 2 3) 8 : 15 4) 15 : 8

సాధన: కొన్నవెల = 100
ప్రకటన వెలలో $\frac{2}{5}$వ వంతు = రూ. 75 (100 – 25 = 75)

$$\text{ప్రకటన వెల} = \frac{75 \times 5}{2} = \frac{375}{2}$$

$$\text{నిష్పత్తి} = \frac{375}{2} : 100 = 375 : 200 = 15 : 8$$

సమాధానం: 4

8. రుద్ర వేతనం మొదట 30% తగ్గింది. తిరిగి తగ్గించిన వేతనం 40% పెరిగింది. అయితే అతడి వేతనంలో నష్టశాతం ఎంత?
1) 2% 2) 4% 3) 5% 4) 3%

సాధన: $\frac{(100 - 30)(100 + 40)}{100} = \frac{70 \times 140}{100} = 98\%$

నష్టశాతం = 100 – 98 = 2%

సమాధానం: 1

9. ఒక వస్తువును రూ. 800కి కొని రూ. 900 అమ్మారు. అయితే మొత్తంగా వచ్చే లాభశాతం ఎంత?
1) 10% 2) $11\frac{1}{2}\%$
3) $10\frac{1}{2}\%$ 4) $12\frac{1}{2}\%$

సాధన: కొన్న వెల = 800; అమ్మిన వెల = 900
లాభం = 900 – 800 = 100

$$\text{లాభశాతం} = \frac{\text{లాభం}}{\text{కొన్నవెల}} \times 100 = \frac{100}{800} \times 100 = 12\frac{1}{2}\%$$

సమాధానం: 4

10. ఒక వ్యక్తి స్కూటర్‌ను రూ. 25,000కు కొన్నారు. ఏటా సంవత్సర ఆరంభంలో దాని విలువ 80% మాత్రమే ఉంటే మూడేళ్ల తర్వాత స్కూటర్ విలువ ఎంత?
1) రూ. 12800 2) రూ. 12000
3) రూ. 14500 4) రూ. 15000

సాధన: మూడేళ్ల తర్వాత స్కూటర్ విలువ

$$25000 \times \frac{80}{100} \times \frac{80}{100} \times \frac{80}{100} = \text{రూ. } 12800$$

సమాధానం: 1

11. ఒక వర్తకుడు కొన్నవెల కంటే 20% అధికంగా ప్రకటన వెల ఉంచి 10% రాయితీ ఇచ్చాడు. అయితే అతడికి వచ్చే లాభశాతం ఎంత?
1) 10% 2) 9%
3) 8% 4) 11%

సాధన: వస్తువు ధర = రూ. 100
ప్రకటన వెల = రూ. 120
రాయితీ = 10%

$$\text{లాభశాతం} = 120 \times \frac{90}{100}$$

= రూ. 108
లాభం = 108 – 100
= రూ. 8
లాభశాతం 8%

సమాధానం: 3



రచయిత
హెచ్. అరుణ శివప్రసాద్, విషయ నిపుణులు

882 Word of the Day

Canonical

Telugu meaning: నిజమైన, నమ్మదగిన
English meaning: The word canonical (కెనానికల్) is an adjective that describes something accepted as authentic, standard, or officially recognized, especially in literature, religion, or academic fields.
Synonyms: Authoritative, Standard
Antonyms: Nonstandard, Unofficial
Usage: 1. Shakespeare's plays are considered canonical works of English literature due to their profound cultural influence.
2. The scientist referred to the canonical laws of physics to support his argument during the lecture.


కరెంట్ అఫైర్స్



భారత వైమానికదళ ఉప అధిపతి (వైస్ చీఫ్)గా ఎయిర్ మార్షల్ నగేశ్ కపూర్ 2026, జనవరి 1న బాధ్యతలు చేపట్టారు. పదవీ విరమణ చేసిన ఎయిర్ మార్షల్ నర్మదేశ్వర్ తివారీ స్థానంలో ఆయన నియామకం జరిగింది. 1985లో జాతీయ డిఫెన్స్ అకాడమీలో శిక్షణ పూర్తి చేసుకుని 1986లో వాయుసేనలో చేరిన ఆయన.. మిగ్-21, మిగ్-29 యుద్ధ విమానాలు, శిక్షణ విమానాలు విస్తృతంగా నడిపారు. మొత్తం 3,400 గంటలసేపు లోహ విహంగాల్లో విధులు నిర్వర్తించిన అనుభవం ఉంది.



భారత మహిళల హాకీ జట్టు కోచ్‌గా షూవర్డ్ మరైన్ (నెదర్లాండ్స్) మళ్లీ నియమితులయ్యారు. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో నాలుగో స్థానంలో నిలిచిన భారత జట్టుకు మరైన్ కోచ్‌గా ఉన్నారు. తర్వాత పదవీ కాలం పూర్తవడంతో కోచ్‌గా తప్పుకున్నారు. 2025లో హరేంద్ర సింగ్ శిక్షణలో భారత జట్టు పేలవ ప్రదర్శన చేసింది. దీంతో డిసెంబరులో హరేంద్ర తన పదవికి రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో హాకీ ఇండియా మరోసారి మరైన్‌కు కోచ్ బాధ్యతలు అప్పగించింది.



ఎలక్ట్రానిక్స్ విడిభాగాల తయారీ పథకం (ఈసీఎంఎస్) కింద రూ. 41,863 కోట్ల పెట్టుబడితో తలపెట్టిన 22 నూతన ప్రతిపాదనలను ఆమోదించినట్లు ఎలక్ట్రానిక్స్-ఐటీ శాఖ 2026, జనవరి 2న తెలిపింది. ఇందువల్ల రూ. 2,58,152 కోట్ల విలువైన ఉత్పత్తులు తయారవుతాయని, 33,791 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు లభిస్తాయని వెల్లడించింది.

చైనా తన నౌకాదళంలోకి మరింత మెరుగుపరిచిన మిసైల్ డిస్ట్రాయర్‌ను చేర్చింది. టైప్ 052డి తరగతికి చెందిన ఈ యుద్ధనౌకకు లౌడీ అని పేరు పెట్టారు. ఇందులో మెరుగైన రాడార్, ఆయుధ, నెట్‌వర్క్ వ్యవస్థలు ఉన్నాయి. దీనివల్ల ఇది గగనతల రక్షణ, సాగరంలో దాడి, టాస్క్‌ఫోర్స్ కమాండ్ లాంటి విధులను నిర్వర్తించగలదు. ఇది లక్షిత యుద్ధనౌకలపై దాడి చేయడంతోపాటు సహచర నౌకలను రక్షించగలదు.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

బీర్బల్ సాహ్ని


శాస్త్రవేత్తలు విశేషాలు

ఈయన భారతదేశానికి చెందిన ప్రఖ్యాత వృక్ష శాస్త్రవేత్త, భూగోళ శాస్త్రవేత్త. శిలాజ మొక్కలు (Fossil Plants), వాటి పరిణామక్రమం (Evolution)పై పరిశోధనలు చేశారు. మొక్కల వర్గీకరణ, జీవావరణశాస్త్రం, జీవభూగోళశాస్త్ర రంగాల్లో గణనీయ కృషి చేశారు. ఈయన భూగర్భశాస్త్రం, పురావస్తుశాస్త్రంలోనూ పరిశోధనలు చేశారు. భారతదేశంలో విజ్ఞానశాస్త్ర అభివృద్ధికి విశేషంగా తోడ్పాటు అందించారు. భారత ఉపఖండంలోని శిలాజ మొక్కలు, వాటి పరిణామం గురించి అనేక రచనలు చేశారు. ఈయన్ను భారతదేశ పురాతన వృక్షశాస్త్ర పితామహుడిగా (Father of Indian Paleobotany) పేర్కొంటారు.

బాల్యం – వృత్తి జీవితం

బీర్బల్ సాహ్ని 1891, నవంబరు 14న షాహ్‌పూర్‌లోని భేరాలో (ప్రస్తుతం పాకిస్థాన్‌లోని పంజాబ్ రాష్ట్రంలో ఉంది) జన్మించారు.

- ప్రాథమిక విద్యాభ్యాసాన్ని లాహోర్‌లోని సెంట్రల్ మోడల్ స్కూల్‌లో పూర్తి చేశారు.
- 1911లో లాహోర్‌లోని ప్రభుత్వ కళాశాల నుంచి నేచురల్ సైన్స్‌లో పట్టభద్రుడయ్యారు. తర్వాత ఉన్నత చదువుల కోసం ఇంగ్లండ్ వెళ్లారు.
- కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలోని ఇమ్మాన్యుయేల్ కాలేజీలో చేరి, 1914లో పట్టా పొందారు.
- 1914లో ప్రఖ్యాత శిలాజ వృక్షశాస్త్రవేత్త (paleobotanist) ఎ.సి.స్టీవార్డ్ వద్ద ఇంటర్న్‌గా పనిచేశారు. ఆ సమయంలో ఆయన వద్ద అనేక విషయాలు తెలుసుకున్నారు. వారిద్దరూ భారతీయ గోండ్వానా మొక్కలపై (పాలియోంటోలాజికా ఇండికా) పరిశోధనలు చేశారు.
- బీర్బల్ 1920లో భారత్‌కు తిరిగివచ్చారు. వారణాసిలోని బెనారస్ హిందూ యూనివర్సిటీలో వృక్షశాస్త్ర ఆచార్యుడిగా పనిచేశారు.
- 1921లో లక్నో యూనివర్సిటీలో వృక్షశాస్త్ర విభాగానికి మొదటి అధిపతిగా, ఆచార్యుడిగా నియమితులయ్యారు. మరణించే వరకు ఆయన అక్కడే పనిచేశారు.




బీర్బల్ సాహ్ని చేసిన ముఖ్యపరిశోధనలు, గతంలో అడిగిన ప్రశ్నల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - భారతదేశ సమాజం

రైతులు, చేనేత కార్మికుల సమస్యలు - సంక్షేమ పథకాలు

భారతదేశంలో పూర్వం నుంచి వ్యవసాయ, చేనేత రంగాలకు ప్రత్యేకస్థానం ఉంది. ఈ రంగాల్లో లక్షలాది మంది వారసత్వంగా జీవనోపాధి పొందడంతో పాటు దేశ ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటి చెప్పారు. దేశ రైతన్నలు అందరి కడుపు నింపుతుంటే, నేతన్నలు తమ కళతో భారతీయ సంస్కృతికి ప్రపంచవ్యాప్త గుర్తింపు తెస్తున్నారు. వీరు కొన్ని సందర్భాల్లో ఒడిదొడుకులకు లోనవుతుంటారు. ఈ క్రమంలో వారికి చేయూతనిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను తీసుకువచ్చింది.



కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు

- కిసాన్ కాల్‌సెంటర్లు
- అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ (ఏటీఎంఏ)
- సాయిల్ హెల్త్‌కార్డు 2015
- రాష్ట్రీయ గోకుల్ మిషన్
- పరంపరాగత్ కృషివికాస్ యోజన
- ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం కిసాన్)
- నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ ప్రోగ్రామ్ (ఎన్‌సీఐపీ)
- ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజన
- వాతావరణ సంబంధిత పంటల బీమా పథకం

చేనేత రంగం - సంక్షోభానికి దారితీసిన పరిస్థితులు, కేంద్ర ప్రభుత్వ చేనేత పథకాలు మొదలైన అంశాలతో పాటు మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Apprentice Posts

Indian Oil Corporation Limited (IOCL) is inviting applications for Trade, Technician, and Graduate Apprentice posts in various states. The total number of posts is 501. Eligible candidates can apply online before 2026 January 12.

CUET PG - 2026 Admission

Common University Entrance Test (CUET) (PG) - 2026 is conducted by the National Testing Agency (NTA) for admission into Postgraduate (PG) programmes of Central Universities and other participating Universities/Institutions across India for the academic session 2026-27. The last date for online applications is 14 January 2026.

Faculty Jobs

The All India Institute of Medical Sciences (AIIMS Bilaspur) is inviting applications for faculty positions in various departments on a direct recruitment/contract basis. The total number of posts is 83. Eligible candidates can apply online before 15 January 2026.

Did You Apply..?

Today (January 5) is the last date for the following Jobs

- 514 Credit Officer posts in Bank of India. ***Eligibility:*** CA, CMA, Graduate degree.
- 12 MTS posts in CSIR-NGRI. ***Qualification:*** 10th class, Intermediate.
- 76 Data Entry Operator jobs at BECIL. ***Eligibility:*** 8th, 10th class, Intermediate, BSc.

For more information and other notifications - scan QR code

One Word Substitution

SSC Exams English

Directions (Qs.1 - 24): *Choose the correct one-word substitution of the given phrase/sentence.*

1. A person who flatters powerful people to gain favour
A) Sycophant B) Martinet
C) Iconoclast D) Maverick

2. A student or scholar of flags
A) Philatelist B) Vexillologist
C) Numismatist D) Cartographer

3. A collector or student of coins and currency
A) Philatelist B) Antiquarian
C) Numismatist D) Curator

4. A fear of enclosed or narrow spaces
A) Acrophobia B) Agoraphobia
C) Claustrophobia D) Xenophobia

5. A person who knows or uses several languages
A) Monoglot B) Illiterate
C) Bilingual D) Polyglot

6. A person who records or studies earthquakes
A) Volcanologist B) Hydrologist
C) Meteorologist D) Seismologist

7. A scientist who studies celestial bodies
A) Astrologer B) Astronomer
C) Cosmologist D) Aeronaut

8. A person who loves or collects books
A) Bibliophile B) Bibliophobe
C) Philatelist D) Biblioclast

9. A skilled and amusing storyteller
A) Raconteur B) Recluse
C) Renegade D) Rhetorician

10. A person who writes plays
A) Novelist
B) Dramatist (Playwright)
C) Lyricist D) Essayist

11. A specialist who studies plants
A) Zoologist B) Mycologist
C) Arborist D) Botanist

12. A scientist who studies birds
A) Ichthyologist B) Entomologist
C) Ornithologist D) Herpetologist

13. An authoritative order or decree
A) Edict B) Opinion
C) Suggestion D) Query

14. A person who travels from place to place (especially for work)
A) Itinerant B) Sedentary
C) Homebound D) Urbanite



15. One who dislikes or fears change
A) Innovator B) Traditionalist
C) Progressive D) Liberal

16. One who believes in or advocates non-violence and opposes war
A) Warmonger B) Pacifist
C) Militarist D) Chauvinist

17. A short, well-known saying expressing a general truth - (e.g., "Honesty is the best policy")
A) Novel B) Fiction
C) Adage D) Anecdote

18. Exclusion from a community or group by general consent
A) Inclusion B) Embrace
C) Ostracism D) Welcoming

19. A person who has lived to or beyond 100 years of age
A) Octogenarian B) Nonagenarian
C) Septuagenarian D) Centenarian

20. A person who studies human society and social behaviour
A) Psychologist B) Theologian
C) Economist D) Sociologist

21. A person who loves or seeks beauty and art for art's sake
A) Aesthete B) Ascetic
C) Altruist D) Agnostic

22. A person who studies insects
A) Entomologist B) Botanist
C) Ornithologist D) Geologist

23. A person who prefers solitude and avoids social interaction by choice
A) Socialite B) Recluse
C) Extrovert D) Host

24. A person who is self-taught and has not received formal education in a subject
A) Pedant B) Autodidact
C) Pupil
D) Scholar

Scan the QR code for Key

Writer: P. Manoj Kumar, Subject Expert

చమురు విపణిపై ప్రభావమెంత?

- ట్రంప్ వ్యాఖ్యలతో సర్వత్రా ఆసక్తి
- వెనెజువెలాలో పెట్టుబడులకు కంపెనీలు ముందుకొచ్చేనా..!

వాషింగ్టన్: ‘‘వెనెజువెలాలో చమురు వ్యాపారం అస్తవ్యస్తంగా ఉంది. అమెరికాలోని పెద్ద కంపెనీలు అక్కడికి వెళ్లి మౌలిక వసతులు కల్పిస్తాయి’’.. వెనెజువెలా అధ్యక్షుడు మదురోను నిర్బంధించిన అనంతరం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలివి. వెనెజువెలా చమురు రంగాన్ని తమ నియంత్రణలోకి తీసుకోవాలన్న ట్రంప్ ప్రణాళికలకు ఈ మాటలు నిదర్శనం! అయితే ఆయన వ్యాఖ్యలు. . వెనెజువెలాలో ఇకపై చోటుచేసుకోబోయే పరిణామాలు.. అంతర్జాతీయ చమురు విపణిపై ఎలాంటి ప్రభావం చూపుతాయన్నది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది.

ఏళ్ల తరబడి నిర్లక్ష్యం

వెనెజువెలాలో 30,300 కోట్ల బ్యారెళ్ల చమురు నిల్వలు ఉన్నట్లు అంచనా. మొత్తం ప్రపంచ నిల్వల్లో దాదాపు 17 శాతానికి ఇది సమానం. అయినప్పటికీ రోజుకు 11 లక్షల బ్యారెళ్ల ముడి చమురును మాత్రమే ప్రస్తుతం ఆ దేశం వెలికితీయగలుగుతోంది. వెనెజువెలాలో చమురు రంగం ఏళ్ల తరబడి నిర్లక్ష్యానికి గురవడం, అవినీతి, అంతర్జాతీయంగా ఆ దేశంపై ఉన్న ఆంక్షలు ఇందుకు కారణం. ట్రంప్ చెబుతున్నట్లు ఈ స్థితి నుంచి వెనెజువెలా చమురు రంగం పునరుత్తేజం పొందాలంటే.. కొన్నేళ్ల సమయం పడుతుంది. భారీస్థాయిలో పెట్టుబడులు అవసరమవుతాయి.



రాజకీయ స్థిరత్వం ఉంటేనే..

ట్రంప్ చెప్పినప్పటికీ.. వెనెజువెలాలో రాజకీయ స్థిరత్వం లేకపోతే ఆ దేశంలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు అమెరికా కంపెనీలుగానీ, ఇతర విదేశీ చమురు కంపెనీలుగానీ సుముఖత చూపవు. ప్రస్తుతానికి ఆ దేశంలో సుస్థిర సర్కారు ఏర్పడే అవకాశాలు కనిపించడం లేదు! ఎక్సాన్ మొబిల్, చెవ్రాన్ వంటి పెద్ద చమురు కంపెనీలు వెనెజువెలాలో పరిణామాలపై ఇంకా స్పందించలేదు. 2007లో అప్పటి వెనెజువెలా అధ్యక్షుడు హ్యూగో చావెజ్ చాలావరకు చమురు ఉత్పత్తిని జాతీయాకరణం చేయడంతో.. ఎక్సాన్ మొబిల్, కొనొకోఫిలిప్స్ వంటి కంపెనీలు ఆ దేశాన్ని వీడాల్సి వచ్చింది. కాబట్టి దేశీయంగా రాజకీయ వాతావరణం మెరుగుపడి, సుస్థిర సర్కారు ఏర్పాటై, తమ వ్యాపారాలకు భరోసా ఇచ్చేదాకా పెద్ద కంపెనీలేవీ వెనెజువెలాలో పెట్టుబడులు పెట్టేందుకు అంతగా ఆసక్తి చూపకపోవచ్చు.

రష్యాపై ఒత్తిడి పెంచొచ్చు

వెనెజువెలాలో ముడి చమురు వెలికితీతను భారీస్థాయిలో హెచ్చించడం.. రష్యాపై ఒత్తిడి పెంచేందుకు దోహదపడుతుందని కూడా అమెరికా భావిస్తోంది. ఎందుకంటే- వెనెజువెలాలో కీలకమైన భార ముడి చమురు ఎక్కువగా లభిస్తుంది. డీజిల్, అస్ఫాల్ట్‌లను.. భారీ సాధనాల్లో వాడే ఇతర ఇంధనాలను ఉత్పత్తి చేసేందుకు ఈ భార ముడి చమురు అవసరం. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా డీజిల్ కొరత ఉంది. అమెరికాలో లభించే తేలికైన ముడిచమురుతో డీజిల్‌ను ఉత్పత్తి చేయడం సులువు కాకపోవడమే అందుకు ఓ కారణం. వెనెజువెలాలో భార ముడి చమురు వెలికితీతను అమెరికా పెంచగలిగితే.. ఐరోపా, ఇతర దేశాలు రష్యా నుంచి దాన్ని కొనుగోలు చేయడం నిలిపివేయొచ్చు! వెనెజువెలాలో మౌలిక వసతులు గణనీయంగా మెరుగుపడి, అక్కడ ఉత్పత్తి భారీగా పెరిగితే.. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు తగ్గుతాయి. అప్పటివరకు మాత్రం విపణిపై తాజా పరిణామాల ప్రభావం పెద్దగా ఉండకపోవచ్చన్నది విశ్లేషకుల మాట.

పని చేయని అమెరికా తంత్రం!

- అఫ్గానిస్థాన్, ఇరాక్‌లలో విఫలం
- ఇప్పటికీ కోలుకోని దేశాలు
- వెనెజువెలా పరిస్థితీ అంతేనా..

దేశాలను ఆక్రమించడంలో ప్రదర్శించినంత దూకుడును.. వాటిని అభివృద్ధి బాట పట్టించడంలో అమెరికా ప్రదర్శించదు. గతంలో అది చేసిన ప్రయోగాలు విఫలమైన తీరే ఇందుకు నిదర్శనం. తనకు వ్యతిరేకంగా మారుతున్నాయన్న అంచనాకు రాగానే దాడులు చేయడం. . పాలకులను దించేయడం.. అనుకూలంగా ఉండే నేతలను పదవుల్లో కూర్చోబెట్టడం అమెరికాకు అలవాటే. అలాంటి రెండు ప్రయోగాలు గతంలో విఫలమైన తీరు చూస్తుంటే.. ప్రస్తుత వెనెజువెలా పరిస్థితీ అంతే అవుతుందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో అఫ్గానిస్థాన్, ఇరాక్‌లలో ఇలాగే చేసిన అమెరికా.. తర్వాత వాటిని పెద్దగా పట్టించుకోలేదు. చివరకు వాటి మానాన వాటిని వదిలేసి చేతులు దులుపుకొంది. ఇప్పుడా దేశాలు ఇంకా అనిశ్చితిలో కొట్టుమిట్టాడుతూనే ఉన్నాయి. అక్కడి ప్రజల కష్టాలు రెట్టింపయ్యాయి.

అఫ్గానిస్థాన్‌లో..

2001లో అమెరికా అనుకూల బలగాలు అఫ్గానిస్థాన్ రాజధాని కాబుల్‌ను ఆక్రమించాయి. తాలిబన్లను తరిమికొట్టాయి. తనకు అనుకూలంగా ఉండే హమీద్ కర్జాయ్‌ను ప్రధానిగా అమెరికా నియమించింది. మధ్య ఆసియాలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరిస్తున్నామని అప్పటి అధ్యక్షుడు జార్జ్ డబ్ల్యూ బుష్ ధీమాగా ప్రకటించారు. కానీ రెండు దశాబ్దాలపాటు తనకు అనుకూల ప్రభుత్వమున్నా అక్కడి ప్రజల జీవితాలు మారలేదు. పైగా తాలిబన్లు తిరిగి పుంజుకుని మళ్లీ ఏకు మేకయ్యారు. దీంతో చివరకు తాలిబన్లకు అధికారాన్ని అప్పగించి అఫ్గాన్ నుంచి అమెరికా వైదొలగింది.

✦ అఫ్గానిస్థాన్‌లో అమెరికా మద్దతుతో ఏర్పడిన ప్రభుత్వం.. అవినీతి, బంధుప్రీతి, గ్రూపులు, విదేశీ సైన్యంపై విపరీతంగా ఆధారపడి చెడ్డపేరు తెచ్చుకుంది. దీంతో మళ్లీ తాలిబన్లు బలం పుంజుకున్నారు.

ఇరాక్‌లో..

2003లో ఇరాక్‌పై దండెత్తిన అమెరికా.. సద్దాం హుసేన్‌ను గద్దె దించింది. ప్రజాస్వామ్యయుతంగా అధికార మార్పిడి చేస్తామని హామీ ఇచ్చింది. కానీ దీర్ఘకాలిక తిరుగుబాటు, మత వర్గాల మధ్య పోరాటం, ప్రాంతీయ అస్థిరత, ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదం పెరగడంతో ఇప్పటికీ ఇరాక్ కల్లోలంగానే ఉంది.

వెనెజువెలాలో..

ఇప్పుడు వెనెజువెలాలో అమెరికా గేమ్ మొదలుపెట్టింది. శనివారం ఆ దేశంపై దాడులు చేసి అధ్యక్షుడిని బందీగా చేసుకుని అమెరికా తరలించింది. పూర్తిగా వ్యూహాత్మక దృక్కోణం నుంచి చూస్తే ఈ ఆపరేషన్ విజయవంతమైనట్లే. ఒక్క అమెరికా సైనికుడూ మరణించలేదు. వెనెజువెలా అధ్యక్షుడిని పదవీచ్యుతుడిని చేశారు. ఈ విషయంలో ట్రంప్ విజయం సాధించినట్లే. రాజకీయంగా ఆయన ప్రతిష్ఠ పెరుగుతుంది.

యుద్ధాలు వద్దంటున్న ట్రంపే..



అమెరికా నిరంతరాయంగా చేస్తున్న యుద్ధాల నుంచి దూరంగా జరుగుతానని పదే పదే ట్రంప్ ప్రకటించారు. ఇరాక్‌పై దాడిని ఇప్పటికీ ఖండిస్తూ ఉంటారు. అఫ్గానిస్థాన్ నుంచి తమ సైన్యాన్ని ఉపసంహరించారు. ప్రపంచంలో ఎనిమిదింబావు యుద్ధాలను ఆపానని గర్వంగా ప్రకటించుకుంటున్నారు. శాంతియుత అధ్యక్షుడిగా ఉంటానని రెండోసారి అధికారంలోని వచ్చారు. కానీ ఏడాది తిరిగే సరికి అనేక వైపుల నుంచి ఆయన పోరాటాలు చేయాల్సి వస్తోంది. ఉక్రెయిన్‌కు, ఇజ్రాయెల్‌కు యుద్ధాల్లో మద్దతుగా నిలుస్తున్నారు. ఇరాన్‌పై నేరుగా దాడికి దిగారు. తాజాగా వెనెజువెలాపై ఆకస్మిక దాడితో అది మరింత విస్తృతమైంది.

- నేషనల్ డెస్క్

మదురో కుమారుడిపైనా అభియోగాలు

వాషింగ్టన్: వెనెజువెలా అధ్యక్షుడు నికొలస్ మదురోను అదుపులోకి తీసుకున్న అమెరికా ఇప్పుడు ఆయన కుమారుడు మదురో గుయెరాపై గురిపెట్టింది. అతనిపైనా పలు కేసులను నమోదు చేసింది. 35 ఏళ్ల గుయెరా.. మదురో తొలి భార్య అడ్రియానా గుయెరా అంగులో కుమారుడు. వెనెజువెలా జాతీయ అసెంబ్లీలో సభ్యుడు. ఇతన్ని ‘ది ప్రిన్స్’ అని కూడా పిలుస్తారు. మదురో రాజకీయ వారసుడిగానూ పేరు తెచ్చుకున్నారు. మదురో కుటుంబం నడుపుతున్న నార్కోటిక్స్ నెట్‌వర్క్‌లో గుయెరాది కీలక పాత్ర అని అమెరికా పేర్కొంటోంది. ప్రభుత్వ అధికారాన్ని ఉపయోగించుకొని టన్నుల కొద్దీ కొకైన్‌ను అమెరికాకు అక్రమంగా తరలించడంలో గుయెరా పాలుపంచుకున్నారన్న అభియోగాలను మోపింది. ఇలా సంపాదించిన డబ్బుతో గుయెరా ఆయుధాలను కొనుగోలు చేశారని కూడా అమెరికా న్యాయ విభాగం తన అభియోగ పత్రంలో పేర్కొంది. వెనెజువెలా ప్రభుత్వం, మదురో కుటుంబం మాత్రం ఇవి తప్పుడు అభియోగాలు అని పేర్కొంది. ప్రస్తుతం గుయెరా ఎక్కడ ఉన్నారో తెలియదు. తండ్రి అరెస్టైనప్పటి నుంచి ఆయన అజ్ఞాతంలో వెళ్లిపోయారని తెలుస్తోంది.

వలసదారుల సంక్షేమం చూస్తున్నాం

- 120 దేశాల జాబితా ఇచ్చిన ట్రంప్
- భారత్ ప్రస్తావన మాత్రం లేదు

వాషింగ్టన్: వివిధ దేశాల నుంచి అమెరికాకు వలస వస్తున్నవారి సంక్షేమం కోసం తాము ఖర్చు చేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. సాయం పొందుతున్నవారిలో పాకిస్థాన్, భూటాన్, చైనా, బంగ్లాదేశ్, నేపాల్ సహా 120 దేశాలు ఉన్నాయి. తన సామాజిక మాధ్యమం ‘ట్రూత్‌సోషల్’లో ట్రంప్ ఈ వివరాలు పోస్ట్‌చేశారు. దీనిలో భారత్ మాత్రం లేదు. బంగ్లాదేశ్ నుంచి వచ్చినవారిలో 54.8% మంది వలసదారులకు అమెరికా నుంచి సాయం అందుతోంది. ఆ తర్వాతి స్థానాల్లో ఉక్రెయిన్ (42.7%), పాకిస్థాన్ (40.2%), నేపాల్ (34.8%), చైనా (32.9%), ఇజ్రాయెల్/ పాలస్తీనా (25.9%) ఉన్నాయి. ఆసియాకు చెందినవారిలో 38.8% మంది సాయం పొందుతున్నట్లు పేర్కొన్నా, ఏ దేశంవారు ఎందరనేది చెప్పలేదు. అమెరికాలో చెప్పుకోదగ్గ సంఖ్యలో ఉన్నవారిలో భారతీయ అమెరికన్లు ఒకరు. అగ్రరాజ్యంలో ఉంటున్న ఆసియా వాసుల్లో సుమారు 21% మంది భారతీయులని ‘ప్యూ పరిశోధన కేంద్రం’ గణాంకాలు చెబుతున్నాయి. వీరి సగటు వార్షిక ఆదాయం 1,51,200 డాలర్లు (2023లో). ఆసియావాసుల సగటు (1,05,600 డాలర్లు) కంటే ఇది ఎక్కువ.

అమెరికా దుశ్చర్యపై వామపక్షాల నిరసన



వెనెజువెలాపై దాడి చేసి ఐక్యరాజ్యసమితి చార్టర్‌ను అమెరికా ఉల్లంఘించిందని వామపక్ష పార్టీలు ఆరోపించాయి. జంతర్ మంతర్ దగ్గర నిరసన ప్రదర్శనలు నిర్వహించాయి. వెనెజువెలా అధ్యక్షుడు మదురోను, ఆయన భార్యను అమెరికా అపహరించడాన్ని ఖండిస్తున్నామని పేర్కొన్నాయి. ఈ మేరకు సీపీఎం, సీపీఐ, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్, ఏఐఎఫ్‌బీ, ఆర్‌ఎస్‌పీలు ఉమ్మడిగా ప్రకటన విడుదల చేశాయి.



20 ఏళ్ల తర్వాత శివసేన భవన్‌లోకి రాజ్ ఠాక్రే

- భావోద్వేగానికి గురైన ఎంఎన్ఎస్ అధినేత

ముంబయి: సుదీర్ఘకాలం దూరంగా ఉన్న శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే, మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన (ఎంఎన్ఎస్) అధ్యక్షుడు రాజ్ ఠాక్రేలు ఇటీవల చేతులు కలిపిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో దాదాపు 20ఏళ్ల తర్వాత శివసేన భవన్‌లో రాజ్ ఠాక్రే అడుగుపెట్టారు. ఒకప్పుడు సొంతిల్లులా భావించిన పార్టీ కార్యాలయంలోకి తిరిగి రావడం ఎంతో భావోద్వేగంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ‘‘ఇక్కడకు రావడం ఎలా అనిపించింది అని ప్రతి ఒక్కరూ అడుగుతున్నారు. 20 ఏళ్ల తర్వాత నాకు జైలు నుంచి బయటకొచ్చినట్లు అనిపిస్తోంది. శివసేన భవన్‌తో ఎన్నో మధుర జ్ఞాపకాలు ఉన్నాయి. వాటిని చెప్పడానికి రోజులు పడుతుంది’’ అని రాజ్ ఠాక్రే పేర్కొన్నారు.

ఆ ఫలితాలను రద్దు చేయండి: ఉద్ధవ్

స్థానిక ఎన్నికల్లో భాగంగా.. 68 వార్డుల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన ‘మహాయుతి’ అభ్యర్థుల ఫలితాలను రద్దు చేయాలని ఉద్ధవ్ ఠాక్రే రాష్ట్ర ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశారు. పోటీ చేయకుండానే విజయాలు సాధించడం అనేది జెన్ జడ్‌తో పాటు తొలిసారిగా ఓటు హక్కు వినియోగించుకునేవారు తమ హక్కును కోల్పోతారని ఆయన పేర్కొన్నారు.

యూపీలో అక్రమంగా నిర్మించిన రెండు మసీదుల తొలగింపు

సంభల్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని సంభల్ జిల్లా హాజీపుర్ గ్రామంలో ఇరవై ఏళ్ల కిందట అక్రమంగా నిర్మించిన మసీదు, మదరసాలను తొలగించినట్లు అధికారులు ఆదివారం వెల్లడించారు. ప్రభుత్వ భూమి ఆక్రమణ కింద ఇచ్చిన నోటీసు గడువు దగ్గర పడటంతో మసీదు కమిటీ సభ్యులే ఈ నిర్మాణాలను తొలగించినట్లు జిల్లా కలెక్టర్ రాజేందర్ పెన్సియా మీడియాకు తెలిపారు. చదును చేసిన భూమిని బలహీన వర్గాలకు చెందిన 20 కుటుంబాలకు లీజు కింద కేటాయించినట్లు చెప్పారు. వీరికి పీఎం ఆవాస్ యోజన కింద ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. అలాగే రాయా బుజుర్గ్ గ్రామంలోనూ నోటీసు గడువు ముగియడంతో అక్రమంగా నిర్మించిన మరో మసీదును అధికారులే తొలగించారన్నారు.

ఉ.కొరియా బాలిస్టిక్ క్షిపణుల ప్రయోగం

- దక్షిణ కొరియా అధ్యక్షుడి చైనా పర్యటనకు ముందు కవ్వింపు చర్యలు

సియోల్: ఉత్తరకొరియా అణుకార్యక్రమంపై చర్చించేందుకు దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యుంగ్ నాలుగు రోజుల చైనా పర్యటనకు బయలుదేరే కొన్ని గంటల ముందు కీలక పరిణామం చోటుచేసుకుంది. ఉత్తర కొరియా బహుళ బాలిస్టిక్ క్షిపణులను ఆదివారం సముద్రం వైపు ప్రయోగించిందని దాని పొరుగుదేశాలు తెలిపాయి. ఉత్తర కొరియా రాజధాని నుంచి ఉదయం 7.50 గంటల ప్రాంతంలో అనేక బాలిస్టిక్ క్షిపణుల ప్రయోగాలను గుర్తించినట్లు దక్షిణ కొరియా జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ ఓ ప్రకటనలో తెలిపింది. ‘‘ఈ క్షిపణులు దాదాపు 900 కిలోమీటర్లు(500 మైళ్లు) ప్రయాణించాయి. అమెరికా, దక్షిణ కొరియా అధికారులు ఈ ప్రయోగాల ఫలితాలను విశ్లేషిస్తున్నారు. ఉత్తర కొరియా రెచ్చగొట్టే చర్యలను తిప్పికొట్టడానికి దేశం సంసిద్ధంగా ఉంది. ఈ క్షిపణి ప్రయోగాలపై అమెరికా, జపాన్‌లతో సమాచారాన్ని పంచుకొంటున్నాం’’ అని అధికారులు వెల్లడించారు. ఉత్తర కొరియా రెండు క్షిపణులను ప్రయోగించినట్లు నిర్ధారణ అయిందని జపాన్ రక్షణశాఖ మంత్రి షింజిరో కొయిజుమి తెలిపారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో శిఖరాగ్ర సమావేశానికి లీ జే మ్యుంగ్ బయలుదేరడానికి కొన్ని గంటల ముందే ఈ క్షిపణి ప్రయోగాలు జరిగాయి. చైనాతో ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకొనేందుకు లీ యత్నిస్తున్నారు. తైవాన్ విషయంలో జపాన్, చైనాల మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న తరుణంలో లీ పర్యటనతో ఉత్కంఠ నెలకొంది.

వెనెజువెలాలో అమెరికా ఆపరేషన్‌ను ఖండించిన ఉత్తరకొరియా..

మాదకద్రవ్యాల తీవ్రవాదం ఆరోపణలపై వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను అమెరికా సైన్యం చేసిన అరెస్టును ఉత్తర కొరియా ఖండించింది. అమెరికా కఠిన స్వభావానికి ఈ చర్య నిదర్శనమని, దురాక్రమణకు పరాకాష్ఠని ఆ దేశ విదేశాంగశాఖ ఆరోపించింది.

చట్టవిరుద్ధ కంటెంట్‌ను తొలగిస్తాం

- అప్‌లోడ్ చేసిన అకౌంట్లను సస్పెండ్ చేస్తాం
- వెల్లడించిన ‘ఎక్స్’

దిల్లీ: ఎలాన్ మస్క్‌కు చెందిన ప్రముఖ సామాజిక మాధ్యమ వేదిక ‘ఎక్స్’ కీలక ప్రకటన చేసింది. తమ వేదికపై పోస్టు చేసిన చట్టవిరుద్ధమైన కంటెంట్‌ను పూర్తిగా తొలగించడంతో పాటు.. వాటిని అప్‌లోడ్ చేసిన ఖాతాలను శాశ్వతంగా సస్పెండ్ చేస్తామని వెల్లడించింది. అవసరమైతే స్థానిక ప్రభుత్వాలతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపింది. ఈ మేరకు ‘ఎక్స్ గ్లోబల్ గవర్నమెంట్ అఫైర్స్’ ఖాతా ద్వారా ఈ ప్రకటన విడుదల చేసింది. అంతకుముందు తమ ఏఐ సేవలు గ్రోక్‌ను ఉపయోగించి అశ్లీల కంటెంట్ సృష్టించినవారిపై, నేరుగా అలాంటి వాటిని అప్‌లోడ్ చేసిన వారిపై ఒకే రకరమైన చర్యలు తీసుకుంటామని మస్క్ హెచ్చరించిన విషయం తెలిసిందే. అనంతరం గ్లోబల్ గవర్నమెంట్ అఫైర్స్ కూడా స్పందిస్తూ చట్టవిరుద్ధ కంటెంట్ ఉన్న ఖాతాలను సస్పెండ్ చేస్తామని హెచ్చరించింది. ఎక్స్ వేదికపై స్థానిక చట్టాలకు విరుద్ధంగా అశ్లీల, అనుచిత కంటెంట్ పెరుగుతున్నట్లు భారత ప్రభుత్వం గుర్తించింది. ముఖ్యంగా గ్రోక్ ఏఐతో మహిళలపై అసభ్యకర చిత్రాలు సృష్టించి పోస్టులు చేసిన ఘటనలపై ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలోనే జనవరి 2న ఎక్స్‌కు నోటీసులు జారీ చేసింది. గ్రోక్‌తో రూపొందించిన అసభ్య కంటెంట్‌ను తొలగించాలని, దీనిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొంది. ఈ నేపథ్యంలోనే ఎక్స్ చర్యలు చేపట్టింది.

సుప్రీం ఆదేశాలిచ్చినా.. హైకోర్టుల్లో కానరాని తాత్కాలిక జడ్జీల నియామకం

దిల్లీ: హైకోర్టుల్లో పేరుకుపోయిన క్రిమినల్ కేసులను విచారించేందుకు తాత్కాలిక న్యాయమూర్తులను నియమించాలని సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాలకు ఏడాది కావొస్తున్నా.. తగిన చర్యలు కనిపించడం లేదు. హైకోర్టులు సైతం చొరవ చూపకపోవడంతో క్రిమినల్ కేసుల చిట్టా నానాటికి పెరిగిపోతోంది. తాత్కాలిక న్యాయమూర్తులను ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసిన 25 హైకోర్టుల్లో ఏ ఒక్కటి కూడా ఇప్పటివరకూ నియామక విధానాన్ని ప్రారంభించలేదు. దాదాపు 18 లక్షల క్రిమినల్ కేసులు పెండింగులో ఉండటంతో సుప్రీం, హైకోర్టుల్లో తాత్కాలిక న్యాయమూర్తుల నియామకాన్ని చేపట్టాలని గతేడాది జనవరి 30న అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. అయితే రిటైర్డ్ న్యాయమూర్తులను తాత్కాలిక ప్రాతిపదికన నియమించడానికి కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖకు ఇప్పటివరకు ఏ హైకోర్టు కొలీజియం నుంచి ఎటువంటి సిఫారసులు అందలేదు.

ఆపండి ‘సర్’

- ఏకపక్ష, లోపభూయిష్ట కసరత్తు ఇది
- ఈసీయే బాధ్యత వహించాలి: మమత



కోల్‌కతా: ఎన్నికల సంఘంపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తన దాడిని మరింత పెంచారు. ‘ఏకపక్షంగా, లోపభూయిష్టంగా’ ఉన్న ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) కసరత్తును రాష్ట్రంలో నిలుపుచేయాలని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌కు విజ్ఞప్తిచేశారు. ప్రస్తుత రూపంలో దీనిని కొనసాగిస్తే అనేకమంది తమ ఓటుహక్కును కోల్పోతారని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రజాస్వామ్య పునాదులపైనే ఇదొక దాడిగా అభివర్ణించారు. ఈ మేరకు ఘాటైన పదజాలంతో సీఈసీకి లేఖ రాశారు. ఏమాత్రం ప్రణాళిక, సన్నద్ధత లేకుండా తాత్కాలిక పద్ధతుల్లో, తీవ్ర అవకతవకలతో, విధాన ఉల్లంఘనలతో, పరిపాలనా లోపాలతో సర్‌ను ఈసీ కొనసాగిస్తోందని విరుచుకుపడ్డారు. ఇదివరకే తాను రెండు లేఖలు రాసిన విషయాన్ని గుర్తుచేస్తూ క్షేత్రస్థాయిలో పరిస్థితులు నానాటికీ క్షీణిస్తున్నాయని చెప్పారు. అందువల్లే తన ఆందోళనను తెలిపేందుకు మరో లేఖ రాయాల్సి వచ్చిందన్నారు. ఈసీ ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం వల్ల పరిస్థితి నానాటికీ దిగజారిపోతోందని చెప్పారు. సరిదిద్దలేనంత నష్టం జరగడానికి ముందే ఈ కసరత్తును ఆపాలని విజ్ఞప్తిచేశారు. జాతీయస్థాయిలో సర్ లక్ష్యాలేమిటో తెలియని స్థితిలో ఈసీ ఉందన్నారు. ఐటీ వ్యవస్థల్ని దుర్వినియోగం చేసి ఓటర్ల పేర్లను తొలగిస్తున్న దాఖలాలు ఉన్నాయని చెప్పారు. దీనంతటికీ ఈసీయే జవాబుదారీ కావాలన్నారు.

✦ ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయి, ముక్కులో గొట్టాలతో సహా సర్ విచారణకు హాజరైన 68 ఏళ్ల వృద్ధుడు బెంగాల్‌లోని దక్షిణ 24 పరగణాల జిల్లాలో ప్రాణాలు కోల్పోవడం రాజకీయ విమర్శలకు తావిచ్చింది.

రష్యాపై ఉక్రెయిన్ డ్రోన్ దాడి: ఇద్దరి మృతి

మాస్కో: కాల్పుల విరమణ కోసం ఓ వైపు చర్చలు జరుగుతున్న వేళ రష్యా, ఉక్రెయిన్‌లు పరస్పరం దాడులు కొనసాగించాయి. రష్యా సరిహద్దు ప్రాంతమైన బెల్గోరోడ్‌లో ఉక్రెయిన్ డ్రోన్ దాడికి దిగింది. ఈ ఘటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు.. శనివారం రాత్రి ఉక్రెయిన్‌లోని ఖర్కివ్ ప్రాంతంలో రష్యా జరిపిన క్షిపణి దాడిలో ముగ్గురు మృతిచెందారు.

సిరియాలోని ఐఎస్ ఆయుధ బంకర్లపై బ్రిటన్, ఫ్రాన్స్ దాడులు

డమాస్కస్: సిరియాలో ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్)కు చెందిన ఆయుధ బంకర్లపై బ్రిటన్, ఫ్రాన్స్ దాడులు జరిపాయి. హామ్స్ ప్రావిన్సులోని పాల్మిరాకు ఉత్తరాన ఉన్న పర్వతాల్లోని ఆయుధ బంకర్లపై శనివారం రాత్రి బాంబులతో విరుచుకుపడినట్లు బ్రిటన్ రక్షణశాఖ ఓ ప్రకటనను విడుదల చేసింది. తమ ఆపరేషన్ విజయవంతమైనట్లు ప్రాథమిక సంకేతాలు కనిపిస్తున్నాయని పేర్కొంది. నిఘా వర్గాల సమాచారం మేరకు నిర్వహించిన ఈ దాడుల్లో రాయల్ ఎయిర్ ఫోర్స్ (ఆర్ఏఎఫ్) టైఫూన్ ఎఫ్‌జీఆర్4లు, ఫ్రెంచ్ రైఫెల్‌లు పాల్గొన్నాయి. ప్రజల భద్రతకు ముప్పుగా మారిన ఉగ్రవాదుల్ని నిర్మూలించడానికి, బ్రిటన్‌ను స్వదేశంలో స్వతంత్రంగా, విదేశాల్లో బలంగా ఉంచడానికి తమ దళాలు ఏ క్షణమైనా సిద్ధంగా ఉంటాయని బ్రిటన్ రక్షణ శాఖ పేర్కొంది. తిరిగి బలం పుంజుకుంటున్న ఇస్లామిక్ స్టేట్స్ (ఐఎస్)ను నిర్మూలించడమే లక్ష్యంగా దాడులు జరిపామని ఫ్రాన్స్ సైన్యం ప్రకటించింది. ఈ దాడులపై సిరియా నుంచి ఎటువంటి సమాచారం అందలేదు. ఐఎస్ ఉగ్రవాదంపై దశాబ్దకాలంగా పోరాడుతున్న అమెరికాతో బ్రిటన్, ఫ్రాన్స్ తాజాగా చేతులు కలిపి, ఆపరేషన్‌లు నిర్వహిస్తున్నాయి.

అస్సాం ఎన్నికల స్క్రీనింగ్ కమిటీ అధ్యక్షురాలిగా ప్రియాంక

గువాహటి: ఈ ఏడాది జరగనున్న అస్సాం అసెంబ్లీ ఎన్నికలకు అభ్యర్థుల ఎంపిక కోసం ఏర్పాటు చేసిన స్క్రీనింగ్ కమిటీకి కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా అధ్యక్షత వహించనున్నారు. అస్సాంతో కలిపి ఈ సంవత్సర ప్రథమార్ధంలో ఎన్నికలు జరగనున్న ఐదు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల కోసం స్క్రీనింగ్ కమిటీలు ఏర్పాటైనట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ శనివారం ప్రకటించారు. అస్సాం, పశ్చిమబెంగాల్, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరిలలో జరగనున్న రాష్ట్ర ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితాను ఖరారు చేసేందుకు నలుగురు సభ్యులతో కూడిన కమిటీలు ఏర్పాటైనట్లు తెలిపారు. ప్రియాంక నేతృత్వంలోని అస్సాం కమిటీలో సభ్యులుగా ఎంపీలు ఇమ్రాన్ మసూద్, సప్తగిరి శంకర్ ఉలకలతో పాటు ఏఐసీసీ కార్యదర్శి సిరివెళ్ల ప్రసాద్‌లు ఉంటారని వేణుగోపాల్ పేర్కొన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత మధుసూదన్ మిస్త్రీ కేరళ స్క్రీనింగ్ కమిటీకి, తమిళనాడు, పుదుచ్చేరిల కమిటీలకు ఛత్తీస్‌గఢ్ మాజీ ఉప ముఖ్యమంత్రి టి.ఎస్.సింగ్ దేవ్ నేతృత్వం వహించనున్నట్లు ఆయన తెలిపారు. పశ్చిమ బెంగాల్ స్క్రీనింగ్ కమిటీకి బి.కె.హరిప్రసాద్ అధ్యక్షత వహిస్తారన్నారు.

14 నుంచి కామన్వెల్త్ దేశాల స్పీకర్ల సదస్సు

దిల్లీ: భారత్‌లో ఈ నెల 14 నుంచి 17వ తేదీ వరకు జరగనున్న కామన్వెల్త్ దేశాల పార్లమెంట్ స్పీకర్, ఎన్నికల అధికారుల సదస్సు (సీఎస్‌పీవోసీ)ను ప్రధాని మోదీ ప్రారంభించే అవకాశం ఉందని అధికారులు ఆదివారం వెల్లడించారు. ఇక్కడి సంవిధాన్ సదన్‌లోని సెంట్రల్ హాల్‌లో నాలుగు రోజుల పాటు జరగనున్న ఈ సదస్సుకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సారథ్యం వహించనున్నారు. ఆయా దేశాల పార్లమెంట్ల పనితీరులో కృత్రిమ మేధ (ఏఐ), సామాజిక మాధ్యమాల వినియోగంపై ఈ సదస్సులో ప్రధానంగా చర్చించనున్నట్లు ఓం బిర్లా వెల్లడించారు.

డేరా బాబాకు పదిహేనోసారి పెరోల్

చండీగఢ్: అత్యాచారం కేసులో జైలుశిక్ష అనుభవిస్తున్న డేరా బాబాకు మళ్లీ 40 రోజుల పెరోల్ మంజూరైంది. ఈయనకు గతేడాది దిల్లీ అసెంబ్లీ ఎన్నికల ముందు జనవరిలో 30 రోజులు, ఏప్రిల్‌లో 21 రోజులు, ఆగస్టులో 40 రోజులు పెరోల్ మంజూరు చేశారు. 2017లో దోషిగా తేలినప్పటి నుంచి ఇప్పటివరకు డేరా బాబా బయటకు రావడం ఇది పదిహేనోసారి. ఇద్దరు శిష్యురాళ్లపై అత్యాచారానికి పాల్పడినందుకు బాబాకు 2017లో 20 ఏళ్ల జైలుశిక్ష పడింది.

వీబీ జీ రామ్ జీపై కాంగ్రెస్‌ది అసత్య ప్రచారం

- కేంద్ర మంత్రి చౌహాన్ ఆరోపణ

దిల్లీ: కాంగ్రెస్ హయాంలో ‘మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం(ఎంజీనరేగా)’లో అవినీతి ప్రబలిందని, కొత్తగా తీసుకువచ్చిన ‘వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్(గ్రామీణ్)(వీబీ జీ రామ్ జీ)’ పథకంపై ఆ పార్టీ నేతలు అసత్యాలు ప్రచారం చేస్తున్నారని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆరోపించారు. దిల్లీలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ మేరకు మాట్లాడారు. ‘‘లోక్‌సభలో వీబీ జీ రామ్ జీ పథకంపై చర్చ జరుగుతున్నప్పుడు రాహుల్ గాంధీ ఎందుకు హాజరుకాలేదు. ‘ఎంజీనరేగా బచావో సంగ్రామ్’ పేరుతో ప్రచారం చేయనున్నట్లు కాంగ్రెస్ ప్రకటించింది. అది పథకాన్ని కాదు. అవినీతిని కాపాడే ఉద్యమం. అవినీతికి పర్యాయపదం ఎంజీనరేగా. గ్రామసభల్లో నిర్వహించిన ఆడిట్‌లలో దీనిపై 10 లక్షలకు పైగా ఫిర్యాదులు వచ్చాయి. పూర్తి అయిన పనినే మళ్లీ చేయడం. యంత్రాలను వినియోగించడం. ఎంజీనరేగా కోసం నరేంద్ర మోదీ ప్రభుత్వంలో రూ.8.48 లక్షల కోట్లు, కాంగ్రెస్ హయాంలో రూ.2 లక్షల కోట్లకు పైగా మంజూరయ్యాయి. వాటితో స్థిరాస్తులు సృష్టించారా? ఆ నిధుల్ని అభివృద్ధికి వినియోగించారా?’’ అని చౌహాన్ ప్రశ్నించారు.

సహకార కమిటీ ఏర్పాటుచేసిన కాంగ్రెస్..

ఎంజీనరేగా బచావో సంగ్రామ్‌ను పర్యవేక్షించేందుకు కాంగ్రెస్ సహకార కమిటీని ఆదివారం ఏర్పాటుచేసింది. ఈ ఉద్యమం అమలు, పర్యవేక్షణ, మార్గనిర్దేశకం చేసేందుకు ఓ కమిటీని ఏర్పాటుచేసి, దాన్ని అమలుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని పార్టీ అధ్యక్షుడు సూచించినట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ తెలిపారు. పార్టీ కోశాధికారి కన్వీనర్ ఉంటే సీనియర్ నేతలు జైరాం రమేశ్, సందీప్ దీక్షిత్, ఉదిత్ రాజ్, ప్రియాంక్ ఖర్గేలు ఈ ప్యానెల్‌లో సభ్యులు ఉంటారని ఆయన వెల్లడించారు. మల్లికార్జున ఖర్గే, డి.అనసూయ (సీతక్క), దీపికా పాండే సింగ్, మనీశ్ శర్మ సహా మరికొందరు నేతలు కూడా నామినేట్ అయినట్లు పేర్కొన్నారు.

ఉత్తర భారతానికి వణుకు

- హిమాలయ రాష్ట్రాల్లో మంచు: ఐఎండీ

దిల్లీ: ఉత్తర భారతమంతటా శీతాకాలం తన పట్టును ఆదివారం మరింత బిగించింది. దిల్లీలో పగటి ఉష్ణోగ్రతలు బాగా తగ్గిపోగా, రాజస్థాన్‌లో పలు ప్రాంతాలను పొగమంచు కమ్మేసి రహదారులు కనిపించలేదు. కశ్మీర్‌లో ఉష్ణోగ్రతలు సున్నా కంటే తక్కువగా ఉండటంతో రాబోయే రోజుల్లో లోయలోని ఎత్తయిన ప్రాంతాల్లో తేలికపాటి వర్షం లేదా మంచు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేస్తోంది. శ్రీనగర్‌లో మైనస్ 3.2, గుల్‌మార్గ్‌లో మైనస్ 6.5, పహల్గాంలో మైనస్ 5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు ఉన్నాయి. దిల్లీలో గరిష్ఠ ఉష్ణోగ్రత 17.3 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. సీజనల్ సగటు కంటే ఇది రెండు డిగ్రీలు తక్కువ. కనిష్ఠ ఉష్ణోగ్రత 7.4 ఉంది. నగరంలోని కొన్ని ప్రాంతాల్లో 6వ తేదీ వరకు చలిగాలులు వీచే అవకాశముంది. కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు డేటా ప్రకారం.. సాయంత్రం నాలుగింటికి దిల్లీలో వాయు నాణ్యతా సూచి మరీ పేలవంగా 307 ఉంది. రాజస్థాన్‌లోని సీకర్ జిల్లా ఫతేపుర్‌లో 1.1 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలోనూ సోమ, మంగళవారాల్లో తేలికపాటి వర్షం లేదా మంచు కురిసే అవకాశముంది. గుజరాత్‌లో రాబోయే అయిదు రోజుల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు పెరగవచ్చని ఐఎండీ తెలిపింది.



ఉత్తరాఖండ్‌లోని దేహ్రాదూన్‌లో కమ్ముకున్న పొగమంచు

అత్యాచారం జరిగింది అంబులెన్సులో!

- ఫరీదాబాద్ ఘటనలో పోలీసుల వెల్లడి

ఫరీదాబాద్: యూపీలో ఇటీవల ఓ యువతిపై జరిగిన సామూహిక అత్యాచారానికి సంబంధించి కొత్త విషయం బయటపడింది. ఆమెపై దాడి చేసింది వ్యాన్‌లో కాదని.. ఓ ప్రైవేట్ అంబులెన్సులోనని తేలింది. నిందితులు ఆ అంబులెన్స్ డ్రైవర్, సహాయకుడేనని దర్యాప్తు అధికారి ఆదివారం వెల్లడించారు. వీరిని ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన వారిగా గుర్తించినట్లు తెలిపారు. ఆరు రోజుల క్రితం ఈ దారుణ ఘటన చోటుచేసుకోగా ప్రస్తుతం ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దాడి తర్వాత విడుదల చేశారని చెబుతున్న వీడియోలో బాధితురాలు మాట్లాడుతూ.. “కారు ఎక్కిన వెంటనే నా పేటీఎం ఎకౌంట్‌కి రూ.600 వేశారు. వారెవరూ నాకు తెలియదు. తర్వాత కారు తలుపులు మూసేసి ఫోన్ లాగేసుకున్నారు’ అని పేర్కొన్నారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. ‘సోమవారం సాయంత్రం బాధితురాలు ఫరీదాబాద్‌లో ఉన్న స్నేహితుల ఇంటికి వెళ్లారు. రాత్రి వేళ తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో నిందితులు ఆమెకు లిఫ్ట్ ఇచ్చారు. తర్వాత గురుగ్రామ్ వైపు తీసుకెళ్తూ కదులుతున్న వాహనంలోనే అత్యాచారానికి పాల్పడ్డారు. తెల్లవారుజామున 3 గంటల సమయంలో రోడ్డుపై పడేసి వెళ్లిపోయారు’ అని పేర్కొన్నారు. నిందితులను అరెస్టు చేశామని.. తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు వివరించారు.

మా పిల్లలకు తెలుగు నేర్పుతున్నాం

- పరాయి రాష్ట్రాల్లో ఉన్నా.. పల్లెలకు వెళ్లి మాతృభాష బోధిస్తున్నాం
- సామూహిక వేడుకలతో మన పండుగల ప్రాధాన్యం తెలియజేస్తున్నాం
- తమిళనాడు, గుజరాత్, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్‌లోని ప్రవాసాంధ్రులు



ప్రపంచ తెలుగు మహాసభల్లో పాల్గొన్న రాష్ట్రేతర తెలుగు ప్రతినిధులు



తమిళనాడుకు చెందిన ఏవీ సీతారామయ్య, రామచంద్రన్, ఎస్టీ రాజు, వెంకట్రావ్

ఈనాడు, అమరావతి: వందల ఏళ్ల క్రితం ఉపాధి, ఉద్యోగ, వ్యాపారాల కోసం తెలుగు నేల వదిలి ఎంతో మంది తమిళనాడు, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, కర్ణాటక, అండమాన్, గుజరాత్, ఛత్తీస్‌గఢ్ తదితర ప్రాంతాలకు వలసవెళ్లారు. రాష్ట్రాల విభజన సందర్భంలో తెలుగు ప్రాబల్యం ఉన్న కొన్ని ప్రాంతాలు తమిళనాడు, కర్ణాటక, ఒడిశా, మహారాష్ట్రల్లో కలిశాయి. ఇలా ఆంధ్ర, తెలంగాణ వెలుపల పెద్ద సంఖ్యలో నేటికీ తెలుగువారున్నారు. ఆయా రాష్ట్రాల్లో సామాజిక, ఆర్థిక, రాజకీయ, వ్యాపార రంగాల్లో రాణిస్తున్నారు. మాతృభాష, సంస్కృతి వికాసానికి కృషి చేస్తున్నారు. గుంటూరులో జరుగుతున్న ప్రపంచ తెలుగు మహాసభలకు వచ్చిన వారు.. తమ ప్రాంతాల్లో తెలుగు భాష అభ్యుదయానికి చేస్తున్న కృషిని, ఎదుర్కొంటున్న సవాళ్లను 'ఈనాడు'కు వివరించారు.

ప్రస్తుతం మాట మాత్రమే తెలుగు


–రాళ్లపల్లి సుందరరావు, ఖరగ్‌పూర్, పశ్చిమ బెంగాల్



పశ్చిమ బెంగాల్‌లో మూడున్నర లక్షల మంది వరకు తెలుగువాళ్లు ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తెలుగు మాధ్యమంలో బోధించే 35 ప్రాథమిక, 9 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఒకటి, రెండు మినహా అన్ని ప్రాథమిక పాఠశాలలు మూతపడ్డాయి. పిల్లలు చేరడం లేదన్న కారణంతో హైస్కూళ్లను ఆంగ్ల మాధ్యమంలోకి మారుస్తున్నారు. ఒక్క ఖరగ్‌పూర్‌లోనే లక్ష మంది పైగా ఉన్నారు. ఇక్కడ తెలుగు మాధ్యమంలో బోధించే మూడు ఉన్నత, ఏడు ప్రాథమిక పాఠశాలలు ఉండేవి. ప్రాథమిక పాఠశాలలన్నీ మూతపడ్డాయి. 25 ఏళ్ల క్రితం వరకూ రాయడం, చదవడం తెలుగులోనే సాగేవి. ఇప్పుడు మాట మాత్రమే తెలుగు. పదేళ్ల క్రితం రాష్ట్రేతర తెలుగు సంఘాన్ని స్థాపించాం. దీని ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాలు చేస్తున్నాం. పిల్లలకు పద్య పఠనం, వక్తృత్వం, వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్నాం.

ఆన్‌లైన్‌లో తెలుగు నేర్పిస్తున్నాం


–తనికెళ్ల పార్థసారథి, రాయపూర్, ఛత్తీస్‌గఢ్



ఛత్తీస్‌గఢ్‌లో సుమారు 3 లక్షల మంది తెలుగువారు ఉన్నారు. ఒక్క రాయ్‌పుర్‌లోనే లక్ష మంది వరకూ ఉంటారు. మా తాతల కాలంలో రైల్వే పనుల కోసం అక్కడకు వెళ్లాం. ఉగాది, సంక్రాంతి, కార్తిక వన భోజనాలు, అన్నమయ్య గీతాలాపనలు చేస్తున్నాం. ప్రవాసాంధ్ర ప్రజా నాట్య మండలి - బిలాయ్, ఆంధ్ర అసోసియేషన్ - రాయ్‌పుర్, ఆంధ్ర బ్రాహ్మణ సమాజం, ఆంధ్ర కల్చరల్ అసోసియేషన్ - బిలాస్‌పుర్, ఆంధ్ర తెలుగు స్వాభిమాన సంఘం తదితర అనేక సంఘాలు పనిచేస్తున్నాయి. ఆదివారాల్లో ఆన్‌లైన్ క్లాసులతో పిల్లలకు తెలుగు నేర్పిస్తున్నాం. గత 50 ఏళ్లుగా బిలాయ్‌లో క్యాంప్-1 ఏరియాలో ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వ సహకారంతో ఓ ఎయిడెడ్ పాఠశాల నడుస్తోంది. ఇక్కడ ఐదో తరగతి వరకు తెలుగు మాధ్యమంలో, పదో తరగతి వరకు తెలుగును ఓ సబ్జెక్టుగా బోధించేవారు. అక్కడి ప్రభుత్వం ఎయిడ్ ఆపేయడంతో అదీ మూతపడింది.

తెలుగు మాటలకే నవతరం పరిమితం

– పీవీపీసీ ప్రసాద్, అహ్మదాబాద్, గుజరాత్



200 ఏళ్ల క్రితం చాలామంది తెలుగువాళ్లు గుజరాత్‌లో స్థిరపడ్డారు. గతంలో తెలుగు మాధ్యమంలో నడిచే పాఠశాలలు ఉండేవి. ఇప్పుడవి మూతపడ్డాయి. కొత్తతరానికి తెలుగు మాట్లాడటం వస్తోంది కానీ రాయడం, చదవడం రావడం లేదు. అందుకే వారాంతాల్లో నేర్పిస్తున్నాం. తెలుగు వాగ్గేయకారుల జయంతులు, పండగలు నిర్వహిస్తున్నాం పిల్లలకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు పెడుతున్నాం. నగరీకరణ వల్ల గుజరాత్‌లో తెలుగువాళ్లు చెదిరిపోతున్నారు.

తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు చొరవ చూపాలి

– జి.ఆనందరావు, ఒడిశా

''వివిధ రాష్ట్రాల్లో ఉన్న తెలుగువారి సమస్యలపై అధ్యయనం చేయాలి. ఆంధ్ర, తెలంగాణ ప్రభుత్వాలు ఈ బాధ్యత తీసుకోవాలి. ఒడిశాలో ఉన్న చాలా తెలుగు పాఠశాల్లో తెలుగు బోధించే ఉపాధ్యాయులు లేరు. ప్రభుత్వం కొత్తవారిని నియమించడం లేదు. కానీ ఒడిశా ప్రభుత్వం తెలుగు పాఠ్యపుస్తకాల కోసం విద్యార్థులకు నిధులిస్తోంది''

తెలుగులో చదవాలని ఇంటింటికీ వెళ్లి చెబుతున్నాం

– రుత్తల వెంకటేశ్వరరావు, తిప్పేస్వామి, తుంగభద్ర డ్యాం, కర్ణాటక



''ఒక్క బెంగళూరు నగరంలోనే 19 శాతం తెలుగు వారున్నారు. బళ్లారి, హోస్‌పేట, గంగావతి, రాయ్‌చూర్ తదితర ప్రాంతాలు సహా కర్ణాటక రాష్ట్రవ్యాప్తంగా కోటిమందికి పైనే ఉంటారు. కానీ 30 లక్షల మందే ఉన్నారని తప్పుడు లెక్కలు చెబుతున్నారు. మేం తుంగభద్ర డ్యాం కట్టేటప్పుడు వచ్చి స్థిరపడ్డాం. మాది మూడోతరం. 10,000 మంది వరకూ ఉన్నారు. కర్ణాటక తెలుగు సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. తెలుగు మాధ్యమంలో బోధించే మూడు ప్రాథమిక, ఒక ఉన్నతపాఠశాల ఉన్నాయి. కానీ తెలుగు టీచర్ల కొరత ఉంది. ఇంటింటికీ వెళ్లి తెలుగులో చదవాలని చెబుతున్నాం. పోటీలు నిర్వహించి బహుమతులు ఇస్తున్నాం''

ఐదు వేల మంది తెలుగు నేర్చుకోవడానికి ముందుకొచ్చారు

–ఏవీ సీతారామయ్య, హోసూరు, తమిళనాడు

రాష్ట్రేతర తెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో హోసూరు ప్రాంతంలో తెలుగువాళ్లు ఉన్న గ్రామాలకు వెళుతున్నాం. ఐచ్ఛిక భాషగా తెలుగును ఎంచుకోవాలని చెప్పి విద్యార్థుల తల్లిదండ్రుల్ని ఒప్పిస్తున్నాం. మా ప్రయత్నం ఫలితంగా ఈ ఏడాది హోసూరు, తళి, కెళమంగళం, సూళగిరి ప్రాంతంలోని 200 పాఠశాలల్లో 5,000 మంది విద్యార్థులకు తెలుగు బోధించడానికి ఉపాధ్యాయులు ముందుకొచ్చారు. ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు 5,000 మందికి దాతల సహకారంతో తెలుగు కాపీ రైటింగ్ పుస్తకాలు అందిస్తున్నా.

తమిళనాడు ప్రభుత్వంపై న్యాయపోరాటం

– రామచంద్రన్, ఎస్టీ రాజు, తమిళనాడు

తమిళనాడు ప్రభుత్వం 2006లో తమిళ నిర్బంధ విద్య చట్టం తీసుకొచ్చింది. అప్పటి నుంచి ఆ రాష్ట్రంలో తెలుగు కనుమరుగవుతూ వస్తోంది. ఈ చట్టంలో నాలుగు భాగాలు ఉన్నాయి. నాలుగో భాగంలో ఐచ్ఛికంగా తెలుగు నేర్చుకునే అవకాశమిచ్చారు. కానీ మార్కులు ఇవ్వలేదు. ఇతర సబ్జెక్టులకు ఇచ్చినట్టే దీనికీ మార్కులు ఇవ్వాలని తెలుగు సంఘాలు హైకోర్టు, సుప్రీం కోర్టుల్ని ఆశ్రయించాయి. సుప్రీంకోర్టు ఐచ్ఛిక భాషకూ మార్కులు ఇవ్వాలని తీర్పు ఇచ్చింది. దీనిపై స్థానిక విద్యాశాఖాధికారులతో మాట్లాడుతున్నాం. ఉపాధ్యాయులు, తెలుగు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.



ఢిల్లీలో జరిగిన సంక్రాంతి వేడుకల్లో స్థానిక మహిళలతో కలిసి సంప్రదాయ వంటకంలో గరిటె తిప్పుతున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

ప్రకృతి, పెద్దలను గౌరవించే పండుగే సంక్రాంతి

దిల్లీ విశ్వవిద్యాలయం వేడుకల్లో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

ఈనాడు, దిల్లీ: 'సంక్రాంతి అంటే కేవలం సెలవు దినంకాదు.. తరతరాలుగా కుటుంబసమేతంగా జరుపుకుంటూ వస్తున్న మహత్తర పర్వదినం. పాడిపంటలు, ప్రకృతి, పెద్దల పట్ల గౌరవాన్ని చాటుకొనే గొప్ప ఉత్సవం' అని పౌరవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు అన్నారు. ఆదివారం రాత్రి ఇక్కడి దిల్లీ విశ్వవిద్యాలయం తెలుగు విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన సంక్రాంతి ఉత్సవాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. 'నగరజీవనం, చిన్న కుటుంబాల కారణంగా మనం పండగలను మరిచిపోవడం తగదు. గాలిపటాలు, ముగ్గులు, గొబ్బెమ్మలు, గంగిరెద్దుల వంటి సంప్రదాయాలను వచ్చే తరాలకూ పరిచయం చేయాల్సిన బాధ్యత యువతపై ఉంది. దిల్లీలో చదువుకుంటున్న విద్యార్థులు తమ భాష, సంస్కృతి, సంప్రదాయాలను మరిచిపోకుండా ఇంత పెద్దఎత్తున పండుగలు జరుపుకోవడం గర్వకారణం. బతుకమ్మ, సంక్రాంతి వేడుకలను ఏటా ఘనంగా నిర్వహిస్తున్న తెలుగు విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు. తెలుగు వారు ఎక్కడ ఉన్నా చక్కని ఆతిథ్యం ఇస్తూ తియ్యని మనసుతో అందరి మన్ననలూ పొందుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో భోగాపురం విమానాశ్రయం తొలి పరీక్ష విజయవంతమైంది. త్వరలో వరంగల్ విమానాశ్రయ నిర్మాణపనులు కూడా ప్రారంభంకాబోతున్నాయి. ఇవన్నీ యువతకు మెరుగైన కనెక్టివిటీ, ఉపాధి అవకాశాలు కల్పిస్తాయి' అని అన్నారు.

రూ.4,497 కోట్ల ట్రూఅప్ భారాన్ని...

ప్రభుత్వమే భరిస్తుంది

- మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

ఈనాడు, అమరావతి: పేద, మధ్యతరగతి, గృహ విద్యుత్ వినియోగదారులపై బిల్లుల భారాన్ని తగ్గించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, ట్రూఅప్ కింద డిస్కంలకు చెల్లించాల్సిన రూ.4,497.89 కోట్ల భారాన్ని ప్రజలపై పడకుండా ప్రభుత్వమే భరిస్తోందని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. 'రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఏర్పాటైనప్పటి నుంచి మొదటిసారి ట్రూడౌన్ చేశాం. యూనిట్‌కు 13 పైసల చొప్పున విద్యుత్ ఛార్జీల్లో తగ్గించిన మొత్తాన్ని నవంబరు నెల బిల్లు నుంచి సర్దుబాటు చేస్తున్నాం. యూనిట్ విద్యుత్ కొనుగోలు వ్యయాన్ని రూ.4.80కు తగ్గించాం. వైకాపా ప్రభుత్వం యూనిట్ విద్యుత్ కొనుగోలుకు రూ.5.19 చొప్పున ఖర్చు చేసింది. ఐదేళ్ల పాలనలో 9 సార్లు ఛార్జీలు పెంచి.. ప్రజలపై రూ.32 వేల కోట్ల అదనపు భారాన్ని వేసింది. కమీషన్ల కోసం అధిక ధరకు విద్యుత్‌ను కొన్నది. ఇతర ఖర్చుల రూపంలో విద్యుత్ సంస్థలను రూ.1.29 లక్షల కోట్ల మేర అప్పుల పాలు చేసింది. 2019లో మిగులు విద్యుత్ ఉన్న రాష్ట్రాన్ని.. అస్తవ్యస్త విధానాలతో అంధకారంగా మార్చింది' అని మంత్రి ఓ ప్రకటనలో విమర్శించారు.



తెలుగు మహాసభల ప్రాంగణంలో పోస్టల్‌శాఖ స్టాల్ పెట్టింది. అక్కడ ప్రదర్శనకు ఉంచిన అక్కినేని నాగేశ్వరరావు స్మారక స్టాంపులు ఇవి

దిల్లీలో చదివిన మారిషస్ అధ్యక్షుడు

- ధరమ్‌బీర్ గోకుల్ ప్రస్థానంలో భారత్‌తో విద్యానుబంధం

ఈనాడు, అమరావతి: మారిషస్ అధ్యక్షుడు ధరమ్‌బీర్ గోకుల్‌కు భారత్‌తో 50 ఏళ్ల అనుబంధం ఉంది. గుంటూరులో జరుగుతున్న మూడో ప్రపంచ తెలుగు మహాసభల్లో ఆయన ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధరమ్ జీవితవిశేషాలను ఆయన సన్నిహితులు వివరిస్తూ భారత్‌తో ఉన్న ప్రత్యేక అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ధరమ్ ప్రస్థానంలో ముఖ్యఘట్టాలివి..

- ధరమ్‌బీర్ గోకుల్ 1949 అక్టోబర్ 25న మారిషస్‌లోని ప్లెయిన్స్ డెస్ రోషెస్ ప్రాంతంలో జన్మించారు.
- 1973లో దిల్లీ విశ్వవిద్యాలయం నుంచి చరిత్ర-ఆర్థికశాస్త్రంలో బీఏ ఆనర్స్ పట్టా పొందారు.
- 1975లో ఎంబీఏ చేసి.. 1987లో యూకేలోని మాంచెస్టర్ సమీపంలో గల యూనివర్సిటీ ఆఫ్ సాల్ఫర్డ్ నుంచి హ్యూమన్ రిసోర్సెస్‌లో ఎమ్మెస్సీ పట్టా పొందారు.
- మారిషస్ విశ్వవిద్యాలయంలో అధ్యాపకుడిగా సేవలు ప్రారంభించి.. సీనియర్ లెక్చరర్, అసోసియేట్ ప్రొఫెసర్, లా అండ్ మేనేజ్‌మెంట్ ఫ్యాకల్టీ డీన్ స్థాయికి ఎదిగారు.
- డీన్‌గా ఉన్నప్పుడే విశ్వవిద్యాలయ సెనేట్, యూనివర్సిటీ కోర్ట్ సభ్యుడిగానూ సేవలందించారు.
- 2008లో ఆయనకు ఫ్రాన్స్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందించి సత్కరించింది.
- 2021 నుంచి 2024 వరకు మారిషస్ విశ్వవిద్యాలయ ఎథిక్స్ కమిటీ సభ్యుడిగా సేవలందించారు.
- అనేకసార్లు ఎంపీగా, మంత్రిగా పనిచేసిన ఆయన. . 2024 డిసెంబరు 6న మారిషస్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

అవయవదాతల కుటుంబాలకు ఆర్థిక సాయం అందించాలి

- సీఎంకు మంత్రి సత్యకుమార్ విజ్ఞప్తి

ఈనాడు-అమరావతి: అవయవాలు దానం చేసిన జీవన్మృతుల కుటుంబాల త్యాగాన్ని గుర్తిస్తూ, వారికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందజేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. దీనివల్ల రాష్ట్రంలో అవయవదానాలను మరింత ప్రోత్సహించినట్లవుతుందని అభిప్రాయపడ్డారు. 'కర్నూలు జిల్లా నన్నూరుకు చెందిన మద్దు కుషల్ వీర సాయికుమార్(15) బ్రెయిన్ డెడ్ కారణంగా మృతి చెందడంతో అతని గుండె, కిడ్నీ, లివర్, ఊపిరితిత్తులను పలు ఆసుపత్రులకు అందించి ఐదుగురి జీవితాల్లో వెలుగులు నింపారు. ఆ బాలుడి అవయవాలు దానం చేసిన కుటుంబసభ్యుల స్ఫూర్తి ఆదర్శనీయం' అని ఆదివారం ఓ ప్రకటనలో మంత్రి కొనియాడారు.

ఉరేసి.. గుండెపోటని నాటకమాడి

- ప్రియుడితో కలిసి భర్తను చంపిన భార్య
- ఇజ్రాయెల్ నుంచి మృతుడి తమ్ముడి ఫిర్యాదుతో బండారం బయటకు



మృతుడు రమేశ్

నిజామాబాద్ నేరవిభాగం, మాక్లూర్, న్యూస్‌టుడే: తన భర్త ఇంట్లో గుండెపోటుతో చనిపోయాడని అందరికీ చెప్పింది. బోరున ఏడుస్తూ హడావుడిగా అంత్యక్రియలు కూడా పూర్తి చేసింది. కానీ, ఇజ్రాయెల్‌లో ఉన్న మృతుడి తమ్ముడికి అనుమానం రావడంతో ఆమె బండారం మొత్తం బయటపడింది. ప్రియుడితో కలిసి భర్తను దారుణంగా హతమార్చి అందరి ముందు నాటకమాడినట్లు పోలీసులు తేల్చడంతో గ్రామస్థులు విస్తుపోయారు. ఆదివారం నిజామాబాద్ ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి విలేకరుల సమావేశంలో ఈ ఘటనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. తెలంగాణలోని నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం బొర్గాం(కె) గ్రామానికి చెందిన పల్లాటి రమేశ్(35), సౌమ్య(అరుణలత) దంపతులకు 13 ఏళ్ల క్రితం వివాహం అయింది. వారికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. గత నెల 20న రమేశ్ ఇంట్లో గుండెపోటుతో మరణించాడని బంధువులకు చెప్పి అంత్యక్రియలు చేయించారు. రమేశ్ మెడపై గాట్లు ఉన్నట్లు కొందరు స్థానికులు ఇజ్రాయెల్‌లో ఉన్న అతని తమ్ముడు కేదారికి చెప్పారు. ఈ మేరకు మాక్లూర్ పోలీసులకు గత నెల 21న ఫోన్ చేసి తన సోదరుడి మరణంపై అనుమానాలున్నాయని ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు 24న మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించడంతో హత్యగా తేలింది. సౌమ్యను అదుపులోకి తీసుకొని విచారించగా తానే హత్య చేసినట్లు అంగీకరించారు. నిజామాబాద్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో నాన్‌టీచింగ్ స్టాఫ్‌గా పని చేస్తున్న ఆమెకు అక్కడి పీఈటీ, నందిపేట్ మండలం బాద్గుణకు చెందిన నాలేశ్వర్ దిలీప్‌తో పరిచయం ఏర్పడి.. వివాహేతర సంబంధంగా మారింది. ఈ విషయం రమేశ్‌కు తెలిసి భార్యతో గొడవపడ్డారు. దీంతో ప్రియుడితో కలిసి అతన్ని అడ్డుతొలగించుకోవాలని ప్రణాళిక వేశారు. గతేడాది ఆగస్టులో రమేశ్ ద్విచక్రవాహనంపై వెళ్తుండగా దిలీప్ కారుతో ఢీకొట్టడంతో స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఇది విఫలంకావడంతో సౌమ్య తన బంగారు ఉంగరాన్ని రూ.35 వేలకు విక్రయించి సుపారీ గ్యాంగ్‌తో చంపించేందుకు పథకం రచించింది. అందులో భాగంగా గత నెల 19న రమేశ్‌కు మంచినీటిలో 10 నిద్ర మాత్రలు కలిపి తాగించడంతో నిద్రలోకి జారుకున్నారు. అనంతరం సుపారీగ్యాంగ్‌ను పిలిపించి వారితో చంపించాలని ప్రయత్నించగా వారు ఫోన్‌లో స్పందించలేదు. ఈ విషయం తెలిసి దిలీప్ తన తమ్ముడు అభిషేక్‌తో కలిసి సౌమ్య ఇంటికి వెళ్లారు. ముగ్గురూ కలిసి రమేశ్ మెడకు టవల్ బిగించి.. దిండుతో ముక్కు, నోరు మూసి చంపారు. ఈ కేసులో నిందితులు సౌమ్య, దిలీప్, అభిషేక్‌తో పాటు సుపారీగ్యాంగ్ సభ్యులు మాధాపూర్ గ్రామానికి చెందిన జితేందర్, వేణుకిషాన్‌నగర్ తండాకు చెందిన కెలోత్ శ్రీరామ్ ఎలియాస్ బబ్లూ, రమావత్ రాకేశ్‌లను పోలీసులు అరెస్టు చేశారు. మరో నిందితుడు మోసిన్ పరారీలో ఉన్నాడు.

భారాసకు కౌంటర్ ఇవ్వడానికి రేవంత్‌రెడ్డి అలా మాట్లాడవద్దని కోరుతున్నా

- మాజీమంత్రి సోమిరెడ్డి వ్యాఖ్య

ఈనాడు, అమరావతి: 'గోదావరి మిగులు జలాల విషయంలో భారాస నాయకుల విమర్శలకు కౌంటర్ ఇవ్వడానికి.. ఆంధ్రా వాళ్లు నీళ్లు వాడుకోకూడదని మాట్లాడొద్దని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని కోరుతున్నాను. ఇలాంటి వ్యాఖ్యలను తెలంగాణ వారు కూడా సహించరు' అని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. వృథాగా సముద్రంలోకి పోతున్న జలాలను వాడుకుంటే తప్పేంటని భారాస నేతల్ని ప్రశ్నించారు. ఆంధ్రులు దోచుకుంటున్నారని భావోద్వేగాలు రెచ్చగొట్టిన భారాసకు ప్రజలు ఇప్పటికే బుద్ధి చెప్పారని తెలిపారు. గోదావరి మిగులు జలాల్లో ఏపీ ఒక్క నీటి బొట్టు వాడుకున్నా సహించబోమంటూ భారాస నేత హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యల్ని తీవ్రంగా ఖండించారు. నెల్లూరులో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'తాను, వైఎస్ జగన్ కలిసి గోదావరి మిగులు జలాలను రాయలసీమకు తరలిస్తామని గతంలో స్వయంగా కేసీఆర్ ప్రకటించారు. తిరుపతిలో మాజీమంత్రి రోజా ఇంటికి వెళ్లిన సందర్భంలో ఆయనీ వ్యాఖ్యలు చేశారు. తన మేనమామ అన్న మాటల్ని హరీశ్‌రావు గుర్తుచేసుకోవాలి' అని చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. 'ఏటా రెండు, మూడు వేల టీఎంసీల గోదావరి జలాలు వృథాగా సముద్రంలో కలుస్తున్నాయి. 200 టీఎంసీల సామర్థ్యంతో బనకచర్ల ప్రాజెక్టును ప్రతిపాదిస్తే భారాస నేతలు అనని మాటలేదు. ఒక్క నీటి బొట్టు ఆంధ్రులు వాడుకున్నా సహించమన్నారు. తెలంగాణకు వాటాగా వచ్చే నీటిని ఏపీ వాడుకుంటే అభ్యంతరం చెప్పాలి. అంతేతప్ప అనవసరంగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం భారాస నేతలకు తగదు' అని సోమిరెడ్డి తెలిపారు.

ఆటో ఇస్తారా.. పామును మీద వేయమంటారా!

ఓ యువకుడు పాముతో ట్రాఫిక్ ఎస్సైని బెదిరిస్తూ హంగామా సృష్టించాడు. హైదరాబాద్‌లోని చాంద్రాయణగుట్ట చౌరస్తా కరాచీ బేకరీ వద్ద ట్రాఫిక్ ఎస్సై ఎం.ఎ.కరీం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. పహాడీషరీఫ్ చార్మినార్ మసీదు ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ సయ్యద్ ఇర్ఫాన్(23)కు శ్వాస పరీక్ష చేయగా 110 రీడింగ్ వచ్చింది. దీంతో అతనిపై కేసు నమోదు చేసి, ఆటో సీజ్ చేస్తున్నామని చెప్పారు. తనపై కేసు పెట్టవద్దంటూ ఇర్ఫాన్ తొలుత అభ్యర్థించాడు. పోలీసులు ససేమిరా అనడంతో.. అక్కడ ఉన్న ద్విచక్ర వాహనానికి తల బాదుకున్నాడు. ఆటోలో తన వస్తువులున్నాయంటూ బండి దగ్గరికి వెళ్లాడు. అందులోంచి ఓ మూటను బయటికి తీశాడు. అందులో ఓ పాము ఉంది. ఇర్ఫాన్ దాన్ని చేతికి చుట్టుకుని ఎస్సై వద్దకు వచ్చాడు. ఆటో ఇస్తారా.. పామును మీద వేయమంటారా అంటూ ఆయన మీదకు తీసుకెళ్లాడు. పామును చేతికి చుడుతూ, విప్పుతూ హంగామా చేశాడు. తర్వాత అక్కడి నుంచి పారిపోయాడు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. ఈ ఘటన శనివారం రాత్రి జరిగింది. ట్రాఫిక్ ఎస్సై ఫిర్యాదుతో పోలీసులు ఇర్ఫాన్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. మద్యం మత్తులో అలా చేశానని, తప్పయిందని తర్వాత ఇర్ఫాన్ మీడియా ముందు చెప్పాడు. తాను చూపించింది చనిపోయిన పాము అని.. తన అక్కలను ఆటపట్టించడానికి దారిలో దొరికితే తీసుకొచ్చానని తెలిపాడు.



పాముతో ట్రాఫిక్ ఎస్సై ఎం.ఎ.కరీం పైకి వెళ్తున్న సయ్యద్ ఇర్ఫాన్

– న్యూస్‌టుడే, కేశవగిరి

తెలంగాణలో ఇక చన్నీళ్ల చేపలు

ఉష్ణమండల రాష్ట్రంలో తొలిసారిగా ఉత్పత్తి కేంద్రం.. నేడు ప్రారంభం

ఈనాడు, హైదరాబాద్: హిమాలయ పర్వత ప్రాంతాలను ఆనుకొని ఉన్న రాష్ట్రాల్లోని చన్నీళ్ల నదులు, ప్రవాహాల్లో పెరిగే అరుదైన ట్రౌట్ చేపలు ఇక తెలంగాణలోనూ లభించనున్నాయి. రుచికరం, ఒమెగా-3 ఫ్యాటీ యాసిడ్లు, విటమిన్లు, ప్రొటీన్ల వంటి పోషకవిలువలతో పాటు మంచి ధర(కేజీ రూ. వేలల్లో)తో ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందుతున్న ఈ చేపలు అతి చల్లటి, ఆక్సిజన్ ఎక్కువగా ఉండే నీటిలోనే పెరుగుతాయి. దేశంలో తొలిసారిగా ఉష్ణమండల రాష్ట్రంలో వాణిజ్యస్థాయిలో ఈ చేపల ఉత్పత్తికి ఏర్పాటు చేసిన రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం గూడూరులోని కేంద్రం సోమవారం కేంద్ర మత్స్యశాఖ మంత్రి రాజీవ్‌రంజన్‌సింగ్ చేతుల మీదుగా ప్రారంభం కానుంది. స్మార్ట్ గ్రీన్ ఆక్వాకల్చర్ లిమిటెడ్ సంస్థ 'రెయిన్‌బో ట్రౌట్ ఫామ్, పరిశోధన కేంద్రం' పేరిట దీనిని ఏర్పాటు చేస్తోంది.

ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపునివ్వాలి

- రాష్ట్రోపాధ్యాయ సంఘం డిమాండ్

ఈనాడు, అమరావతి: ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ ఉత్తీర్ణత నుంచి మినహాయింపు ఇవ్వాలని, ఈ మేరకు వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో చట్ట సవరణ చేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు రాజస్థాన్‌లోని జైపుర్‌లో జరిగిన ఏఐఎస్‌టీఎఫ్ జాతీయ కార్యవర్గ సమావేశంలో నిర్ణయించినట్లు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.రఘునాథరెడ్డి, ఎల్.సాయిశ్రీనివాస్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

పోలవరం-నల్లమలసాగర్‌పై సమర్థ వాదనలు వినిపించండి

- 'సుప్రీం' న్యాయవాది సింఘ్వీకి సూచించిన సీఎం రేవంత్‌రెడ్డి
- ముంబయి వెళ్లి ఆయనతో భేటీ అయిన సీఎం, మంత్రి ఉత్తమ్
- సుప్రీంకోర్టులో నేడు విచారణకు రానున్న కేసు



అభిషేక్ సింఘ్వీతో చర్చిస్తున్న తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: గోదావరిపై ఏపీ తలపెట్టిన పోలవరం- నల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టును (పీఎన్‌ఎల్‌పీ) అడ్డుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం సీనియర్ న్యాయ నిపుణులతో చర్చలు జరిపింది. ఆదివారం ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హైదరాబాద్ నుంచి ముంబయి వెళ్లారు. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పీఎన్‌ఎల్‌పీపై గత నెలలో రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ప్రభుత్వం దాఖలు చేసిన రిట్ పిటిషన్ సోమవారం విచారణకు రానుంది. ప్రభుత్వం తరఫున సమర్థ వాదనలు వినిపించాలని సింఘ్వీకి సీఎం సూచించారు. అవసరమైన అన్ని ఆధారాలను సిద్ధంగా ఉంచుకోవాలంటూ నీటిపారుదల ఇంజినీర్లను ప్రభుత్వం అప్రమత్తం చేసింది. న్యాయనిపుణులతో భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు.

అనుమతులు లేకుండా నిర్మాణం

పోలవరం ప్రాజెక్టు నుంచి బనకచర్ల హెడ్‌రెగ్యులేటర్ లేదా నల్లమలసాగర్ జలాశయానికి లింక్ చేసేలా గోదావరిపై ఏపీ ప్రాజెక్టు చేపడుతోందంటూ రిట్ పిటిషన్‌లో తెలంగాణ సుప్రీంకోర్టుకు విన్నవించింది. దీనికి ఎలాంటి అనుమతులు లేవని పేర్కొంది. ఈ పనులను తక్షణమే నిలిపివేసేలా పోలవరం ప్రాజెక్టు అథారిటీని ఆదేశించాలని అభ్యర్థించింది. అనుమతించిన మేరకే పోలవరం ప్రాజెక్టు స్వరూపం ఉండాలని, విస్తరణ పనులు చేపట్టడం చట్టవిరుద్ధం అని పేర్కొంది. 'దీనిపై తెలంగాణ.. కేంద్రానికి పలు అభ్యంతరాలను తెలిపింది. వీటిని పరిగణనలోకి తీసుకోకుండా నల్లమలసాగర్ ప్రాజెక్టు ప్రీ ఫీజిబిలిటీ రిపోర్టును (పీఎఫ్‌ఆర్) కేంద్ర ప్రభుత్వం పరిశీలించడం సమంజసం కాదని తెలిపింది. దీనికి సంబంధించి ఎటువంటి చర్యలు చేపట్టరాదంటూ జలశక్తి మంత్రిత్వ శాఖ, కేంద్ర జల సంఘం, గోదావరి నదీ యాజమాన్య బోర్డులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కేంద్రాన్ని కోరింది'' అని రిట్‌పిటిషన్‌లో పేర్కొంది.

డీపీఆర్‌పై ముందుకెళ్లకుండా చూడాలి

అభ్యంతరాలు చెబుతున్నా కేంద్ర జల సంఘం మార్గదర్శకాలకు విరుద్ధంగా పోలవరం-నల్లమలసాగర్ లింక్‌కు సంబంధించి ప్రాజెక్టు సమగ్ర నివేదిక (డీపీఆర్) తయారీకి ఏపీ ప్రభుత్వం సిద్ధపడుతోందని పిటిషన్‌లో తెలంగాణ తెలిపింది. డీపీఆర్‌పై ఆ రాష్ట్రం ముందుకు వెళ్లకుండా చూడాలని కోరింది. ఏపీ నిర్మిస్తున్న లింక్ ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు జారీ చేయకుండా, కేంద్రం నుంచి ఎటువంటి ఆర్థిక సాయం అందించకుండా తగిన ఆదేశాలు ఇవ్వాలంటూ సుప్రీంకోర్టును కోరింది.



ట్రోఫీతో అల్లూరి జిల్లా కలెక్టర్ నేతృత్వంలోని జట్టు

ముగిసిన ఐఏఎస్ క్రికెట్ టోర్నమెంట్-2025

- విజేతగా అల్లూరి జిల్లా కలెక్టర్ నేతృత్వంలోని జట్టు

ఈనాడు, అమరావతి: పరిపాలన బాధ్యతలతో బిజీగా గడిపే ఐఏఎస్ అధికారులు క్రికెట్ బ్యాట్లు పట్టారు. ఫోర్లు, సిక్సులతో హోరెత్తిస్తూ బౌలింగ్‌లోనూ సత్తా చూపారు. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం కొప్పురావూరులోని మైదానంలో ఆదివారం 'ఐఏఎస్ క్రికెట్ టోర్నమెంట్-2025' ఫైనల్ మ్యాచ్ జరిగింది. ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోరులో అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ నేతృత్వంలోని జట్టు విజేతగా నిలిచింది. వారికి నిర్వాహకులు ట్రోఫీ అందజేశారు. ఈ టోర్నీలో ఐఏఎస్ అధికారులు రంజిత్‌బాషా, రాహుల్ మీనా, వివిధ జిల్లా కలెక్టర్లు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

గ్రామంలోకి చొరబడి సాయుధమూక దాడులు

- నైజీరియాలో 30 మందికి పైగా మృతి

మిన్నా: ఉత్తర నైజీరియాలో సాయుధమూకలు పేట్రేగిపోయాయి. నైజర్ రాష్ట్రంలోని ఓ గ్రామంలోకి చొరబడి దాడులకు తెగబడ్డాయి. ఈ ఘటనలో 30 మందికిపైగా మృతిచెందగా.. పలువురు అపహరణకు గురయ్యారు. శనివారం సాయంత్రం దుండగులు బోర్గు ప్రభుత్వ పరిధిలోని కసువాన్- డాజీ గ్రామంలోకి ఆయుధాలతో చొరబడి గ్రామస్థులపై కాల్పులకు తెగబడినట్లు పోలీసులు వెల్లడించారు. ఆపై స్థానిక మార్కెట్లను, ఇళ్లను తగలబెట్టినట్లు తెలిపారు. అపహరణకు గురైన వారి ఆచూకీ కోసం బలగాలను రంగంలోకి దింపినట్లు పోలీసులు తెలిపారు. దుండగుల కాల్పుల్లో 37 మంది మృతి చెంది ఉంటారని పలువురు గ్రామస్థులు తెలిపారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముంది.

పడవ బోల్తా.. 25 మంది మృతి

మరోవైపు ఉత్తర నైజీరియాలోని యోబే రాష్ట్రంలో పడవ బోల్తా పడి 25 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 14 మంది గల్లంతయ్యారు. శనివారం రాత్రి యోబే నదిలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. 52 మందితో స్థానిక మార్కెట్‌కు ప్రయాణిస్తున్న పడవ బోల్తా పడినట్లు అధికారులు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న అత్యవసర సేవల సిబ్బంది... 13 మందిని రక్షించారు.

గీత పఠనంతో పరీక్షల ఒత్తిడి ఉఫ్!



బిహార్‌లోని గయాలో దాదాపు 2,500 మంది విద్యార్థులు చదువుతున్న దయా ప్రకాశ్ సరస్వతీ విద్యామందిర్ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. ఈ పాఠశాల టీచరు షాలిని రాజ్‌పూత్ విద్యార్థులు మంత్రముగ్ధులు అయ్యేలా సంస్కృతంలోని భగవద్గీత శ్లోకాలను ఆలపిస్తూ సరళమైన హిందీ భాషలో వాటి సారాంశాన్ని వివరిస్తున్నారు. తద్వారా పరీక్షల వేళ తమకు మానసిక ఒత్తిడి దూరమవుతున్నట్లు విద్యార్థులు చెబుతున్నారు. రెండేళ్ల కిందట ఈ విద్యామందిర్‌లో టీచరుగా చేరిన షాలిని మొదట్లో ఇతర టీచర్లలాగే పాఠ్యాంశాల బోధనకు పరిమితం అయ్యేవారు. రాను రాను పరీక్షల వేళ విద్యార్థులు మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్న విషయాన్ని ఆమె గుర్తించారు. సంగీతం నేర్చుకొన్న షాలిని ఈ సమస్యకు కనుగొన్న పరిష్కారమే గీతా పఠనం. పాఠశాల నిర్వాహకులు ఆమె చొరవను అభినందించి ప్రోత్సహిస్తున్నారు. భగవద్గీత సంస్కారం నేర్పుతుందని, విద్యార్థులంతా చాలా ఉత్సాహంగా తనతో కలిసి శ్లోకాలను ఆలపిస్తున్నట్లు షాలిని 'ఈటీవీ భారత్'కు తెలిపారు.

ఈటీవీ భారత్ — యాప్ స్టోర్ & గూగుల్ ప్లే ద్వారా డౌన్‌లోడ్ చేసుకోండి



చైనాలోని హెయిలాంగ్‌జియాంగ్ ప్రావిన్స్ హర్బిన్‌లో కొనసాగుతున్న ఐస్ అండ్ స్నో ఫెస్టివల్‌లో మంచు కళాకృతిపై జారుతున్న ఓ సందర్శకుడు

బ్రూక్లిన్ జైలు.. అదో నరకం

ఇంటర్నెట్ డెస్క్: ఆపరేషన్ 'అబ్సల్యూట్ రిజాల్వ్' చేపట్టిన అమెరికా.. వెనెజువెలా అధ్యక్షుడు మదురో, ఆయన సతీమణిని బంధించి న్యూయార్క్‌కు తరలించింది. ప్రస్తుతం వారిని బ్రూక్లిన్‌లోని మెట్రోపాలిటన్ డిటెన్షన్ సెంటర్లో అధికారులు ఉంచారు. ఆర్. కెల్లీ, సీన్ డిడ్డీ కాంబ్స్ వంటి మ్యూజిక్ స్టార్లు ఉన్న ఈ జైలు ఎంతో సమస్యాత్మకమైందిగా భావిస్తుంటారు. నిందితులను అక్కడికి పంపించేందుకు కొందరు న్యాయమూర్తులే నిరాకరిస్తారనే ప్రచారం వ్యాప్తిలో ఉంది.



బ్రూక్లిన్‌లోని ఎండీసీని 1990లో ప్రారంభించారు. ప్రస్తుతం అక్కడ 1300 మంది ఖైదీలున్నారు. వివిధ కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటూ మన్‌హటన్, బ్రూక్లిన్ ఫెడరల్ న్యాయస్థానాల్లో విచారణ కోసం వేచి చూస్తున్న వారిని ఇక్కడికి పంపిస్తుంటారు. వైట్‌కాలర్ నేరాల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారితోపాటు గ్యాంగ్‌స్టర్లు, మాదకద్రవ్యాల కేసుల్లో నిందితులను ఉంచుతారు. ఓ దేశాధ్యక్షుడు ఇక్కడ నిర్బంధానికి గురి కావడం ఇదే తొలిసారి కాదు. హోండురాస్ మాజీ అధ్యక్షుడు జువాన్ ఆర్లాండో హెర్నాండెజ్ గతంలో ఇక్కడే బందీగా ఉన్నారు. వందలాది టన్నుల కొకైన్‌ను అమెరికాకు అక్రమ రవాణా చేశారన్న కేసులో ఆయనకు 45ఏళ్ల శిక్ష పడింది. అయితే గతేడాది ట్రంప్ ఆయనకు క్షమాభిక్ష ప్రసాదించడంతో జైలు నుంచి విడుదలయ్యారు. మెక్సికోకు చెందిన మాదక ద్రవ్యాల వ్యాపారులు, వెనెజువెలా నిఘా విభాగం మాజీ చీఫ్ హ్యూగో కార్వజల్‌తోపాటు ఆ దేశానికి చెందిన పలువురు కీలక వ్యక్తులు ఇక్కడ బందీలుగా ఉన్నారు.

భూమిపై నరకంగా..

స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ కనుచూపు మేరలో ఉన్న ఈ జైలుపై అనేక వివాదాలున్నాయి. ఇక్కడి దారుణ పరిస్థితుల కారణంగా దీన్ని భూమిపై నరకం, నిరంతర విషాదం అని వర్ణిస్తారు. ఇక్కడ హింసాత్మక ఘటనలపై ఖైదీలు, వారి న్యాయవాదుల నుంచి ఎన్నో ఫిర్యాదులు వస్తుంటాయి. 2024లో సహచరుల చేతిలో ఇద్దరు ఖైదీలు హత్యకు గురయ్యారు. నిషేధిత వస్తువులు అనుమతించడం, లంచాలు తీసుకుంటున్నారని జైలు సిబ్బందిపై ఆరోపణలున్నాయి. 2019లో విద్యుత్ అంతరాయం కారణంగా వారంపాటు ఖైదీలు చలి, చీకట్లోనే ఉండాల్సి వచ్చింది.

చమురు కోసమే ఈ ఆపరేషన్

- కమలా హారిస్ వ్యాఖ్య



వాషింగ్టన్: వెనెజువెలా అధ్యక్షుడు మదురోను బంధించడాన్ని అమెరికా మాజీ ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ తీవ్రంగా ఖండించారు. ఈ ఆపరేషన్ వెనుక డ్రగ్స్, ప్రజాస్వామ్య పరిరక్షణ అనడం అబద్ధమని, పూర్తిగా చమురు ప్రయోజనాలే కారణమని ఆరోపించారు. 'ట్రంప్ చర్యలు అమెరికాను మరింత సురక్షితంగా, బలంగా మార్చలేవు. మదురో క్రూరమైన, చట్టబద్ధత లేని నియంత అనేది వేరే విషయం. ఈ చర్య చట్ట విరుద్ధం, అవివేకం అనే వాస్తవం మారదు. సైనికులను ట్రంప్ ముప్పులోకి నెడుతున్నారు, బిలియన్ల డాలర్లు ఖర్చు చేస్తున్నారు. ఒక ప్రాంతాన్ని అస్థిరం చేస్తున్నారు. కానీ ఎలాంటి చట్టబద్ధ అధికారమూ, ఎగ్జిట్ ప్లాన్, దేశానికి లాభమూ లేదు. పని చేసే కుటుంబాల ఖర్చులు తగ్గించడం, చట్ట పాలన అమలు, మిత్రదేశాల బలోపేతం, ముఖ్యంగా అమెరికన్ ప్రజలను ముందుగా ఉంచే నాయకత్వం ఇప్పుడు దేశానికి అవసరం' అని హారిస్ స్పష్టం చేశారు.

జెలెన్‌స్కీని పుతిన్ బంధిస్తే..?

అమెరికా కాంగ్రెస్ సభ్యుడు రోఖన్నా

ఇంటర్నెట్‌డెస్క్: వెనెజువెలాపై అమెరికా సైనిక చర్యను భారత సంతతికి చెందిన చట్ట సభ సభ్యుడు రోఖన్నా తప్పుబట్టారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. "వెనెజువెలాలో పాలన మార్పు కోసం ట్రంప్ యుద్ధాన్ని ప్రారంభించి మాగా (మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్)ను మోసం చేశారు. ఇరాక్, అఫ్గానిస్థాన్, లిబియాలో ఘర్షణలకు వ్యతిరేకంగా ఓటు వేస్తున్నాం. కానీ, మా అధ్యక్షులు మాత్రం సైనికీకరణకు అనుకూలంగా ఉండే కొందరు వ్యక్తుల మాటలకు తలొగ్గుతున్నారు. తైవాన్ అధ్యక్షుడు లై చింగ్‌ను చైనా, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని రష్యా నిర్బంధిస్తే ఏం చేస్తారు?" అని రోఖన్నా ప్రశ్నించారు.

మదురోను వెంటనే విడుదల చేయాలి : చైనా

దిల్లీ: వెనెజువెలా అధ్యక్షుడు మదురో, ఆయన భార్య సిలియా ఫ్లోర్స్‌ను వెంటనే విడుదల చేయాలని అమెరికాను చైనా కోరింది. వెనెజువెలా ప్రభుత్వాన్ని కూల్చివేసే ప్రక్రియను ఆపాలని, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించాలని అమెరికాకు సూచించింది. అమెరికా చర్య అంతర్జాతీయ చట్టాలు, ఐరాస చార్టర్ సూత్రాల్ని స్పష్టంగా ఉల్లంఘించడమేనని తెలిపింది. వెనెజువెలాలో అధికార మార్పిడి శాంతియుతంగా జరగాలని బ్రిటన్ ఆకాంక్షించింది. తొలి నుంచి తాము మదురో చర్యలను వ్యతిరేకిస్తున్నామని ఆ దేశ ప్రధాని కీర్ స్టార్మర్ తెలిపారు. త్వరలో తాము ఈ అంశంపై అమెరికాతో చర్చిస్తామని చెప్పారు.

■ అమెరికా దాడి ప్రమాదకర ధోరణి అని ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ చట్టాలను గౌరవించకపోవడాన్ని తప్పుబట్టారు.

ట్రంప్‌నకు అభినందనలు: నెతన్యాహు

"వెనెజువెలాపై సాహసోపేత, చరిత్రాత్మక సైనిక చర్యను చేపట్టినందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు అభినందనలు. స్వేచ్ఛ, న్యాయం కోసం ట్రంప్ నాయకత్వంలో ఈ చర్యను చేపట్టారు. ఈ విషయంలో ట్రంప్ చూపిన నిబద్ధతకు నా సెల్యూట్. అమెరికా సైనికులు అత్యంత సాహసోపేతంగా ఈ సైనిక చర్యను నిర్వహించారు" అని పేర్కొంటూ ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు ట్వీట్ చేశారు.

ఇది యుద్ధ చర్య: మమ్దానీ

నికోలస్ మదురో, ఆయన భార్య సిలియా ఫ్లోర్స్‌ను అమెరికా సైన్యం బంధించడాన్ని యుద్ధ చర్యగా న్యూయార్క్ నగర మేయర్ జొహ్రాన్ మమ్దానీ అభివర్ణించారు.

అధికారాన్ని ట్రంప్ దుర్వినియోగం చేశారు : రాజా కృష్ణమూర్తి

అమెరికా కాంగ్రెస్ అనుమతి తీసుకోకుండా వెనెజువెలాపై ట్రంప్ సర్కారు సైనిక చర్య చేపట్టడం సరికాదని అమెరికా ప్రతినిధుల సభ ఇంటెలిజెన్స్ కమిటీ సీనియర్ సభ్యుడు రాజా కృష్ణమూర్తి అన్నారు. మరొక సార్వభౌమ దేశంపై అమెరికా నియంత్రణ గురించి బహిరంగంగా ట్రంప్ మాట్లాడటం చట్టవ్యతిరేకమే అని ఆయన తెలిపారు.

వెనెజువెలా అధ్యక్షుడు మదురోను అమెరికా నిర్బంధించటాన్ని శ్రీలంక అధికార పార్టీ జనతా విముక్తి పెరమున తీవ్రంగా ఖండించింది.

ఎక్స్‌ప్రెస్‌వేపై యువకుడి ప్రమాదకర విన్యాసం

గురుగ్రామ్: హరియాణాలోని గురుగ్రామ్ ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వేపై థార్ వాహనం నుంచి ఓ యువకుడు ప్రమాదకరంగా విన్యాసాలు చేస్తూ.. మొబైల్‌తో వీడియో తీసుకున్నాడు. అదే సమయంలో మరో కారులో వెళ్తున్న వ్యక్తి దాన్ని చిత్రీకరించి తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. దీనికి గురుగ్రామ్, దిల్లీ పోలీసులను ట్యాగ్ చేస్తూ.. అందులోని యువకుడిపై చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. దీనికి స్పందించిన గురుగ్రామ్ పోలీసులు విన్యాసాలు చేసిన యువకుడిపై చర్యలు తీసుకుంటామని బదులిచ్చారు.



హ్యాండ్లర్లతో మాట్లాడటానికి ఘోస్ట్ సిమ్ కార్డులు

దిల్లీ పేలుడు ఘటన దర్యాప్తులో వెల్లడి

శ్రీనగర్, దిల్లీ: గతేడాది నవంబరు 10న దిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడుకు సంబంధించిన నిందితులు పాకిస్థానీ హ్యాండ్లర్లతో మాట్లాడటానికి ఘోస్ట్ సిమ్ కార్డులు, ఎన్‌క్రిప్టెడ్ యాప్‌ల అధునాతన వెబ్‌ను ఉపయోగించారని దర్యాప్తులో తేలినట్లు అధికారులు తెలిపారు. ముజమ్మిల్ గనీ, ఆదిల్ రాథర్‌లు సహా అరెస్టైన వైద్యులు భద్రతా సంస్థల నుంచి తప్పించుకోవడానికి వ్యూహాత్మక డ్యూయల్ ఫోన్ ప్రొటోకాల్‌లో భాగంగా ఘోస్ట్ సిమ్ కార్డులను ఉపయోగించారని వెల్లడించారు. పేలుడు పదార్థాలతో నిండిన వాహనాన్ని నడుపుతూ మరణించిన ఉమర్ ఉన్ నబీ సహా ప్రతి నిందితుని దగ్గర రెండు నుంచి మూడు మొబైల్ హ్యాండ్‌సెట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. నిందితులు తమ పేరుతో రిజిస్టర్ అయిన ఒక ఫోన్‌ను, పాకిస్థాన్ హ్యాండ్లర్లతో మాట్లాడటానికి మరొక ఫోన్‌ను ఉపయోగించారని వెల్లడించారు. ఈ ఫోన్లలో సిమ్ కార్డుల కోసం పౌరుల ఆధార్ వివరాలను దుర్వినియోగం చేశారని చెప్పారు. నకిలీ ఆధార్ కార్డులను ఉపయోగించి సిమ్‌లు జారీచేసిన ప్రత్యేక రాకెట్‌ను జమ్మూకశ్మీర్ పోలీసులు గుర్తించారని తెలిపారు.

6,100 మందికి పైగా ఖైదీలకు మయన్మార్ క్షమాభిక్ష

బ్యాంకాక్: తమ దేశ 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మయన్మార్ సైనిక ప్రభుత్వం 6,100 మందికి పైగా ఖైదీలకు క్షమాభిక్షను ఆదివారం ప్రకటించింది. మరికొందరి శిక్షలను కూడా తగ్గించినట్లు అధికారికంగా వెల్లడించింది. సైనిక పాలనను వ్యతిరేకించి జైలు శిక్ష అనుభవిస్తున్న రాజకీయ ఖైదీలు విడుదలైన వారిలో ఉన్నారా? లేదా అనే విషయం స్పష్టంగా తెలియరాలేదు. స్థానిక మీడియా ప్రకారం... మొత్తం 6,134 మంది ఖైదీలను విడుదల చేశారు. ఇందులో 52 మంది విదేశీయులను విడుదల చేసి దేశ బహిష్కరణ చేయనున్నారు. ఖైదీలు చట్ట విరుద్ధంగా నిబంధనలు ఉల్లంఘిస్తే మళ్లీ మిగిలిన శిక్షను అనుభవించాల్సి ఉంటుందని ప్రభుత్వం హెచ్చరించింది.



నిర్మల్ జిల్లా రెండో అదనపు జూనియర్ జడ్జి నిఖిత, మొదటి అదనపు జూనియర్ జడ్జి భవిష్య, ఎస్పీ జానకి షర్మిల, కలెక్టర్ అభిలాష అభినవ్, హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్ట్‌ఫోలియో జడ్జి జస్టిస్ సుజన, జిల్లా జడ్జి శ్రీవాణి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి రాధిక



ఇన్‌ఛార్జి డీఆర్వో రత్నకల్యాణి, డీఆర్డీవో విజయలక్ష్మి

నిర్మల్ అంతటా మేడం సార్.. మేడం అంతే

తల్లిగా.. చెల్లిగా.. భార్యగానే కాక.. పాలికగా కూడా అందరినీ నడిపిస్తోంది అతివ. కట్టుబాట్ల కాలం నుంచి కలలను సాకారం చేసుకునే దాకా మహిళలు ఎదిగారు. బాసర సరస్వతీమాత కొలువుదీరిన తెలంగాణలోని నిర్మల్ జిల్లాలో కీలక విభాగాల్లో అత్యధికంగా మహిళలు ఉండటం విశేషం. జిల్లా పోర్ట్‌ఫోలియో జడ్జిగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజన వ్యవహరిస్తున్నారు. జిల్లా జడ్జి శ్రీవాణి, కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిల, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి రాధిక, జిల్లా ట్రెజరీ అధికారి సరోజ, ఆర్డీవో, ఇన్‌ఛార్జి డీఆర్వో రత్నకల్యాణి, డీఆర్డీవో విజయలక్ష్మి, బాసర ఆలయ ఈవో అంజనీదేవి, ఇలా పలు విభాగాల్లో మహిళా అధికారులు పాలనను సమర్థంగా నడిపిస్తున్నారు. నిర్మల్‌కు చెందిన జస్టిస్ శ్రీదేవి హైకోర్టు న్యాయమూర్తిగా కొనసాగుతున్నారు. ఇటీవల నిర్వహించిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులుగా అయేషా మస్రత్ ఖానం వ్యవహరించడం విశేషం. జిల్లాలో మొత్తం ఓటర్లు 7,37,396 మంది ఉండగా 3,82,107 మంది మహిళలు ఉన్నారు. ఓటర్లలోనూ ఆధిక్యాన్ని చాటుతూ జిల్లా అతివల ఖిల్లాగా పేరొందుతోంది. –న్యూస్‌టుడే, నిర్మల్

కల నెరవేరె.. బడి దరిచేరె..





ఇక్కడ సంతోషంతో కేరింతలు కొడుతున్నది ఆదివాసీ చిన్నారులు.. ఆదివారం తమ కొత్త పాఠశాల ప్రారంభం సందర్భంగా ఇలా సందడి చేశారు. తెలంగాణలోని ఆదిలాబాద్ పట్టణంలో కుమురంభీం కాలనీలో గుడిసెల్లో ఉండే వారు తమ పిల్లలను అక్కడే ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. వారి మాతృభాష గోండు. ఇతర పిల్లలతో భాష సమస్యగా మారిందని ప్రత్యేక పాఠశాల ఏర్పాటు చేయాలని ఇటీవల కలెక్టర్ రాజర్షిషాను కలిశారు. వారి సమస్యను పరిష్కరించాలని ఐటీడీఏ అధికారులకు కలెక్టర్ సూచించారు. దీంతో ఇప్పటికిప్పుడు పాఠశాలను నిర్మించే పరిస్థితి లేదని ప్రత్యామ్నాయంగా కంటెయినర్ పాఠశాలకు రూపకల్పన చేశారు. ఐటీడీఏ అధికారులు రూ.5.09 లక్షలతో 12.5 అడుగుల వెడల్పు, 30 అడుగుల పొడవుతో కంటెయినర్ తయారు చేయించారు. మూడు ఫ్యాన్లు, ఆరు లైట్లు వెలిగేలా విద్యుత్తు సౌకర్యం కల్పించారు. గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలను ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ ప్రారంభించారు. ప్రస్తుతం 20 మంది విద్యార్థులకు పాఠాలు చెప్పడానికి ఐటీడీఏ నుంచి ఒక ఉపాధ్యాయుడిని నియమించారు. –న్యూస్‌టుడే, ఆదిలాబాద్ కలెక్టరేట్

అరణ్యం వీడి.. అరచేతిలో ఇమిడి



ఉత్తరాఖండ్‌లోని దేహ్రాదూన్ జిల్లాలో ఓ అరుదైన పాము జనావాసాల్లో కనిపించింది. వికాస్‌నగర్ పట్టణ సమీపంలోని కాల్సి అటవీ డివిజను సైంచివాలాలో ఒక ఇంటి దగ్గర లైకోడాన్ జారా అనే 12 అంగుళాల పాము కనిపించింది. స్థానికుల సమాచారంతో అటవీ సిబ్బంది పామును రక్షించి సురక్షిత ప్రాంతంలో వదిలారు. ఈ పాము ట్విన్-స్పాటెడ్ వూల్ఫ్ స్నేక్ జాతికి చెందినదిగా గుర్తించారు. –ఈటీవీ భారత్

ఎర్రకాళ్ల కొక్కిరాయి.. టీవి అంటే నీదేనోయ్!



సాధారణంగా కొంగల కాళ్లు లేత బూడిద, లేత ఆకుపచ్చ రంగులో కనిపిస్తాయి. కానీ ఎరుపు రంగు కాళ్లతో, రంగురంగుల ముక్కుతో ఆకర్షణీయంగా కనిపిస్తూ టీవీగా పోజిస్తున్న ఈ కొంగను ఎర్రకాళ్ల కొక్కిరాయి లేదా ఇండియన్ పాండ్ హెరాన్ అని పిలుస్తారు. తెలంగాణలోని ఆదిలాబాద్ నుంచి జన్నారం వెళ్లే మార్గంలో ఇది కనిపించింది. ఈ జాతి పక్షులు ప్రత్యుత్పత్తి సమయంలో ఇలా ఆకర్షణీయ రంగులను సంతరించుకుంటాయి. ఇవి భారత్‌తో పాటు బర్మా, శ్రీలంక దేశాల్లోనూ నివసిస్తాయి. ఈ కొంగ శాస్త్రీయనామం ఆర్డీడే అని మహబూబ్‌నగర్ ఎంవీఎస్ ప్రభుత్వ అటానమస్ కళాశాల అసోసియేట్ ప్రొ. బక్షి రవీందర్‌రావు తెలిపారు. –ఈనాడు, ఆదిలాబాద్



ఈ ఆదర్శ దంపతులు.. ప్రకృతి విధేయులు

తెలంగాణలోని ఖమ్మం జిల్లాకు చెందిన పర్యావరణ మిత్ర జాతీయ అవార్డు గ్రహీత డా.కడవెండి వేణుగోపాల్ పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా కృషి చేస్తున్నారు. భార్య అరుణకుమారి సహకారంతో 15 ఏళ్లుగా ప్రజల్లో చైతన్యం కలిగిస్తున్నారు. 180 పాఠశాలల్లో అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించి సొంత డబ్బుతో జూట్, క్లాత్ బ్యాగులు తయారు చేయించి పంపిణీ చేశారు. వేసవిలో విత్తనాలు సేకరించి వర్షాకాలంలో ఖాళీ స్థలాలు, అడవుల్లో విత్తన బంతులను చల్లుతున్నారు. వీరు ఇప్పటి వరకు జాతీయ స్థాయిలో 2, రాష్ట్ర స్థాయిలో 10 అవార్డులు పొందారు. –ఈనాడు, ఖమ్మం

అమెరికాలో ఎన్నారై యువతి హత్య?

- భారత్‌కు పరారైన మాజీ ప్రియుడు..
- 'మిస్సింగ్' ఫిర్యాదు చేసిందీ అతడే..

కొలంబియా: అమెరికాలోని మేరీలాండ్‌లో ఉన్న కొలంబియాలో 27 ఏళ్ల నికిత గొడిశాల అనే యువతి అనుమానాస్పద స్థితిలో హత్యకు గురైంది. ఆమె తన మాజీ ప్రియుడి అపార్టుమెంటులో విగత జీవిగా పడి ఉండగా పోలీసులు కనుగొన్నారు. అయితే అంతకుముందే అతడు దేశం విడిచి పారిపోయాడు. పారిపోవడానికి ముందు అతడే నికిత కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కొత్త సంవత్సర వేడుకల తర్వాతి నుంచి నికిత కనిపించలేదు. దీంతో అర్జున్ శర్మ అనే 26 ఏళ్ల యువకుడు ఆమె కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తాను చివరిసారిగా ఆమెను ఎల్లికాట్ సిటీలో డిసెంబరు 31వ తేదీన చూశానని చెప్పాడు. అది అతడు ఉంటున్న అపార్టుమెంటే. అయితే జనవరి 2వ తేదీన అతడు భారత్‌కు పారిపోయినట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం సెర్చ్ వారెంటు జారీ చేసిన అధికారులు.. అతడి అపార్టుమెంటును తనిఖీ చేయగా నికిత మృతదేహం దొరికింది. ఆమె శరీరంపై గాయాలున్నాయి. విచారణ జరపగా.. డిసెంబరు 31వ తేదీ రాత్రి 7.30 గంటల తర్వాత నికితను మాజీ ప్రియుడైన అర్జున్ చంపేసినట్లు తేలింది. అయితే హత్యకు కారణాలు తెలియరాలేదు. భారత్‌కు పరారైన అర్జున్‌ను గుర్తించేందుకు పోలీసులు ఫెడరల్ అధికారుల సాయం కోరారు. మరోవైపు నికిత స్నేహితులు ఆమె ఆచూకీ కోసం తీవ్రంగా ప్రయత్నించారు. ఆమె ఫొటోను సోషల్ మీడియాలో ఉంచారు. ఆమె హత్యకు గురైందని ఆదివారం వెల్లడి కావడంతో విషాదంలో మునిగిపోయారు.



స్వర్ణ శోభితం.. యాదగిరి క్షేత్రం

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం గోపురాలు ఆదివారం రాత్రి స్వర్ణ కాంతులతో భక్తులను అబ్బురపరిచాయి. ఆరు రోజుల పాటు కొనసాగిన ఆలయ అధ్యయనోత్సవ పర్వాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. – న్యూస్‌టుడే, యాదగిరిగుట్ట పట్టణం

మేడారం.. భక్తజన సందోహం



మేడారం మహా జాతర ఈ నెల 28 నుంచి ప్రారంభంకానున్న నేపథ్యంలో.. వనదేవతలను దర్శించుకొనేందుకు వచ్చే భక్తుల సంఖ్య భారీగా పెరుగుతోంది. ఆదివారం సెలవురోజు కావడంతో తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర ప్రాంతాల నుంచి వేల మంది భక్తులు తరలిరావడంతో మినీ జాతరను తలపించింది. గద్దెల వద్ద దేవతలను దర్శించుకొని బంగారం (బెల్లం), పసుపు, కుంకుమ, సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగింది. మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, సీతక్క, ఎంపీ బలరాంనాయక్‌లు కూడా దేవతల దర్శనానికి, పనుల పర్యవేక్షణకు రావడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. – న్యూస్‌టుడే, తాడ్వాయి

సీతక్క నోట.. వనదేవతల పాట

సామాజిక మాధ్యమాల్లో వైరల్



తాడ్వాయి, న్యూస్‌టుడే: వనదేవతలు సమ్మక్క, సారలమ్మలపై తెలంగాణ మంత్రి సీతక్క పాడిన రెండు పాటలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ఉద్యమ కాలంలో పాటలు పాడిన అనుభవం, ఆదివాసీలు పాడే పాటలతో గొంతు కలిపిన సీతక్కతో కొందరు యువత సుమారు నాలుగు నెలల కిందట ఓ స్టూడియోలో రెండు పాటలు పాడించి రికార్డు చేశారు. వాటిని యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లో అప్‌లోడ్ చేశారు. 'కొండకోనల నడుమ దండాలు బాపేటి దయగల్ల సారక్క గద్దెకు మొక్కాలో..' అనే పాటకు 22 లక్షల వ్యూస్.. 'మిలమిల మెరిసిందదిగో మేడారం జాతర.. కళకళలాడిందిగా గిరిజనుల జాతర' అనే పాటకు 6 లక్షల వ్యూస్ వచ్చాయి.